TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204263
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000 LIBRARY.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 3.1 / D29B Accession No. T379

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

సరస్వతీ గ్రంథమండలి :
అనుబంధమాలిక : ౧౩

భారతకథాసారము

శ్రీమతి దేచిరాజు లక్ష్మీనరసమ్మ

Approved by the Madras Text Book Committee
for Class use, Fort St. George Gazette, Part 1-B (Edl.)
No. 21-B D/ 27—5—1941, Page 153.

రు1/

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్ర కా శ కు ల వి

First Edition 1928
Second Edition 1945

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Lakshmanaswamy Naidu
For Addepally & Co., Educational Publishe
Order No. 3657—28-8-45

భారతకథాసారము

ఆదిపర్వము

భరతవంశజాతుఁడగు శంతనుఁడను మహీపాలు డొకనాఁడు మృగయావినోదంబులఁ దగిలి వనాంతరంబున సంచరించుచు, గంగాపులినతలమున నొక్క సరోజముఖిని గాంచి తన్ను వరింపుమనియడుగ నత్తన్వి "రాజా! నేనాచరించు కార్యముల కడ్డు చెప్పకుండువేని నిన్నుఁ జేపట్టి యభిమతముఁ దీర్చెద. ఎప్పు డడ్డుసెప్పిన నప్పుడు నిన్ను విడిచి చనియెద" నని చెప్పెను. శంతనుఁ డందులకొడఁబడి యామెను బరిగ్రహించెను.

అనంతర మాయువతికి సుతుఁ డుదయింప దోడనే యామె వానిని దీసికొనిపోయి గంగాప్రవాహమునఁ బడవైచివచ్చెను. శంతనుఁ డా ఘోరకృత్యమును గాంచి సహింపలేకయుఁ దాను వలదన్నచో నయ్యింతి తన్నుఁబాసి యరుగునను భయమున నూరకుండెను. ఆ లలన యట్లు సుతసప్తకమును గాంచి యందఱను వధించి యష్టమతనూజునిఁగూడఁ బ్రవాహమునఁ బడవైవఁ బోవుచుండ నుదయార్కతేజుఁడగు నక్కుమారుని గని శంతనుఁ డూరకుండ జాలక "పుత్రఘాతకీ! ఈకుమార రత్నమునైన నదీగర్భమునఁ ద్రోయక బ్రదుకని" మ్మని యామెను వారించెను. "మహారాజా! నీవు నన్ను వారించితివి

గనుక నీక నాయిచ్చవచ్చిన మార్గమున నరిగెద" నని యానుదతి వచింప శంతనుఁ డామె నెడఁబాయఁ జాలకఁ చింతా క్రాంతుఁ డయ్యెను.

పిమ్మట నామె "అవనీతలేంద్రా! నీవు చింతింపక నా వృత్తాంతము సమగ్రముగ నాలింపుము. నేను త్రిభువనపావని యనఁబరగిన భాగీరథిని. నా కుదయించిన కుమారు లెనమండ్రును వసువులు. వీరలొకనాఁడు పత్నీసమేతులై మేరుపర్వతమునకుఁ గ్రీడార్థ మరుదెంచి, యటఁ దపంబు నేయుచున్న వసిష్ఠమహాముని హోమధేనువగు నందినిని బట్టుకొని పోయిరి. అనంతరము వసిష్ఠమహాముని తన ధేనువును గానక వనమెల్ల వెదకి పిమ్మట యోగదృష్టింజూచి వసువు లెత్తుకొని పోయిరని యెఱింగి కోపాయత్తచిత్తుఁడై "మర్త్య లోకమునఁ బుట్టుఁ" డని వారిని శపించెను. అంత నావసువులు భీతచిత్తులై వచ్చి మునీంద్రునకుఁ బ్రణామములాచరించి "తాపసోత్తమా! ధర్మమూర్తివగు నీవు మాయపరాధము సహించి భూలోకమున మే మెక్కువకాలము జీవింపకుండునట్లు మమ్మనుగ్రహింపు" మని ప్రార్థింప మునీంద్రుఁడు ప్రసన్నుఁడై "మీరు కోరినట్లే యగును. ప్రభాసుఁడు మాత్రము మహాప రాధము చేసెను గావున నతఁడు మర్త్యలోకమునఁ బెక్కు కాల ముండు" నని వచించెను. అనంతర మావసువులు తమ శాపవృత్తాంతము నాకెఱిఁగించి "మే మెందుచోట జనింప నోపము. నీయందుఁ బుట్టెదము. నీవు స్త్రీరూపముఁదాల్చి

ముమ్ముఁ గనినతోడనే ప్రవాహమునఁ బడవైచుచుందును" అని వేఁడ నే నందుల కంగీకరించితిని. ఆ కారణమువలన నిది వఱకు జనించిన కుమారసప్తకమును నదిలోఁ బడవైచితిని. దేవవ్రతుఁడైన యిక్కుమారుఁడు దీర్ఘాయుష్మంతుఁ డగును. వయోవంతుఁ డగువఱకు వీనిని నాయొద్ద నుండనిమ్ము" అనుచు గంగాదేవి సమస్త వృత్తాంతము శంతనున కెఱిఁగించి యాతని నోడఁబఱిచి, నిజరూపధారిణియై యరిగెను. విషణ్ణ చిత్తుఁడై శంతనుఁడు తన రాజధాని కేఁగెను.

భీష్మాభిధానుఁడగు నాకుమారుఁడు దినక్రమాభివృద్ధుఁడై పరశురామునియొద్ద విలువిద్య నభ్యసించి యందు నిపుణుఁ డయ్యెను. అనంతర మొకనాఁడు శంతనుఁడు గంగాతీరమునకు రాఁగా భాగీరథీదేవి యాకుమారు నాతని కొసఁగెను. శంతనుఁడు ప్రమోదభరితమానసుఁడై హస్తినాపురమున కరిగి భీష్ము యౌవరాజ్యాభిషిక్తుం జేసి సంతసములోఁ గాలముఁ గడపుచుండెను.

ఇట్లు నాలుగువత్సరములు గడచిన పిమ్మట నొకనాఁడు శంతనుఁడు వేటకొఱకు విపినమున కరిగి, యమునా తటమున నొక కమలలోచనం గాంచి "సుందరీ! నీ వెవ్వరి దానవు?" అని ప్రశ్నింప నా సుదతి "రాజా! నేను దాశ రాజు తనూజను. సత్యవతి యనుదానను. తండ్రి పనుపున నిచ్చట నోడనడుపుచుందును." అని ప్రత్యుత్తర మొసఁగెను. పిమ్మట శంతన భూపాలుఁడు దాశ రాజుకడ కేఁగి "నీతనూజను

నా కొసఁగు" మని యడుగ, నతఁడు "అవనీతలేంద్రా! నా దౌహిత్రుని రాజ్యాభిషిక్తుం జేయ నంగీకరింతువేని నా తనయ నిచ్చెదను." అని యుత్తర మొసఁగెను. "అగ్రతనూజుఁడు, సుగుణగణ విరాజితుఁడు నగు భీష్ముని విడిచి, సత్యవతికి జనించువాని నెట్లు భూమీశుం జేయఁగలను?" అని శంతనుఁడు చింతాక్రాంతుఁడై హాస్తిపురమునకు నరుదెంచి మనంబున సత్యవతినే తలపోయుచుండెను.

ధర్మనిరతుఁడైన గాంగేయుఁడు తన తండ్రి చిత్తము సత్యవతిపయిఁ దగులుట యెఱిఁగి దాశునికడకేఁగి "నేను గురుప్రయోజనార్థము నిజరాజ్య పరిత్యాగమును, బ్రహ్మచర్య వ్రత పరిగ్రహమును చేయుచుంటిని. హిమకరుఁడు శైత్యమును, భానుఁడు తేజమును, హుతాశనుఁ డుష్ణమును విడిచినను నే నీవ్రతము విడువను. సత్యవతికిఁ బుట్టెడి సుతుఁడే మహీనాథుఁ డగు!" ననుచు సకలజన సమక్షమునఁ బ్రతినఁ జేసెను. అప్పు డమ్మహనీయుని పితృభక్తికి మెచ్చి బృందారకులు కుసుమవర్షముఁ గురియించిరి. దాశుఁడు సంతసించి సత్యవతి నొసంగెను. గంగానందనుఁ డామెను హాస్తిపురికిఁ దోడ్కొనిరాఁగా శంతనుఁ డమందానంద మొంది వివాహమాడి, తనకొఱకై సమస్తభోగములం ద్యజించిన కుమారునకు స్వచ్ఛందమరణము వరముగా నొసఁగెను.

అనంతరము శంతనమహారాజు సత్యవతియందుఁ, జిత్రాంగద విచిత్రవీర్యులను సుతులను బడసి కొంతకాలమునకుఁ

బరలోకగతుఁ డయ్యెను. సత్యవ్రతుఁడగు భీష్ముఁడు తండ్రి మరణానంతరమునఁ జిత్రాంగదుని రాజ్యాభిషిక్తుం జేసెను. అతఁ డతి గర్వితుఁడై సుర, దనుజ, మనుజ, గంధర్వాదుల నాక్షేపించుచుండఁ జిత్రాంగదుఁడను గంధర్వపతి వానియం దలుకవహించి సమరమున కరుదెంచెను. చిత్రాంగదుఁ డా గంధర్వనాథు నెదుర్కొని ఘోరముగఁబోరి తుద వానిచే నిహతుఁడయ్యెను.

అనంతరము భీష్ముఁడు విచిత్రవీర్యుని సింహాసనాసీనుంజేసి, కాశీరాజ దుహితలైన యంబికాంబాలిక లను యువతీ మణులం దెచ్చి యాతనికి వివాహము చేసెను. విచిత్ర వీర్యుఁడు నిరంతరము స్త్రీలోలుఁడై సంచరించుటచే నాయు క్షీణంబుగా శీఘ్రంబున- బరలోకగతుఁ డయ్యెను. అప్పుడు గంగానందనుఁడు శోకార్ణవనిమగ్నులైన మాతృదండ్రను, జన యిత్రిని నాశ్వాసించి యరాజకమైన రాజ్యము నకలంకముగ నేలసాగెను.

అనంతర మొకనాఁడు సత్యవతీదేవి భీష్మునిఁగాంచి "కుమారా! నీ విఁక వివాహమాడి సంతతిఁబడసి యీకురు వంశము నుద్ధరింపుము!" అని వచింప, దేవవ్రతుఁడు "తల్లీ! నేను గురుప్రయోజనార్థంబై సర్వజనసమక్షమునఁ జేకొన్న పవిత్రవ్రతము విడువనొల్ల; పావనమైన యీ కురువంశోద్ధర ణార్థ మేనొక్క ధర్మముఁ దెల్పెదను. ఉత్తమరాజవంశము లంతరింపనున్న తరుణమున క్షత్రియక్షేత్రములందుఁ దపో

బలె విశుద్ధాత్ములైన భూసురోత్తములచే ధర్మమార్గమున నుద్భవించి వంశకరులైన క్షత్రియు లనేకులు గలరు. ఈ విధముస వంశము నిలువఁబెట్టుట క్షత్త్రిధర్మము. కావున నిప్పుడు విచిత్రవీర్య క్షేత్రములందు సత్సంతానము ననుగ్రహించునట్లు ధర్మనిరతుఁడగు నొక ధరణీ దేవోత్తముని బ్రార్థించుట కర్తవ్య" మని చెప్పెను. సత్యవతి యందుల కంగీకరించి కుమారా! నేను గన్యాత్వముననుండి తండ్రి నియోగమున యమునానది నోడనడపుచుండ నొకనాఁడు పరాశరమునీంద్రుఁ డరుదెంచి నన్నుఁ గామించి యమునాద్వీపమున, నద్యో గర్భంబునఁ, గృష్ణద్వైపాయనుఁడను సుతు ననుగ్రహించి, నా కన్యాత్వము దూషితము గాకుండునట్లు వరమొసఁగి చనెను. "పనిగలయప్పుడు నన్నుఁ దలఁచిన వచ్చెద" నని చెప్పి కృష్ణద్వైపాయనుఁ డప్పుడే తపోవనమున కేఁగెను. ధర్మమూర్తియు, నిత్యసత్యవచనుఁడు నగు నాకుమారుఁ డీవంశము నుద్ధరింప సమర్థుఁడని తలఁచెదనని పలుక, గాంగేయుఁడు కృష్ణద్వైపాయనుని దలఁచి కరకమలములు మొగిచి "వేదవ్యాస మునీంద్రుఁ డీ భరతవంశమును బ్రతిష్ఠించుట సకలజన సమ్మత" మనుచు భక్తి పులకితాంగుఁడై వచించెను.

అంతట సత్యవతి కురువంశోద్వహానార్థము పారాశర్యునిఁ దలంప నతఁ డరుదెంచి భీష్మునిచేఁ బూజితుఁడై, జనయిత్రికి నమస్కరించి యామెవలన సమస్తవృత్తాంతము నెఱిఁగి కాశీరాజ పుత్త్రికలకుఁ బుత్త్రదానముసేయ నంగీకరించెను.

అంతట సత్యవతి పెద్దకోడలైన యంబిక కడకేఁగి "ఈరాత్రి నీయొద్దకు వ్యాసముని యరుదెంచును. నీవు ధర్మవిధానమున వానివలన రాజ్యధురంధరుఁడగు సుపుత్త్రుఁ బడసి భరత వంశము నిలుపుము." అని చెప్పి యామె నొడంబఱిచి యానాఁడు సకలజనులకు నన్నదానము సేయించెను. పిమ్మటఁ గృష్ణద్వైపాయనుఁ డంబికకుఁ బుత్త్రదానంబు సేసి సత్యవతి కడకుఁ జని "తల్లీ! అంబికకు బలపరాక్రమవంతుఁడయిన సుతుఁ డుదయించును; వాఁడు మాతృదోషమువలన నంధుఁ డగును." అని చెప్ప, సత్యవతి విషణ్ణచిత్తయై "కుమారా! అంబాలికయం దొక సుతుం బడయుము" అని నియో గించెను. అంతట వ్యాసుఁ డంబాలికకడకుఁ జని యామెం కొక సుతు ననుగ్రహించి వచ్చి "జననీ! అంబాలికకును పరాక్రమశాలియు, సుగుణవంతుఁడు నగు సుతు డుదయిం చును. వాఁడు మాతృదోషమువలనఁ బాండుదేహుఁడగును" అని చెప్పి తపోవనమున కరిగెను.

పిమ్మట నంధుఁడైన కుమారుఁ డంబికకును, పాండు దేహుఁడైన కుమారుఁ డంబాలికకును జనింప సత్యవతి దుఃఖితయై మరలఁ బారాశర్యునిఁ బిలువ నతఁ డరుదెంచెను. "కుమారా! అంబికానందనుఁ డంధుఁడయ్యెఁ గావున నామెకు మఱియొక సుపుత్త్రు నొసఁగుము." అని సత్యవతి నియో గింపఁ గృష్ణద్వైపాయనుఁ డంతఃపురమున కేఁగెను. అప్పు డంబిక యాముని వికృతరూప గంధములం దలఁచి కడు

ననుహ్యాపడి తన దాసి నలంకరించి శయనతలమున నుండఁ బనిచెను. తాపసోత్తముఁడు దానికిఁ దనయు ననుగ్రహించి చనెను. అంత నద్దాసికి ధర్మాధర్మవిదుఁడయిన విదురుఁడు జనించెను.

అనంతరము భీష్ముఁ డంబికానందనునకు ధృతరాష్ట్రుఁ డనియు, నంబాలికా తనూజునకుఁ బాండుడనియు నామ కరణముఁ జేయించి పెంచి రాజవిద్యలు చెప్పించెను. అగ్రజుఁ డగు ధృతరాష్ట్రుఁ డంధుఁడగుటచే రాజ్యాధిపత్యమున కనర్హుఁడైనను సుగుణరత్నాకరుఁడైన పాండురాజాతనినే సింహాసనాసీనుం జేసి తన పరాక్రమాతిశయమున రాజ్యముఁ గాపాడుచు సకల జనానురక్తుఁడై వర్తించుచుండెను.

గాంధార రాజనందన యగు గాంధారి సుతశతంబుఁ బడయునట్లు మహేశ్వరునిచే వరము నొందెనని విని గాంగేయుఁడు కురువంశము నభివృద్ధినొందింప నెంచి గాంధారపతి నడిగి యాకన్యకను దెచ్చి ధృతరాష్ట్రునకుఁ బరిణయముఁ జేసెను. పరమ పతివ్రతయగు గాంధారి తన పతి కనుగుణముగా నేత్రపట్టముఁగట్టుకొనియెను. ధృతరాష్ట్రుఁడు గాంధారినిఁ బట్టమహిషిగఁ జేకొని పిమ్మట నామె తోఁబుట్టువులను బదుగురు కన్యకలనుగూడ వివాహమాడెను. అనంతరము గాంగేయుఁడు భరతవంశమును విస్తరింపఁజేయు నపేక్షగల వాఁడై కులశీల రూపవతులగు కన్యలను బెక్కండ్రను దెచ్చి ధృతరాష్ట్రునకు వివాహముఁ జేయుచుండెను. ధృతరాష్ట్రుఁ

డిట్లు నూర్వురు కన్యలను బరిగ్రహించెను. భరత కులాలంకారుఁడైన పాండు మహీశుఁడు భీష్మానుమతి నొంది, యదువంశజాతయు, వసుదేవుని చెలియలు నగు పృథాదేవిని, మద్రరాజ నందనయగు మాద్రిని స్వయంవరవిధానమునఁ బెండ్లియాడెను.

పృథాదేవికిఁ గుంతియను నామాంతరము గలదు. కుంతిభోజుఁడనురాజు సంతానరహితుఁడై, తన మేనమామ సుతుఁడగు శురసేనునడిగి యాతని సుతయైన పృథాదేవిని దనకుఁ గొమరితగాఁ దెచ్చి యతిప్రేమమునఁ బెంచుకొనెను. అందువలన నామెకుఁ గుంతి యను పేరు గలిగెను. కుంతి భోజుని గేహమునఁ బెరుఁగుచున్న కాలములో నొకనాఁడు దుర్వాస మహాముని యతిథియై రాఁ గుంతి యాతనికిఁ గోరిన యాహారము నొసఁగి సముచితోపచారములు చేయ నమ్మునివరుఁడు ప్రీతుఁడై "కుమారీ! నీకు నేను దివ్యమంత్రము నుపదేశించెదను. ఆ మంత్రముచే నీ వే దేవు నారాధించిన నా దేవుఁడు వచ్చి నీవు కోరిన కుమారుల నొసఁగును" అని చెప్పి మంత్రము నామె కుపదేశించి చనెను. అనంతర మొకనాఁడు కుంతీదేవి గంగాతీరమున కరిగి యా మంత్ర ప్రభావము నెఱుఁగఁదలఁచి యంశుమంతు నుద్దేశించి "అంబుజమిత్రా! నాకు నీయట్టి తనయునిఁ బ్రసాదింపుము." అని యా మంత్రము జపింప నాదిత్యుఁ డచటి కరుదెంచెను. ఆమె యాతనింగని భయకంపితగాత్రయై నేను మునివరుఁ డుపదేశించిన

మంత్రశక్తి నెఱుఁగఁదలఁచి, యజ్ఞానినై త్రిలోకైకదీపకుఁడ వగు నిన్ను రావించితి. నాయపరాధము సహింపవలయును. కన్యవగు నేను గర్భమునుబొల్చిన గురుజనము లూరకుందురా ? " అనుచుఁ బ్రార్థింప నా దేవుఁడు కరుణాయత్తచిత్తుఁడై " సుదతీ ! నా దర్శనము వ్యర్థముగాదు. నీ కన్యాత్వము దూషితము గాకుండునట్లు సద్యోగర్భమున నీకుఁ గొమరుఁ డుద్భవించును. " అని చెప్పి యామెకు సుతు ననుగ్రహించి చనియెను. అప్పు డామెకుఁ గవచకుండలధారియైన కుమారుఁడు జనింప " బాలార్కప్రతిముఁడగు నీ బాలు నిప్పు డేమి సేయుదు ? " నని కుంతీదేవి దుఃఖించెను. అప్పు డాదిత్యప్రేరితయై యనర్ఘరత్నవసుధరితంబైన ' మంజన ' నదీ ప్రవాహ వేగంబునఁ దన సమీపమునకు రాఁ గుంతి యబ్బాలుని దానిలోఁ బరుండఁబెట్టి నిజగృహమున కరిగెను. పిమ్మట నొక సూతుఁడు రత్నపుంజభరితమైన యా మంజసం గాంచి దానిని దెఱచి యందున్న కుమారు నతిప్రేమున నెత్తుకొనిపోయి తన సతియగు రాధ కొసఁగెను. ఆ దంపతు లనపత్యు లగుటచే నా బాలు నెక్కువ మక్కువతోఁ బెంచిరి ఆ కుమారుఁడు కర్ణుఁడను నామమునఁ బరఁగెను.

కుంతియు మాద్రియుఁ దనకు సంతసముఁ గూర్చుచుండఁ బాండునృపాలుఁడు ప్రజారంజకుఁడై వర్తించుచు, దిగ్విజయము సేసి యపరిమితధనరాసులం దెచ్చి ధృతరాష్ట్రునిచే ననేకాశ్వమేధయాగములు చేయించెను.

అనంతర మొకనాఁడు పాండురాజు నిజాంగనలం గూడి మృగయావినోదార్థియై కాంతారమున కరిగి, క్రీడాసక్తమై యున్న మృగ మిథునము నవలోకించి బాణములం బ్రయోగించి యా కురంగద్వయమును భేదించెను. అంత నా మిథునమునం దల్పావశిష్టజీవంబై యొక మృగము పాండురాజు నవలోకించి "రాజా, నేను కిందముఁడను ఋషిని. ఈ లేడి నా సహధర్మిణి వినోదార్థము మే మీ హరిణరూపములు దాల్చి, యొరుల కేమియు నపకారముఁ జేయక నిచ్చోటవిహరించుచుంటిమి నిరపరాధులమగు మమ్ము నిర్దయుండవై చంపితివి. కావున నీవును భామినులను సమీపించినప్పుడు పంచత్వము నొందెదవు" అని శపించి ప్రాణములు విడిచెను. జీవములం బాసిన యా హరిణిద్వయమునుగాంచి పాండురాజు విషాదమనస్కుఁడై యరిగి తన శాపవృత్తాంతము నిజసతులకుఁ దెలిపి, "నేనిక సర్వసంగపరిత్యాగినై, కందమూలఫలాశనుఁడనై విపినమున దపము సేయుచుండెదను: మీరలు హస్తినాపురమున కేఁగి, భీష్మధృతరాష్ట్రాదులచే సంరక్షితలై యచట నుండుఁడు." అని చెప్పెను. "మహీపాలోత్తమా! మేము నిన్ను విడిచి హస్తినాపురమున కరుగఁజాలము. మేము నీచెంత నుండ నంగీకరింపుము. లేనిచోఁ బ్రాణములు పరిత్యజింతుము." అనుచు నప్పతివ్రతాశిరోమణులు బాష్పపూరితనయనలై ప్రార్థింపఁ బాండుభూపాలుఁడు వారలఁ దనచెంత నుంచుకొన నంగీకరించి, జటావల్కలధారియై వానప్రస్థాశ్రమము స్వీకరించి, తపస్విస్

వేషములందాల్చిన నిజాంగనలను దోడ్కొని శతశృంగ పర్వతమున కరిగి యచ్చటఁ దపము సేయుచుండెను.

అట్లుండి యొకనాఁడు బ్రహ్మలోకమున కేగుచున్న తాపసోత్తములను గాంచి పాండురాజు "మునివరేణ్యులారా, మీర లెట కేగుచుంటిరి?" యని యడుగ, వారలు "నేఁడమవన గావునఁ గమలజునిఁ గొలువ నేఁగుచుంటిమి. నేఁ డచటికి ఋషులును, పితృదేవతలును నరుదెంతురు," అని చెప్పిరి. అంతటఁ బాండుమహీశుఁడును భార్యాసమేతుఁడై యత్తాపసులవెంట నేఁగుచుండ వారలు "రాజా! ఇవి దేవపథములు; మీర లచటికి రాఁజాలరు. ఇట నిలువుఁడు," అని వచించిరి. అప్పుడు పాండురాజు "అపుత్రస్య గతి ర్నాస్తి" యను వచనమును దలఁచి "తాపసోత్తములారా, నే నపుత్రకుఁడను. నాకుఁ బుణ్యలోకప్రాప్తి యెట్లు చేకూరును" నని చింతింప నమ్మునులు యోగదృష్టింజూచి "రాజా! నీ వపుత్రకుఁడవు గావు. ధర్మానిలశక్రాశ్వినుల వరమునఁ దనూజులం బడయుదువు. సంతానార్థము యత్నము సేయుము," అని చెప్పి యరిగిరి.

అనంతర మొకనాఁడు పాండుమహీశుఁడు కుంతినిఁగాంచి "సుదతీ! పుత్రహీనులకుఁ బుణ్యలోకములు సేకూరవు. అస్మన్నియోగమున, ధర్మమార్గమున నీవు క్షేత్రజులగు సుతులను బడసిన నేను బుత్రవంతుఁడనై పుణ్యలోకములు

వడయఁగలవాఁడను," అని వచింప, నప్పతివ్రతాశిరోమణి "దేవా! చిన్నతనమున దుర్వాసమునీంద్రుఁడు నా కొక మంత్రరాజము నుపదేశించెను. ఆ మంత్రమున నే దేవు నారాధించిన నా దేవుఁ డరుదెంచి యభిమతముఁ దీర్చు; ఇప్పు డే వేల్పు నారాధింతునో యానతీయుఁడు." అని యడిగెను. అప్పుడు పాండురాజు "తన్వీ, ధర్మదేవత నారాధింపుము," అని యాజ్ఞాపింప, కుంతి సమాహితచిత్తయై య ద్దేవు నారాధించెను. అప్పుడు ధర్ముఁడు యోగమూర్తి ధరుఁడై వచ్చివరమొసఁగఁ గుంతి తత్ప్రసాదమున గర్భముఁ దాల్చి, నవమాసములు గడచినపిమ్మట శుభముహూర్తమున బాలార్కప్రతిముఁడగు కుమారునిఁ గనియె. ఆ కుమారునిఁ గాంచి పాండురాజు హర్షపరిప్లుతాంతరంగుఁ డయ్యెను. ఆకాశ వాణి యా బాలునకు యుధిష్ఠిరుఁడని పేరిడెను.

అంతకుమున్నే గాంధారియు గర్భవతియై యొక్క వత్స రముగడచినను బ్రసూతికానందున నామె యుధిష్ఠిరుని జన నము విని యుదర తాడనము సేసికొన గర్భపాతం బయ్యెను. అప్పుడు వ్యాసమునీంద్రుఁ డరుదెంచి "ఇట్లేల సేసితి" వని గాంధారిపయిఁ గోపించి, యామె కుదయించిన మాంసపేశి నేకోత్తరశతఖండములుగా విభాగించి వానిని ఘృతకుండ ములం బెట్టించి "వీనిని శీతలోదకములతోఁ దడుపుచు గాపాడుచుండుఁడు. వీనినుండి నూర్వురుకొమరులు, నొక్క కొమరితయుఁ జనింతురు," అని చెప్పి వెడలిపోయెను.

గాంధారీధృతరాష్ట్రులు మునివచనానుసారముగా నాఖండము లను గాపాడుచుండిరి.

అనంతరము శతశృంగమునఁ బాండురాజు కుంతీదేవినిఁ గాంచి " కుంతీ! అనిలదేవు నారాధించి బలశాలియగు మఱి యొక తనయునిఁ గాంచుము," అని యాజ్ఞాపింప నామె సమాహితచిత్తయై యద్దేవు నారాధించి గర్భముఁదాల్చి కుమారునిఁ గాంచెను. అశరీరవాణి యాబాలునకు భీమ సేనుఁడని పేరుఁ బెట్టెను.

భీమసేనుఁ డుదయించిన దినముననే హాస్తిపురమునఁ ఘృతఘటములోఁ బెట్టిన మాంసఖండమునుండి దుర్యోధనుఁ డనుసుతుఁడు గాంధారీ ధృతరాష్ట్రులకు జనించెను. పిమ్మటఁ గ్రమమున నాఖండములనుండి దుశ్శాసనాదితనయులు నూర్వు రును, దుస్సలయను తనూజయు నుదయించిరి.

అనంతరము పాండురాజు తన కింకను సుపుత్రులం బడయ నభిమతము గలదనియు, దేవేంద్రు నారాధించి త్రిలోక విజయుఁడగు సుతు నింకొకనిఁ బడయుమనియు నానతీయఁ బృథాదేవి సురరాజు నారాధించి మఱియొక తనూజునిఁ గాంచెను. ఆ కుమారునకు దివ్యవాణి యర్జునుఁడని నామ మిడెను.

కుంతియు, గాంధారియుఁ బుత్రులం గాంచుటఁ జూచి తాను సంతానహీనయైనందులకు మాద్రి చింతింపఁ బాండు భూపాలుఁ డామె నోదార్చి, కుంతీదేవినిఁ బిలిచి " తన్వీ!

అప్పుడు దుర్యోధనుఁడు శిల్పకళావిశారదుఁడును, తనకుఁ బ్రియసఖుఁడును నైన పురోచనుఁ డనువానిం బిలిచి "చెలి కాఁడా! నీ శిల్పనైపుణ్యము మెఱయ వారణావతమున నాయుధాగార సమీపమున, లాక్షాసర్జకరస సమ్మిశ్రమై ఘృతతైలార్ద్రమైన మృత్తికాపుంజముతో చతుశ్శాల నతి రమణీయముగా నిర్మించి, పాండవుల నందునిచి, వారలు నిన్ను విశ్వసించి యుండుఁ గొంతకాలము నివసించిన పిమ్మటఁ దగు సమయమున నాగృహము దగ్ధముసేసి పగతురం జంపి రమ్ము. శీఘ్రముగాఁ బొమ్ము" అని చెప్పి యాతని నంపెను.

అనంతర మొక శుభదినమునఁ బాండవులు భీష్మ ద్రోణ విదుర ధృతరాష్ట్రుల దీవనలఁ గైకొని జననీ భృత్యామాత్య యుతముగా వారణావతమునకుఁ బయనమైరి. అప్పటికి యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవులు క్రమంబున నిరువది తొమ్మిది, యిరువదియెనిమిది, యిరువదియేడు, యిరువది యాఱు, యిరువదియైదు వత్సరముల ప్రాయముగలవారై యుండిరి.

పాండునందనులు రథారూఢులై వారణావతమున కేఁగు చుండఁ బౌరు లెల్లరును శోకసంతప్తహృదయులై "కుటిల చిత్తుఁడగు ధృతరాష్ట్రుఁ డేలకో యి కుమార రత్నములను బురము వెడల ననుపుచుండె! మనమును వీరలతోఁ బోయి

వారణావతముననే నివసింతము,'' అని పలుకుచు వారల వెంట రాసాగిరి. యుధిష్ఠిరుఁడు వారల గాంచి, "పిత్రాజ్ఞో ల్లంఘనము ధర్మవిరుద్ధము; కావున నేను వారణావతమున కేఁగి కొంత కాలము నివసించి వచ్చెద; మీర లిచ్చటనే యుండుఁడు,'' అని చెప్పి వారలను మరలించెను. పాండవులపై విదురున కపార ప్రేమము గలదు. అందువలన నతఁడు వారలతోఁ జాల దూర మరిగి పాండునృపునిఁ దలఁచి బాష్పపూరితలోచనుఁడై, యుధిష్ఠిరు నాలింగనము చేసికొని "కుమారా! వారణావతమున మీర లధిక జాగరూకులై యుండవలయును; ఏమఱిచితో విషాగ్నులవలనఁ బ్రమాదము సంభవించును; నేనిచటనుండి దుర్యోధను దురాలోచనలు చక్కఁగ నరసి, నీకుఁ బ్రతికారము చెప్పి పంపెదను.'' అని చెప్పి, దీవించి మరలిపోయెను. పాండునందనులు విదురుని యువ్యాజప్రేమకు సంతసించుచు వారణావతమున కేఁగిరి.

వారణావత నివాసులు పాండవాగమనము విని హర్షావేశముతో నెదురుకొని రాజప్రాసాదమునకు వారిం దోడ్కొని పోయిరి.

పిమ్మట నొకనాఁడు పురోచనుఁడు, నయనాభిరామముగాఁ దానునిర్మించిన చతుశ్శాలను పాండవులకుఁ జూపింప, వారలు దాని రామణీయకతకుఁ గడు సంతస మొంది, పురోచనుని సన్మానించి శుభదినమున గృహప్రవేశము చేసిరి. పిమ్మట నొకనాఁడు యుధిష్ఠిరుఁ డా సౌధమును జక్కఁగఁ బరిశీలించి

య్యును యశోవైభవాతిశయమున సార్వభౌమునివలె ప్రకాశించుచుండెను. నిరంతరము ధర్మానురక్తుఁడై వర్తించు చుండుటచే నాతనికి ధర్మరాజని పేరుకలిగెను. ప్రజలెల్లరు నాసహోదరుల పరస్పర ప్రేమాధిక్యమును, ధర్మశీలమును, పరాక్రమమును వేనోళ్ళఁ బొగడుచుండ, వారలఁ గాంచి భీష్మ ద్రోణ విదురాదులు సంతోషాంబుధి నోలలాడుచుండిరి.

దిగంత విశ్రాంతమైన యుధిష్ఠిరుని యశంబు విని సహింప నోపక దుర్యోధనుఁ డొకనాఁ డేకాంతమున ధృతరాష్ట్రునిఁ గాంచి "తండ్రీ! నీవు యుధిష్ఠిరుని యువరాజుఁ జేసినదాదిగా బ్రజలెల్ల రాతని కనురక్తులై "ఈధర్మశీలునకే రాజ్యాధిపత్య మొసంగినఁ బుడమిపై ధర్మము వర్ధిల్లజేయు" ననుచు నాలోచించుచుండిరి. ఈ పలుకులు శూలములవలె నన్ను బాధించుచున్నవి. కావున నిప్పుడు పాండవుల నీ పురము వెడలననుపుము" అని వచింప, ధృతరాష్ట్రుఁడు "కుమారా! అంధుఁడనైనను నన్ను రాజుగా నంగీకరించి తన బాహుబలమున నరపతుల జయించి కప్పములు దెచ్చి నాకొసఁగుచు నాయెడ నధికభక్తితో వర్తించిన తమ్ముని కొమరుల నిప్పు డెవ్విధమున వెడలఁగొట్టుదు!" ననుచు కొంచెము దుఃఖించెను. అంతట దుర్యోధనుఁడు "జనకా! పాండుభూపతి మున్ను రాజ్యము నతి నిపుణముగాఁ గాపాడుటవలన నిప్పుడు ప్రజలెల్ల రాతని తనయునే సార్వభౌముం జేయవలె నను

చున్నారు. యుధిష్ఠిరుఁ డిప్పుడు రాజ్యార్హుఁ డయ్యెనేనిఁ క్రమముగా నిట్టి యాతని పుత్రపౌత్రులు రాజ్యార్హులౌదురు. మేమును మా సంతతియును వారలఁ గొలిచి బ్రదుకుచుండ వలయును. కావున నీవిప్పుడు పాండురాజునందలి తొల్లిఁటి ప్రేమఁ దలఁపక, జననీ సహితముగాఁ బాండవులను వారణావతపురమున కనుపుము. నేను దాన సన్మానములచేఁ బ్రజలం దృప్తులం జేసి వారల యనురాగము వడసి, యుధిష్ఠిరుని మఱచునట్లు వర్తించెదను. తొల్లి పాండురాజు నిన్నే భూనాధుగా నంగీకరించెఁ గావున నాక్రమంబున నిప్పుడు సార్వభౌమపదమునకే నర్హుఁడ నయ్యెదను. రాజ్యము సుప్రతిష్ఠిత మైనపిమ్మటఁ బాండు నందనులను మరల నిచటికి రావింత" మని చెప్పి యెట్టకేలకు ధృతరాష్ట్రునకు వారలపై నసూయం గలిగించి వారిని వారణావతపురమున కనుప నొడఁబఱచెను.

పిమ్మట నొకనాఁడు ధృతరాష్ట్రుఁడు పాండవులను బిలిచి "కుమారులారా! పాండునికంటెను మీరలు నాయెడఁ గడు భక్తితో వర్తించుచుండుటచే సంతుష్టాంతరంగుఁడనై మిమ్ముల నిప్పుడు సర్వసుఖాస్పదమైన వారణావతపురమున కనుప నెంచితిని. జననీ సహితముగా మీరలచటి కరిగి, పశుపతినివాసంబైన యప్పుణ్యస్థానమునఁ బితృహితార్థము గోభూహిరణ్యాది మహాదానములుచేసి, భృత్యామాత్యవర్గముతో నటఁ గొంతకాలము నివసించి రండు," అని యానతీయఁ బాండునందను లందుల కంగీకరించిరి.

మాయోపాయములచే నందు దగ్ధులైరి." అనుచు విలపించి, యవ్వార్త ధృతరాష్ట్రునకుఁ దెలియఁ బఱచిరి. పాండవులు మరణించిరని విని ధృతరాష్ట్ర భీష్మద్రోణులును, పౌరులును మిక్కుటముగా విలపించిరి. దుర్యోధనాదులు పాండవుల మరణమునకు సంతసించి, ప్రియమిత్రుఁడయిన పురోచనుఁడు మృతుఁడైనందుల కెంతయుఁ జింతించిరి. ధృతరాష్ట్రుఁడు పాండవులకు గంగాతీరమున నుత్తరక్రియలు జేయించెను. ఖనకుఁ డా బిలమును మరల నతి రహస్యముగాఁ బూడ్చి హస్తినాపురమున కరుదెంచి పాండవుల కుశలమును విదురున కెఱింగించెను.

అట బిలమార్గమునఁ బోయిన పాండవులు భాగీరథి దాటి దక్షిణాభిముఖులై గహనమున నరుగుచు నధికక్షుత్పిపాసా పరవశులై నడువనోపక యుండ మారుతాత్మజుండు వారి నందఱి నెత్తుకొని వాయువేగమునఁ జని సాయాహ్నమున నొక మహీరుహమునీడను విశ్రమింపఁజేసి, తాను సరోవరమునకుఁ జని జలపానము చేసి, జననీ సహోదరులకొఱకుఁ గమలపత్రపుటికలనిండ నీరము గైకొని వచ్చెను. కుంతీ ధర్మార్జున నకులసహదేవులు పథశ్రాంతులై తమ తమ వస్త్రంబుల నా వటవృక్షము క్రిందఁ బఱచుకొని నిద్రించుచుండ భీమసేనుఁడు కావలి గాచుచు, తమకు సంభవించిన దురవస్థను దలంచి చింతాక్రాంత మనస్కుఁడై యుండెను. అప్పుడు హిడింబుఁడను రక్కసుఁడు దూరమునుండి పాండవు

లం గాంచి, "చిరకాలమునకు మంచి యాహారము లభించె" నని సంతసించి తన చెలియలగు హిడింబను బిలిచి "నీవు సత్వర మా వటవృక్షము కడ కేఁగి యచట శయనించిన మానవులం జంపి తెమ్ము. నరమాంస భక్షణము జేసి చాల కాలమయ్యె" నని చెప్పి పంపించెను.

పాండవులం జంప నరుదెంచిన హిడింబ భీముని గాంచి సంతనే మరులుగొని వధింపనొల్లక యాతని కడకువచ్చి "పురుషవరేణ్యా! ఈ వనము నా యగ్రజుఁడగు హిడింబాసురునిది. ఇచ్చటికి మనుజులు రా వెఱతురు. మానవు లీ వనము సొచ్చి వెలువడిన, జమునికుత్తుకం జొచ్చి వెలువడినట్లు సంతసింపవలయును; నామనము నీయందు లగ్నమగుటచే నిట్లు హితము గఱపుచుంటిని; హిడింబుఁ డిచ్చటికి రాకమున్నె నీసోదరులను ప్రబోధింపుము. నేను త్వరితముగ మిమ్మందఱిని మఱియొక వనమున కెత్తుకొనిపోయి రక్షించెద" నని వచింప, భీమసేనుఁడు "ఒక్క హిడింబుఁడే గాదు; సురాసుర లేకమై వచ్చినను వీరి సుఖనిద్రకు భంగము, గలుగఁ జేయకనే యెదుర్కొని యుద్ధము చేయనోపుదు" నని పలికెను.

అంతలో హిడింబుఁడు తన సోదరి జాగుసేయుచుండెనని యుగ్రుఁడై రాఁగా హిడింబ భయాక్రాంతచిత్తయై భీముని మఱుగుఁజొచ్చెను. అంతట భీముఁడు వాని నెదుర్కొని ఘోరముగ మల్లయుద్ధము జేసి వానిని జముని పీటికిఁ బంపెను. హిడింబాసురుఁ డఱచిన కేకలకు కుంతీ యుధిష్ఠి రార్జున

తమ్ములం బిలిచి "అనుజులారా! ఈ గృహకుడ్యము లాజ్య తైల లాక్షాగంధగర్భములు; మఱియు నిది శస్త్రాగారసమీపమునఁ గట్టఁబడుటచే మా యీగృహ మగుట నిశ్చయము. కుశాగ్రబుద్ధియగు విదురుఁడు దీని నెఱిఁగియే "విషాగ్నులవలన జాగరూకులై యుండుఁ" డని మనకు బోధించెను. కావున మన కిచ్చటఁ దప్పక నగ్నిభయము నేకూరు" నని చెప్పెను. "అగ్రజా! మన మీ పాపగృహము నిప్పుడే పురోచన సహితముగా దగ్ధముచేసి, ముందున్న మందిరమున నివసింతము," అని తమ్ములు వచింప ధర్మరాజు "తమ్ములారా! అట్లాచరించితిమేని, యెవ్విధంబుననైన మన కపాయము చేయ నమకట్టి దుర్యోధనుఁ డింకొక యుపాయముఁ బన్ని మనలఁ బంపును. కావున దీని రహస్యమును మన మెఱుఁగ నట్లు నటించుచు నిచ్చటనే కడు జాగరూకతతో నుండవలయు" నని పలికెను. పురోచనప్రేరితయై నిషాదవనిత యొకతె పుత్రపంచకముతో వచ్చి కుంతీదేవి నెల్లపుడు సేవించుచు, పాండవు లొనరించు కార్యములను బురోచనునకుఁ దెలుపుచుండెను.

ఇట్లాఱుమాసములు గడచిన పిమ్మట నొకనాఁడు హస్తిపురమునుండి విదురునిచేఁ బంపఁబడిన ఖనకుఁ డొకఁడేతెంచి రహస్యముగఁ బాండవులంజూచి "ఈ కృష్ణచతుర్దశి నాఁటిరాత్రి పురోచనుఁ డీ గృహమున దహనము దరిగొల్పును; మీర లిటనుండి వెడలిపోవుటకు రహస్యముగా బిలము

సేయ విదురుఁడు నన్నుఁ బంపె” నని చెప్పి యతి రహస్య మున నొక సొరంగము త్రవ్వి వారలచే నన్మానితుఁ డయ్యెను.

అంతఁ గృష్ణచతుర్దశినాఁడు పృథాదేవి యప్పురమందలి బీదల నందఱిని బిలిపించి యిష్టాన్నదానములచేఁ దుష్టి నొం దించెను. నాఁటి యుత్సవమున నా నిషాదవనితయు, నేవురు సుతులును గాలచోదితులై యధిక మధుపానము చేసి మత్తుచే నొడ లెఱుఁగక యా లక్కయింటఁ బరుండి నిద్రించిరి. అర్ధ రాత్రమైనతోడనే భీమసేనుఁడు లేచి, పురోచనుఁడు సేయఁ బూనిన కార్యముఁ దానే సేయనెంచి, యాకుటిలుని శయన గృహద్వారమున ఘోరానలము దరిగొల్పి, ఖనకునకుఁ దమ కుశలగమనము నెఱిఁగించి, జననీసహోదరులతో బిల ప్రవిష్టుఁ డయ్యెను. అప్పుడు కుంతీ ధర్మార్జున నకులసహదేవులు నిద్రాభారముచే నా బిలమునఁ ద్వరితముగ నడువఁ జాలక యుండ భీమసేనుఁడు వారలఁ దన భుజద్వయముపై నెక్కించుకొని యతి త్వరితగమనమున నేఁగెను.

ఇట్లు పురోచనసహితముగా లాక్షాగృహమును, నాయుధా గారమును హుతాశనున కశనం బగుటఁ జూచి వారణావత నివాసులు భయభ్రాంతులై గుంపుగూడి వచ్చి, యా భస్మ రాశియం దేవురు సుతులతోఁ జచ్చిపడియున్న నిషాదవనితం జూచి, కుంతియుఁ గుమారులు మృతినొందిరని భావించి “అక్కటా! ధర్మమూర్తులైన పాండవులు, ధార్తరాష్ట్రుల

ములఁ బెకలించుచుఁ, జిన్నతనముగుటచే నతిధూర్తతతో సంచరించెను. అందువలన ధార్తరాష్ట్రు లతనియెడఁ గ్రోధముగలవారై, యొకనాఁ డతఁడు నిద్రించుచుండ ఘనపాశములచే నంటఁగట్టించి గంగాజలమునఁ ద్రోయించిరి. అంతట మహాబలశాలియగు వాయునందనుఁడు మేల్కాంచి యొడలు విఱువ నాబంధములన్నియుఁ దెగిపోయెను; సంతసముతో నతఁడు బయట కేతెంచి సహోదరులం గలిసికొనెను. మరల నొకనాఁడు పవనతనూజుఁడు నిద్రించుతఱిఁ గృష్ణోరగములచేఁ గఱపింప నవి యాతని వజ్రదేహమును గఱవలేక పోయెను. మఱియొకనాఁ డతిరహస్యముగా నన్నమున విషముఁగలిపి పెట్టింప నది యమ్మహాసత్త్వున కమృతాన్నము పగిది జీర్ణమయ్యెను. తమ ప్రయత్నము లన్నియు నిట్లు విఫలములగుటచే దుర్యోధన, దుశ్శాసనాదులు సిగ్గునొందియు, మరల నెవ్విధముననైనఁ బాండవపంచకమును గడతేర్చు నుపాయమును దమ మేనమామయగు శకునితో రహస్యముగ నాలోచించుచుండిరి.

ఇట్లుండ నొకనాఁడు పాండవధార్తరాష్ట్రులెల్లఱుఁ గ్రీడాపరులై పురబాహ్యప్రదేశమున నాటలాడుచుండఁ గాంచన కందుకము నూతిలోఁ బడెను. దానిం దీయునుపాయము నెఱుఁగక నాకుమారులెల్లఱు నిలిచి చూచుచుండ, నప్పూడమార్గమున నేఁగుచున్న ద్రోణాచార్యుఁడను విప్రుఁ డది చూచి తన ధనుర్విద్యాకౌశలమున దానిని దీసి యిచ్చెను.

కురుకుమారులు దానింగైకొని సంతోషితస్వాంతులై యా భూసురోత్తముని దమ పితామహునిపాలికిఁ దోడ్కొని పోయి జరిగినవృత్తాంతము నెఱింగించిరి.

గాంగేయుఁడు ద్రోణుని సన్మానించి "మహాత్మా! ఎట నుండి వచ్చుచుంటిరి ?" అని యడుగ "కురువంశోత్తమా ! అగ్నివేశుఁ డను మునివరునికడ నేనును, ద్రుపదుఁడును ధనుర్వేదము నభ్యసించితిమి. అప్పుడు మాకిరువురకుఁ గడు స్నేహమయ్యెను. కొంతకాలమునకు ద్రుపదుఁడు పాంచాల రాజ్యాధిపత్యము వహింప నేఁగుచు నన్నుఁ గాంచి 'చెలువుఁడా ; నీకు ధనధాన్యములు గావలసినప్పుడు నాయొద్దకు రమ్ము." అని చెప్పి చనియెను. అనంతరము నేను కృపాచార్యుని చెలియలు కృపిని వివాహమాడి యశ్వత్థామయను నందనుం బడసితిని. ఆ బాలుఁడు పాలుద్రావుట కావును దెమ్మని యేడ్చుచుండ నా బాల్యసఖుఁడైన ద్రుపదునికడకు గోవు నడుగ నేఁగితిని ; అతఁడు రాజ్యమధాంధుఁడై "నేను భూపాలుఁడను ; నీవు పేదపాఱుఁడవు ; నీతో నాకెక్కడి సఖ్యము ?" అని యవమానించెను. అంతట నేను వేఱొక భూనాథు నాశ్రయించి బాలుని కోర్కెఁ దీర్పనెంచి వచ్చుచున్నాను." అని ద్రోణుఁడు తన వృత్తాంతమును విశదీకరించెను. అంతట శాంతనవుఁ డాభూసురునకుఁ గావలసిన యర్థంబుల నొసఁగి "మహానీయా, మీ రిచట నివసించుచు నామనుమల కందఱకిని రాజవిద్యలఁ గఱపుఁడు ;" అని ప్రార్థింప ద్రోణుఁ డందుల కానందమొంది-

అశ్వినీ దేవతలవలన మాద్రికి సంతతిఁ గలిగింపుము," అని వచించెను. అంత నామె యద్దేవతల నారాధింప నవ్వేల్పుల వరమున మాద్రి గర్భవతియై సుతద్వయమును గాంచెను. ఆకాశవాణి యక్కుమారులకు నకుల, సహదేవులని పేరుఁ బెట్టెను. శుక్లపక్ష సుధాకరుని చందమున నక్కుమార పంచకంబు దినదినాభివృద్ధి నొందుచు జననీజనకులను సంతోషింపఁజేయుచుండెను. పాండుభూమీశుఁడు వారలకుఁ జౌలోపనయనములు చేయించి వేదాధ్యయనముఁ జేయించుచుండెను.

అట్లుండ నొకనాఁడు పాండుమహీశుఁడు మాద్రిమనోహరాకృతియందుఁ జిత్తమునిలిపి, మునిశాపమును దెలిసి యాసాధ్వి వారించిన వినక విధిప్రేరితుఁడై బలవంతముగ నామెం దాకి విగతజీవుఁ డయ్యెను. అప్పుడు మాద్రి యాక్రందనము సేయఁ గుంతియుఁ, గుమారులు నరుదెంచి భూనాథునిఁ గాంచి విలపింపసాగిరి. అప్పుడు పృథాదేవి సహగమనము సేయఁబోవ, మాద్రి "అక్కా, నేనిక్కుమారులను జాగరూకతతోఁ బోషింపఁజాలను. ధీశాలివగు నీ విక్కుమార పంచకంబును గాపాడుచుండుము. నేను పతితోడఁ బరలోకమున కరిగెద" నని చెప్పి నిజనందనులను గుంతి కప్పగించి యామె సహగమనము చేసెను. అంత నయ్యాశ్రమవాసులగు మునులెల్ల నరుదెంచి కుంతినిఁ గుమారులను నూరార్చి వారలను హస్తిపురమునకుఁ దోడ్కొనిపోయి, భీష్ము

ధృతరాష్ట్ర విదురాదులకుఁ బాండుమహీశుని మరణవృత్తాంతము, దెలిపి కుంతీకుమారులను వారల కప్పగించి చనిరి. ధృతరాష్ట్రాదులు పాండురాజవియోగమునకు దుఃఖితులై, శోకపూరితమానసయైన కుంతిని, కుమారపంచకమును నోదార్చి వారల నతిప్రియమునఁ గాపాడుచుండిరి. అనంతర మొకనాఁడు వ్యాసమునీంద్రుఁ డరుదెంచి ధృతరాష్ట్రాదు లకు దుఃఖోపశమనంబు సేసి యేకాంతమున సత్యవతినిఁ గాంచి "జననీ! ధృతరాష్ట్ర తనూజులు దుర్మార్గవర్తను లయ్యెదరు; వీరలవలనఁ గులక్షయంబగును. మీర లిట నున్నచో నీదుఃఖము ననుభవింపవలయుఁ గావున నిప్పుడే తపోవనమున కేఁగుట యుక్తము" అని వచింప, నామె యవ్వార్త భీష్మునకుఁ దెలిపి, కోడండ్రం దోడ్కొని తపోవనమున కేఁగెను. వారు ముగ్వురును గొంతకాలము తప మాచరించి పిమ్మట శరీరములం ద్యజించిరి.

ఇట ధృతరాష్ట్రుఁడు తన సుతులను, బాండుసుతులను సమభావమునఁ బోషించుచుండఁ, గుంతీదేవియుఁ దనపుత్రులను సవతిపుత్రులను సమభావమునఁ గాపాడుచుండఁ గుమారులందఱు దినక్రమాభివృద్ధు లగుచుండిరి. ఆ రాజనందనులందఱిలో భీమసేనుఁడు మిగుల బలవంతుఁడై యుండెను. అతఁడు జలక్రీడలాడుసమయమునఁ దన భుజములపై ధార్తరాష్ట్రులం బలువుర నెక్కించుకొని నీట ముంచుచు నెత్తుచు, వారలు ఫలార్థులై వృక్షములెక్కినప్పుడు దానప్పాదపం

నెల్లవారును జూడంగ నీక్షణంబ
రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి.

అని పలికి భీష్మ ధృతరాష్ట్రుల యనుమతి వడసి కర్ణునిఁ గాంచన పీఠమున నునిచి యంగ రాజ్యమున కభిషిక్తుం జేసెను. తన యవమానముఁ బాపి రాజుఁ జేసినందుల కమందానంద మొంది కర్ణుఁడు దుర్యోధనునికొఱకు తన ప్రాణము నైన నసీయ దృఢనిశ్చితుఁడై యాతనితోఁ జెలిమి సేయ నొడఁబడియెను. అప్పుడు రాజ్యాభిషిక్తుఁడైన కొమరునిఁ గని సూతుఁడు హర్ష పూరితాంతఃకరణుఁడై వచ్చి యాతని నాలింగనము సేసికొన, నెల్లరుఁ గర్ణుని సూతసుతునిగా నెఱింగిరి. అప్పుడు వాతాత్మజుఁడు కర్ణునిఁ గని "సూతసుతుఁడవగు నీవు రాజ్యాభిషేకమున కనర్హుఁడవు. నీ కులవృత్తి ననుసరించి రథసారథ్యము సేయుచుండుము." అని పలుక దుర్యోధనుఁ డలిగి "దివ్య లక్షణ లక్షితుఁడగు నిమ్మహాపురుషుఁడు సూతకులసంభవుఁడు గాఁడు. మహాత్ముల జన్మరహస్యముల నెఱుంగ నొరుల కల వియే! వీరవరేణ్యుఁడగు కర్ణుఁడీ యంగ రాజ్యంబునకే గాదు సకలమహీ రాజ్యంబున కర్హుఁడైనవాఁడు." అనిచెప్పి, యప్పటికి సరోజమిత్రుఁ డస్తాద్రిం జేరుటచేఁ గర్ణునిఁ దోడ్కొని నిజమందిరమున కరిగెను. అంతట సభఁ జాలించి యందఱుఁ దమతమ నిలయముల కేగిరి.

మఱునాఁడాచార్యుఁడు శిష్యుల నందఱినిఁ బిలిచి "నాకు గురుదక్షిణ యొసఁగుఁ"డని యడుగ వారలు బద్ధాంజలులై

"గురువరా! తమ యభీష్టముఁ దెలుపుఁ"డనిరి. "మున్ను నన్నవమానించిన పాంచాల మహీశునిఁ బట్టి తెం" డని ద్రోణాచార్యుఁడు వచించెను. వెంటనే ధార్తరాష్ట్రులెల్ల రాయుధపాణులై యరిగి ద్రుపదు పురంబును ముట్టడింపఁ బాంచాల భూపతి శరవర్షంబుఁ గురియించి వారలఁ జిందర వందర గావించెను. ద్రుపదుని ధాటికి నోర్వఁజాలక ధార్తరాష్ట్రులు మరలి వచ్చిరి. వెన్వెంట నర్జునుఁడే లేచి యాచార్యుని సెలవు గైకొని పాంచాలమున కేఁగుచుండ భీమసేనుఁడు మాద్రేయులు నాతని వెంట నేఁగిరి. ఆ సోదర చతుష్టయము ద్రుపద నగరము ముట్టడించి వైరి బలంబులఁ జెండాడుచుండ ద్రుపదుఁడు వారల నెదుర్కొనియె. అప్పుడు పార్థుఁడాతనిపై నిశితవ యస్త్రంబులఁ బ్రయోగించి చీకాకుఁబఱచి యమ్మహీనాథుని బట్టి బంధించి గురు సన్నిధానంబునకుఁ దెచ్చెను. "మహారాజా! నా శిష్యునిచే నిట్లు బద్ధుఁడవైతి వేల? ఇప్పుడైన ధనమదాంధ్యము విడిచి నన్ను గుర్తించితివా?" అనుచు ద్రోణుఁ డాతని నవమానించి విడిచిపెట్టి శిష్యునిపరాక్రమమునకుఁ బహుమానఁ దమొంది యతనికి మఱికొన్ని దివ్యాస్త్రముల నొసంగెను.

అనంతరము ధృతరాష్ట్రుఁడు భీష్మ విదురులతో నాలోచించి యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషిక్తుం జేసెను. తమ్ములు నలువురును మదోన్మత్తులైన భూపాలుర జయించి ధనరాసు లందెచ్చియిచ్చుచుండ యుధిష్ఠిరుఁడు పేరునకు యువరాజ

రాజనందనులకుఁ విద్యఁ గఱపుచు నాఁటనుండి యచటనే నివసించుచుండెను.

ఆ రాజకుమారులందఱిలో నర్జునుఁడు విలువిద్యయం దధిక ప్రావీణ్యముఁ గనుపఱచుచుండుటచే నాచార్యుఁ డాతనియెడఁ బ్రీతుఁడై యనేక దివ్యాస్త్రంబుల నుపదేశించెను. కుమారు లందఱును రాజవిద్యల నాఱితేఱినపిమ్మట నొకనాఁడు వారల విద్యాకౌశలమును భీష్మ ధృతరాష్ట్రాదులకుఁ జూపనెంచి యాచార్యుఁడు శిష్యులనందఱిని సభాంతరమునకుఁ దోడ్కొని వచ్చెను. అంతట గదాయుద్ధవిశారదులైన భీమ, దుర్యోధనులు కొంతసేపటివఱకు సాము సేసి తమ గదాయుద్ధకౌశలముం గనఁబఱచి సభ్యులానందింపఁ జేసిరి. పిమ్మట రాజపుత్రు లెల్లరును దాము నేర్చినవిద్యలం జూపి సభ్యులమెప్పుఁ గాంచిరి. అనంతర మాచార్యుఁడు "నా ప్రియశిష్యుఁడైన పాండవమధ్యముని ధనుఃకౌశలముఁ జూడుఁ" డనుచుండ నర్జునుఁడు లేచి, యాగ్నేయ వారుణాది దివ్యాస్త్రములం జూపి సభాసదులను హర్షింపఁ జేసెను. పాండవమధ్యముని ధనుఃకౌశలముఁ గాంచి సభ్యు లందఱును, హర్షితులైరి గాని, దుర్యోధనుఁడును నాతని యనుజన్ములును గడు నసూయాగ్రస్తులైరి.

ఆసమయమున నచటికిఁ గర్ణుఁ డరుదెంచి భుజాస్ఫాలనము సేయుచు నవ్యసాచిం గని "నేనే విలువిద్యయం దగ్రగణ్యుఁడని గర్వితుఁడవుగావలదు. నీవు చేసిన పనులనెల్ల నేనుగూడఁ జేసి సభ్యులఁ మెప్పించెదఁ జూడుము." అనుచు గంభీరవాక్యము

లాడి యర్జునుఁడు చూపిన విద్యలన్నియుఁ దానును జూపి సభ్యులను విస్మితులం జేసెను. అదిగాంచి దుర్యోధనుఁడు ప్రమోదభరిత మానసుఁడై కర్ణునిఁ గౌఁగిలించుకొని "వీరవరేణ్యా! నీవు నాతో సఖ్యముచేసి నాయభిమతముఁ దీర్పవలయు" నని వచింపఁ గర్ణుఁ డందుల కంగీకరించెను. అనంతరము కర్ణార్జునులు ద్వంద్వయుద్ధము సేయ నెదుర్కొనిరి. ఆసమయంబున ధార్తరాష్ట్రులెల్లరు కర్ణునిపక్షమునను, భీష్మద్రోణ కృప విదురాదులు పార్థపక్షమునను నుండిరి. అప్పుడు కృపాచార్యుఁడు కర్ణార్జునుల మధ్య నిలిచి కర్ణునవలోకించి "భరతాన్వయప్రదీపకుఁడును, పాండురాజనందనుఁడు నగు నర్జునునితో ద్వంద్వయుద్ధము సేయ నెంతువేని నీవంశమును, మాతాపితల నామధేయమును మాకుఁ దెలుపుము. నీవును క్షత్రియకులోత్తముఁడ వైనచోఁ బార్థుఁడు నీతో యుద్ధము సేయు" నని వచింపఁ గర్ణుఁడు సూతపుత్రుఁడగుటచే దనకులముఁ దెలుప సిగ్గునొంది తలవంచి యూరకుండెను. అప్పుడు దుర్యోధనుఁడు కృపాచార్యునిఁ గని

క. కులము గలవాఁడు శౌర్యము
గలవాఁడును నధికసేన గలవాఁడును భూ
తలమున రాజను నామము
వెలసిల్లఁగఁ దాల్చు మూఁడువిధములఁ బేర్మిన్.

తే. రాజవరుఁడైన పార్థుతో రాజు గాని
యాతఁ డని సేయఁగాఁ దగఁడేని వీని

నకులసహదేవులు మేల్కాంచి పవన తనయుని విజయము గాంచి సంతసించిరి. పిమ్మట హిడింబ "నను బరిగ్రహింపు" మని భీమసేనునిఁ బ్రార్థింప, "రక్కసులను విశ్వసింపరా" దని యతఁడు దానిని జేపట్ట నొల్ల కుండెను. అప్పుడు ధర్మ తనయుఁడును, కుంతీదేవియు "ఇది యుత్తమురాలు; దీని యందు రాక్షసభావం బుపలక్షింపవలదు; నీవివ్వనిత యభీష్టము దీర్పుట న్యాయభిమత" మని వచింపఁబవననందనుఁడు హిడింబను జేపట్టెను. పిమ్మట నందఱును శాలిహోత్రుఁడను మునీంద్రు నాశ్రమమున కేఁగిరి.

అచ్చటికిఁ గృష్ణ ద్వైపాయనుఁ డరుదెంచి, వినయావనతులై కృతాంజలులైన మనుమలను దీవించి, బాష్పపూరితలోచనయైన కోడలిని జూచి చింతింపవలదు. కొంతకాలము నకు మీరు బాంధవులం గలిసి రాజ్యభోగము లనుభవించెదరు. ధర్మ నిరతుఁడగు నీసుతుఁడు సకల భూనాథులను శాసించి సార్వభౌముఁడై రాజసూయాశ్వమేధాది క్రతువుల నాచరించి భరతాన్వయముఁ బవిత్రము సేయు" ననుచు దుఃఖోపశమనము చేసి, మరలఁ దన తపోవనమున కేఁగెను. పిమ్మట హిడింబకు సద్యోగర్భమున ఘటోత్కచు డను నందనుఁ డుద్భవించి, తండ్రులకుఁ గుంతికి నమస్కరించి "నేనును నాజనయిత్రియు నిఁక రాక్షస పిశాచబలములం గలిసి నివసించుచు మీకుఁ బనిగల యప్పుడు తలంచిన వచ్చుచుందుము." అనిచెప్పి వారల సెలవుఁ గై కొని హిడింబను

దోడ్కొని యుద్ధేచ్ఛం జనియెను. పాండవులు శాలిహోత్రు నాశ్రమమునఁ గొన్ని దినములుండి యనంతర మమ్మునీంద్రుని వీడ్కొని యేకచక్రపురమునకుఁ జని విప్ర వేషములం దాల్చి భిక్షాటనముచేయుచు కాలముఁ గడపుచుండిరి.

ఆపుర సమీపమున బకుఁడను రాక్షసుఁడు గలఁడు. అను దినము వాఁ డాగ్రామముపయిఁబడి లెక్కలేకుండ మానవులను దినుచుండఁ బౌరు లాఘోరకృత్యములకు కోర్వఁజాలక "నిత్యము నిలువరుస నొక మానిసిని, రెం డెనుబోతులను నొక శకటమున నన్నమును నీకడ కనుపుచుందుము. నీవు వానిని భక్షించి శాంతింపుము." అని యాదానవునిఁ బ్రార్థించి నాఁటనుండి యట్లనుపుచుండిరి.

ఒకనాఁ డానిశాచరుని కాహారముఁ గైకొనిపోవువంతు, పాండవులున్న గృహాధికారికి రాఁగా నాతని సతి పతి వియోగమున కోర్వఁజాలక "నాథా! ప్రాణవియోగము చేసి యయినను భార్య భర్తకు హితముచేయుచుండవలయు; కావుననే నారక్కసున కశనమయ్యెదను; మీ రేఁగవల" దని విలపింప నతఁడు. "అగ్నిసాక్షిగా వివాహమాడిన యుత్తమ సతిని దానవున కాహారముగాఁ బంపి నేను జీవింపనోప" ననుచు శోకించుచుండెను. మరణవ్యవసాయమునం దున్న తలిదండ్రులం గాంచి కొమార్తెయుఁ గుమారుఁడును దుఃఖించుచు వారల విడిచిజీవింపఁజాలక "నిశాచరున కాహారముగా

"మే మేఁగెద" మనుచు నాక్రందనముఁ జేయసాగిరి. అప్పుడు కుంతి వారికి సంభవించిన యాపద నెఱిఁగి "ఆరక్కసునకాహారముగా మీరెవ్వరు నరుగవలదు; అపమాన బలవంతుఁడగు నాసుతు నంపి యాదుష్టునిఁ జంపించెద" నని చెప్పి వారల నోదార్చి, భీమసేనున కీవార్త దెలిపెను.

అంతట భీముఁడు సంభ్రమాక్రాంత హృదయుఁడై బకుఁడున్న చోటికి కరిగి యుద్ధమునకుఁ బిలువ, వాఁ డుగ్రుఁడై వచ్చి వృక్షములఁ బెఱికి భీమసేనుపైఁ బోవసాగెను. ఇరువురును గొంత తడవు మహీరుహములతోఁ బోరాటము సలిపి పిమ్మట మల్లయుద్ధము సేయఁదొడఁగిరి. ఇట్లు కొంత తడవు ఘోరముగ నాయోధనము సేసి భీమసేనుఁడు బకాసురుని విగత జీవునిఁ జేసి వాని కళేబరము నీడ్చుకొని వచ్చి పురద్వార సమీపమునఁ బడవైచెను. దానిం గాంచి పౌరులెల్లరును హర్షపరవశులై వాయునందనుని వేనోళ్ళఁ గొనియాడిరి.

అనంతర మొకనాఁ డొక విప్రుఁడు ద్రుపదపురమునుండి యరుదెంచి విశ్రమార్థియై పాండవులున్న యింటికి రా నాగృహస్థుఁ డాతని నభ్యాగత పూజల సంతుష్టుఁ జేసెను. పిమ్మటఁ గుంతి యాతనిఁ గాంచి "భూసురోత్తమా! మీరే దేశమునుండి వచ్చితిరి? మీదేశమునఁగల విశేషము లెవ్వి?" యని ప్రశ్నింప నాధరణీసురుఁడు "తల్లీ! నేను పాంచాలదేశమునుండి వచ్చుచుంటిని. ఆభూపాలుఁ డిప్పుడు తన సుతకు స్వయంవరము మహావైభవమునఁ జేయఁబోవుచున్నాఁడు.

అగ్నికుండ సముద్భవయగు నక్కోమలిని జేపట్ట నభిలాషులై నానాదేశపాలకులు వచ్చుచున్నా" రని యచటి విశేషములు జెప్పెను. యుధిష్ఠిరుఁ డామాట లాలించి "ఆర్యా! ఆకన్యకామణిని ద్రుపదుఁ డెట్లు వడసెనో విశదముగఁ దెలుపుఁడు." అని యడుగ నాభూదేవుఁడు "అయ్యా! ద్రుపదుఁడు మున్నొకపరి ద్రోణాచార్యు నవమానించుటచే నాతని ప్రియశిష్యుఁడగు నర్జునుఁడు పాంచాలమున కరుదెంచి ద్రుపదునితో రణముచేసి యతనిని బంధించి తీసికొనిపోయి తన గురునమ్ముఖమున నునిచెను. ద్రోణుఁడాతని నవమానించి విడిచిపెట్టెను. పిమ్మట ద్రుపదుఁ డర్జునుని పరాక్రమమునకు సంతసించి యాతనిని దనకు జామాతం జేసికొన నభిలషించి పార్థునకు దేవిగాఁ దగుకూఁతును, ద్రోణాచార్యునిఁ జంపఁజాలు కొడుకును బడయనెంచి మహాక్రతువుజేయ నగ్నికుండము నుండి కృష్ణ యను సుతయు, ధృష్టద్యుమ్నుఁడను సుతుఁడును నుద్భవించిరి. ఆకన్యను పార్థునకు దేవిగా నీయఁగోరియున్న ద్రుపదుఁడు పాండవులు లాక్షాగారమున దగ్ధులైరని చారుల వలన విని చింతాక్రాంతుఁడయ్యెను. అప్పుడాతని పురోహితుఁడు "రాజా! కుశాగ్రబుద్ధులగు పాండవు లెవ్విధమున నైన నయ్యాపదఁ దప్పించుకొని యెందైనఁ బ్రచ్ఛన్నులై యుందురుగాని, మృతులైరను వార్త నేను విశ్వసింపఁజాలను. నీవిప్పుడు విచార ముడిగి, క్షత్రియ సామాన్యుల కభేద్యమగు మత్స్యయంత్రము నేర్పఱచి స్వయంవరముఁ జాటింపుము.

విజయుఁడు తప్పక నిచ్చటికివచ్చి యాయంత్రము గొట్టి నీ సుతను జేపట్టి నీమనోరథ మీడేర్చును." అని యుపదేశింప ద్రుపదుఁ డట్లు గావించుచుండెను." అని యాధరామరుఁడు ద్రుపదు వృత్తాంతము నామూలాగ్రముగఁ దెలిపి తన మార్గమున నేఁగెను. అంతటఁ బాండవులును పాంచాలమున కేఁగ నుత్సుకులై జననీయుతముగఁ బయలుదేరిరి.

మార్గమధ్యమున ననేక విశేషములను గాంచుచు దక్షిణ పాంచాలమున కరిగి ద్రుపదుపురమున నలుదిశల విడిసియున్న నానాదేశాగత మహీనాథుల బహువిధస్కంధావారములఁ గాంచుచుఁ జని యొకానొక కుంభకారాగృహమున విడిసి, విప్రసమూహముం గలిసి స్వయంవర రంగమున కేఁగిరి.

కనకమయమైన విశాలమంటపముపై సమర్పబడిన రత్న సింహాసనములపై మహీకాంతులెల్లరు నాసీనులై యుండఁ బాంచాలరాజనందన పుష్పమాలికఁ జేఁబూని యరుదెంచెను. అప్పుడు ధృష్టద్యుమ్నుఁడు లేచి నిలిచి మహాకార్ముకమును, వియత్తలమునఁ గట్టిన మత్స్యయంత్రమును రాజలోకమునకుఁ జూపి "పార్థివోత్తములారా! ఇమ్మహాధనువు నెక్కుపెట్టి యైదమ్ములతో నయ్యంత్రమును గొట్టిన వీరాగ్రగణ్యుని నాయనుజ వరించు" నని చెప్పెను.

భూపాల సమూహ మక్కోమలిని గాంచి యనురాగజనిత మానసులై తమతమ సామర్థ్యముల నాలోచింపక నయ్యంత్రముసేయ నరిగి యువ్విల్లు మోపెట్టఁజాలక సిగ్గునొంది మరలి

వచ్చిరి. ఇట్లు మహీనాథులెల్లరు నయ్యంత్రము నేయఁజాలక యుండ నర్జునుఁడు లేచి యశ్రమంబు నవ్విల్లు మోపెట్టి యేనమ్ముల నయ్యంత్రమును బడఁగొట్టెను. అప్పుడు ధరామరోత్తములెల్లరు నంతోషపరవశులై యాశీర్వదించుచుండ ద్రుపదరాజనందనయైన కృష్ణ మందస్మిత వదనారవిందయై వచ్చి విజయుని గళంబునఁ గుసుమమాలిక వైచెను.

స్వయంవరోత్సవమునకు తరుదెంచిన జరాసంధ, దుర్యోధనాది నృపాలురెల్ల నది చూచి "పరాక్రమశాలురగు వసుమతీనాథు లుండఁగ ద్రుపదుఁడు తనసుత నీపేదపాఱున కిచ్చి మనల నవమానించె" ననుచు నాగ్రహులై ద్రుపదార్జునుల ముట్టడించిరి. పాండవమధ్యముఁడా రాజసమూహమును, ధృష్టద్యుమ్న, భీమసేనుల సహాయమునఁ బాఱఁదోలి, కృష్ణాసహితముగఁ దమ విడిదికేగెను.

ఆమెను గాంచినది మొదలు యుధిష్ఠిర, భీమ, నకుల సహదేవుల మనస్సు లామెయందు లగ్నములయ్యెను. ఆమెయు వారి సౌకుమార్యమును, విక్రమాతిశయమును, సత్యసంధతయను సహోదర ప్రేమమును గాంచి తనమనంబు నయ్యేవురపై నిలిపెను. కుంతీదేవియుఁ దనతనయు లేవు రయ్యువతిని బాణిగ్రహణము చేసికొనిన నానందముగ నుండునని తలంచెను. అప్పుడర్జునుఁడు యుధిష్ఠిరునిఁ గాంచి "అన్నా! అగ్రజుని విడచి యనుజుఁడు వివాహమాడదగదు; కావున నీవీ కన్యను బరిగ్రహింపుము." అని వచింప ధర్మరాజు

"తమ్ముఁడా! దైవప్రేరితములై మనయేవురి మనంబు లిత్తన్వియందు లగ్నములయ్యెను? కావున నీమె నేవురము వివాహమాడుదము." అని చెప్పెను.

అటఁ బాంచాలమహీశుఁడు విజయుని గుర్తింపలేకఁ దన తనూజ నింకెవ్వనికో యీయవలసెనని చింతాక్రాంతుఁడై యాతనివృత్తాంతము నరసిరమ్మని ధృష్టద్యుమ్నునిఁ బంపించెను. ఆతఁ డతిరహస్యముగాఁ బాండవులున్న గృహము సొచ్చి వారల సంభాషణల నాలించివచ్చి జనకా! నా యన్నదమ్ముల సంభాషణల నాలింప వారలు క్షత్రియోత్తము లని తోఁచుచున్నద" ని చెప్పెను. పిమ్మట ద్రుపదుఁడు "చాతుర్వర్ణ్యోచితములగు రథములఁ గొనిపోయి వారలం దోడ్కొని రమ్మ" ని వచింప ధృష్టద్యుమ్నుఁ డయ్యరదములతో నరిగి "రాజమందిరమునకు విచ్చేయుఁడ" ని పాండవుల నాహ్వానించెను. అంతటఁ బాండునందనులు రాజయోగ్యములగు రథములెక్కి ద్రుపదరాజనివేశమున కరుదెంచి, క్షత్రియోచితాసనములపై నాసీనులైరి.

అప్పుడు ద్రుపదుఁడు వారినిగాంచి "మహావీరులారా! మీరు క్షత్రియులో, బ్రాహ్మణులో, లేక గృహస్థాపరిగ్రహణార్థం బగుదెంచిన దివిజులో-మీ వృత్తాంతము నెఱింగించి నన్నానందింపఁజేయుఁడు." అని వచింప, ధర్మరాజు "అవనీతలేంద్రా! మేము పాండురాజనందనుల" మని చెప్పెను. పాంచాలభూపతి యప్పలుకులకుఁ బ్రమోదభరితమానసుఁడై

"మహామహులారా! నాపుణ్యమున లక్ష్యగృహదహనము వలన మీరేయపాయము నొందరైతిరి. ఇఁకఁ గృష్ణార్జునులకు వివాహముచేయ సుముహూర్తము నిర్ణయింత" మని వచింప ధర్మనందనుఁడు "నృపవరేణ్యా! ఈకన్యను మే మేవురము వివాహమాడవలయు" ననుచు నిజాభిలాషము వ్యక్తపఱచెను.

ఒక్కకన్యక నేవురు పరిణయమాడుట ధర్మమా యని ద్రుపదుఁడు సంశయించుచుండ నప్పుడు కృష్ణద్వైపాయనుఁ డచటికరుదెంచి "వసుమతీనాథా! ఇక్కన్యారత్నము తొలి జన్మమునఁ బతిఁగోరి పశుపతి నుద్దేశించి ఘోరతపము సేయ నుమారమణుఁడు ప్రీతుఁడై వరము వేఁడుమనియెను. అంత నామె తనకుఁబతిని బ్రసాదింపుమని యేనుమాఱులు వేడ మహేశ్వరుఁడు "నీకు దేహాంతరమున నేవురు పతులగుదురు" అని వర మొసఁగి యంతర్ధానుఁడయ్యెను; ఆ కారణంబున నీమె పాండవపంచకమునకుఁ బత్నియగును; దైవనిర్దిష్టమగుటచే నిది ధర్మవిరుద్ధముగాదు. మఱియు నిట్టియాచారముగలదు; తొల్లి నిశంతుఁడను రాజర్షి కొడుకులేవురు పరస్పరమైత్రి నతిప్రసిద్ధులై పెరుఁగుచు, నాశీనరపతిసుతను స్వయంవరమునఁబడసి వివాహమాడిరి. కావున నీవిఁక సంశయమువిడిచి పాండవుల కేవురకు ద్రౌపదిని గ్రమమునఁ బాణిగ్రహణము చేయింపుము" అని ద్రౌపదీ పూర్వజన్మవృత్తాంతమును దెలిపి యాతని సందేహముదీర్చెను. పిమ్మట ద్రుపదమహారాజు సుముహూర్తమున మహావైభవముతోఁ

పాండునందనుల కేవురకు ద్రౌపది నొసఁగి పాణిగ్రహణ మహోత్సవము చేయించెను. పాండవులు ద్రౌపదితో నానందించుచు నచ్చట నొకవత్సరముఁ గడపిరి.

అనంతర మొకనాఁడు దేశదేశవృత్తాంతముల నరసి రానేఁగిన చారులు దుర్యోధనునిపాలి కరుదెంచి, నాఁడు మత్స్యయంత్రముఁగొట్టినవాఁ డర్జునుఁ డనియు, ద్రుపదాత్మజను బరిణయమాడి పాండవులు ద్రుపదుపురమున సుఖముగనుండి రనియుఁ జెప్పిరి. దుర్యోధనుఁ డది విని, లాక్షాగృహమునఁ బురోచనుఁ డొక్కఁడే దగ్ధుఁడయ్యెఁగాఁబోలు నని దుఃఖతాత్ముఁడై కర్ణునిఁగూడి తండ్రికడ కేఁగి పాండవుల చరితము నాతని కెఱిఁగించెను. "అయిన మన మిపుడేమి సేయుద" మని ధృతరాష్ట్రుఁ డడుగ, దుర్యోధనుఁడు "పాండవుల నిటకు రావించి, కౌంతేయమాద్రేయులకును, ద్రౌపదికి, నేవురు పతులకు నంతఃకలహములు కలిగించి పిమ్మట నొక్కొక్కరినిఁ జంపుద" మని చెప్పెను. "అదివఱకిట్టి యుపాయములెన్నియో పన్నితిరి; వానివలన నేమిప్రయోజనము గలిగెను? పాండవుల కంతఃకలహ మేనాఁటికిఁగలుగదు. కావున మన మిప్పుడు చతురంగ బలములతో నరిగి ద్రుపదునోడించి పాండవులతోఁ బోరి వారలను బంధించి తెచ్చుటయుక్తము." అని కర్ణుఁడు వచింప, ధృతరాష్ట్రుఁ డిదియే కర్తవ్యమని తలఁచి భీష్మద్రోణవిదురులఁ బిలిచి యావృత్తాంతము నెఱిఁగించెను. "పాండవధార్తరాష్ట్రులు మాకు సములు; పితృ

పితామహాంశమైన రాజ్యమునకు మీవలె వారును నర్హులు; కావున పాండవుల కర్థరాజ్యమిచ్చి మీరును వారును గలిసి యుండుట మాకును, లోకమునకును సమ్మతముగాని వారలతోఁ బోరుట సమ్మతముగాదు" అని యామువ్వురు నేకగ్రీవముగాఁ బలికిరి. ధృతరాష్ట్రుఁడు వారిమాటఁ ద్రోసివేయఁజాలక "పాండవుల కర్థరాజ్యమొసఁగెదను. వారల నిచటికిఁ దోడ్కొని రమ్ము." అని విదురునకుఁ జెప్పెను. అంతట విదురుఁడు సంతోషముతో పాంచాలమున కేఁగెను.

పాండవులాతనిఁ గాంచి హర్షతరంగితాంతఃకరణులై యతిప్రేమమున నాలింగనము చేసికొనిరి. పిమ్మట విదురుఁడు ధృతరాష్ట్రునాజ్ఞఁ దెలుపఁ బాండునందనులు ద్రుపదానుమతిం బడసి, కుంతిని, ద్రౌపదిని దోడ్కొని హస్తినాపురమున కరుదెంచిరి. భీష్మద్రోణాది గురుజనులను, బౌరులును వారిని గాంచి యానందాశ్రువులను విడనాడిరి.

అచ్చటఁ బాండవులు రాజ్యవిద్యావినోదములతో నైదు సంవత్సరములు నివసించిరి. పిమ్మట నొకనాఁడు ధృతరాష్ట్రుఁడు భీష్మ, ద్రోణ, విదుర, దుర్యోధనాదుల సమక్షమున యుధిష్ఠిరు నర్థరాజ్యాభిషిక్తుం జేసి ఖాండవప్రస్థమ్మున నుండ నియమించెను. అంతటఁ బాండవులు ఖాండవప్రస్థమున కేఁగి యచ్చట నింద్రప్రస్థమను నగరరాజము గట్టించి శుభదినమున మృదుమధురమంగళ సంగీతరవములతోడను, భూసురాశీర్వాదనాదములతోడను నందుఁ బ్రవేశించి, ధర్మ

మార్గమునఁ బ్రజాపాలనము చేయుచుండిరి.

అనంతర మొకనాఁడు నారదమునీంద్రుఁ డింద్రప్రస్థమున కరుదెంచి ధర్మనందనుచే, బూజితుఁడై, యాతనితో "నృపాల తిలకా! కాంతల నిమిత్తమున నెట్టివారికైనఁ గలహము సంభవించును. కావునఁ బాంచాలివలన మీకెవ్వర కంతః కలహము జనింపకుండున ట్లొక్క నియమము సెప్పెద; మీరు దానిం బాలింపుఁడు; ద్రౌపది క్రమమున మీలో నొక్కొక్కని మందిరమున నొక్కొక్క వత్సర ముండవలయును; ఆ లలనామణియున్న గృహమునకుఁ గడమ నలువురిలో నెవ్వ రేఁగఁజనదు. పొరబడి యచటి కరిగినవాఁడు ద్వాదశమాసములు తీర్థయాత్ర సేయవలయును; ఈనియమమును పాలించుచున్న మీకు వైరము గలుగనేరదు." అని హితోపదేశముఁ జేసి చనియెను. పాండవు లానియమము ననుసరించుచు సంతసముగఁ గాలముఁ గడపుచుండిరి.

ఇట్లుండ నొకనాఁడు భూసురోత్తముఁ డొకఁడు తన హోమధేనువులను దస్యులచేఁ గోల్పడి యాక్రోశించుచు రా నర్జునుఁ డయ్యాక్రోశము విని, యాతని యాపద దీర్ప నెంచి తన శరాసనముఁ గైకొన నతి శీఘ్రముగ నాయుధాగారమున కేఁగెను. అప్పుడు ధనుశ్శాలయందు యుధిష్ఠిరుఁడు ద్రౌపదీసహితుఁడై యుండెననియుఁ, దానప్పు డచ్చటి కేఁగ రాదనియు నెఱిఁగియు విజయుఁడు గోసంరక్షణార్థ మచటికరిగి, తన కార్ముకముఁ గేలఁబూని వెడలి చోరులను వధించి

హోమధేనువులను దెచ్చి యావిప్రున కొసఁగి, నియమభంగము చేసినందులకుఁ దాను ద్వాదశమాసిక వ్రతము సలుప సమకట్టెను. "నీవు విప్రహితార్థము నియమము నతిక్రమించితివి గావునఁ బ్రాయశ్చిత్త మక్కరలే" దని ధర్మరాజు వారించినను విజయుఁడు "లోకమర్యాదల నరసికాపాడు మన వర్తనమున నించుకైన నధర్మముండరా" దని చెప్పి యాతని నొప్పించి తాను తీర్థయాత్రకు వెడలెను.

పాండవమధ్యముఁ డనేక తీర్థములు సేవించుచు నొక నాఁడు భాగీరథీజలమునఁ గృతాభిషేకుఁడై తత్తీరమున హోమము సేయుచుండ నులూచియను నాగకన్య యొకర్తు గాంచి యాతనియందు బద్ధానురాగయై నాగపురమునకుఁ దోడ్కొనిపోయి తన యభిమత మాతనికి దెలిపెను. పార్థుఁ డానాఁడు నాగలోకమున వసియించి యులూచి యభీష్టము నెఱవేర్చి, యామెయం దిరావంతుఁడను నందను బడసి మఱునాడు నాగలోకము విడిచి మరల గంగాద్వారమునకరు దెంచెను. అనంతర మతఁడు భీమేశ్వర, నైమిశారణ్యాది పుణ్యక్షేత్రముల సంచరించుచు ద్వాదశమాసములు గడపి, త్రయోదశమాసమున మణిపూరుపురమున కరుదెంచెను. తత్పురాధీశుఁడు సవ్యసాచిని బూజించి తన తనయ చిత్రాంగద నాతనికిఁ బరిణయముఁ జేసెను. పార్థుఁ డచ్చటఁ గొన్ని దినములు నివసించి బభ్రువాహనుఁడను నందను బడసి, మణిపూరుపురపాలకుఁ డగు చిత్రవాహనుఁ డపుత్రకుఁడగుటచే

నర్పొకొమరు నాతనికి వంశకరుగా నొసంగి వారలను వీడ్కొని,
ప్రభాసతీర్థమున కరుదెంచెను.

అచ్చటికి ద్వారక కనుసమీపమగుటచే నప్పట్టణమున
కేఁగి బాంధవులఁ జూచి రావలయునని విజయుఁ డాలోచించు
చుండ, నాతని కాప్తమిత్రుఁడును, మేనమామ కుమారుఁడును,
ద్వారకాధీశుఁడును నగు శ్రీకృష్ణుఁ డచటి కరుదెంచి కుశల
ప్రశ్నము చేసెను. అప్పుడు పురందరనందనుఁడు వసుదేవ
నందను నవలోకించి యానందబాష్పభరితనయనుఁడై,

ఉ॥ "ద్వాదశమాసికవ్రతము ధర్మవిధిం జలుపంగ నేఁగి గం
గాది మహానదీ హిమవదాది మహాగిరిదర్శనంబు మీ
పాదపయోజదర్శనముఁ బన్నుగఁ జేయుటఁజేసి పూర్వసం
పాదితసర్వ పాపములువాసె భృశంబుగ నాకు నచ్యుతా!"

అనుచు సాష్టాంగదండ ప్రణామ మాచరించెను. దేవకీతనయుఁ
డర్జును నతిప్రియమున నాలింగనము చేసికొని, యాతని
చిత్తము తన యనుజయగు సుభద్రపయిఁ దగులుట యెఱిఁగి
యాకోర్కె నెరవేర్పనెంచి ద్వారకానగరమునకుఁ దోడ్కొని
పోయెను. అర్జునునకు సుభద్రనీయుట కృష్ణుని యగ్రజుఁడగు
బలరామున కసమ్మతమగుటచేఁ గృష్ణుఁ డకార్యము రహ
స్యముగఁ జేయనెంచి, సవ్యసాచిని రైవతకాచలముననుండ
నియమించి తాను నిజమందిరమున కరుదెంచెను.

పిమ్మటఁ గృష్ణుఁడు రైవతమహోత్సవము సేయుదమని
బలదేవాదులకుఁ జెప్పి సకల యాదవులఁ గూడి యాగిరి
కరుదెంచెను. అచ్చట యతిరూపధరుఁడై యున్న యర్జునునిఁ

గాంచి బలదేవాదు లధికభక్తితోఁ బ్రణామముచేసి, యాతని వలన సర్వతీర్థములుఁ, దత్ప్రభావఫలములు విని సంతసిల్లి "మహాత్మా! ఈవర్షాకాలమున నిటనుండి చాతుర్మాస్యముచేసి, మమ్ముఁ గృతార్థులఁ జేయుఁడు," అని ప్రార్థించి విజయునిఁ దమ మందిరమునకుఁ దోడ్కొని పోయి, యాతనికి సపర్యలుచేయ సుభద్రను నియమించిరి. సుభద్ర యధిక భక్తితో నుపచరించుచుండ నర్జునుఁడు కన్యాగారమున నివసించుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు సుభద్ర, భోజనావసానమున విజయునిఁ గాంచి "యతీంద్రా! మీరాడని తీర్థములుఁ, జూడని పురములు లేవని తలఁచెదను. లోక విఖ్యాతమగు నింద్రప్రస్థపుర మెప్పుడైనఁ జూచితిరా? అచ్చటఁ బాండు నందనులు సుఖులై యున్నారా? వీరవరేణ్యుఁడగు పాండవ మధ్యముఁడు తీర్థసేవఁ జేయ నేఁగెనని వింటిమి; ఆవిక్రముఁడు మరలఁ బురమున కరుదెంచి కుశలియైయుండెనా? వారల వృత్తాంతము నెఱిఁగియుంటిరేని నాకుఁ దెలిపి యానందింపఁ జేయుఁడు." అని యడుగ నర్జునుఁడు మందహాసముఖారవిందుఁడై "లలనామణీ! పాండవ మధ్యముఁడను నేనే సుమీ! నిన్నుఁ జేపట్టఁగోరి యతిరూపముఁ దాల్చి యిచటి కరుదెంచితి" నని పలికెను. అంతట సుభద్ర లజ్జావనతవదనయై యంతఃపురమున కరిగెను. కృష్ణుఁ డది యెఱిఁగి విజయునకు భోజనవిధు లమర్పఁ దన సతియగు రుక్మిణీదేవినిఁ బంపించెను.

పిమ్మటఁ గృష్ణుఁడు సుభద్రార్జునుల యనురాగమును, జననీజనకులగు దేవకీ వసుదేవుల కెఱిఁగించి వారి నంగీకరింపఁజేసి, యొకనాఁడు పశుపతి పూజావ్యాజమున బలరామాది సకల యాదవులఁ గూడి యంతర్ద్వీపమున కేఁగెను. సుభద్రార్జునులు మాత్రము రాజప్రాసాదముననే యుండిరి. అనంతరము శ్రీకృష్ణుఁడు పురమున కరుదెంచి సుభద్రార్జునులకు రహస్యముగ వివాహముఁజేసి, వారిని గాంచన రథమున నెక్కించి యింద్రప్రస్థమున కేఁగఁ బనిచి మరలఁ దానంతర్ద్వీపమునకు బోయెను

పురపాలకులు విజయునిఁ గాంచి “ఈతఁడు బలరామ కృష్ణు లెఱుఁగకుండ సుభద్రను దోడ్కొని పోవుచున్నాఁడ”ని తలఁచి యాతనితోఁ బోరసాగిరి. ధనంజయుఁడు నిజకౌశలము మెఱయ వారలఁ బాఱఁదోలి యింద్రప్రస్థమున కరిగెను. ద్రౌపదీ యుధిష్ఠిరాదు లయ్యిరువురినిఁ గాంచి ప్రమోదభరిత మానసులైరి.

అట బలరాముఁడు తన చెలియలిని ధనంజయుఁ డెత్తుకొనిపోయెనని విని క్రుద్ధుఁడు కాఁగా, శ్రీకృష్ణుఁడు శాంతవచనములతో నాతని క్రోధము నుపశమింపఁజేసెను. అనంతరము వసుదేవ, బలరామ, కృష్ణులు సకల బాంధవులతో నింద్రప్రస్థమునకు వచ్చి సుభద్రార్జునుల కనేక దివ్యాంబర మణిభూషణముల నొసఁగి పాండవులచే సన్మానితులైరి. యాదవులెల్ల రచ్చట సంతసముతో సప్తరాత్రములు నివసించి

పిమ్మటఁ దమపురమున కేఁగిరి. కృష్ణుఁడు మాత్రము ధనంజయుతోడి వినోదముల నింద్రప్రస్థముననే యుండెను.

పిమ్మట విజయుఁడు సుభద్రయం దభిమన్యుఁడను నందను బడసెను. పాండవు లేవురును ద్రౌపదియందుఁ, బ్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులను సుపుత్త్రులం గాంచిరి.

ఒకనాఁడు కృష్ణార్జునులు వేఁటలాడి ఖాండవవన సమీపమున నొక చందన లతాభవనచంద్రకాంత వేదికయందు మందశీతల సురభిమారుతసుఖము ననుభవించుచు నిష్టకథా వినోదములనుండ, శ్వేతకియను రాజర్షి యొనరించిన సత్త్రయాగమునన్నైన యపరిమిత ఘృతపానమువలన వ్యాధి పీడితుఁడై యున్న యగ్నిదేవుఁడు విప్రరూపమున నరుదెంచి "మహామహులారా! నాకాహారము నొసఁగి తృప్తినొందింపుఁడు," అని యడిగెను. "భూదేవోత్తమా! నీకెట్టి యాహార మిష్టమో యెఱిఁగింపు" మని కృష్ణార్జునులు వచింప నాధరణీసురుఁడు "నేను హుతాశనుఁడను, నాకు భోజన మీ ఖాండవవనము; నేను దీనిని భుజింపఁబోవఁ బురందరుఁడు నాయత్నము విఫలముచేయుచుండెను. దివ్యాస్త్రకోవిదులగు మీరు పాకశాసనుఁ డొనరించు విఘాతములు వారింపనోపుదు రేని నేనిమ్మహారణ్యమును దహించి కృతార్థుఁడనయ్యెద" నని చెప్పెను. "అమరేంద్రుని జయింపఁగలము గాని, యాతనితోఁ బోరుటకుఁ దగిన కార్ముకమును, వాహనములును

లేనందున సంశయించుచుంటి" మని కృష్ణార్జునులు వచింపఁ, దోడనే యగ్నిదేవుడు శ్వేతాశ్వములుగల దివ్యరథమును గాండీవమనుకార్ముకమును, వరుణదేవునిచే విజయున కిప్పించి దేవదానవ పిశాచోరగ ప్రశంసనమై వెలుఁగుచున్న సుదర్శన చక్రమును, కౌమోదకియును గదయును వాసుదేవున కిప్పించెను. కృష్ణార్జునులు సంతసమున వానిం గైకొని యుద్ధసన్నద్ధులైన పిమ్మట హవ్యవాహనుఁ డవ్వన దహనము నారంభించెను.

తన సఖుఁడగు తక్షకుఁడను పన్నగేంద్రుఁ డమ్మహావనమున నివసించుచుండుటచే నమరేంద్రుఁ డవ్వనము నతిజాగరూకతతోఁ గాపాడుచుండెను. అందువలన నతఁ డప్పుడగ్నిదేవునకుఁ దన సుతుఁడు సహాయుఁడై వచ్చెనని యెఱిఁగియు ఖాండవవన రక్షణమునకు దేవగణంబులతో నరుదెంచి హుతాశనునిపై వారి ధారల నమితముగఁ గురియింప నారంభించెను. అప్పుడు విజయుఁడు మారుతాస్త్రముఁ బ్రయోగింపదాని కాగఁజాలక మేఘములు చెల్లాచెదరై పోవఁదొడఁగెను. అంతట హుతాశనుఁడు మహాతేజముతోఁ బ్రకాశించుచు నరణ్య దహనము గావించెను. దివ్యౌషధయుక్తమైన యావనమును దహించుటవలన హవ్యవాహనుని వ్యాధి తొలఁగిపోయెను.

అప్పుడు పురందరుఁడును, దేవగణములును దమ యత్నము విఫలమగుటకుఁ గోపించి కృష్ణార్జునులపై శరవర్షము, గురి

యింప, నవ్వీరవరేణ్యులు నిశితసాయకముల, బ్రయోగించి యా బాణములను భగ్నము సేయుచుండిరి. అప్పుడ శరీరవాణి పురుహూతు నుద్దేశించి,

కం॥ "పరమఋషు లయినతొల్లిటి
నరనారాయణులు కృష్ణనామంబుల ను
ర్వర నుదయించిరి నీ క
య్యెరువుర జేర్మియును వింతయే దివిజేంద్రా!"

చ॥ అలఘులు కృష్ణపార్థులు మహాత్ములు యాదవ కౌరవాన్వయం
బులం బెలిగించుచున్న నృపపుంగవులు వీరల నీకు నోర్వంగా
నలవియె వీరు దొల్లి యసురాసుర యుద్ధమునాఁడు దైత్యులఁ
జెలయఁగ నోర్చియున్న రణవీరులు గావున నీ వెఱుంగవే?"

"నీ సఖుఁడైన తక్షకుఁడు మున్నే యివ్వనము విడిచి రొండు చోటికేఁగి సుఖుఁడై యున్నవాఁడు. ఖాండవ మగ్నిచేత దగ్ధమగు నని తొల్లి బ్రహ్మవచనము గలుగుటఁ జేసి యిది హుతాశనున కశనమయ్యెను. కావున దీనికిఁ జింతింపవలదు." అని పలికెను. అంతట సురనాథుఁడు సమరముఁ జాలించి, నిజతనయుని పరాక్రమమునకు సంతసించి యాతని కాగ్నేయ, వారుణ, వాయవ్యాది దివ్యాస్త్రముల నొసఁగి సురగణములతో దివమున కరిగెను.

ఖాండవము దగ్ధమగుచుండ, నందు నివసించుచున్న మయుఁ డను దానవుఁ డొకఁ డయ్యగ్నిజ్వాలలనుండి తప్పించుకొని పోవనేరక విజయుని శరణు జొచ్చెను. దయాతరంగిత స్వాంతుఁ డగు ధనంజయుఁడు వానిని రక్షించి, దేవకీతన

యువతితోఁ గూడి బరమాహ్లాదముతో నింద్రప్రస్థమున కేఁగి ఖాండవవన దహనప్రకారము ధర్మజునకుఁ దెలిపెను.

—• సభాపర్వము •—

వాసుదేవ సహితులై పాండునందనులు పేరోలగమునుండ మయుఁ డంజలిబద్ధుఁడై విజయునిఁ గాంచి,

క॥ ఘనముగఁ బ్రాణము రక్షిం
చిన యుపకారికిఁ బ్రియంబు సేయుదు నన నే
ర్తునె యైనను నీకుఁ బ్రియం
బనఘా చేయంగ నిష్టమైనది నాకున్.

నేను దానవ విశ్వకర్మను; శిల్పకళాకుశలుఁడను; మీరు కోరినదాని నతి గమ్యముగ నిర్మింపఁగలవాఁడను; మీ కెద్ది యభీష్టమో నా కెఱిఁగింపుఁడు!" అని వచింప, దేవకీనందనుఁడు "నీ శిల్పనైపుణ్యము మెఱయ నొక యపూర్వమైన సభ నిర్మించి ధర్మరాజున కొసఁగుము." అని యాజ్ఞాపించెను.

అంత నద్దానవుఁడు వివిధరత్న విభవాభిశోభితముగా నొక్క సభాభవనము బదునాలుగు మాసములు నిర్మించి యుధిష్ఠిరున కొసఁగి, దివ్యఘోషముగల దేవదత్తమను శంఖము ధనంజయునకును, శత్రుఘాతిని యను గదను భీమసేనునకును నొసఁగి, యుధిష్ఠిరునిచే సత్కృతుఁడై తన నివాసమున కరిగెను. పిమ్మట శుభముహూర్తమున ధర్మరాజు తమ్ములఁ గూడి భూసురాశీర్వాద పుణ్యాహనాదములతో సభాప్రవేశము చేసెను. అప్పుడు,

మ॥ మదమాతంగ తురంగ కాంచనల సన్మాణిక్యగాణిక్య సం
పదలోలిం గని వచ్చి యిచ్చి ముద మొప్పం గాంచి సేవించి ర
య్యుదయాస్తాచలసేతు సీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయుణ్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయుణ్.

అనంతర మొకనాఁడు నారదుఁ డింద్రప్రస్థమున కరుదెంచి మయనిర్మిత సభాభవన విభవముఁ గాంచి సంతసించి యుధిష్ఠిరునిచే సన్మానితుఁడై కుశలప్రశ్నము చేసి "ధర్మనందనా! మీ జనకుఁడు పాండుమహీశుఁడు యమలోకము నుండి నన్నుఁ గాంచి "మునీంద్రా! నాకు సురలోకమున కరుగ నభిమతము గలదు. రాజసూయ మహాధ్వర మాచరించిన వారలకుఁ గాని నాకాధిపలోకసుఖావాప్తి చేకూరదు; కావున నీవు భూలోకమున కేఁగి మా యుధిష్ఠిరునకు నా వృత్తాంతముఁ దెలిపి, రాజసూయమఖము సేయఁ బ్రోత్సహింపుము. అతఁ డమ్మహాక్రతు వాచరించెనేని నేను పితృపితామహ నివహముతో నమరలోకమున కేఁగి యచ్చట సౌఖ్యమనుభవించెద." నని చెప్ప, నా వృత్తాంతము నీకెఱిఁగింప నిటకు వచ్చితిని. కావున నీవు పితృహితార్థము రాజసూయ మఖము నవశ్యము చేయు" మని చెప్పి యథేచ్ఛం జనియెను.

పిమ్మట న య్యధ్వరంబు సేయ భీమార్జున నకుల సహదేవులు ధర్మరాజునుఁ బ్రోత్సహించిరి. అంతట యుధిష్ఠిరుఁడు వసుదేవతనయునితో నవ్విషయము నాలోచింప; నమ్మహానుభావుఁడు "పార్థివోత్తమా! నీ వైభవాతిశయమునకుఁ

దగినటుల నమ్మహాక్రతువుఁ దప్పక నాచరించి సత్కీర్తిం గాంచుము. మగధాధిపుఁడైన జరాసంధుఁడు మహీపాలురఁ బెక్కండ్రఁ జెఱఁబట్టి వారిని భైరవదేవునకు బలి యొసఁగుచుండె; ధరణీచక్రమునఁ గల దుష్టనృపతు లెల్లను నా జరాసంధునిఁ గొలుచుచు, వాని సహాయమున ననేక దుండగములు సేయుచుందురు. కావున మనము ముందు, మహాప్రతాపవంతుఁడగు మగధేశుని జయించి, వాని చెఱలో నున్న మూర్ధాభిషిక్తుల విడిపించి పిమ్మట మహీవలయము జయించుట కర్తవ్యము. నేను భీమార్జునులును గిరివ్రజమున కేఁగి జరాసంధు నవలీల జయించి వచ్చెద" మని వచింప ధర్మరాజందుల కనుమతించెను. గిరివ్రజమున కేఁగ భీమార్జునులుఁ బరమోత్సాహులైరి. అంతట మురమర్దనుఁడు భీమార్జునులఁ గని "జరాసంధుఁడు విప్రసేవాపరాయణుఁడు; కావున మనము విప్రవేషములతో నరిగి ముం దాతనికి హితోపదేశముఁ జేయుదము; మన యుపదేశము నతఁడు విననియెడల నాజిభిక్షఁ గోరుదము." అని చెప్పెను. పిమ్మట కృష్ణ భీమ విజయులు బ్రాహ్మణవేషములఁ దాల్చి గిరివ్రజమునకుఁ బయనమైరి.

గోరథము, ఋషభము, వైహారము, ఋషిగిరి, చైత్యకాద్రి యను నైదుపర్వతముల నడుమ నిర్మింపఁబడి శాత్రవదుర్భేద్యమై, మగధదేశ రాజధానియై ప్రకాశించుచున్న గిరివ్రజపురము నయోధ్యాధత్రయముసొచ్చి రాజమందిరమున కేఁగిరి.

జరాసంధుఁడు వారల నెదుర్కొని యుచితాసనముల నుపవిష్టులఁజేసి మధుపర్కముల నీయఁబోవ నవ్వీరపురుషత్రయము "మేము వీనిఁ బరిగ్రహింప" మనిరి. "నేనొసఁగు సపర్యల నేల బరిగ్రహింపరు? మీకెద్ది యభీష్టమో యెఱిఁగించిన దాని నిచ్చెద" నని జరాసంధుఁడు నుడువ, నమ్మధుసూదనుఁడు "రాజా! నీవు భూపాలురఁదెచ్చి బలినిచ్చుచుంటివని యెఱిఁగి వారిని రక్షింప నేతెంచితిమి. "నాకంటె నధికుఁడులేడ" ని గర్వితుఁడవై నిరపరాధులఁ జంపి నరకాగ్నిజ్వాలలఁ గూలక, నా సద్బోధ నాలించి నీచేఁ జిక్కిన ధరణీనాథుల విడిచిపుచ్చుము. అట్లు సేయ నొల్లవేని రణభిక్షార్థులమై వచ్చిన మాతో సమరము సేయుము" అనుచు గంభీరస్వనమున నుత్తరమొసఁగెను. "ఇట్టి శూరవచనము లాడుచున్న మీరు కపటవిప్రులని తలంచెద; మీ నిజవృత్తాంతముఁ దెలుపుఁడు; నేనట్టి వెఱపింపులకు వెఱచి, దేవార్థము తెచ్చిన నృపాలుర విడుచువాఁడఁగాను; సైన్యరహితులై వచ్చిన మీతో సైన్యయుతుఁడనై పోరుట యనుచితము గావున నేనొక్కఁడనే మీ మువ్వురితో సంగర మొనరించెద" నని జరాసంధుఁడు వచింప, దేవకీనందనుఁడు "ఒక్కనితో మువ్వురని సేయుట పాడిగాదు. మాలో నీయిచ్చవచ్చినవానితోఁ బోరాటము సలుపుము! నేనుగృష్ణుఁడ, నితఁడర్జునుఁ డితఁడు భీముఁడ"ని యాతనికిఁ దమ నిజనామముల నెఱిఁగించెను. అంతట జరాసంధుఁడు తనసుతుఁడగు సహదేవుని రాజ్యా

పి క్తుఁజేసి తాను మహాబలవంతుఁడగు భీమసేనునితో మల్ల యుద్ధముసేయ నిశ్చయింప భీమసేనుఁడును యుద్ధసన్నద్ధుఁ డయ్యెను.

అనంతర మయ్యిరువురుఁ బదుమూఁడు దినము లెడ తెగక నతికౌశలముతో నాయోధనము, జేసిరి. పదునాల్గవనాఁటి రాత్రి పవనతనయునిచే జరాసంధుఁడు నిహతుఁడయ్యె! మహా సత్త్వశాలియైన జరాసంధుని మరణమునకు సహదేవుఁడు దుఃఖింపఁ గృష్ణుఁ డాతని నోదార్చి, చెఱసాలలోనున్న నృపా లుర నందఱిని విడిపించెను. సంఖ్యాతీతమైన యా భూపా లసమూహ మాయోధత్రయమునకుఁ బ్రణామము లాచ రించి వేనోళ్ళఁ గొనియాడిరి. కృష్ణభీమపార్థులు సహదేవుఁ డొసఁగిన యుపాయనంబులఁ గైకొని, యా రాజచయముం దోడ్కొని యింద్రప్రస్థమున కేఁగిరి.

యుధిష్ఠిరుఁడు విజయవిభాసితులై వచ్చిన తమ్ములఁగాంచి యానందజలభరిత నయనుఁడై, నృపసమూహము నర్హరీతి గౌరవించెను. అనంతర మా భూమీశులెల్లరు ధర్మరాజు నకు వివిధోపాయనము లొసఁగి తమతమ పురముల కరిగిరి. అనంతరము ధర్మనందనుఁడు భీమసేనుని దూర్పునకును, పార్థు నుత్తరమునకును, సహదేవుని దక్షిణమునకును, నకులునిఁ బశ్చిమమునకును దిగ్విజయముఁ జేయఁ బంపించెను.

భీమార్జున నకులసహదేవులు చతురంగబల సమేతులై యొక్కొక్క రొక్కొక్క దిశ కరిగి దిగ్విజయముచేసి, వసుధా

చక్రమునఁగల రాజచక్రము నధ్వరమునకుఁ బిలిచి, వారలచే నసంఖ్యాత ధనకనక వస్తువాహన నివహములఁ గైకొని వచ్చి యగ్రజునకు సమర్పించిరి. పిమ్మట ధర్మరాజు యజ్ఞోపకరణతతులను సిద్ధముఁ జేయించెను. మఖావలోకన కుతూహాలురై పాంచాల, కౌరవ, యాదవాది బాంధవులును, అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజాది సకల మహీపాలురును, నారద, వ్యాస, మార్కండేయ, మైత్రేయ, యాజ్ఞవల్క్యాది మహర్షులును, మహీతలమునఁగల సమస్త జనులును నింద్రప్రస్థమునకు విచ్చేసిరి. ధర్మరాజు వారల నందఱి నుచితరీతిని సత్కరించి, హిరణ్యరజత రత్న దక్షిణాదానవిషయములందుఁ గృపాచార్యునిఁ, గృతాకృత పరిజ్ఞానమునందు భీష్మ ద్రోణులను, సకలవస్తు వ్యయమునందు విదురుని, నానా దేశాగతులైన రాజులు దెచ్చియిచ్చిన యుపాయనములు గైకొన దుర్యోధనుని, భక్ష్యభోజ్యాది వినియోగమునందు దుశ్శాసనుని నియోగించి తాను సవన దీక్షితుఁడయ్యెను.

పురోహితుఁడైన ధౌమ్యుఁడును వ్యాస, యాజ్ఞవల్క్యాది మహామునులును యథావిధిగ నమ్మహా యజ్ఞము నసమాప్తము సేయించిరి అప్పుడగ్ర్యగో, భూ, హిరణ్యాది మహా దానముల ధరణీసురులును, దివ్యాంబర, మణిభూషణ, చందనాది సముచిత సత్కారముల నఖిలరాజన్యులును, అఖిమతాన్నదానమున నకలజనులును దృప్తులై యానందాతి

శయమున ధర్మనందనుఁ బెక్కువిధములఁ గీర్తించిరి.

అనంతరము యుధిష్ఠిర నృపాలుఁడు గాంగేయునిచే నను జ్ఞాతుఁడై, సకలభువన రక్షకుఁడైన వాసుదేవున కర్ఘ్యమిచ్చి పూజించెను. శ్రీకృష్ణుని మేనత్తకుమారుఁడును, చేదిభూపాలుఁ డును నగు శిశుపాలుఁ డదిచూచి సహింపక ధర్మరాజు నుద్దేశించి

మ. "అవనీనాథు లనేకులుండఁగ విశిష్టారాధ్యులార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండఁగ ధరిత్రీనాథ గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించితిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే"

సీ. ఈతని వృద్ధని యెఱిఁగి పూజించితే
వసుదేవుఁడుండంగ వసుమతీశ
ఋత్విజుండని విచారించి పూజించితే
ద్వైపాయనుండుండ ధర్మయుక్తి
యాచార్యుఁడని వినయమునఁ బూజించితే
కృతమతుల్ ద్రోణుఁడు కృపుఁడునుండ
భూనాథుఁ డనియెడు బుద్ధిఁ బూజించితే
యాదవుల్ రాజులే యవనిమీఁదఁ
పూజనీయులైన పురుషులలోపల
నెవ్వఁడయ్యెఁ గృష్ణుఁ డిట్టులేలఁ
బూజ్యులైనవారిఁ బూజింపనొల్లక
భీష్మపలుకుఁజేసి బేలవయితి

క. నీకెఱుఁగక యిచ్చిన నిది
నావిషయమె యని మనంబునం దలఁపక ల
జ్జావిరహితుఁడయి యర్ఘ్యము
గోవిందుఁడు గొనియె దనకుఁ గొను టుచితంబే."

అనుచు భీష్మయుధిష్ఠిరకృష్ణుల ననేకవిధముల నిందించుచు

యుద్ధసన్నద్ధుఁడై నిలువ, దామోదరుఁడు చక్రాయుధముచే వాని మస్తకముఁ ద్రెళ్లఁజేసెను. ఇట్లు ప్రశాంతవిఘ్నమై, సుఖారంభమై, ప్రభూతభక్ష్యాన్న ధనదానసనాథమై, జగన్నాథరక్షితమై రాజసూయమహాధ్వరము సమాప్తమైన పిమ్మట నానాదేశాగతులైన రాజులెల్లను ధర్మరాజుం జూచి "పార్థివోత్తమా! మేము రాజసూయోత్సవ దర్శనమునను, భవత్కృత సత్కార గౌరవముననుఁ జేసి కృతార్థులమైతిమి, ఇఁక మా మా నిలయముల కేఁగెద" మని చెప్పి యమ్మహారాజు సెలవుఁగైకొని తమతమ రాజ్యముల కరిగిరి. భీష్మ, ధృతరాష్ట్ర, ద్రుపద, కృష్ణాది బాంధవులును పాండవులను వీడ్కొని నిజపురముల కేఁగిరి. దుర్యోధనుఁడుమాత్రము తన మేనమామయగు శకునిఁగూడి, మయనిర్మితసభావైభవము జూచువేడ్క నింద్రప్రస్థమున నింకఁ గొన్ని దినములుండెను.

దుర్యోధనుఁ డాసభాభవనముఁ గాంచి దాని యపూర్వరమణీయతకు విస్మితుఁడై యొక్కనాఁ డాయా ప్రదేశములఁ గ్రుమ్మరుచు, వివృతమైన ద్వారదేశము సంవృతముగాఁ దలఁచి చొరనొల్లక, సంవృతమైన దాని వివృతముగా నెంచి చొరంబోయి, లలాటఘట్టితకవాటద్వారుఁడై, నీలాశ్మరశ్మిస్థగితమైన విమల మణిస్థలము జలాశయముగా వగచి పరిధానంబెగద్రోచికొని, స్ఫటికదీప్తిజాల పరిష్కృతమైన జలాశయము స్థలముగాఁ దలఁచి కట్టిన పుట్టము తడియఁజొచ్చి క్రమ్మఱిన నాతనిఁజూచి పాంచాలియు, భీమసేనుఁడును నగిరి. దుర్యోధనుఁ

డందులకు లజ్జితుఁడుగా, యుధిష్ఠిరుఁ డాతని కనేక దివ్యవస్త్ర భూషణములనిచ్చి సత్కరించి గజపురమునకుఁ బంపించెను.

కరిపురమున కరిగినదాది దుర్యోధనుఁడు, మహీవలయమునఁగల రాజులెల్లఱు యుధిష్ఠిరున కంకితులై నానావిధోపాయనములఁ దెచ్చియిచ్చుటయు, నిర్మల స్ఫటికశిలానిర్మితమును, వివిధరత్న ప్రభాభాసురమును నైన యా సభావైభవమును దలఁచి కడు నసూయాపరుఁడై, ధర్మతనయుని రాజ్యలక్ష్మి నెవ్విధముననైనఁ దానపహరింపనెంచి తన యభీష్టము నొక్కనాఁడు శకునికిఁ దెలిపెను. కపటోపాయధురీణుఁడైన శకుని యాతని యభిమతము నెఱిఁగి "రాజా! అక్షవిద్యయందే నతికుశలుఁడను; యుధిష్ఠిరుఁడు ద్యూతప్రియుఁడగునుగాని యంత నిపుణుఁడు గాఁడు. కావున నీవాతని నిటకు రావించితివేని నేను జూదమాడి యాశ్రమమున నోడించి రాజ్యలక్ష్మిఁ గైకొని నీకొసంగెద" ననుచు దుర్యోధనునకు సంతసము గలుగునటులఁ జెప్పెను. అంత నయ్యిరువురును ధృతరాష్ట్రుపాలికేఁగి తమ దురాలోచనఁ దెలిపి ధర్మరాజు నిచటికి రావింపుమని కోరిరి. "పరాక్రమశాలురైన పాండవులతోడి వైరము విడుచుట శ్రేయస్కర"మని ధృతరాష్ట్రుఁడు పలుక దుర్యోధనుఁడు "జనకా! పాండునందనుల వైభవాతిశయముఁ గాంచి నేనించుకైన సహింపఁ జాలను. యుధిష్ఠిరునితో నిప్పుడు జూదమాడ నీవంగీకరింపవేని నేను ప్రాణములఁ ద్యజింతు" ననియె.

అంతట ధృతరాష్ట్రుడు తనయు నభీష్టమును దీర్పనెంచి శిల్పకళావిశారదులను గావించి, కనకఖచిత స్తంభ సహస్రము లను, విచిత్రద్వారశతములను వివిధరత్నరుచిరప్రదేశములను జేసి రమ్యముగా నొక్క సభాభవనముఁ గట్టించి, యొక నాఁడు విదురునిఁ బిలచి "ఈ సభావైచిత్ర్యముఁ గాంచి సంత సించుటకును, దుర్యోధనునితో నిచ్చటను సుహృద్ద్యూత మాడు టకును ధర్మరాజు ననుజ సతీయుతముగా నిచటికిఁ దోడ్కొని రమ్ము." అని యాజ్ఞాపించెను. విదురుఁ డవ్వచనము లాకర్ణించి విషణ్ణచిత్తుఁడై "రాజా! ద్యూతమువలన నెట్టి వారి కైనఁ గలహము సంభవించును; దాన నుభయపక్షములకు హానిసేకూరు; కావున నీవు దీని కంగీకరింపకుము," అనుచు ననేకవిధముల హితోపదేశముఁ జేయ, ధృతరాష్ట్రుడు సుహృద్ద్యూతమువలనఁ బ్రమాదము సంభవింపదు కావున నీవు సత్వరమునఁ బోయి యుధిష్ఠిరు నిచటికిఁ దోడ్కొనిరమ్ము." అని చెప్పి పంపించెను.

అంతట విదురుఁ డింద్రప్రస్థమున కరిగి ధృతరాష్ట్రు నాజ్ఞఁ దెలుప యుధిష్ఠిరుఁడు పిత్రాజ్ఞ నుల్లంఘింపరాదని తలఁచి తమ్ములను ద్రౌపదిని దోడ్కొని హస్తిపురి కేతెంచెను. దుర్యోధనుఁడు పాండవులను సన్మానించి వారలకు నూతనసభాభవనముఁ జూపించెను. అనంతర మందఱు నా సభాంతరమున నుపవిష్టులై యిష్టసంభాషణాది క్రీడావస రమునందు దుర్యోధనుఁ డజాతశత్రు నవలోకించి "అనఘా!

నీవు ద్యూతమునఁ గుశలుఁడవనివింటి; కావున మనమిప్పుడు హృదయరఞ్జకముగాఁ గొంతతడవు జూదమాడుదము.” అని యధికోత్సాహముతో వచించెను. “తమ్ముఁడా! దుర్వ్యసనములలో నొక్కటియగు దురోదరము మన కను చితము.” అని ధర్మరా జనుచుండ నంతలో శకుని “రాజా! ద్యూతకళావిశారదుఁడును, లోకజ్ఞుఁడును నగు సత్క్షత్రియుఁడు దాని నిందింపఁదగునే? జూదమున నోడుదునను భయము నీకుఁ గలదేని మిన్నకుండు” మని పలికెను. అంతట ధర్మరాజు రోషావేశితుఁడై నెత్తమాడ నంగీకరింప నాతనితో నాడుటకు దుర్యోధనుఁడు తనపక్షమున శకునిని నియోగించెను.

అంతట శకుని దుర్యోధను హస్తకీటకములను, ధర్మరాజు తన మణిహారములను నొడ్డి జూదమాడ ధర్మతనయుఁ డోడెను. అంత నతఁడు క్రమమున సువర్ణరత్నభాండాగారములను, వారణ, వాజిసమూహములను, పరిచారక జనములను, సమస్త వస్తువులను, రాజ్యమును, నలువురు తమ్ములను, బణముపెట్టి యోటువడి, చివరకుఁ దన్ను నయిత మొడ్డి యోడెను. అప్పుడు శకుని యాతనితో “ధర్మనందనా! ఇంకను నీ ధనమగు ద్రౌపదియుండ ని న్నేలయొడ్డితి.” వన, యోచనా రహితుఁడై ధర్మరాజు నిజసతిఁగూడఁ బణముపెట్టి యోడెను.

అంతట దుర్యోధనుఁడు పాండవులఁ దనదాసులుగ నెంచి,

"దాసత్వముసేయ ద్రౌపది నిటకుఁ దోడ్కొనిరమ్ము" ని యొక సేవకున కాజ్ఞాపించెను. వాఁ డామెపాలికిఁ బోయి యావద్వృత్తాంతము నెఱిఁగింప న య్యోషామణి దుఃఖితయై "పాండవాగ్రజుఁడు తనోడిన పిమ్మట నన్నోడెనో, నన్నోడిన పిమ్మటఁ దనోడెనో యడిగి తెలిసికొనివచ్చి నన్నుఁదోడ్కొని పొమ్ము" ని చెప్పెను. అంత నా సేవకుఁడు సభకు వచ్చి యా ప్రశ్ననుదెలుప, దుఃఖాతిశయమున ధర్మరా జేమియుఁ జెప్పఁజాల కూరకుండెను. దుర్యోధనుఁడు "ఓయీ! ద్రౌపదినే యిచటికివచ్చి యడిగి యా సంశయముఁ దీర్చుకొమ్మని చెప్పుము." అని వానిని, మరలఁ బంపించెను. వాఁడు ప్రభువునాజ్ఞఁ దెలిపి యక్కోమలిని సభకుఁ దోడ్కొని రానామె విషణ్ణవదనయై వచ్చి కురువృద్ధుని సమీపమున నిలువఁబడియె. పాండవు లా నారీరత్నమును జూడఁజాలక శోకవిహ్వలమానసులై శిరములువంచిరి.

అప్పుడు దుర్యోధనుఁడు దుశ్శాసనునిఁబిలిచి "తమ్ముఁడా! పాంచాలిని సభామధ్యమునకుఁ దీసికొనిరమ్ము." అని నంతనమునఁ బలుక, దుష్టబుద్ధియగు దుశ్శాసనుఁ డామె సమీపమున కేఁగెను. ఆతనిఁ గాంచి ద్రౌపది భయావేశితయై గాంధారికడకుఁ బోవుచుండ నద్దురాత్ముఁ డామె వెంటఁజని "నీవు కురుపతియర్ధమైతివి. ఇఁక నెట కేఁగెదవు? రమ్ము." అనుచు గద్దించి పలికెను. "ఏకవస్త్రనై, గురుబంధుజనాధిష్ఠితమైన సభాంతరమున కెట్లు రాఁగలను?" అని యాసాధ్వీమ

తల్లి వినయమున వచింప, నద్దురాత్ముఁడు "నీ వేకవస్త్ర వైనను, విగతవస్త్రవైనను పోఁదా౯నిపోదు" ననుచు నామె శిరోజములను బట్టుకొని బలాత్కారముగ సభామధ్యమున కీడ్చుకొని వచ్చెను. అప్పతివ్రతాశిరోమణి తన దురవస్థకు మిక్కుటముగ విలపించుచు, ఆర్తజనరక్షాతత్పరుఁడైన పరమేశ్వరుఁడే తనకు శరణ్యుఁడని తలంచి "పరమపురుషా! భక్తవత్సలా! దుష్టచిత్తులగు ధార్తరాష్ట్రులవలన నా కవమానము ఘటిల్లకుండఁ గాపాడుము." అనుచు మనమున జగత్పతిని వేడుచుండెను.

ద్రౌపదికి సంభవించిన దుస్థితిఁగాంచి భీమసేనుఁడు కడు దుఃఖితుఁడై యజాతశత్రు నవలోకించి "నీవు ధనకనక వస్తువాహనములును రాజ్యమును మమ్మునుఁ బోటుపడుట యుచితమే గాని; పాపద్యూతమని యెఱిఁగియు ద్రౌపదినిఁ బణము పెట్టి యధర్మ ప్రవృత్తుఁడ వైతివి. కావున భవద్బాహు దాహంబు సేయవలయు" నని యతికోపమునఁ బలుక గాండీవి యాతనిఁ బట్టుకొని "అన్నా! సుహృద్ద్యూతమునకు నెవరులు బిలిచిన నేఁగుట క్షాత్రధర్మము; ఏఁగనిచో గౌరవహాని యగుంగావున ధర్మనందనుఁడు దాని నంగీకరించెను. దీన నమ్మహానీయుని తప్పేమిగలదు? గురుజనములపై నిట్లుకోపింపఁదగునే?" అని చెప్పి వృకోదరుని శాంతింపఁజేసెను.

అప్పుడు, 'జగత్త్రయవిజయభుజవీర్యననాథులైన నాథులు గలిగియు ననాథవలెఁ బాంచాలరాజపుత్త్రి, దుశ్శాసనాప

కృష్ణయై, భయార్తయై, సభాంతరమున నుండుటఁ గాంచి సుయోధనుని తమ్ములలో నొకఁడగు వికర్ణుఁడను నాతఁడు జాలినొంది "సభాసదులారా! "పాండవాగ్రజుఁడు తన్నోడి నన్నోడెనో, నన్నోడి తన్నోడెనో యెఱిఁగింపు" డని ద్రౌపదియడిగిన ప్రశ్నను విచారించి యామె దాసియైనదియుఁ గానిదియు నిర్ణయించుట సభ్యులధర్మము; అయినను మీరెల్లఱు మిన్నకుంటిరిగావున నేను ధర్మనిర్ణయము జేసెద; ద్యూతపానాది దుర్వ్యసనాసక్తుఁడైన మనుజుఁడు ధర్మముఁ దప్పి వర్తిల్లు గావున నట్టివాని కృత్యములు సేకొనఁదగవు; కితవాహూతుఁడై, వ్యసనవర్తియై, పరాజితుఁడైన ధర్మరాజు పాండవుల కందఱకు సాధారణధనమైన ద్రౌపదిని బణము జేసెఁగావున నామె యధర్మవిజిత! అక్రమముగ నిట్లవమానించుట యన్యాయము" మని పలుక, రాధేయుఁడు "పెద్దలగు సభ్యులెల్లఱు మిన్నకుండ, నీయట్టి చిఱుతవాఁడు ధర్మవిచారణ సేయఁజనదు. యుధిష్ఠిరుఁడు తన సర్వస్వమ్ము నొడ్డి యోటువడినప్పు డిదివానికి వెలిగాదు; కావున ద్రౌపది ధర్మవిజితయే! లేనిచోఁ బాండవు లెల్లఱు దీనిని విజితఁగా నేల యొడఁబడుదురు? ఇవ్వనిత యనేక భర్తృకగావున బంధకి యనఁబడు, దీనిని విగతవస్త్రఁజేసి సభాంతరమునకుఁ దెచ్చినను ధర్మవిరోధము లేదు." అని చెప్పి యాతనిని వారించెను.

పిమ్మట దుర్యోధనుఁడు దుశ్శాసనుఁ బిలిచి "పాండవుల యొక్కయు, ద్రౌపదియొక్కయు వస్త్రములఁ దీసికొనిరమ్ము."

అనివచింప, నవ్వచనముల నాలించినతోడనే పాండవులు తమపై వుట్టములఁ దీసియిచ్చిరి. అనంతరము ఖలుఁడగు దుశ్శాసనుఁడు స్త్రీయని యించుకయు వంకయుంపక ద్రౌపది కట్టిన పుట్టము నానభలో నూడఁదీసెను అప్పు డార్తత్రాణ పరాయణుఁడగు శ్రీమన్నారాయణుఁ డామె శరీరమున నింకొకవస్త్రము నుత్పన్నముచేసి యా పతివ్రతాశిరోమణి కవమానము ఘటిల్లకుండఁ గాపాడెను. అట్లు దుశ్శాసనుఁ డెన్ని వసనముల నూడఁదీసినను మరల నామెమేన నూతనాంబర ముత్పన్నమగుచుండఁ గొంతకడపున కతఁడు సిగ్గునొంది యాయాసయుక్తమనుండి మరలెను.

ఆ యవమానకృత్యముఁ గాంచి పవననందనుఁడు క్రోధారుణితనేత్రుఁడై

మ. "కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ చూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపదినిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్.

ఇట్లు సేయనైతినేనిఁ బితృపితామహులగతికిఁ దప్పినవాఁడ నగుదు" నని ప్రతిజ్ఞఁజేసెను.

దుశ్శాసనుచే నట్లు పరిభవితయై శోకాకులితమానసయై యున్న కృష్ణఁగాంచి కర్ణుఁడు "తరుణీ! ఒక యువతి కేవురు పతులుండుట యనుచితము; కావున నీభర్తలలో నీకుఁ దగినవానిని, జూదరియై యాలి నోటువడని వానిని వేఱొక్కని వరించి, దాస్యవిముక్తవై సుఖంపుము." అని చిఱునగవుతోఁ బలుకఁ, బాప నిరతుఁడగు దుర్యోధనుఁడు తన యూరుతలము నెక్కరమ్మని యుత్సాహముతో నా యోషా

మణికి సైగచేసెను. వృకోదరుఁ డదిగాంచి సహింపనోపక,

ఉ. "ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరునిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరివర్తిత చండగదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్."

అనుచుఁ గ్రోధావేశితుఁడై నిజాయుధము వంకఁ జూడ, భీష్మ ద్రోణ, కృప, విదురు లాతనిఁ గాంచి "వత్సా! క్రోధమున కిది సమయముగాదు. శాంతింపుము. పరమసాధ్వియగు ద్రౌపది నవమానించిన ఫలము నిక్కముగ కురుకులపాంసనులు వేగము ననుభవింతురు." అని చెప్పి యాతనిఁ బ్రశాంతచిత్తుఁ జేసిరి.

అప్పుడు ధార్తరాష్ట్రుల మందిరములలో మహోత్పాతములు కొన్ని జనింప ధృతరాష్ట్రుఁ డది విని భీతాత్ముఁడై దుర్యోధనునిఁ బిలిచి "పరమపతివ్రత నిట్లవమానింపఁదగద" ని మందలించి ద్రౌపదిని రావించి "అమ్మా! బుద్ధిహీనులై వీర లాచరించిన యపరాధముల మదినుంచక, నీ యిచ్చవచ్చిన వరముఁ గోరు మేనొసఁగెద" నని శాంతవచనములఁ బలుక, నా సాధ్వీమతల్లి "పాండవాగ్రజుని దాస్యవిముక్తునిఁ జేయుఁడు" అని కోరెను. అతఁ డవ్వరమొసఁగి వేఱొకటిఁ గోరుమన నామె "ధర్మరాజు తమ్ములను దాస్యవిముక్తులఁ జేయుఁడు" అని యడిగెను. అట్టి కష్టసమయమందును ద్రౌపది ధర్మము నెడ బాయక తన పతులనే దాస్యవిముక్తులఁ జేయ నభిలషించెనుగాని, తన్ను దాస్యవిముక్తఁ జేయఁ గోరదయ్యె! ధృతరాష్ట్రుఁ డామె ధర్మగుణమునకు సంతసించి యుధిష్ఠిరునిఁ బిలిచి "కుమారా! దుర్యోధను దుర్నయము మదినుంచక నీవనుజసహితముగా నింద్రప్రస్థమున కేఁగి యెప్పటియట్ల

రాజ్యము సేయుము" మని చెప్పి వారల నింద్రప్రస్థమునకుఁ బంపించెను.

అనంతరము దుర్యోధనుఁడు ధృతరాష్ట్రుపాలికిఁ జని "తండ్రీ! చేఁజిక్కిన పాండవులను విడిచి పుచ్చి నా యత్న మంతయు భగ్నముఁ జేసితివి. ఇంత వైరము కలిగిన పిమ్మట మాకు స్నేహ మెట్లలవడును? పరాక్రమశాలురగు పాండవుల నిప్పుడు విడిచి పుచ్చుట ఘోరపన్నగముల నలిగించి కంఠ సమీపమున విడిచి యూరకున్న చందము గాదె! ఇప్పుడు పాండవుల ననుద్యూతమునఁ బరాజితులఁ గావించి విరళ దేశ నిర్వాసితులను జేయ నంగీకరింపుముఁ" అని చెప్ప ధృతరాష్ట్రుఁడు దాని కొడఁబడి యనుద్యూతార్థము యుధిష్ఠిరుని మరలఁ బిలువనంపెను.

పితృనియోగమును, విధినియోగమును నతిక్రమింపనగునే యని విచారించి ధర్మరాజు తల్లిని, దమ్ములను, భార్యను దోడ్కొని హాస్తిపురమున కరుదెంచెను. అప్పుడు శకుని యక్షములఁ గైకొని ధర్మరాజు నుద్దేశించి "రాజా! నీవు మున్నోడిన రాజ్యమును, పత్ని, సహోదరులను కురువృద్ధుఁడు మరల నీకొసంగెఁ గావున వాని నిపుడొడ్డఁజనదు; నేనొక యపూర్వమైన పణము సెప్పెద; ఈద్యూతమున నోటు పడిన వార లజినవల్కలధారులై, వన్యమూలఫలాశనులై పండ్రెండేండ్లు వనవాసము సేసి, జనపదమున నొక్కయేఁ డజ్ఞాతవాసమును సేయవలయు; అజ్ఞాతవాసమున వారల నొరు లెఱింగినచో మఱలఁ బండ్రెండేం డ్లరణ్యవాసమును నొక్క యేడజ్ఞాతవాసము నాచరింపవలయు; నీ విప్పణమునకు ఒప్ప

రక సమ్మతించెదేని జూదమాడుదము." అని పలుక, అను-ద్యూత ధర్మాపహాసుండనై మరలి పోవుట యవమాన కరమని యెంచి ధర్మరాజు దాని కంగీకరించి శకునితో జూదమాడి పరాజితుం డయ్యెను.

అంతటఁ బాండవులు రాజ్యోపభోగములు విడిచి కృష్ణా సహితులై వనమున కేఁగ సిద్ధులుగాఁ గుంతి వారలను కౌఁగిలించుకొని దుఃఖాతిశయమున నాక్రందనము చేసెను.

భీష్మద్రోణ విదురాదులు పరమ దుఃఖితులైరి. కుంతియు వనవాసమున కేఁగఁ బోవ విదురు డడ్డువచ్చి "తల్లీ! నీవు వనవాస క్లేశముల నోర్వఁజాలవు. నాయింట నివసింపుము" అని ప్రతిమాలి యామెను దన గృహమున నునిచికొనియె. కృష్ణయుఁ బాండవులను, కుంతి భీష్మద్రోణాది గురుజనములకు నమస్కరించి వారల యాశీర్వాదములఁ గైకొని సుభద్రాభిమన్యులను, ద్రౌపదేయులను దోడ్కొని విపినమున కేఁగు చుండిరి. అప్పుడు మూలభృత్యులు కొందఱు స్యందనములను దోలుకొనుచు వారి పిఱుందన వనమున కరిగిరి.

ఇంద్రప్రస్థము రాజధానిగా నిరుపదిమూఁడేండ్లు రాజ్యము చేసి, కన్నబిడ్డలఁ బోలెఁ బ్రజలను గాపాడి, యానాఁడు పాపద్యూతపరాజితుండై కాంతారమున కేఁగుచున్న యుధిష్ఠిరనృపాలునిఁ గాంచి పౌరులెల్లఱు శోకించుచు "భరతాన్వయ రత్నదీపా! దురాత్ములగు ధార్తరాష్ట్రుల రాజ్యమున మేము నివసింపనోపము, మీవెంట నరణ్యమునకు వచ్చెద" మనుచు వచ్చుచుండ, ధర్మరాజు "క్రూరమృగాకీర్ణమగు నరణ్యము కడుభయంకరము; అచటి నివాసము

నకు మీర లోర్వఁజాలరు. ఇచట నేనుందును," అని యనునయవాక్యములు సెప్పి వారిని మరలించెను. పురోహితుఁడైన ధౌమ్యుఁడును, నింకఁ గొందఱు భూసురులును పాండవులతో వనమున కేఁగిరి.

—♦ అరణ్యపర్వము ♦—

పాండవులు కామ్యకమను వనమున కరిగి యచ్చట నివసించుచుండ, వారికి సంభవించిన దురవస్థ నెఱిఁగి కృష్ణాది యాదవులును, ధృష్టద్యుమ్నాది పాంచాలురును నవ్విపినమున కరుదెంచిరి. ద్రౌపది ధృష్టద్యుమ్న కృష్ణులఁ గాంచి "అన్నలారా! సింహవిక్రములైన మీకుఁ జెలియలనై, దుర్వారప్రతాపులగు పాండునందనులకుఁ బట్టమహిషినై, కౌరవసభయందు ననాథవలెఁ బరిభవింపఁబడితి" ననుచు మిక్కుటముగ విలపింప, వారామె యశ్రుజలముఁ దుడిచి, "సోదరీ! నీవూరడిల్లుము. మేమీ క్షణమునఁ బోయి యా పాపాత్ముల నంతకసదనమున కనిపి, ధర్మనందనుని రాజ్యాభిషిక్తుని జేసి నీకు సంతసముఁ గలిగించెద" మని చెప్పి యామె నోదార్చిరి. అప్పుడు సవ్యసాచి "భ్రాతృవరేణ్యులారా! మీ కెరుఁగని ధర్మము గలదే! ఇప్పుడు ధార్తరాష్ట్రులతో ననిఁ జేయుట ధర్మవిరుద్ధము గావున శాంతి వహింపుఁ"డని చెప్పి వారలఁ బ్రశాంతచిత్తులఁ జేసెను. అనంతరము సుభద్రాభిమన్యులను దోడ్కొని కృష్ణుఁడును ద్రౌపదేయులను దోడ్కొని ధృష్టద్యుమ్నుఁడును పాండవుల వనవాసమునకు వగచుచు నిజపురముల కేఁగిరి.

పాండవులకడ కనుదినము, రోమశ, బృహదశ్వ, మార్కండేయాది మహామును లరుదెంచుచు, వారలచే సత్కృతులగుచు, సత్కథలను జెప్పి వారికిఁ జింతోపశమనము సేయుచుండిరి. అట్లు పాండునందనులు కామ్యక వనమునఁ గొన్ని దినములువసించి, పిమ్మట ద్వైతవనమున కరుదెంచిరి.

అచ్చటి కొకనాఁడు వ్యాసమునీంద్రుఁ డరుదెంచి పాండవులచేఁ బూజితుఁడై యజాతశత్రు నవలోకించి "ధర్మనందనా! "ప్రతిస్మృతి" యను నొక దివ్యమంత్రము నీ కుపదేశించెద; నీవు దాని నర్జునున కుపదేశింపుము; అమ్మంత్రశక్తి నతఁ డధిక తపోవీర్య విభవుఁడై దేవతలఁ బ్రత్యక్షము చేసికొని వారలవలన దివ్యాస్త్రములు వడసి, కర్ణ దుర్యోధనాది శాత్రవులను జయించు"నని చెప్పియాతనికి మంత్రోపదేశము చేసి చనియె. పిమ్మట ధర్మతనయుఁడు విజయున కమ్మంత్రరాజ ముపదేశించి, కృష్ణద్వైపాయను వచనములను దెలుప, నతఁడు దివ్యాస్త్రలాభార్థియై తపమున కరుగ నమకట్టెను. అప్పుడు కృష్ణ యాతని కడకు వచ్చి,

చ॥ "అరికృత దుష్పరాభవ మహార్ణవమగ్నుల మమ్మునందఱన్
గరుణ సముద్ధరింపుము జగన్నుత యన్యులు పూనఁగానియీ
భరము వహింపఁబూని నయపారగుణాన్వితు నిన్ను దిక్కులన్
ధరణియు సోముఁడున్ నభముధాత్రియు గాడ్పును గాచుచుండెడున్."

అని దీవించి, యాతని వియోగమున కోర్వఁజాలకయు నెట్టకేలకు మనము స్థిరము సేసికొని పంపించెను.

అంతనర్జునుఁడు గాండీవధరుఁడై వెడలి హిమశ్శైల, గంధమాదనముల గడచి యింద్రకీల పర్వతమున కేఁగ నచ్చట వృక్షచ్ఛాయ నొక వృద్ధబ్రాహ్మణుఁడు నిలిచి గాండీ-

విని చూచి "పితహర్ష క్రోధులైన ధరణీసురు లుండెడు పుణ్యనివాసమున నీవాయుధపాణివై యుండదగదు. కావున నీబాణాసనమును విడువు" మని పలికెను. విజయుఁ డవ్వచనము లకు సంచలింపక యుండ, శతమఖుఁ డాతని ధైర్యమునకు మెచ్చి యా వృద్ధబ్రాహ్మణ రూపము విడిచి నిజరూపము చూపె "కుమారా! నీధైర్యము నెఱుఁగఁగోరి యీభూసుర వేసముతో నరుదెంచి నిన్నుఁ బరీక్షించి ప్రీతుఁడనైతి; నీకుఁ గావలసిన వరములడుగు" మనియె. సవ్యసాచి ముకుళిత కర కమలుఁడై "దేవా! నాకు దివ్యాస్త్రములఁ బ్రసాదింపు"మని యడుగ,నమరవల్లభుఁడు "కుమారా! నీవు ముందు పశుపతినిఁ గుఱించి తపముజేసి పరమాస్త్రలాభము నొందు"మని చెప్పి దివమున కేగెను. పిమ్మట నర్జునుఁడు హిమవన్నగమున కేగె. వివిధకుసుమఫల వృక్షములతోడను, విమల నిర్ఝర జలములతోడను మనోహరముగ నున్న యొక తపోవనమున సుమారమణు నుద్దేశించి నాలుగు మాసములు ఘోరముగఁ దపముజేసెనుఁ

ఈశ్వరుఁ డాతని తపమునకు బ్రీతుఁడై కిరాతరూపముఁ దాల్చి, వనచరీసహస్రముతోడను, గిరాతబలముతోడను ధనంజయుని తపోవన ప్రాంతమున కరుదెంచెను. అప్పుడు మూకుఁడను దైత్యుఁడొకఁడు గరళకంఠునిచే ననుజ్ఞాతుఁడై భీకరమగు సూకరాకారముఁ దాల్చి పార్థునివయికి రా నతఁడు గాండీవగుణధ్వని సేయుచు దానిపైకి బాణము విడువ నమ కట్టి నిలిచెను. అప్పుడొక దిశనుండి "ఈసూకరము నేయ కేయకు" మనుచు నొక గంభీరవాక్యము వినరా నతఁడు

దాని సలక్ష్యముజేసి బాణము నాసూకరముపైకి విడిచెను. అత్తఱిముననే గిరాతపతియు నొక్కవాడి నారాచము విడువ నయ్యిరువురి శరము లొక్కమారే యాసూకరముం దాకెను. అంత నాపంది యాదృశ్యముగాఁగ నర్జునుఁడు కిరాతనాథునిఁ గాంచి "ఓయీ! నేనేసిన మృగమునేసి, మృగయాధర్మ విరోధమేల సేసితివి? నిన్నిప్పుడు నానిశితబాణజాలముల పాలుజేసెద" ననుచుండ, నక్కిరాతుఁడు "నేనునామృగము నేయ నది నాబాణఘాతమువలనఁ జచ్చె; దానిని నీవు చంపి నట్లు చెప్పికొనుటేటి పౌరుషము? శూరుఁడవయినచో నాతో రణముజేసి నీశౌర్యము గనఁబఱచుము" నుచు నర్జును నెదు రొక్కని పోరసాగెను. ధనంజయుఁ డాతనిపై శరవర్షముఁ గుఱిపింప నాశరము లాతనియెడ నిష్ఫలము లగుచుండెను. కిరాతనాథుఁ డేయు శరములు మాత్రము పార్థు నధికముగఁ బీడింపసాగెను. అదిగాంచి ఫల్గునుఁడు విస్మితుఁడై "ఈతఁ డెవ్వఁడో కిరాతరూపధరుఁడై వచ్చిన దివ్యపురుషుఁడుగాని యన్యుఁడుగాఁడ"ని నిశ్చయించి భీకరముగఁ బోరి కొంత తడవునకు మూర్ఛితుఁడయ్యెను. అప్పుడా మహేశ్వరుఁడు నిజరూపము ధరించి యర్జునుని లేవదీసి "ధనంజయా! నీతపమునకును, శౌర్యమునకును నేను బ్రీతుఁడనైతి; నీకోర్కె సఫలము జేసెద; వరమువేఁడు" మని పలుక, విజయుఁడు కృతాంజలియై "పరమేశ్వరా! లోకైకనాథా! ఎఱుకవేసముతో నరుదెంచిన నిన్నెఱుఁగక నేచేసిన యపరాధము సహించి నాయెడఁ బ్రసన్నుఁడవై, పాశుపతాస్త్రముఁ బ్రసాదింపు" మని వేడెను. అంతట బార్వతీరమణుఁ డాతనికి మంత్ర

ధ్యాన జపహోమ పూర్వకముగా, సంధాన మోక్షణ సంహా
రసహితముగాఁ బాశుపతాస్త్రము నొసఁగి "ధనంజయా!
ఈదివ్యాస్త్రమున నీవఖిలలోకములు జయింతువు" అని వర
మొసంగి యంతర్హితుఁడయ్యెను. అప్పుడు పాకశాసనుఁడు
యమవరుణ కుబేరులతో నర్జునునకుఁ బ్రత్యక్షమై "కుమారా!
నీకు నారథము బుత్తెంచెద: నీవు దాని నధిరోహించి యమ
రావతికి రమ్ము; నీకచ్చట దివ్యాస్త్రముల నొసఁగెద" అని
చెప్పెను. యమ వరుణ కుబేరులు విజయుని యెడఁ బ్రీతులై
కొన్ని దివ్యాస్త్రముల నొసఁగిరి. ధనంజయుఁడా దిక్పాలకు
లను వాక్పుష్ప ఫలజలములఁ బూజించి తృప్తులఁ జేసెను.
అంత నయ్యాసురవల్లభుఁడు దిక్పాలులతో నంతర్హితుఁడై
యర్జునునకు మాతలిచే రథముఁ బంపించెను.

పార్థుఁడ రథమున నధిష్ఠించి యమరావతి కరుగఁ
బాకశాసనుఁ డాతని నతిప్రీతి నాలింగనము జేసికొని తన
సింహాసనమున గూర్చుండఁజేసెను. అప్పుడు సురరాజుతో
నేకాసనమందున్న గాండీవిని, సుర సిద్ధ గంధర్వ విద్యాధరు
లతిప్రీతి నగ్గించిరి. పిమ్మట శతముఖుం డాతని నొక మణిమయ
సౌధమున నుండఁ బనిచెను.

నాఁటిరాత్రి యూర్వసియను నప్సరస మన్మథబాణాలం
కృతయై విజయునికడకు వచ్చి "పురుషశ్రేష్ఠా! నారదాది
మహర్షులెల్లరు నీసుగుణగణములఁ గొనియాడుచుండ నాక
ర్ణించి నేను బెక్కుకాలమునుండియు నీ స్నేహము గాంక్షించు
చుంటిని; మదీయ పుణ్యవశమున నేఁడు భవదీయ దర్శనము
సేకూరె; కావున నిప్పుడు నీవు నా మనోరథముఁదీర్పు" మని

ప్రార్థింప, నతఁ డామెకు దండప్రణామము సేసి "తల్లీ! మదీయ వంశకర్తయైన పురూరవునకుఁ బత్నివగుట వలనను, బురందరునకుఁ బరిచర్య యొనర్చుట వలనను నీవు నాకు జనయిత్రి వయితివి. కావుననే యిట్టి దుర్భాషణముల వినఁజాల; నా యందుఁ బుత్త్రవాత్సల్యముంచు" మని వినయమునఁ బలికెను. అంత నామె కోపావేశితమానసయై "నిన్నుఁ గామించి వచ్చిన నా మనోరథము విఫలము సేసితివి గావున నీవు మర్త్యలోకమున మానవవర్జితుఁడవై మానినీమధ్యమున నపుంసకుఁడవై యుండుము." అని శాపమిచ్చి నిజసదనమున కేఁగెను.

ప్రభాతమైన పిమ్మటఁ బురందరుఁ డవ్వృత్తాంతము నెఱిఁగి విజయుని సచ్ఛీలమునకు మెచ్చి "కుమారా! నీవజ్ఞాతవాసము సేయునప్పుడు షండరూపమునఁ బ్రచ్ఛన్నుండవై రాజకన్యకలకు నర్తనముఁ గఱపుచు నీ శాపము ననుభవించి, యనంతరము నిజరూపముఁ దాల్చు" మని చెప్పి యాతని కమోఘాస్త్రంబు లనేకమిచ్చి దనయొద్దఁ గొంత కాలముంచుకొని, చిత్రసేనుఁడను గంధర్వునిచే నాతనికి గీత వాద్య నృత్యములు జెప్పించి, యొక్కనాఁ డేకాంతమున "కుమారా! కాలకేయనివాతకవచు లనఁబఱఁగు మూఁడు కోట్ల దానవులు లోకభీకరులై దివిజులకు బాధలఁ గలుగఁజేయు చుండిరి. నీవు దేవతల వలనఁ బడసిన దివ్యాస్త్రములచే నద్దనుజులను వధించి దేవబ్రాహ్మణహితము సేయు" మని చెప్పి యొక్క యభేద్యకవచమును, సహస్రసూర్య ప్రభాభాసితమైన యొక్క దివ్యమణికిరీటమును నొసంగి, మాతలిప్రయుక్తమైన రథమున నెక్కించి పంపించెను.

అంతఁ బార్థుఁడు, సముద్రగర్భమునఁ గల హిరణ్య మహా పట్టణమున నివసించుచున్న నివాతకవచులయొద్ద కరిగి శంఖ ధ్వానము సేయ, నద్దానవు లలిగి నానావిధాయుధసన్నద్ధులై వచ్చి విజయునిఁ జుట్టుముట్టిరి. అంతఁ గిరీటి నిజకౌశలము మెఱయఁ గొంతతడ వాయోధనము సేసి, పాశుపత, వారుణ, కౌబేరాది దివ్యాస్త్రములఁ బ్రయోగించి దనుజమర్దనము సేసి, విజయ విభాసితుఁడై దేవదత్తముఁ బూరించుచు నాకమున కరుదెంచెను.

అప్పుడు పురందరుఁడు, బృందారకుల కజేయులైన మూఁడు కోట్లదానవులఁ జెండాడి వచ్చిన విజయు నతిప్రీతి నాలింగనము జేసికొని, మూర్ధాఘ్రాణము సేయుచు, "కుమారా! కాల కేయనివాతకవచులఁ జంపి దేవబ్రాహ్మణ హితము సేసి నాకు సంతసముఁ గలిగించితివి. ఇఁక నీ రాకకు నిరీక్షించు చున్న సహోదరుల కడకరిగి వారికి మనఃప్రియము సేయు" మని చెప్పి యాతనిని ధర్మతనయునికడకుఁ బంపించెను. దేవతల వలన దివ్యాస్త్రలాభము వడసివచ్చిన కిరీటినిఁగాంచి కృష్ణయుఁ, బాండవులును హర్ష పరిప్లుతాంతరంగులైరి.

అట గజపురమున కౌరవనాథుఁడు శకుని కర్ణదుర్యోధన దుశ్శాసనను లోకరూపోటఁగూడి "వనమున నరయుచున్న పాండవుల కడకు మనము మహావైభవముతో నేఁగి వారలఁ దుఃఖచిత్తులఁజేసి రావలయు" నని యోఁజించి "సారవంత మైన ద్వైతవనమునఁడి యభివృద్ధి నొందుచున్న మన గోగణమున కిప్పుడు క్రూరజంతువులచే బాధగలుగుచుండె నని గోపాలురు వచించిరి. కావున మేమిప్పు డచ్చటి కరిగి

యీ దుష్టవర్తనముల నడ్డగించి, ధేనువ్రాతము గాపాడి వచ్చెద" మని భీష్మ విదురధృతరాష్ట్రాదులకుఁ జెప్పి, దివ్య మణిభూషణాలంకృతులై, కాంతాజనముతోడను, సైన్యము తోడను మహావైభవముతో ఘోషయాత్ర కరిగిరి.

అట్లు ద్వైతవనమున కరుదెంచి, గోబృందము గాంచి పరిశీలించి, క్రూరమృగములఁ జెండాడి, పల్లవప్రసూనఫల భరితపాదపములచే నతిమనోహరముగ నున్న నవ్యవనమున విహరించుచు, మయూరమధుకర కీరకోకిలల మధురగానము లాకర్ణించుచు, పాండవుల యాశ్రమ సమీపమునకు వచ్చి యచ్చట నొక్క సరోవరముఁ గాంచి, యక్కమలాకరతీరమునఁ గ్రీడాగృహములు నిర్మింప భృత్యులఁ బనిచెను.

అప్పుడు కొందఱు గంధర్వులచటి కరుదెంచి "ఈ వనాకరము మాయేలికుఁడైన చిత్రసేనాఖ్య గంధర్వునకుఁ గ్రీడార్థమేర్పఱుపఁబడినది. కావున మీ రిటనుండి సత్వరమున వెడలుఁ" డని వచింప, భృత్యులు కురుపతి పాలికిఁ బోయి యావృత్తాంతము నెఱింగించిరి. దుర్యోధనుఁ డది విని కోపావేశుఁడై "ఎవఁ డేఁగి యా గంధర్వులఁ జంపి సరోవరము నాక్రమింతు" రనుచు కర్ణాదియోధులఁ గూడి గంధర్వులపైకి సమరమున కరిగెను. ఉరుప్రజ్ఞుఁడైన చిత్రసేనుఁ డది గాంచి బాహుబల సమన్వితుఁడై వచ్చి కౌరవానీకము నెదుర్కొని శరవర్షము గురియింపఁ, గౌరవవాహిని యాతని ధాటికోర్వఁజాలక చిందరవందరయయ్యెను. కర్ణుఁడు కొంతతడవు భీకరముగ రణము సేసి యనంతరము క్షతగాత్రుఁడై నిలువఁజాలక రణభూమినిఁ దొలంగి చనియె. అంతఁ

చిత్రసేనుఁడు దుర్యోధను నెదుర్కొని సమరము సేసి హయసారథులఁ దునిమి, విరథుఁడైన యక్కురుపతిఁ బట్టుకొని పెడకేలుఁగట్టి సింహనాదము సేయ, నాతని యనుచరులు దుశ్శాసనాదులను, వనితాజనములను బంధించిరి.

అప్పుడు కొంద ఱమాత్యులును, భృత్యులును ధర్మరాజు కడకుఁ బరుగెత్తిపోయి "పార్థివోత్తమా! కాంతా జన సహితముగాఁ జిత్రసేను చేతఁ జిక్కిన నీ యనుజ ప్రాణముఁ గాపాడు" మని యాక్రందనము సేసిరి. అప్పుడు భీమసేనుఁడు ప్రహసితాననుఁ డగుచు ధర్మరాజును గాంచి "అన్నా! మనము చేయవలసిన కార్యమును జిత్రసేనుఁడే యొనరించెను. దుష్టచిత్తులై మనల ననేక విధముల బాధించిన ధార్తరాష్ట్రులయెడ నిపుడు కనికరింపవల" దని వచింప, దయాంతరంగ స్వాంతుఁడైన యుధిష్ఠిరుఁడు "దుర్యోధనుఁడు దుర్నీతుఁడైనను, కాంతాజన సహితముగా నొరుల చేతఁ జిక్కిన సమయమున రక్షింపక యుపేక్షించుట మనకు ధర్మము గాదు. అతఁడు నీయొక్కయు, ధనంజయునియొక్కయుఁ బరాక్రమమెఱిఁగినవాఁ డగుటచే నిప్పుడు మీరు వచ్చి తన్ను విడిపింతురను నాస వహించియుండును. ఇది మనకుఁ బుణ్యమును, యశమును దెచ్చికొనఁదగిన సమయము! కావున నీ వనుజులతో నరిగి ధార్తరాష్ట్రులఁ జెఱనుండి విముక్తులఁ జేసి రమ్ము." అని శాంతవచనములను జెప్పి యాతని విగతమత్సరుం జేసి పంపించెను.

అగ్రజుపనుపున ననుజులు నలువురు రథారూఢులై యరిగి గంధర్వవాహినిఁ దాకి వాడి నారాచములఁ బ్రయోగింప,

చిత్రసేనుఁడు రణసంరంభము విడిచి స్నేహభావముతోఁ గిరీటిఁ గాంచి "ధనంజయా! ఖలుఁడగు నీ సుయోధనుఁడు, వనవాసక్లేశితులగు మిమ్ముపహసింపఁ దలఁచి యిటకు రా నేనది యెఱిఁగి పీని గర్వ మడుపఁ దలంచి యిట్లు గావించితినని చెప్పెను. దయార్ద్రహృదయుఁడైన ధర్మరాజు ధార్తరాష్ట్రులను విడిపింప మాకనుజ్ఞ నొసఁగె; కావున నీఁక వారలను విడిచి మాకు సంతసముఁ గలిగింపుఁ" డని గాండీవి వచింపఁ, జిత్రసేనుఁ డవ్వచనముల కలరి ధర్మరాజు కడకేతెంచి యాతనిచే సన్మానితుఁడై ధార్తరాష్ట్రులను విడిచి తన మార్గమున నేఁగెను.

అప్పుడు యుధిష్ఠిరుఁడు దుర్యోధనుఁ గాంచి "తమ్ముఁడా! నీవిఁక విషాదము నొందక ననుజ సహితముగాఁ బురమున కేఁగి రాజ్యంబు సేయు"మని చెప్పి పంపించెను. దుర్యోధనుఁడు చెదరిపోయిన సైన్యమును, శకుని కర్ణాదులను గలిసికొని లజ్జాకజ్జలిత హృదయుఁడై కరిపురమున కేఁగెను ధౌమ్యాది భూసురులును, నయ్యాశ్రమవాసులైన ఋషులును పాండవుల ధార్మికత్వమును బహువిధముల బ్రస్తుతించిరి.

అనంతరము పాండవులు తృణబిందు నాశ్రమమున కేఁగి యాట నివసించుచు నొకనాఁడు ధౌమ్య సహితముగాఁ బాంచాలి నాశ్రమమున నునిచి తా మేవురును మృగయార్థము నలుదిశలకుఁ జనిరి. అప్పుడు, ధృతరాష్ట్రుని జామాతయు, సింధుసౌవీర దేశాధీశుఁడునగు జయద్రథుఁడు సాల్వకన్యకఁ బరిణయమాడ నమార్గమున నేగుచు, నయ్యాశ్రమమున నున్న ద్రౌపదిఁ గాంచి మోహితుఁడై, కోటికాస్యుఁడను తన

మిత్రునిఁ గాంచి "ప్రియసఖా! నీవయ్యాశ్రమమున నున్న, సుందరి కడకేఁగి, యాసుదతి యన్వయనామధేయములఁ దెలిసికొని, యామెకు నన్నెఱింగించి, మాయిరువురకు సఖ్యముఁ గూర్చు" మని చెప్పిపంపించెను.

అంతన కోటికాస్యుఁడు పాంచాలిపాలికిఁ బోయి "రాజబింబాననా! దారుణమృగ సమాకులమైన యివ్వనాంతరమున నొంటిగ నున్న నీవెవ్వతెవు? నీతలిదండ్రు లెవ్వరు? పతి యెవ్వఁడు? సింధుసౌవీరనాథుఁ డగు జయద్రథుఁడు నిన్నుఁ గాంచి ప్రీతుఁడై, నీ తెఱంగెఱుంగ నన్ను బుత్తెంచె" నని వచింప, నమ్మానినీమణి "అన్నా! నేను పాండునందనుల ధర్మపత్నిని, పాంచాల రాజపుత్రిని, పాండవు లిప్పుడు మృగయార్థము వనాంతరమున కరుగుటచే నే నిట నొంటిగ నుంటిని. కావున నీవిటఁ దడయఁజనదు. మీ రియ్యాశ్రమ ప్రాంతమున గొంత తడవు విశ్రమింపుఁడు. పాండవులరుదెంచి మిమ్ముల సన్మానించి పంపుదురు" అని చెప్పెను.

కోటికాస్యుఁ డంతట జయద్రథుని కడ కేఁగి యామె వచనముల నెఱిఁగింప నతఁడు మదనకంపితహృదయుఁడై ద్రౌపది నపహరింప నెంచి యామె కడ కేఁగి "తరుణీ! రాజ్యముఁ గోల్పోయి కందమూల ఫలాశనులై కాంతారమున నవయుచున్న పాండవులఁ గూడి నీ విట్టికష్టములఁబడనేల? శీఘ్రముగ నన్నుఁ జేపట్టి రాజ్యభోగము లం దనివిదీర ననుభవింపుము." అని వచింప నక్కాంతారత్నము "అన్నా! నీవు దుస్సలకుఁ బతివగుటచే నాకు నన్న వగుదువు. ఉత్తమ రాజ వంశోద్భవుఁడవై, నీచునివలె నిట్టి దుర్భావములాడఁ

జును నే!" అనుచు వినయ వాక్యములతో హితోపదేశముఁ జేసెను. ఆదుష్టుఁ డామె నదుపదేశము నాలింపక "వరోజఃముఖీ! రాజులకు నావివరుసలతోఁ బనిలేదు. కావున సత్వరముగవచ్చి నాయరదము నెక్కు" మన, నాసాధ్వి "దురాత్మా! దుర్వారప్రతాపులగు పాండవుల విక్రమము నెఱుఁగక, నోటికి వచ్చినట్లు పలుకుచున్నావు. శీఘ్రముగ నిటనుండి వెడలి ప్రాణములఁ గాపాడుకొనుము. లేనిచోఁ బాండవు లరుదెంచి నీయుసురుల నపహరింతు"రని వచించెను "వీరకులప్రసూతులమగు మేము పాండవులకు వెఱచువారముగా" మనుచు సైంధవుఁడ పతివ్రతాశిరోమణిని బలవంతముగఁ బట్టుకొని రథముపై నిడుకొని సపరివారుఁడై యరుగఁదొడఁగెను. అప్పుడు ద్రౌపది దుఃఖాతిశయమున నడలుచుండ ధౌమ్యుఁ డరుదెంచి "దుష్టాత్మా! ఈసాధ్వీమతల్లినిఁ గొంపోయినఁ బాండవులు నీప్రాణముల నపహరింపక విడువరు. కావున నీమెను విడువు" మని యాక్రోశించుచు వాని పిఱుందనఁ బోవుచుండెను.

వేఁటకరిగిన పాండవు లనేక మృగములఁ జంపి నిజాశ్రమమునకు వచ్చి యటనున్న పరిచారకవలన జరిగినవృత్తాంతము విని, క్రోధావేశమున మహోరగములవలె రోజుచు, దమయరదముల నతివేగమునఁ బరుగెత్తించి, త్రిగర్త, సింధు, శిబి, సౌవీరసైన్యములతో ననేకనరపతిపరివృతుఁడై యున్న జయద్రథుఁగాంచి క్రోధారుణలోచనులై సింహనాదములు సేయుచు శాత్రవసేనపయిఁ గవిసి శరవర్షమును గురియించిరి. అంతట సైంధవుఁడును తనసేనలఁ బురిగొల్పుచు పాండవుల-

నెదుర్కొని కొంతతడ వాయోధనము సేసెను. అప్పుడు విజయుఁడుఁ గాండీవపాణియై నిజకౌశలము మెఱయ సవ్యాపసవ్యముల వాడి నారాచములఁ బ్రయోగించి శాత్రవయోధులఁ బీభత్సము సేయుచుండ, భీమసేనుఁడు హేమబంధబంధురమును, నయోమయమును నగు గదాదండమును ద్రిప్పుచు నరివీరులఁ జెండాడఁ గొంతతడవునకు రణభూమి యంతయు శవమయమయ్యెను. హతశేషులు భీమార్జునుల ధాటి కోర్వఁజాలక పలాయనులైరి.

అంతట సైంధవుఁడు ద్రౌపదిని దిగవిడిచి తనయరదము నతిత్వరితముగఁ దోలుకొని రణభూమిని బాసిపోవుచుండ భీమార్జునులు వాని వెంటఁ దమయరదములఁ బరుగెత్తించికొని పోయిరి. అప్పుడు కిరీటి వాని హయసారథులఁ దునుమ నతఁడు రథము డిగ్గి పరుగిడిపోయి యొక గుల్మమధ్యమునఁ డాగెను. వృకోదరుఁడు దానెఱిఁగి పరుగెత్తిపోయి వాని శిరోజములఁ బట్టుకొని యీడ్చి తెచ్చి యుగ్రముగ నొక్కపోటుఁ బొడిచెను. అప్పు డర్జునుఁడు వానిఁ జంపవలదని వారింప, భీమసేనుఁడు వానితలఁ గొఱిగి, రాజవేషము వికల్పితము సేసి "ఓరీ! ఇఁక మీఁద నీవు పాండవదాసుఁడనని యెల్లెడలఁ జెప్పుకొనుచుండువేని యిప్పుడు నిన్ను ప్రాణముతో విడిచెద; లేనిచో జమునివీటి కతిథిఁ జేయుదు" నని బెదరించెను. సైంధవుఁడు భీతుఁడై యట్లు సేయుదుననఁ భీమార్జునులు వానిం బెడకేలు గట్టి యుధిష్ఠిరునిపాలికిఁ దోడ్కొనిపోయిరి.

ధర్మరాజు వానిం జూచి యీ దురాత్ముని జంపినచో దుస్సల విధవయగుఁ గావునఁ జంపవల" దని చెప్పి విడిపించి

“ఇంకనైన సన్మార్గము నవలంబించి జీవింపు” మని వానికి బుద్ధిచెప్పి పంపించెను.

అంత నా సైంధవుడు గంగాద్వారమునకరిగి పశుపతి నుద్దేశించి యుగ్రతపము సేయ నద్దేవుడు ప్రత్యక్షమై వరము వేడుమనియె. “దేవా! నేను పాండవుల జయించు నట్లు వరమొసంగు” మన, భవానీపతి “ఓయీ! పాండవుల జయింప నమరులకైన నలవిగాదు అయినను నీకోర్కెం దీర్పవలయుం గాన విజయునిం దక్కం గడమవారిని నీవొక్క నాటిసంగరమున మాత్రము జయింపంగలవు.” అని వరమిచ్చి మహేశ్వరుం డంతర్హితుండయ్యె. పిమ్మట సైంధవుండు నిజ పురమున కేగెను.

ఇటం బాండవులు కృష్ణాసహితులై నిజాశ్రమమునకు వచ్చి, మహర్షిసాంగత్యమున సుఖముగం గాలక్షేపము సేయుచుండ నొకనాం డొక విప్రుం డరుదెంచి “ధర్మరాజా! హరిణ మొకటివచ్చి నాయరణి నెత్తుకొనిపోయెను. నిత్య విధికి లోపము చేకూరకుండ నయ్యరణిం దెప్పించి యి” మ్మని యడిగెను.

అంతం బాండవులేవురు నాయుధపాణులై యామృగంబు వెంటనంటి పరుగిడుచు నెన్ని సాయకముల నేసినను వానిలో నొక్కటియైన దానికిం దగులకుండెను. ఆ సారంగము వేగ ముగం బరుగెత్తుచు, పాండునందనుల నొక ఘోరాటవిలోనికిం దీసికొనిపోయి పిమ్మట నదృశ్యమయ్యెను. తమ కృత్యము నిష్ఫలమగుటకు [illegible] తాపమునొందుచు నయ్యేవురు నతిశ్రాంతులై యొక [illegible] విశ్రమించిరి. అప్పుడు

నకులుఁ డప్పాదపమునెక్కి దెసలు గలయఁ బరికించి, దూరమున సలిలములుగలవని యెఱింగి, వానిం దెచ్చి యగ్రజుల పిపాసఁదీర్పనెంచి త్వరితగతిన్ రయమునఁజని, ముందట సకలమనోహరమగు తటాకముఁగని, యందలిజలములు ద్రావఁ బోవ నొక్క యశరీరభూత మాతని నుద్దేశించి

క. "ఓయన్న యీతటాకము
నాయది నీ విజలముఁ గొనఁగవలతేనిన్
నాయడిగిన ప్రశ్నములకు
నాయుత్తరములిమ్ము తేటపడంగాన్."

అని పలికెను నకులుఁ డవ్వచనములయెడ ననాదరము నేసి యా సలిలములు ద్రావినతోడనే నిశ్చేతనుఁడై తత్తీరమునఁ బడెను.

అట ధర్మనందనుఁడు నకులుఁ డేలనో తడసెనని సహదేవునిఁ గాంచి "తమ్ముఁడా! నీవేఁగి నకులునిజాడ నరసి సత్వరమున జలములు గైకొనిరమ్ము" అని యాజ్ఞాపింప నతఁడతిశీఘ్ర గమనమున నేఁగి, కమలాకరతీరమునఁబడియున్న సోదరునిఁగాంచి, విస్మయవ్యాకులహృదయుఁడై, "ఇతఁడు నిశ్చేతనుఁ డగుట కేమి కారణ" మని యోజించుచు, తృష్ణాభరము సహింపనోపక జలపానము సేయఁబోవ, నాతనికిని నయ్యశరీరవాక్యములు వినవచ్చెను. సహదేవుఁ డవ్వచనములయెడ ననాదరముఁజూపి సలిలపానము సేసి వెంటనే యచ్చటఁ బడిపోయెను

అట యుధిష్ఠిరుఁడు "మాద్రేయు లేలకో తడసిరి ఇప్పటినను వారి కేమిపత్తు సంభవించెనో" యని, సంతాపించుచు, "వారిజాడ నరసి సలిలములు గైకొనిరా" నర్జును

ధనంజయునిఁ బంప నతఁడును, నాతనియనంతరమున భీమ సేనుఁడును నేఁగి, యశరీరవచనముల నలక్ష్యము సేసి, పానీయ ముల నాస్వాదించి తత్తీరమునఁ బడిరి.

అంతటఁ బాండవాగ్రజుఁడు నలువురుతమ్ములు నేల మరలిరో యని విచారగ్రస్తుఁడై వచ్చి, పద్మాకరతీరమునఁ బడియున్న యనుజులఁ గాంచి దుఃఖాక్రాంతచిత్తుఁడై "ఇది యేమిమాయయో యని" పలుతెఱఁగుల విలపింపఁ యధిక పిపాసాలసుఁడై సలిలములు గ్రోలఁబోవ నెప్పటియశరీరవాణి యాతని నుద్దేశించి "రాజా! ఇక్కొలను నాయది. నే నడుగు ప్రశ్నములకు నుత్తరము లిచ్చినఁగాని యీజలముల నాస్వా దింపఁజనదు. నీ యనుజులు నావచనముల ననాదరము సేసి జలపానముచేసి యిట్లు నిశ్చేతన్యులైరి" అని పలికెను. అంతట యుధిష్ఠిరుఁ డంబరాభిముఖుఁడై "అయ్యా! నీవు రుద్రుఁ డవో, పావకుఁడవో, పవనుఁడవో గావలయు; లేనిచో నీకా సురగంధర్వాదుల కజేయులగు నాయనుజులఁ బడఁద్రోయు సామర్థ్య మెవరులకుఁ గలదు? నీ వెవ్వఁడవో, నీతలఁ పెయ్య దియో యెఱింగించి నాహృదయవేదన నపనయింపుము." అని వచింప, నొక యక్షుఁ డాతని యెదుట నిలిచి "నృపాలా! నేనొక యక్షుఁడను; నాయనుమతి లేకుండ నిత్తటాక తోయముఁ గ్రోలిన మనుజులు విగతప్రాణులగుదురు. ధీశాలి వగుటచే నీవిట్టి యనుచితకార్యము జేయవైతివి. నాప్రశ్న ముల కుత్తరమిచ్చి యిందలి సలిలముల నాస్వాదింపుము." యని చెప్పెను. "మహాత్మా! నీచిత్తమునకు వచ్చునట్లుగాఁ జెప్ప నాబోటివానికి శక్యమగునే? అయినను నా నేర్చు విధ

మునఁ జెప్పెద నడుగుము." అని ధర్మతనయుఁడువచింప, న య్యక్షుఁడు

క. "ఎయ్యది ధర్మమునకుఁ గుదు
రెయ్యది యాశ్రయము కీర్తికిమ్మగు మార్గం
బెయ్యది సురలోకమునకు
నెయ్యది సుఖములకు నిక్క మేర్పడఁ జెపుమా."

అని ప్రశ్నించెను.

క. "అమరఁగ దాక్షిణ్యము ధ
ర్మమునకు గుదురంద్రు కీర్తిమహిమ నెలవు దా
నము సత్యము సురపురి మా
ర్గము శీలము సంశ్రయము సుఖంబుల కెల్లన్."

అని యుధిష్ఠిరుఁడు దానికి సదుత్తరముఁ జెప్పెను.

అయ్యక్షుఁ డిట్లనేక ప్రశ్నము లడుగ ధర్మతనూజుఁడు వానికన్నిఁటికిఁ దగిన యుత్తరముల నొసఁగెను. అనంతర మతఁడు "నృపవరేణ్యా! మదీయ ప్రశ్నములన్నిఁటికి సదుత్తరము లిచ్చితివి గావున నీయెడఁ బ్రీతుఁడనై, నీయనుజులలో నొక్కని ప్రాణముల నీయఁదలంచితి, కావున నీయిచ్ఛవచ్చినవానిం గోరు" మన, ధర్మరాజు "మహాత్మా! నకులుని బ్రదికింపు" మని యడిగెను. "రాజా! పరాక్రమవంతులగు భీమార్జునులనువిడిచి, నకులు నేలఁగోరితి!" వని యడుగఁగ, గౌంతేయాగ్రజుఁడు "ఆర్యా మాతండ్రికి, కుంతియు, మాద్రియునను పత్నులిరువురుగలరు. అందుఁ గుంతీపుత్త్రులు ముగ్గురిలో నేనొక్కఁడను జీవితుఁడనై యుంటిని. కావున నిప్పుడు మాద్రీపుత్త్రులలోఁగూడ నొకఁడు జీవించుట ధర్మఁమని తలంచి నకులునిఁ గోరితిన"ని పత్యుత్తరమొసఁగెను.

అంత నయ్యక్షుఁడు "రాజోత్తమా! నీధర్మగుణమున కేను హర్షితుఁడనైతి; నీయనుజులు నలువురును లబ్ధజీవితులయ్యెద" రనుచుండ నంతలో భీమార్జున నకులసహదేవులు నిద్రవోయి మేల్కనిన విధమున సముద్ధితులైరి. అప్పుడు యుధిష్ఠిరుఁడు హర్షావేశితుఁడై యక్షు నుద్దేశించి "మహాత్మా! నిన్నొక యక్షమాత్రునిగ విశ్వసింపజాలకున్నాఁడ; నీవు హరుఁడవో, సమీరణుఁడవో, లేక మజ్జనకుఁడగు ధర్ముఁడవో నిక్క మెఱింగించినన్న ధన్యుని జేయు"మని వేఁడ, నయ్యక్షుఁడు "కుమారా! నేను ధర్ముఁడను, నీధర్మశీలము నెఱుంగఁ గోరి, హరిణరూపధారినై బ్రాహ్మణుని యరణిఁ దెచ్చితి. నిన్నిటకు రావించి, పరీక్షించి సంతోషితస్వాంతుఁడనైతి. నీవు కోరిన వరమొసఁగెద యడుగు" మనెను.

మత్తకోకిలము. "ఆదిదేవుఁడవైన నీవు దయామతిం బొడసూపి న
న్నాదరించుటఁ జేసి ధన్యుఁడనైతి నింతకు నెక్కుడే
దేది గల్గెడునైన నాకు నికెల్ల నాఁడును క్రోధమో
హామలం బెడఁబాసి ధర్మమునందు నెక్కొనఁ జేయవే"

అని యుధిష్ఠిరుఁడు వేఁడ నద్దేవుఁ డవ్వరమొసఁగి, విప్రుని యరణి నిచ్చి, అజ్ఞాత వాసము సేయునప్పుడు వారల నెవరు తెలియఁగకుండునట్లాశీర్వదించి యంతర్హితుఁడయ్యె.

పిమ్మటఁ బాండవులు పరమానందభరిత మానసులై నిజాశ్రమమున కరిగి, ధరణీదేవునకు నరణిప్రదానము సేసి సుఖముగ నుండిరి.

—♦ విరాటపర్వము ♦—

పాండునందనులు ద్వాదశవర్షములు వనవాసము సేసి,

త్రయోదశ వత్సరమున నజ్ఞాతవాసము మత్స్యభూనాథుఁడగు విరాటుని సన్నిధి నాచరింపఁ దలఁచి, యప్పటివఱకుఁ దమ్ముఁ బరివేష్టించియున్న ధౌమ్యాది భూసురులను, బరిచారకజనములను సముచితాలాపములఁ బ్రీతులంజేసి వారివారి నిలయముల కనిపి, పిమ్మట విరటపుర ప్రాంతారణ్యమున కేఁగి, తమ తమ యాయుధములఁ గట్టఁగట్టి, యచటి ప్రేతభూమియందుఁ బడియున్న యొక శవముఁ దెచ్చి, తమ యాయుధములఁ గాంచి యొరులు శవమని భావించి దరిఁజేరకుండునటుల నా ప్రేతము నయ్యాయుధములపయిఁ బెట్టికట్టి, మహోన్నతమైన యొక్క శమీవృక్షముపై వాని నునిచిరి.

పిమ్మటఁ బాండవాగ్రజుఁడు యతివేషమును దాల్చి కంకుభట్టాభిధానముతో విరటు నాస్థానమున కేఁగి యమ్మహీకాంతునిచే మన్ననల నంది, ఎల్లప్పుడుఁ బుణ్యకథలఁ జెప్పి యాతని మనము రంజింపఁజేయుచు నచ్చట నివసించెను. భీమసేనుఁడు వలలుఁడను నామధేయమున నరిగి, రుచ్యములగు పాకములఁ జేయుచు భూమీశుని మెప్పుఁగాంచుచుండెను. ధనంజయుఁడు బృహన్నలాహ్వయముతో నరుదెంచి, రాజానతిచే నాతని తనూజకు నర్తనముఁ గఱపుచుండెను. నకులుఁడు దామగ్రంధియనియు, సహదేవుఁడు తంత్రీపాలుఁడనియు నభిధానములతో నరుదెంచి విరటుని హయముల నొకరును, గోవుల నొకరును గాపాడుచుండిరి. కృష్ణ సైరంధ్రీవేషము దాల్చి మాలిని నామధేయముతో, విరటుని దేవియగు సుధేష్ణపాలికిఁబోయి "దేవీ! సింహవిక్రములైన యేవురు గంధర్వులకేను ధర్మపత్నిని, ఒక్క కారణమున నొక్కవత్సర

మేను పతుల నెడబాసియుండవలసె; నీవు ధర్మవర్తినివని విని నీకడ నివ్వత్సరముఁ గడుపఁ దలఁచి వచ్చితి; అతిసీచకృత్యములకు నన్ను నియోగింపక, గునుసుమమాలికలఁ గట్టుటయు జడలల్లుటయు నాదిగాఁగల పనులు నాచేఁ జేయించుకొను చుండు"మని వచింప, సుధేష్ణ యంగులకు సమ్మతించి ద్రౌపదిని దనకడ నునిచికొనియె. కృష్ణ, సుధేష్ణ యిచ్ఛాను వర్తినియై మెలఁగుచు నామెచే మెప్పుఁగాంచుచు సేవించు చుండెను.

ఇట్లు పాండవులు కృష్ణా సహితముగా విరటుపురమున వర్తించుచుఁ, గతిపయ దినములు గొఱంతగా వత్సరకాలము గడపిరి. అంత నొకనాఁడు మత్స్యభూనాథుని మఱఁదియు, దండనాథుఁడునగు గీచకాభిధానుఁడు దనయక్కం జూచు వేడ్క నంతఃపురమున కరుదెంచి, పాంచాలినిఁ గాంచి మోహితాత్ముఁడై తనయభీష్టము నామెకుఁ దెలుప, నాసాధ్వి యను నయవాక్యములతో వానిని మరలింపనెంచి "అన్నా! నేపట్టి దుర్భాషలను విననోపను; నన్ను నీసోదరినిగ భావింపు" మనియె. ఆదుష్టుఁ డవ్వచనములు నాలింపక "కోమలీ! నిమ్ము హస్తము లెత్తిరవాని నిట్టూరీకము సేయుచేల? నన్నుఁ జేపట్టి రాజభోగముల ననుభవింపుము" అని పలుక, ద్రౌపది "దురాత్మా! దుర్వారప్రతాపులగు నాపతులు నీప్రాణములఁ బోఁతిగొందురు. ఇచ్చవచ్చినట్లు వదరక సత్వరమున నిట నుండి వెడలు"మని గద్దించెను.

అనంతర మతఁడు సుధేష్ణపాలికేఁగి తన మనోరథము నామెకెఱిఁగించి "అక్కా! ఎవ్విధముననైన నత్తన్వోదరిని నా

కొనఁగు"మని వేడెను. "తమ్ముఁడా! పరవతీ సాంగత్యఁ మఘప్రదముగాదె? మఱియు న య్యువిదకు సింహావిక్రములగు గంధర్వు లేవురు పతులు గలరు. వారివలన నీకెట్టి కీడు మూడునోయని నాకు భీతి వొడముచున్నది. అట్టియుపద్రవ కరమైన యువిదస్నేహము నీకేల? ఆమెయందలి ప్రీతివిడువు" మని సుధేష్ణ హితోపదేశమునుజేయఁ, గీచకుఁడు "అక్కా! నీకింత భయమేల? ఈ భూవలయమున నన్నెదిరింపఁజాలిన వీరుఁడు గలఁడే? నీవు భీతినుడిగి యాసుందరి నెట్లైన నాకొ నఁగుము. దానితో నానందింపనిమెడల నామేనఁ బ్రాణ ములు నిలువ" వనుచు నామూర్ఖుఁ డద్దేవి నధికముగఁ బ్రార్థించెను. "వీఁడీక నిష్ప్రాపా దరణమునుండి వెనుదిరుగఁడు. ఏమి సేయుదు" ననుచు సుధేష్ణ మనమునఁ జింతించి, యను జుని ప్రార్థనఁ ద్రోసివేయఁజాలక "అనుజా! నీవిప్పు డింటి కేఁగుము. సురా దెచ్చు నెపమున నమ్మానిని నీమందిరమున కనిపెద; అప్పుడు నీమనోరథమును దీర్చుకొనుము." అని గద్గదకంఠయై చెప్పెను. అంతఁ గీచకుఁడు ముదితహృద యుఁడై నిజమందిరమున కరిగి మనమునఁ బాంచాలిని స్మరిం చుచు గడియ నొక యుగముగఁ గడపుచుండెను.

పిమ్మట సుధేష్ణ ద్రౌపదిఁగాంచి "కీచకుని యింట రుచ్య మైన వారుణిగలదు; నీవట కేఁగి త్వరితముగ దానిఁ దెచ్చి యిమ్మ"ని యానతిచ్చెను. "దేవి! నన్నట్టి నీచకృత్యములకు నియోగింపవలదని మొదటనే మనవిఁజేసితినిగదా" యని ద్రౌపది వినయముతో వచింప, సుధేష్ణ "సఖి! దీనిని నీచ కృత్యముగ నెంచితివా? కీచకుఁడు నాయనుజుఁడేగానియన్యుఁ

డుగాడు. కావున నీవటు కేఁగ సంశయింపవల"దని బదులు చెప్పెను. అంతటఁ బాంచాలి "ఇఁక నీమె కెదురాడుట యనుచిత"మని తలంచి మనమున ననేక విధములఁ జింతించుచు, హృదయమునఁ బరమేశ్వరుని ధ్యానించుచు నంతఃపురము వెలువడి దినకరునిఁ గాంచి కేలు మొగిచి

తే. "పాండుపుత్త్రుల కేను దప్పని మనంబు
గలుగుదాననయేని యో కమలమిత్ర!
కీచకుని చేత నన్నొక కీడు తెరువు
వొరయకుండఁగ రక్షింపు కరుణతోడ."

అని వేఁడి, యద్దురాత్ముని గేహమునకుఁ జని "దేవి వారుణిం దెమ్మని యానతిచ్చె; సత్వరమునఁ బోయియిమ్ము"డనియె.

ఆమె రాక కెదురుచూచుచున్న యానరాధముఁడు సంభ్రమాన్వితచిత్తుఁడై "లతాంగి! వారుణి నింకొకతెచేఁ దెప్పించెద; నీవు నామనోరథమీడేర్చు" మనుచు దిగ్గున నామె హస్తమును బట్టుకొనెను. అప్పుడు దైవబలము తన్నావేశింప ద్రౌపది యధికబలోపేతయై యాసింహబలుని పట్టు విడిపించుకొని వానిమందిరము వెలువడి మహాసత్త్వముతో, పరుగెత్తుచు విరాటుని కొలువుకూటమున కరుదెంచెను. ఆమె వెనువెంటనే కీచకుఁడును పరుగెత్తుచు వచ్చి యాసభామధ్యమున నయ్యార్యశ్రీని నొక్క తన్ను దన్నెను.

భక్తవత్సలుఁడైన యాదిత్యుఁడు ద్రౌపది తన్ను బ్రార్థించినంతనే ప్రీతుఁడై యాసాధ్వీమతల్లినిఁ గాపాడ నొక్కదానవు నామె వెంటఁ బంపించెను. అద్దనుజుఁ డదృశ్యాకారుఁడై వచ్చి, ద్రౌపదిని సింహబలుఁడు తన్నినతోడనే, వానద్దురాత్ము నొక్కపెట్టుబొడిచెను. కీచకుఁ డాపోటునకుఁ

గదునలిగి, తన్నుఁగొట్టినవానిని గనుగొన నేరకఁ గోపమున నరకమువలె రోజుచుండెను.

అప్పుడా సభలోనున్న వృకోదరుఁడు ద్రౌపదికిఁ గలిగిన యవమానమునుగాంచి సహింపనోపకఁ గ్రోధావేశితుఁడై, కీచకునిఁ బరిమార్పనెంచి యగ్రజుని మొగ మవలోకింప నీతిశాలియగు నా ధర్మరాజు భీమసేను నుద్దేశించి

మ. “వలలుం డెక్కడఁ డాఁచె నొండెడన సేవ్యత్వ్రజముల్ పుట్టెడిన్
ఫలితంబై ఘనశాఖలొప్పఁగ ననల్ప ప్రీతిసంధంబుమున్
విలసచ్ఛాయ సుపాంథశితప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూరుహముం దవ కట్టియలై ఖండింపఁగా నేటికిన్”

అనుచు, సభ్యాగనున్న యొక మహీరుహమును గనుఁగొని పలికి నటుల సూచ్యార్థయుక్తముగఁ బలికి యాతని ప్రయత్నమును వారించెను. విరటుఁ డవ్వికృత్యమును గాంచి సహింపనోపకయు, మహాబలశాలియగు మత్స్యుఁడయ్యుఁ దన కోపముఁ జూపఁజాలక, “ఇట్లు సేయఁదగ” దని శాంతవచనములం జెప్పి యాతని నింటి కనిపి, పరిభవానల సంతప్తమానసయై యున్న ద్రౌపది నారాత్రి యంతఃపురంబున కనిపెను.

సుధేష్ణ కృష్ణఁగాంచి “నెచ్చెలీ! నీ విట్లు విచారాక్రాంతవై యుంటివేల?” అని యడుగ, నామె “దేవీ! నీ వెఱింగియు నిట్లడిగిన నేనేమి చెప్పుదును? అయినను విను” మని కీచకుని దుశ్చేష్టితమంతయు సవిస్తరముగఁ జెప్పెను. “నారీమణీ! నీవు ఖేద మందకుము. నేను కీచకునిఁ బిలిచి శిక్షించెద” నని సుధేష్ణ వచింప, ద్రౌపది “ఆ నీచాత్ముని నా పతులే శిక్షింపఁగల” రని పలికి యా నాఁడు మజ్జన భోజనముల నొనరింపక దుఃఖాతిశయమున నడలుచుండెను.

ఆ నాఁటిరాత్రి యెల్లయును నిద్రించినపిమ్మటఁ గృష్ణ తెల్లతెల్లగా తెల్లవారుచుండ, మహానసగృహమునఁ బరుండియున్న వడముడిపాలికిఁ బోయి

ఉ. "నన్నుఁ బరాభవించి సదనంబునకుం జని కీచకుండుము
న్నున్న తెఱంగు దప్పక సుభోచిత శయ్యను నిద్రసేయ నీ
కన్ను మొగుడ్చు నూఱటకుఁ గారణమెయ్యది భీమసేన యీ
యున్న పరాక్రమంబు వలదన్ననొకో దయమాలి తక్కుటా."

అనుచు దుఃఖింప, నతఁడామె నూఱడించి "సతీ! మన యజ్ఞాతవాసమునకు భంగము సేకూరకుండునటుల నద్దురాత్ము నతిరహస్యముగఁ జంపవలయు; ఆ మదోన్మత్తుఁడు మరల నీ కడ కరుదెంచెనేని నీ వతి చతురముగ మాటలాడి, వాని యభీష్టమును దీర్ప నంగీకరించినట్లు నటించి, వాని నొంటిగా నర్తనశాలకు రమ్మని చెప్పుము. అయ్యధము నచ్చటఁ బరిమార్చి నీకు సంతసముఁ గలిగించెద. కావున నీవు మాఁడిల్లి శయనస్థానమున కేగి పరుండు" మని చెప్పి పంపించెను.

ద్రౌపదియందు బద్ధానురాగుఁడై యున్న సింహబలుఁడు మరల నెట్టివిధముననైన ప్రతిమాలి యామెం జేపట్ట నిశ్చయుఁడై, మఱునాఁ డంతఃపురమున కరుదెంచి పాంచాలినిఁ గాంచి "కమలనేత్రీ! ఏల నన్నిట్లు మానభంగ చేసెదవు! ఇఁక నైన నాయందుఁ గరుణవహింపుము. నీవంగీకరింపకున్న, నా, బలిమినైన చేపట్టుదు గాని విడుచువాఁడను గాను." అని పలుక నత్తలోదరి "ప్రపంచమునకే రహస్యము లేక, బహిరంగముగ నిట్లు నన్నుఁ బరిగ్రహింపనెంచిన నేనెట్లు సమ్మతింతు" ననియె. అతఁడ దన్వచనములకుఁ బొంగి "లలనామణీ! నీవే సమయమున నెచటికి రమ్మనిన నచటికి వచ్చెద. ఆ సతీయు"

మన, నామె "బృహన్నల పవతెల్లయు స్త్రీలకు నర్తనముఁ గఱపి వెడలిపోవును గాన రాత్రులందు నర్తనశాల నిర్మానుష్యముగ నుండును నేటిరాత్రి యొంటరిగ నటకు వచ్చెదని నీయభీష్టమును దీర్తు" నని చెప్పెను. ఆమదోన్మత్తుఁ డవ్వచనముల నానందభరితమానసుఁడై నిజమందిరమున కరిగి, సూర్యాస్తమయమునకు నిరీక్షించుచుండెను. కృష్ణ యవ్వృత్తాంతమును భీమునకు రహస్యముగఁ జెప్పెను.

నాఁటిరాత్రి జనులెల్లరు నిద్రాపరవశులై పిమ్మట భీమసేనుఁడు నిజసతిఁ దోడ్కొని నర్తనశాలకుఁ బోయెను. అనంతర మచటి కాహ్లాదపూరితాంతఃకరణుఁడై కీచకుఁ డరుదేర వృకోదరుఁడు వాని నెదుర్కొనియె. అంతట, కీచకుఁడు పవనతనయునితో నతి ఘోరముగఁ గొంత తడవు మల్లయుద్ధముఁ జేసి పిమ్మట నమ్మహాసత్త్వునిచే నిహతుఁ డయ్యెను. భీమసేనుఁడు ద్రౌపదికా నీచునిశవముఁ జూపించి నేత్రపర్వము సేసి "సుదతీ! నీవిఁకనిటఁ దడయక నంతిపురి కేఁగు" మని చెప్పి తాను మహానస శాలకేఁగి శరీరప్రక్షాళనము చేసికొని శయనించెను.

ఇట ద్రౌపదియు సంతోషపరవశయై నర్తనశాల వెలుపడి కావలివారలఁ బిలిచి "దురాత్ముఁడైన కీచకుని నా పతులు సంహరించిరి చూడుఁ" డన వార లతిత్వరితముగఁ బరుగులిడుచు వచ్చి యా దురాత్ముని కళేబరమును గాంచి సంతోషించిరి. అప్పుడు కీచకుని తమ్ములా కలకలము విని యచటి కరుదెంచి తమ యగ్రజుని శవమునుగాంచి దుఃఖితులై "ఇప్పాపినిమూలముననే యింత ఘోరము జరిగె.

కావున నీవుగూడ మన యగ్రజునితో దహనము సేయుద" మనుచు ద్రౌపదిని బట్టుకొని యాశవము పయిం బెట్టి కట్టి మోసికొని పోవుచుండ నామె కడు భీతినొంది "నాథులారా! గంధర్వాత్మజులారా! ఉపకీచకులు నన్నుఁ దమ యన్న శవముతో దహనము సేయఁ గొంపోవుచున్నారు మీరు వేవేగ వచ్చి నన్ను విడిపింపు" డనుచు నాక్రందనము చేసెను.

వృకోదరుఁ డయ్యాక్రందనము నాలించి త్వరితగమనమున నరుదెంచి యొక్క మహీరుహముఁ బెకలించి చేతఁ బట్టుకొని, ప్రేతభూమి కేఁగుమార్గమున నడ్డముగ నిలిచెను. ఉపకీచకులా రౌద్రమూర్తినిఁ గాంచి భయావేశితులై "గంధర్వులు వచ్చుచుండిరి" యనుచు ద్రౌపది నటఁ బడవైచి పరుగు లిడనారంభించిరి. మారుతాత్మజుఁడు వారలందరిని పట్టుకొని యానూటయేవురిలో నొక్కనిని విడువక నందఱ జమసదనమున కనిపి, ద్రౌపదీబంధమోక్షముఁ గావించి యొకరికిఁ దెలియరాకుండఁ దాను మరల వంటసాల కేఁగి పరుండెను.

ద్రౌపది ప్రమోదభరిత మానసయై సరోజహితుఁ డుదయించిన పిమ్మట సంతోషపూర్వమున నరుదెంచె, మాలిని మూలమునఁ దన తమ్ములందఱును గంధర్వులచే హతులైరని శోకసంతప్తమానసయై యున్న సుదేష్ణ యామెం గాంచి "వంతా! నీ కిఁక మా రాష్ట్రమును విడిచి యెచటికైనఁ బొమ్మని చెప్పెను "దేవీ! ఇఁకఁ బదుమూఁడు దినములు మా [illegible] సిట నుండ [illegible] కరింపుము. పిమ్మట నాపతులు

వచ్చి మీకుఁ బ్రియము చేసి నన్నుఁ గొంపోవుదు" రని ద్రౌపది వినయముతో వచింప సుధేష్ణ యందులకు సమ్మతించెను.

అట సుయోధనుఁడు, అజ్ఞాతవాసముఁ జేయుచున్న పాండవు లెటులైనఁ గనుగొని వారిని మరల నరణ్యవాసమున కనుపనెంచి "సమస్త దేశములు, నరణ్యములు వెదకి పాండవులజాడ నరసిరం" డని చారుల నంపెను. ఆచారులు మహీతలము నంతయు నెమకియుఁ బాండునందనులఁ గనఁగానఁజాలక మరలివచ్చి "అవనీతలేంద్రా! వసుధావలయ మంతయుఁ బరిశీలించితిమి; పాండవులజాడ యెచ్చటను గానరాలేదు. ఒక్క విశేషము మాత్ర మెఱిఁగి వచ్చితిమి. మన వైరియగు మత్స్యభూనాథు బావమఱఁది యొక సుందరిని గామింప నామె పతులగు గంధర్వు లర్ధరాత్రమున నరుదెంచి మల్లయుద్ధము చేసి, యనుజయుతముగ నాతనిఁ జంపి" రని విన్నవించిరి.

అంతఁ గౌరవేశ్వరుఁడు మిత్రామాత్యుల నవలోకించి "కీచకుఁడును, భీముఁడును, బలరాముఁడును, శల్యుఁడును సమానబలవంతులు; మల్లయుద్ధమున వీరలువురిలో నొకరి నొకరు జయింపవలయునేగాని, యన్యులు వీరలఁ జయింప నేరరు. ముష్టియుద్ధమున బక, జరాసంధాదిమహావీరులఁ బరిమార్చిన భీమసేనుఁడే, గంధర్వులను నెపమునఁ గీచకుని వధించియుండనోపు; ఆయువతి ద్రౌపదిగావలయు; పాండవులు విరటునిప్రోల నివసించుచుండిరిగాఁబోలు; మన మిప్పుడు మత్స్యభూమీశుపైకి దాడివెడలి, యాతని గోగణముఁ

పట్టుకొనదమని, విరటునితోఁ బాండవులును రణమున కరు-
దెంతురు. అప్పుడు వారికి సమయభంగముఁ జెప్పి మరలఁ వరణ్యమునకుఁ బంపవచ్చును. పాండవు లచ్చట లేనిచో మత్స్యాధిపుని సమస్తవస్తువులను జూఱగొందము. అన్ని విధముల మన కీసండయాత్ర లాభకారియగు" నని వచింప, నాతనిమిత్రులెల్లఱు నదియే కర్తవ్యమనిరి.

అంతట దుర్యోధనుఁడు తనకు సఖుఁడును, త్రిగర్తదేశ నాథుఁడునునైన సుశర్మనుగాంచి "ప్రియవయస్యా! ముందు నీవు సైన్యయుతముగ నేఁగి విరటుని ధేనువులఁ గొన్నిటిని బట్టుకొనుము." అని చెప్పి పంపించి, మాఱుదినమునఁ దాను భీష్మ, ద్రోణ, కృప, కర్ణాశ్వత్థామాది యోధవరులతోఁ బయనమయ్యెను.

సుశర్మ యపారసేనతోనేఁగి దక్షిణదిశయందున్న విరటుని పశుగణముఁ బట్టుకొన గోపాలురువచ్చి విరటునకు వార్త దెలిపిరి. అంత నతఁడు రోషావేశుఁడై సమరమున కేఁగుచుండ ధర్మరాజాతనిపాలికిఁబోయి "మహీపాలా! నేను మున్నొకఋషివరునికడ ధనుర్విద్యఁ గొంచె మభ్యసించి యుంటిని. మనవలల, దామగ్రంథి, తంత్రీపాలురును కౌశలముగ రణముసేయఁగలరు; కావున వారలఁ గూడి సమరభూమికేతేర నాకనుజ్ఞనొసఁగు" మని పలుకఁ విరటుఁ డలరి యా నలువురిని రథారూఢులఁజేసి రణరంగమునకుఁ దోడ్కొనిపోయెను.

అనంతర మిరువాగులవారు నతిశౌర్యముతోఁ బోరాటము సలిపిరి. సుశర్మ విరటు నెదుర్కొని కొంతతడ వాయోధ

నమునేసి యాతని వాహనసారథులఁ జంపి, విరథుఁడైన మత్స్యనాథునిఁ జెఱబట్టెను. అప్పుడు యుధిష్ఠిర, భీమ, నకుల, సహదేవులు తమ విక్రమము మిఱుఁగు నిశితసాయకములఁ బ్రయోగించి శాత్రవసైన్యమును దైన్యమునొందించి, మత్స్యపతినిఁ జెఱనుండి విముక్తుఁ జేసి, సుశర్మఁ జెఱఁబట్టిరి.

అప్పుడు విరటుఁడు సంప్రీతుఁడై కంకవలల దామగ్రంథి తంత్రీపాలుర శౌర్యముఁ బొగడి "వీరవరేణ్యులారా! మీ కృపవలన నేను శాత్రవులచే మానహానియుఁ, బ్రాణహానియు నొందక మరల విముక్తుఁడనైతి; మీకుఁ గోరిన యభీష్టముల నొసంగెద నడుగుఁ" డని గౌరవపూర్వకముగ వచింప, యుధిష్ఠిరుఁడు "నృపాలా! ఈస్వల్పకార్యమునకు మమ్మింతగఁ బొగడనేల? అయినను నీవు నాయభిమతముఁ దీర్పనెంతువేని యీసుశర్మను సైన్యయుతముగఁ జెఱవిడిచి పుచ్చుము. ఇదియే నా యభీష్ట" మని చెప్పెను. అంత నమ్మత్స్యమహీకాంతుఁడు త్రిగర్తనాథునిఁ జెఱవిడిచి యాధర్మశీలునకు సంతసముఁ గలిగించెను.

ఆసమయమునఁ గౌరవులువచ్చి యుత్తరదిశయందున్న ధేనువ్రాతముఁబట్టి నడచిరి. గోపాలకులు తను జేరి కొమరుఁడైన యుత్తరున కవ్వార్త నెఱింగించిరి. ఉత్తరుఁడు కౌరవులపరాక్రమము నెఱుఁగనివాఁ డగుటవలన వారిని సామాన్యులఁగాఁ దలఁచి "నే నిక్షణమునఁ బోయి కురువాహినిఁ జెండాడి పశువర్గముఁ దోలుకొని రాఁగలనుఁ గాని నాకు, దగినసారథి లేఁడయ్యె;" అనుచు గర్వాతిశయమునఁ బలుక, ద్రౌపది యప్పలుకు లాకర్ణించి, సమయజ్ఞాతవాసవత్సరము

గడచుటఁదలఁచి యుత్తరునితో "రాజనందనా! మన బృహ
న్నల మున్నొకపరి ధనంజయుని కత్యంత ప్రియముగ సార
థ్యము సేయు నే గాంచితి; ఇత్తరి నీకు సారథ్యముసేయ నతఁడే
యర్హుఁడ" ని చెప్పెను. అంత నుత్తరుఁడు బృహన్నలను
రావించి తనకు సారథ్యము సేయుమని యడుగ నతఁ డందుల
కంగీకరించి తేరాయత్తముసేసి తెచ్చెను. సైన్యమంతయు
విరటునితో దక్షిణదిశ కేఁగినందున నుత్తరుఁ డొక్కఁడే
రథారూఢుఁడై రణంబున కేఁగుచుండెను. అప్పుడు రాజ
పుత్రియగు నుత్తర యా యిరువురిని గాంచి "మీరు కురు
వీరులం జయించి వచ్చునప్పుడు వారల శిరోవేష్టంబుల నుత్త
రించి తెచ్చి మా బొమ్మల కీయుఁ" డని చెప్పెను.

బృహన్నల యతిత్వరితముగఁ దేరు నడుపుచుండ నేఁగుచు
నుత్తరుఁడు దూరమునఁ గౌరవవాహినిం గాంచి భయ
కంపితగాత్రుఁడై "బృహన్నలా! కౌరవయోధులం గాంచి
నంతనే నాకు భీతివొడముచున్నది. వారితో నే ననిసేయఁ
జాలను. కావున నీవు మన రథమును మరల్పు" మనియె.
"రాజకుమారా! మన మిప్పుడు మరలిపోయినచోఁ బ్రజ
లెల్లరు నగరే? ధైర్యమూనుము. శాత్రవానీకముం జయించి
గోబృందమును మరల్చి పురికిఁ బోవుద" మనుచు బృహన్నల
మందహాసాంచిత వదనారవిందుఁడై రథము నురువేగమునఁ
దోలసాగెను.

అంత నుత్తరుఁడు "ఈ బృహన్నల నా వచనముల
నంకు సేయక నరదముఁ బరుగెత్తించుచుండె; కానిమ్ము;
వీరి కాకారవులే బుద్ధిసెప్పుదు" రని యోజించి బాణాసనము

వగదముపయిఁ బెట్టి తాను ధరణిపైకి దుమికి పరుగిడఁ దొడఁగెను. ధనంజయుఁ డదిగాంచి తానును స్యందనము దిగవచ్చి యాతనిఁ బట్టుకొని "రాజకుమారా! నీవిట్లు పరుగెత్తి పోవలదు. భీతినుడిగి నాకు సారథ్యము నేయుము. నేను కౌరవులఁ జెండాడెద" నని వచింప, నుత్తరుఁ డాతనిపట్టు విడిపించికొనఁజాలక సారథ్యము సేయ నరదమెక్కెను. అంతటఁ బాండవమధ్యముఁ డాస్యందనమును మున్ను తమయాయుధములఁ దాచిన శమీవృక్షము కడకుఁ దోలించుకొనిపోయి "నృపకుమారా! పాండుతనూజులు తమతమ యాయుధముల నిమ్మహీరుహమున దాచి యజ్ఞాతవాసము సలుప నేఁగిరి. వానిలో ధనంజయుని గాండీవము, గైకొని నేనిప్పు డనినేయ నేఁగెద. కావున నీవిప్పా దపము నధిరోహించి దానిం దెచ్చి యి" మ్మని వచింప నుత్తరుఁడు విషాదముఖుఁడై "బృహన్నలా! పాండవులు మాకు బాంధవులు; అమ్మహానీయులు తమ యాయుధముల నిచట నునిచి యెటకేఁగిరో నీవెఱింగినఁ దెలుపు" మని సస్నేహముగ నడిగెను. అంతట విజయుఁడు కంకవలలదామగ్రంథి తంత్రీపాలురు యుధిష్ఠిర భీమ నకుల సహదేవులనియు, మాలిని కృష్ణయనియుఁ దాను ఫల్గునుఁడనియు, నజ్ఞాతవాసము సలుప నిట్లు మాఱువేసముల దాల్చితిమనియు, గంధర్వుల నెపమునఁ గీచకుల నందఱినిఁ బరిమార్చిన వీరవరుఁడు భీమసేనుఁడనియుఁ దమ వృత్తాంతమంతయు నాతనికి సవిస్తరముగ నెఱింగించెను. ఉత్తరుఁ డవ్వృత్తాంతము విని సంభ్రమాశ్చర్యస్వాంతుఁడై గాండీవముఁ దెచ్చి పార్థున కొసఁగెను. సవ్యసాచి యమ్మహానీయచాపముఁ గేలఁ బూని నియతాత్ముఁడై

జగదీశ్వరునిఁ బ్రార్థింప నప్పేడిరూపముపోయి నిజరూపము వచ్చెను. ఉత్తరుఁ డాదివ్యమూర్తింగాంచి పార్థపులకితాంగుఁడై యమ్మహానీయునకు దండప్రణామము లాచరించి "మహాత్మా! నాభాగ్యవశమున నేఁడీ వృత్తాంతము వింటిని భవదీయ నిజరూప సందర్శనముచే నా భీతియంతయుఁ దొలఁగె; సంతసముతో నీకు సారథ్యము సేయుదు" ననుచుండ ధనంజయుఁ డాతని నాలింగనము సేసికొని "కుమారా! మనస్సాదనము పరిత్యజించి నీవుగఁ గౌరవవాహినికడకుఁ దోలు"మని ప్రియపూర్వకముగఁ బలికి, తన దేవదత్తముం బూరించెను.

ఆ శంఖారావము నాలించి ద్రోణాచార్యుఁడు "దేవదానవుల కజేయుఁడగు విజయుఁడు వచ్చుచుండె" ననఁ దుర్యోధనుఁడు "అర్జునుఁడు వచ్చినచో, సహోదరులఁగూడి మరల నరణ్యమున కేగవలయు," నని పలికెను. అంతఁ బితామహుఁడు పాండవులరణ్యమున కరిగిన దాది నాఁటినుండి గడచిన కాలమును లెక్కించిచూచి పదమూఁడువత్సరములు నిన్నటితోఁ గడిచె నని చెప్పెను.

అంతలో ధనంజయుఁ డరుదెంచి భీష్మద్రోణకృపాచార్యులకుఁ జరణసమీపస్థలములనిలువ రెండును, కర్ణాభ్యర్ణప్రదేశములఁ జన రెండునుగా నాలుగేసి యమ్ములను విడచి, కౌరవవాహినిం గలయఁజూచి తనస్యందనమును గోవులున్న దెసకుఁ దోలనాజ్ఞాపించెను. గురు, కృప, గాంగేయులు, కిరీటిబాణపాతప్రకారములు ప్రణామ, కుశలప్రశ్నములుగా నెఱింగి, యాతనికిఁ దమయెడఁగల గౌరవాతిశయమున కెంతయు సంతసించిరి

అంత నర్జునుఁ డతిరయమున గోవులున్న స్థానమునకేఁగి యచటి సైన్యమును భీభత్సము నేసి ధేనుచయమును మరల్చి గోపాలుర కప్పగించి, కురుపతినెదుర్కొనఁబోవుచుండ భీష్మ ద్రోణ కృప కర్ణాశ్వత్థామాదియోధులెల్ల రాతని కడ్డుపడిరి, సవ్యసాచి నిజకౌశలము మెఱయ వారితోఁ గొంతతడ వాయోధనము సేసి, పిమ్మట సమ్మోహనాస్త్రముం బ్రయోగింప నెల్లఱు సమ్మోహాస్త్రమునకు బద్ధులై మైమఱచి తమ తమ రథములపయిఁ బడిరి. అప్పుడు గాండీవి, యుత్తరయభీష్టముం దీర్పనెంచి యుత్తరునిచే వారలతలపాగలఁ గోయించి తెప్పించెను. మందాకినీనందనుఁడు మాత్రమయ్యస్త్రమునకుఁ బ్రతిసేతెఁగినవాఁడగుటచే నిద్రితుఁడుగాక విజయునెదుర్కొన, నయ్యురువిక్రముఁడు నిశితసాయకములఁబఱపి పితామహుని నొప్పించి రణభూమినివిడిచి యరుగుచుండెను.

అంతలో గౌరవు లందఱును లేచి మగల నాతనితోఁ బోరఁ గనెంచుచుండ సురనదీసూనుఁడు సుయోధను నవలోకించి "ధనంజయుఁడు ధర్మశీలుఁడగుటచే మీరెల్లఱు మైమఱచి పడియున్నపుడు తలలంగోయక కలపాగలఁగోసి తీసికొని పోయె; మగల రణమునకేఁగినచో నతఁడు మనలం బూర్ణాహుతి సేయకమానఁడు. కావున నింకట సమరము చాలించుట యుక్త"మని చెప్పెను. అంతట దుర్యోధనుఁడు భిన్నాంతఃకరణుఁడై తనబలములఁగూడి నిజపురాభిముఖుఁడై వెడలెను.

అనంతరము ధనంజయుఁ డాస్యందనమును శమీవృక్షము కడకుఁ దోలించుకొనిపోయి గాండీవము నచ్చటనునిచి తాను మరల బృహన్నల వేషముందాల్చి "కుమారా! కౌరవులను

నేను జయించితినని యేటికిఁ దెలుపవల"దని యుత్తరునకుఁ జెప్పి యరదముఁ దోలుచు రాజప్రసాదమునకు వచ్చుచుండెను.

విరటుఁ డంతకుమున్నె పరవారయుతుఁడై కోట కరుదెంచి, నిజనందనుండు కౌరవులఁ జయించి వచ్చుచుండెనను వార్త నాలించి సంతోషితాంతరంగుఁడై, యాతని విజయముఁ బురమునఁ జాటఁ బనిచి, యుధిష్ఠిరునితో వినోదముగ జూదమాడుచు "నా కొమరు, డొక్కఁడు నేఁగి కౌరవయోధులఁ జయించి వచ్చుచుండెను. ఇంతటి పరాక్రమశాలియొండైనఁ గలఁడే యనుచు హర్షాతిశయమునఁ బలికెను. "వసుధాధిపా! భీష్మద్రోణకర్ణాదియోధులఁ జయించి ధేనువులం దెచ్చినవాఁడు బృహన్నలగాని, యుత్తరుఁడు గాఁడు. కావున బృహన్నల విజయముఁ బురమునఁ జాటఁ బనుపు" మని యుధిష్ఠిరుఁడు దరహాసితాననుఁడై వచింప, విరటుఁ డుగ్రుఁడై, "నా తనయుని విజయము నసత్యము సేసి పేఁడి జయించెనని చెప్పుదువా?" అనుచుఁ దన హస్తమునందున్న సారె నమ్మహాత్ముని పైకి విసరివైచెను. అది ధర్మతనూజుని ముఖమునఁ గొట్టుకొని రుధిర మొలుకుచుండ నది గాంచి ద్రౌపది తత్తరమున నేతెంచి యాశోణితముఁ గ్రిందఁ బడనీయకఁ దన వస్త్రముతోఁ దుడుచుచుండెను. మహీవల్లభుఁ డది గాంచి "ఇట్లు సేయనేల" నని ద్రౌపదినిఁ బ్రశ్నింప, నాసాధ్వి "ఈ మహనీయుని రక్తబిందువులు ధరణిపై నెన్నిబడిన నన్ని వర్షము లాదేశమున ననావృష్టి సంభవించు; కావున నేను దానిం గ్రిందఁ బడనీయక నాపుచుంటి" నని యాతనికిఁ బ్రత్యుత్తర మొసంగెను.

అంతలో నుత్తరుం డచటికి వచ్చి యుధిష్ఠిరునకు నమస్కరించి యాతని ముఖమునందలి గంటిఁ జూచి "పుణ్యచరితా! ఇదేలఁ గలిగె" నని యడుగ, విరటుఁడు తా నాతనిఁ గొట్టిన విషయము నవిస్తరముగా నెఱిఁగించెను. ఉత్తరుఁడది విని "తండ్రీ! నీ విమ్మహాపురుషుని యెడ గొప్ప యపరాధము సేసితి" వన, విరటుఁడు పశ్చాత్తప్తమానసుఁడై ధర్మతనూజునకుఁ బ్రణమిల్లి "మహానీయా! నా యపరాధము సైచి ప్రసన్నుఁడవు గ" మ్మని వేడెను. "కృపాలా! ఈ మాత్రమునకై నన్నింతగ వేడవలెనా! క్రోధము నా కెన్నఁడును గలుగ" దని యజాతశత్రుఁడు సంప్రీతుఁడై వచించెను. అంతట మత్స్యభూనాథుఁడు కొమరునాలింగనము సేసికొని "కుమారా! నీవు గాంగేయ, కుంభసంభవాది యోధవరులఁ జయించి వచ్చిన విధము నెఱిఁగింపు" మని కౌతుకమున నడుగ నుత్తరుఁడు "జనకా! కౌరవానీకముఁ గాంచిన తోడనే నేను భయాకులితచిత్తుఁడనై వెనుకకు వచ్చుచుండ నొక దివ్యపురుషుఁ డేతెంచి నాభీతి నుడిపి తా నొక్కరుఁ డవ్వాహినినంతయు బీభత్సము గావించి మన పశుగణమును మరల్చె" ననుచు సమర వృత్తాంతము నామూలాగ్రముగఁ జెప్పెను. "తనయా! ఆ మహాపురుషుఁ డిపు డెచట నున్నాఁ" డని విరటుఁ డాతురమున నడుగ, నుత్తరుఁడు "తండ్రీ! అమ్మహాత్ముఁ డొకటి, రెండు దినములలో మరల వచ్చెదనని చెప్పి యెచటికో నేఁగెనని చెప్పెను.

నాఁటిరాత్రి పాండునందను లేవురును, ద్రౌపదియు నొక్కచోటఁ గూడి తమ యజ్ఞాతవాస వత్సరము నిర్విఘ్న

ముగ గడచుటఁ దలంచి సంతసించి, మత్స్యభూపతికిఁ దమ్మెఱిఁగించుకొన నిశ్చయించిరి. అప్పుడు భీమార్జున నకులసహాదేవులు యుధిష్ఠిరు ముఖము నవలోకించి "అగ్రజా! గంటియేలఁ గలిగె" నని యడిగిరి. యుధిష్ఠిరుఁడు దాని తెఱఁగెఱిఁగింప వార లుగ్రులై "ఆమానవాధము నిప్పుడు మర్దించి వచ్చెదము; ఆనతీయు" మనిరి "తమ్ములారా! ఇంతకాలమునుండియు నత్యంత గౌరవముతో మనలం బోషించిన విరటుఁ డిపు డించుక నేరము సేయ మనము సైరింపవలదే!" అని చెప్పి యుధిష్ఠిరుఁడు వారల నుపశమింపఁ జేసెను.

కమలాప్తుఁ డుదయించినతోడనే పాండవులు కొలువుకూటమున కేఁగి, విరటుని సింహాసనమున ధర్మనందనుఁడును, నాతని యిరుపార్శ్వములఁగల యుచితాసనములపై భీమార్జున నకులసహదేవులును నాసీనులైరి. అనంతర మచటికి విరటుఁ డరుదెంచి, తన యాసనమున నుపవిష్టుఁడైన యుధిష్ఠిరు నవలోకించి "విప్రుఁడా! నాగద్దియపైఁ గూర్చుంటివేల" నని గద్దించి యడిగెను. అంత నర్జునుఁడు "మత్స్యనాథా! రాజసూయమహాధ్వరము సేసి, యజాతశత్రుఁడను ఖ్యాతిఁ గాంచిన యుధిష్ఠిర మహారాజీ చిత్రగద్దియ నెక్కఁదగఁడే!" అని చిఱునగవుతోఁ బలుక విరటుఁ డాశ్చర్యస్వాంతుఁడై "ఇతఁడు ధర్మరాజైనచో భీమార్జున నకులసహదేవులును, ద్రౌపదియు నేరి?" అని ప్రశ్నించెను. అంతట ధనంజయుఁడు క్రమంబునఁ దమ్ముండఱి నాతని కెఱిఁగించి, గంధర్వులను నెపమునఁ గీచకులఁ బరిమార్చిన వీరోత్తముఁడు భీమసేనుఁడే యని చెప్పెను. అప్పు డుత్తరుఁ డరుదెంచి "జనకా! కౌర

వులఁ జయించి ధేనుచయమును మరలించిన దివ్యపురుషుఁ డీవిజయుఁడే సుమ్మా! ఈమహామహుం డప్పుడు నీకుఁ దన్నెఱింగింపవలదని యాజ్ఞాపించినందున నొక దివ్యపురుషుఁ డని నీకుఁ జెప్పితి" ననుచు వారల వృత్తాంతమును సవిస్తరముగఁ దెలిపి విరటుని సంశయముఁ దీర్చెను.

అంత నమ్మత్స్యమహీవల్లభుఁ డధికహర్షమునఁ గౌంతేయాగ్రజునకుఁ బ్రణామ మాచరించి, భీమార్జున నకులసహదేవుల నాలింగనముసేసికొని "మహనీయులారా! మందబుద్ధి నగు నేను మిమ్మింత కాలమునుండియుఁ దెలిసికొన నేరనైతి; నాయపరాధము సైరింపుఁడు. మీకరుణా విశేషముననే నారాజ్యమును, ప్రాణమును నిలిచె" ననుచు ననేకవిధములఁ గొనియాడి, విజయు నతిప్రీతిఁ గౌఁగిలించుకొని "మహాత్మా! నాయం దనుగ్రహించి యుత్తరం జేపట్టు" మని యధికంబుగఁ బ్రార్థించెను. "వసుమతీశా! నేను గురుండనై యుత్తరకు నృత్తగీతాది విద్యలం గఱపుటచే నామె నాకుఁ బుత్త్రికాసమురాలు; కావుననే నామెఁ జేపట్టనొల్ల; అక్కన్యకామణిని నాసుతుఁడగు నభిమన్యున కొసంగు" మని కిరీటి వచింప విరటుఁ డతుల కమందానంద మొందెను.

పిమ్మటఁ బాండవులు శమీవృక్షనిక్షిప్తములైన యాయుధములను మరలఁ దెచ్చికొని, యుపప్లావ్యపురమున కేఁగి యట నివసించుచుండిరి. అప్పుడు ద్రౌపదేయులఁ దోడ్కొని ద్రుపదుఁడును, సుభద్రాభిమన్యులఁ దోడ్కొని శ్రీకృష్ణ బలరాములును నప్పురమున కరుదెంచి పాండవులఁగాంచి హర్షపరిప్లుతాంతరంగులై, వారలకు రుచిరాంబరరత్నభూష

ణముల నతిప్రీతి నొసంగిరి.

పిమ్మట మత్స్యభూపతి యుత్తరాభిమన్యులకు మహావైభవముతోఁ బరిణయమహోత్సవముఁ గావించెను.

—♦ ఉద్యోగపర్వము ♦—

పాంచాలమహీపాలుఁడు శ్రీకృష్ణ యుధిష్ఠిరాదులతో నాలోచించి దుర్యోధనుని కడకుఁ దనపురోహితుని దూతఁగా నంపనెంచి యాభూసురోత్తముని రావించి "విప్రవరేణ్యా! నీవు కురుపతిపాలికిఁజని "ద్యూతసమయమునఁ గావించిన యొడంబడికప్రకారమునఁ బాండవులు పండ్రెండేఁడ్లు వనవాసమును, నొక్కయేఁ డజ్ఞాతవాసమును సలిపిరి గావున నిఁక వారిరాజ్యమును వారి కొసంగుఁడు; లేనిచోఁ బాండునందనులు సమరమున మిమ్ములఁ జయించి రాజ్యలక్ష్మిఁ గైకొనకమాన'రని చెప్పిర" మ్మని యాజ్ఞాపించి పంపించెను. పిమ్మట శ్రీకృష్ణబలదేవాదియాదవులు పాండవులనువీడ్కొని నిజపురమున కరిగిరి.

అట సుయోధనుఁడు పాండవులకు రాజ్యమునీయనొల్లక వారితో సంగ్రామముసేయ నిశ్చితుఁడై, కాంభోజ, సౌవీరాదిమహీపాలురఁ దనకు సహాయార్థముగాఁ బిలువ దూతల, బనిచి, శ్రీకృష్ణునిసహాయము నపేక్షించి తాను ద్వారకకరుదెంచెను. ఆసమయమునఁ దేవకీతనయుఁడు నిద్రాసక్తుఁడైయుండ దుర్యోధనుఁడువచ్చి యమ్మహామహుని తలయంపిదెస నున్న తానసమున నాసీనుఁడైయుండెను. అప్పుడు పప్లావ్యమునుండి కిరీటియు వాసుదేవునిసహాయము నపేక్షిం

చివచ్చి, నిద్రాపరవశుఁడైయున్న పద్మనాభునిఁగాంచి వినమ్రుఁడై యద్దేవుని చరణారవిందముల సమీపమున నిలువఁబడియె.

కొంతతడవునకు గోపాలదేవుఁడు మేల్కాంచి, తన యెదుట నిలువఁబడియున్న పురందరనందను నవలోకించి, పిమ్మట సుయోధనునిఁగాంచి, యిరువురిని కుశలప్రశ్నము సేసి, యుచితాసనాసీనులఁజేసి "వచ్చిన కార్యముఁ దెలుపుఁ" డని ప్రియపూర్వకముగ నడుగ న య్యిరువురుఁ దాము వచ్చినపని నెఱిఁగించిరి. అప్పుడు సుయోధనుఁడు "పుండరీకాక్షా! ముందువచ్చినవాఁడను నేనగుటచే లోకము పాడి విచారించి నీవు నాకు సహాయుఁడవుగా వలయు" నని పలుకఁ, వాసుదేవుఁడు "కౌంతేయ్వరా! నీవు ముందువచ్చినది నిక్కముగ ని, నేను తొలుత సవ్యసాచినేగాంచితిని. అందువలన మీ యిరువురకు సహాయము సేయుట నాకుఁ గర్తవ్యము; కావున నాతో సమానబలవంతులును, రణకోవిదులును, నారాయణ గోపాలాభిధానులును నగువారల పదివేవుర నొకరికొసంగెద; వార లొకపక్షమునందుండి కార్యము నేయుదురు. నేను వేఱొకపక్షమున నిరాయుధుండనై, పరమాప్తుఁడనై యుండెద. మీ యిచ్ఛవచ్చినవారలఁ గోరుఁ" డని చెప్పెను. అంతట సవ్యసాచి దేవకీతనయుని, సుయోధనుఁడు నారాయణగోపాలురను గోర, శ్రీకృష్ణుఁడు వారల యభిమతము నెరవేర్చెను. పిమ్మట సుయోధనుఁడు బలరాముని సదనమున కేఁగి సహాయము వేడ నద్దేవుఁడు "సుయోధనా! కృష్ణుఁడు పాండవపక్షపాతియైయుండును; కావున నేనాతనికిఁ బ్రతిపక్ష

ముననిలిచి పోరనొల్లను. నే నీసంగ్రామమున మీ యిరు వాగుల వారికిని సహాయము సేయక దీర్ఘయాత్ర కేగెద" నని ప్రియపూర్వకముగ జెప్పి పంపించెను. పిమ్మట సుయోధనుడు యాదవవీరుడైన కృతవర్మను తనకు సహాయము సేయబిలిచి యాతని యనుగ్రహము వడసి నిజపురమున కరిగెను.

అనంతరము సవ్యసాచి కృష్ణునకు బ్రణామ మాచరించి "పరమపురుషా! నీచే సారథ్యము సేయించికొనగ జిరకాలము నుండియు నా కభిమతముగలదు. నా యభీష్టము నెఱవేర్పు" మని యడుగ, నాథ భక్తవత్సలుడు డమందానందముతో నందుల కంగీకరించి, యాతనిం దోడ్కొని యుపప్లావ్యమున కరుదెంచెను

మద్రదేశనాథుడును, నకులసహదేవుల మేనమామయును నగు శల్యుడు పాండవులకు సహాయము సేయ వేడ్క నుపప్లావ్యమునకు వచ్చుచుండ సుయోధనుడు మార్గమధ్యమున న మ్మద్రమహీపాలునకును, నాతని పరివారమునకును గావలసిన సౌకర్యములన్నియుం దాను సమకూర్చి ప్రవసాగెను. శల్యుడందులకు సంతుష్టాంతరంగుడై "మనకీ సౌకర్యములన్నియు బంపుచున్న వారెవ్వరు? ప్రసాద దానమున కర్హులైన వారల నిచటికిం దోడ్కొనిరం" డని నిజానుచరుల కాజ్ఞాపించెను. అప్పుడు దుర్యోధనుడు శల్యునిపాలి కరుదెంచి, యాతనిచే సన్మానితుడై "సమరమున నాకు సహాయుండవు" గమ్మని యడుగ నతం డందుల కియ్యకొని "కౌరవేశ్వరా! నీవిక గజపురమున కేగుము నేను పాండవులం జూచివచ్చెద" నని

చెప్పి యాతనిఁ బంపించి తా నుపప్లావ్యపురమున కరుదెంచెను.

పిమ్మట శల్యుఁడు పాండవులకడ కరుదెంచి వారిచే సన్మానితుఁడై, కుశలప్రశ్నము సేసి, దుర్యోధనుఁడు తన సహాయముఁ గోరుటఁ దెలుప, యుధిష్ఠిరుఁ డాతనిఁ గాంచి 'అనఘా! కోరినవారికోర్కెఁ దీర్చుట పెద్దలగుణము గావున సుయోధనునకు నీవు సహాయము సేయుట నాకానందకరము; నే నొక్కటి మాత్రము వేడెద; కర్ణుఁడు పార్థునితో సమరము సేయునపు డాతనికి సారథ్యము సేయ నిన్నుఁ గోరెదరు. నీవప్పుడు రాధేయుని మనమునకుఁ గలంక పుట్టునట్టుల నిరాకరించి పరికి గాండీవిఁ గాపాడవలయు"నని కోరెను. శల్యుఁ డందుల కంగీకరించి యుధిష్ఠిరు నాలింగనము సేసికొని "సమరమున విజయుఁడవగుదు"వని యాశీర్వదించి నిజసేనాపరివృతుఁడై హస్తిపురమున కేఁగెను.

మున్ను ద్రుపదునిచేఁ బంపఁబడిన భూసురోత్తముఁడు కరిపురమున కరిగి కౌరవసభయం దుచితాసనాసీనుండై, ద్రుపదుఁడు తనకుఁ జెప్పిన వాక్యములఁ దెలుప, "పాండునందనులకు రాజ్యము నొసఁగుట ధర్మం" బని గాంగేయుఁడును వచించెను. అప్పుడు కర్ణుఁడా ధరణీసురు నుద్దేశించి "కౌరవనాథుఁడు పాండవులకు వెఱచి పుడమిఁ బంచి యిచ్చునా" యని వచింప, ధృతరాష్ట్రుఁడు "విప్రవరేణ్యా! నేను పుత్త్రమిత్త్రవృద్ధామాత్యులతో నాలోచించి పాండవులకడకు దూతసంపెద. నీవు ముం దరుగు" మని చెప్పి యాతనిఁ బంపించెను.

అనంతరము ధృతరాష్ట్రుఁడు సంజయుఁడను నాతని

కౌండవుల పాలికిఁ బంప, నతఁ డుపప్లావ్యమున కరుదెంచి పాండవులను దర్శించి "మహామహులారా! కురువృద్ధుఁడు మీకుఁ దెలుప నాజ్ఞాపించిన వచనములఁ జెప్పెద నాకర్ణింపుఁడు. "ధర్మనందనా! మందబుద్ధియగు సుయోధనుఁడు నా పలుకులనాలించి రాజ్యము నొసంగు వాఁడుగాఁడు. నీ యట్టి ధర్మనిరతుఁ డఖిలప్రజానాశనకరమగు సమరమునకుఁ దలపెట్టుట సమంజసము గాదు. కావున నీవు కార్యక్రమము జక్కఁగ నాలోచించి శాంతి వహింపుము." అని చెప్పి నన్నుఁ బుత్తెంచె" ననుచు సంజయుఁడు ధృతరాష్ట్రుని సందేశముఁ జెప్పెను. "సంజయా! మేము స్నేహము నభిలషించువారమే గాని, కయ్యమునకుఁ గాలుదువ్వువారము గాము. మా రాజ్య మంతయు మా కియ్యనొల్లరేనిఁ గుశస్థలమును, వృకస్థలమును, ఇంద్రప్రస్థమును, వారణావతమును, మాకందియు ననునైదూళ్ళ నైన మాకిచ్చినఁ దృప్తినొందుదుము. ఇట్లు సేయ నంగీకరింతురేని యెల్లవారికి శుభమగు" నని యజాతశత్రుఁడు సంజయునకుఁ బ్రత్యుత్తర మొసఁగి పంపించెను.

అంతట సంజయుఁడు కరిపురమున కరిగి ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు ధర్మతనయుని వచనములఁ జెప్పెను. ధృతరాష్ట్రుఁడు కిరీటిపరాక్రమముఁ దలఁచి భీతినొంది "కుమారా! నీవు పాండవులకు రాజ్యముఁ బంచి యిచ్చుట శ్రేయస్కర" మని సుయోధనునకు హితోపదేశముఁ జేయ నతఁడు దానికంగీకరింపక "భీష్మ ద్రోణ కర్ణాశ్వత్థామాది యోధవరేణ్యులు మన పక్షమున బెక్కుమంది గలరు పాండవులు వీరి నందఱిని జయింప నేర్తురే! అర్జునుని పరాక్రమమునకు నీవు

భీతిల్లఁ బనిలేదు. ఆతనిఁ జయింపఁ గర్ణుఁడు గలఁడు.” అని తండ్రికిఁ బ్రత్యుత్తర మొసంగెను. అప్పుడు గాంగేయుఁడు “సుయోధనా! మీరు ఘోషయాత్రకరిగి గంధర్వులచేఁ బట్టువడినప్పుడును, మొన్న మత్స్యభూమీశుని పశువులఁ బట్టినప్పుడు కర్ణుని శౌర్య మెటకేఁగె? ఈతఁడు ధనంజయు నెంతమాత్రము జయింపఁజాలఁడు. నీవిక నిద్దురాశం ద్యజించి పాండవులకు రాజ్యముఁ బంచి యి” మ్మని వచింపఁ, గర్ణుఁడు రోషావేశుఁడై “పితామహుఁడు నన్ను నిరంతరము నిరసించి పలుకుచుంటఁ గావున, నేనీతఁడు జీవించియున్నంతవఱకు సమరముఁ జేయను. ఈతఁడు పడిపోయిన మీఁదట నేనాయుధహస్తుఁడనై బాహుబలము మెఱయ నని సేయువాఁడ” ననుచు భీష్మునిపయిఁ గల కోపముచే నస్త్రసన్న్యాసము నేసి కొలువుకూటము విడిచిపోయెను.

ధర్మపరతులగు పాండవులు బంధువధము సేయ నొల్లక యొవ్విధముననైన సుయోధనునితో సంధి సేసికొననెంచి మధుసూదను నవలోకించి

క. “ఆపదఁ గడవం బెట్టఁగ
నోపి శుభంబైన దాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకు బాండుఁ
డ్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా.
తే. సమయమిది మిత్ర కార్యంబు చక్కఁజేయ
నీ కతంబున నే మవినీతుఁడైన
యా సుయోధనుతోడి పోరాటఁ దక్కి
యనుభవింతుము మా యంశమగు ధరిత్రి.”

నీకు మేము ప్రద్యుమ్నాదికుమారుల తోడివారము; మమ్ము దురితములు వొరయకుండ నరసి రక్షించు భారము నీయది.

కావున నీవు కరినగరమున కరిగి సుయోధనాదులతో దండ
గిన మాటలాడి సంధి సేయు" మని ప్రార్థింప, వాసుదేవుఁడు
ప్రీతుండై పాండవులకుఁ బ్రియము సేయ నిశ్చితుఁడై తన
ప్రియానుజుఁడైన సాత్యకిఁ దోడ్కొని యాదవసేనాపరివృతుఁడై
గరుడధ్వజ విరాజితమైన యరద మెక్కి గజపురమున కేఁగెను.

శ్రీకృష్ణుని రాక విని దుర్యోధనుఁడు పురమంతయు నలంక
రింప నాజ్ఞాపించి, మిత్రామాత్యబంధువర్గము నద్దేవుని కెదురు
బంపించి గౌరవపూర్వకముగా సభకుఁ దోడ్కొని వచ్చి
యర్ఘ్యపాద్యమధుపర్కాద్యుపచారముల నాచరించి కనకా
సనాసీనుఁ జేసెను. కృష్ణుఁడు భీష్మ ధృతరాష్ట్ర దుర్యోధ
నాదుల నుచితరీతినిఁ గుశలప్రశ్నము సేసి, పిమ్మటఁ బాండవ
విరోధియగు సుయోధనుని గేహమున భుజింపనొల్లక విదు
రుని సదనమున కేఁగెను.

భక్తాగ్రేసరుఁడైన విదురుఁడు వాసుదేవు నతిభక్తిఁ
బూజించి, యిష్టమృష్టాన్నముల నొసఁగి ప్రీతాత్మునిఁ గావిం
చెను. దేవకీనందనుఁడు కుంతీదేవి కుశలము నరసి, యద్దేవికిఁ
బాండవుల క్షేమముఁ దెలిపి యారాత్రి విదురుని సదనమున
శయనించెను.

ప్రభాతమైనతోడనే సుయోధనుఁడు మిత్రవర్గముతోఁ
కృష్ణునికడ కరుదెంచి యమ్మహామహునిఁ దమ మందిరము
నకుఁ దోడ్కొనిపోయెను. వాసుదేవుఁడు కౌరవసభాంతర
మునఁ గనకాసనాసీనుఁడై ధృతరాష్ట్రు నుద్దేశించి "మహీ
నాథా! చిన్ననాఁటనుండియు నీవు పాండవుల నధికప్రేమతోఁ
బెంచినవాఁడవు. కావునఁ బాండవ ధార్తరాష్ట్రులు నీకు

సములు. ఈయిరుపక్షముల వారిలో నెవ్వరు సమరమున సమసినను నీకు సంతాపమే సంభవించును. మఱియు సమరమువలన సకలజనక్షయమగు; ధర్మాధర్మవిదుండవగు నీవు పాండవధార్తరాష్ట్రులకు సమముగా రాజ్యము బంచి యిచ్చి, సోదరకములవలె మీరును వారును గలిసి యుండుట సమంజస" మని వచించెను. "అనఘా! నీవు ధర్మయుక్తములగు వాక్యములు జెప్పితివి; మందబుద్ధియగు సుయోధనుండీ మాటల కంగీకరింపఁడు. నేనేమి సేయుదును? ఎవ్విధముననైన వానికి నీవు హితోపదేశముఁ జేయు" మని ధృతరాష్ట్రుఁడు శ్రీకృష్ణునకుఁ బ్రత్యుత్తర మొసఁగెను. "సుయోధనా! పావనవంశమున జనించిన నీవు దుర్మార్గము నవలంబించుట యుక్తముగాదు. సన్మహాను సుశీల సించుచున్న పాండవులకు రాజ్యముఁ బంచి యిచ్చి, సకల జనానందకరముగా నీరాజ్యమును నీవు పాలించుచుండుము. నీవు పాండవులకు రాజ్యమునీయనొల్లవేని, వారలు సమరమున మిమ్ములఁ జయించి రాజ్యము నవశ్యము గైకొనఁగలరు" రని దామోదరుఁడు గాంధారేయునకు హితోపదేశముం జేసెను. భీష్మద్రోణ గాంధారీధృతరాష్ట్రులును "కుమారా! పాండవులకు రాజ్యము నొసంగు" మని యనేక విధముల నుపదేశించిరి. ఎవ్వరెన్ని విధములఁ జెప్పినను సుయోధనుఁడు మాత్రము పాండవులకు రాజ్యమీయ నొల్లక "మధుసూదనా! పలుమాటలేల? నేను సూదిమొన మోపఁజాలినంతమాత్రపు భూమినైనఁ బంచి యిచ్చువాఁడఁగాను. ఎవ్వరైనను సంగ్రామమున జయించి పుడమి నేల నిశ్చయించితి" నని కృష్ణునకుఁ బ్రత్యుత్తర మిచ్చెను.

మఱియు సుయోధనుఁడు కర్ణ, శకుని, దుశ్శాసనులఁగూడి "పాండవులకు నేడు గడయగు జనార్దనునిప్పుడు చెఱంబెట్టితిమేని, ఱెక్కలు విఱిగిన పులుఁగులఁబోలెఁ బాండవులను సమరమున ననాయాసముగ నిర్జింపవచ్చు" నని యోజించుచుండెను. సాత్యకి వారల దుర్మంత్రము నెఱిఁగి, కృష్ణునితో ధృతరాష్ట్రాదులఁగాంచి

మ. "అదె కౌరవ్యుల శక్తి మగ్గనతఁ జేయంబూని పయిఁబాటెఁ బో
చెదరన్మ్రొక్క దము చేతఁ దీసుకొని జయ శ్రీకాంతు దైత్యాంతకున్
బొదువం దారు దలంచు రెల్ల నసలం బాలంబిరబంధింపఁగా
మదినూహించిన యట్లగాకఁ దమ దుర్మంత్రంబె యాలం బోవునే."

అని వచింప, విదురుం డదరిపడి వైచిత్రవీర్యు నుద్దేశించి

ఉ. "భూవర నీతనూభవులు పుణ్యు నగణ్యపరాక్రము న్మహా
త్మావలమర్త్యుఁ గాఁ దలంచి కట్టినఁ బట్టినఁ దారుమంటపై
వావిరిఁ గ్రమ్ము నాశలభవర్గము చాడ్పున మండిపోరె కా
లావధియయ్యెఁ గావలయు నక్కట వారికి వారి వారికిన్."

అని పెద్దయెలుంగునఁ బలికెను. అప్పుడు ధృతరాష్ట్రుఁడు కుమారుఁ బిలిచి "సుయోధనా! నీవిదుర్బుద్ధిం ద్యజింపు" మని మందలించెను. మధుసూదనుఁడు మందస్మితవదనారవిందుఁడై సుయోధను నవలోకించి "నేనొక్కఁడనని తలంచి పట్టనెంచితే" యనుచుండ నద్దేవుని ఫాలప్రదేశమున బ్రహ్మయు, వక్షమున విరూపాక్షుఁడును, వదనమున వహ్నియు, పార్శ్వములనింద్రయమవరుణ కుబేరాదులును నుద్భవించిరి. దుర్నిరీక్ష్యమై ప్రకాశించుచున్న యా దివ్యతేజోరూపముఁ జూడఁజాలక సకల జనములు నయనములు మొగిడ్చి యద్భుతభయానక రసములఁ జొత్తిల్లు చిత్తములతో నిశ్చేష్టితులై యుండిరి. పరమభాగవతులగు భీష్మ, విదురాదులు

మాత్రము విశ్వరూపధరుఁడైన శ్రీకృష్ణునిఁ గాంచి సాంద్రానంద మునఁ దేలుచుండిరి. అప్పుడు బృందారకులు వాసుదేవునిపయిఁ గుసుమవర్షముఁ గురియించిరి.

క. కరుణింపుము సంశ్రితభయ
హరణధురీణా సహింపు మజ్ఞానంబున్
శరణంబు వేఁడెద భవ
చ్చరణంబుల ననుఁగరం బ్రసాదింపఁగదే."

అని ధృతరాష్ట్రుఁడు వాసుదేవునిఁ బ్రార్థింపఁ సమ్మహానుభావుఁడు ప్రీతుండై యాతనికి నయనములు నొసంగెను. ధృతరాష్ట్రుఁడా దివ్యమూర్తినిఁ దనివిదీర నవలోకించి "జగదీశ్వరా! నిన్నుఁ గాంచిన నేత్రములతో నితరులఁ జూడనొల్ల, ఇఁక నాలోచనములను సంహరింపు" మని వచింపఁ, గృష్ణుఁ డాతని నెప్పటియట్లు గావించెను. అనంతరము వాసుదేవుఁడు నిజవిశ్వరూప ప్రపంచము నుపసంహరించి, కుంతీసదనమునకరిగి, కౌరవసభయందు జరిగినవిశేషముల నామె కెఱింగించి, యామె యాశీర్వాదములతో సెలవుఁ గైకొని యుపప్లావ్యమునకుఁ బయలుదేరెను.

కృష్ణుఁడు రథారూఢుఁడై, తన్నుఁ బంపవచ్చిన భీష్మ ధృతరాష్ట్రాదుల నవలోకించి "మీరలిఁక నిలువుఁ" డనిచెప్పి, కర్ణునిఁ గాంచి "నన్ననిచివత్తుగాని ర"మ్మని యాతని హస్తముఁ బట్టుకొని యరద మెక్కించికొని కొంత దవ్వరిగి "మిత్రమా! నీవు జనులెల్లఱు దలచునట్లు సూతసుతుండవు గావు. కన్యాత్వమునఁ గుంతి నిన్ను సూర్యునివరమునఁ బడసె; అక్కారణమున నీవు పాండునృపాలున కగ్రసుతుండవైతివి. నీవిప్పుడు కౌరవులను

విడిచి నీయనుజులకడకు వచ్చెదేని నిన్ను సామ్రాజ్యమునకు నభిషిక్తుఁ జేయుదు. యుధిష్ఠిరాదు లనుజులు నిన్ను సేవింతురు; పాంచాలరాజపుత్త్రి నీకుఁ బత్ని యగు. కావున నీవు నీతమ్ముల పాలికరుగుదెంచి మహేంద్ర విభవముతో మహీతల మేలు" మని రహస్యముగఁ జెప్పెను. "పుండరీకాక్షా! కొన్ని దినముల క్రిందట నే మదీయ జననవృత్తాంతము నెఱింగితి. అయినను, సుయోధనుఁడు పిన్ననాఁటనుండియు నన్ను హీనసూతుఁ డని చులకన జేయక రాజ్యాభిషిక్తుఁ జేసి యథోక్తరీతి నాదరించుచు, సమరమున ధనంజయునిఁ గెలువఁగలవాఁడను నేను యని విశ్వసించి పాండవులతో వైరముఁ బెంపెక్కె. నేనిప్పుడాతనిని విడిచి పాండవుల కడకేఁగుట పాడిగాదు. అట్లు నేనిటనేని దుర్యోధనునకు వెఱచి పాండవులఁ గలిసితినను నపయశమును వాటిల్లు; కావున నేను సుయోధనుని విడిచి రానొల్లను. ధర్మనిరతుఁడగు యుధిష్ఠిరుఁడు నే నగ్రజుఁడ నని యెఱింగెనేని రాజ్యాభిషేకమున కంగీకరింపఁడు. కావున నీ విరహస్యము నెవరికిఁ దెలుపవలదు. నీసహాయమున నజాతశత్రుఁడు కౌరవులఁ జయించి మహీతలము నేలుఁ గాక" యని పలికి కర్ణుఁడు వాసుదేవు నాలింగనము సేసికొని యమ్మహానీయుని సెలవుఁ గైకొని రథావతరణము సేసి నిజ సదనమున కరిగెను. కృష్ణుఁడు సాత్యకీ సహితుఁడై యుపప్లావ్యమున కరిగి, జరిగిన వృత్తాంతమంతయుఁ బాండవుల కెఱింగించి యిక సామమునఁ గార్యము చక్కఁబడదని చెప్పెను.

అంతట యుధిష్ఠిరనృపాలుఁడు ధార్తరాష్ట్రులతో సమరము సేయ నిశ్చితుఁ డయ్యెను. ఆతనికి సహాయార్థము మగధ, చేది,

పాండ్య, కేకయ, పాంచాల, మత్స్యభూమిపాలురు దమతమ బలములతోఁ జనుదెంచిరి. ఆసైన్యమంతయు నేడక్షౌహిణులయ్యెను. ధర్మరాజు శ్రీకృష్ణునుమతము వడసి ద్రుపదసేనకంతకును, శాత్రవభయంకరుండగు ధృష్టద్యుమ్ను నధిపతిగా నభిషేకించెను.

ఇట్లు సమరసన్నాహములు జరుగుచుండ నొకనాడు కర్ణుండుపస్థానార్థము భాగీరథీతీరమున కరిగిన సమయమున నచటికిఁ గుంతీదేవి యరుదెంచెను. కర్ణుఁడామెకుఁ బ్రణామము సమర్పించి "వచ్చిన కార్యము సెలవిండు" మని యడుగ నద్దేవి "కుమారా! నీవు భాస్కరానుగ్రహమున నాకు జనించినవాఁడవుగాని, రాధాసుతుఁడవుగావు. కావున నీవు కౌరవ్యులను విడిచి సోదరులఁ గూడి జయశ్రీవిభాసితుండవై సార్వభౌమచక్రము నేలు" మని వచించెను. "జననీ! నీవు నన్నుఁ బుట్టినతోడనే త్యజించితివి. నా జన్మ మతి రహస్యమై యున్నది. ఇప్పుడు కౌంతేయుండ ననుచు పాండవులఁ జేరితిని, ధనమానములకు మెచ్చి వారిఁ గూడితినను నపయశము నేనొందను. సుయోధనుఁడు మొదటినుండియు నన్నాదరించెను. ఆ సుయోధను నిట్టిసమయమున విడుచుట ధర్మముగాదు. కావున నేను పాండవులతో సమరము సేయుట తప్పదు; అయినను నీవిటు కరుదెంచితివి గావున నొక్కప్రియము నొసఁగెద; యుధిష్ఠిర భీమ నకుల సహదేవులు నాచేతఁ జిక్కినను వారలఁ జంపక విడచెద. ఈసమరమున నేనర్జునునిఁ జంపుటయో, లేక నేనాతనిచేతఁ జచ్చుటయో నిక్కము. ఎటులైనను నీకుఁ దనూజు లేవురే గాని, యాఱ్వురను తలంపు విడువు" మని కర్ణుఁడు కుంతీదేవికిఁ బ్రత్యుత్తరమొసఁగి యామె సెలవుఁ

గైకొని నిజ నివాసమున కేఁగి, సుయోధన హితార్థము సమర ప్రయత్నములఁ జేయుచుండెను.

దుర్యోధనునకు సహాయార్థము మద్ర, కాంభోజ, సాల్వ, త్రిగర్త, కోసల, గాంధార, సింధు, సౌవీర, మాహిష్మతి, యవంతీ దేశ భూపతులు తమతమ బలములతో నరుదెంచిరి. ఆ సైన్య మంతయుఁ బదునొకండ క్షౌహిణులయ్యెను. దుర్యోధనుఁ డవ్వాహిని కంతకును భీష్ముని సేనానిగా నభిషేకించెను.

అనంతర మయ్యిరు వాగుల వారును దమతమ చతురంగ బలములతోడను శంఖభేరీమృదంగాదినిస్వనములతోడను బయలుదేరి, కురుక్షేత్రమున కరుదెంచి, యందు తృణ, కాష్ఠ జలసమృద్ధము లయిన రమణీయప్రదేశముల విడిసిరి.

కౌరవపాండవులు కయ్యమునకుఁ గడంగిరని బలరాముఁడు విని కురుక్షేత్రమునకుఁ బోయి యిరువాగులవారినిగాంచి "నేను ఘోరసంగ్రామముఁ జూడఁజాలకఁ దీర్థయాత్ర కేగుచుంటి" నని చెప్పి వారలను వీడ్కొని సరస్వతీ తీర్థమున కేఁగెను.

అనంతర మయ్యిరు వాగులవారును దమతమ సేనలకును సేనాపతులకును రేపు సంగ్రామమని చెప్పి సమస్త సాధనములు నాయితములు సేయుచుండిరి.

అప్పుడు సుయోధనుఁడు గాంగేయు నవలోకించి స్వపక్ష, పరపక్ష వీరుల సామర్థ్యము నడుగ నద్దేవవ్రతుఁడు "దుర్యోధనా! భీముఁడును, విజయుఁడును, నభిమన్యుఁడును, సాత్యకియు, ద్రుపదుఁడును, ధృష్టద్యుమ్నుఁడును మొదలుగాఁగల యోధా

గ్రేసరులు పాండవపక్షమునఁ గలరు. వీరలు వైరుల కజేయులు! ద్రోణ, కృప, కర్ణాశ్వత్థామాది వీరవరేణ్యులు సబలమునఁ బెక్కండ్రు గలరు. నేను నీవు మెచ్చునటులఁ బాండవపక్షమునఁ గల యోధశ్రేష్ఠులందరితో రణము సేయఁజాలుదు. పాంచాల రాజనందనుఁడైన శిఖండితో మాత్రము సేయనొల్ల" నని చెప్పెను. "పితామహా! శిఖండిని జంపనొల్లమి కేమికారణము" మని సుయోధనుఁ డడుగ, శంతనసూనుఁడు "కుమారా! తొల్లి నేను విచిత్రవీర్యునకు వివాహము సేయ నెంచి, కాశీరాజు తన కూఁతులకు స్వయంవరోత్సవము సేయుచుండ నచటి కరిగి యాతని కుమార్తెల ముగ్గురఁ దెచ్చితి. అప్పు డాముగ్గురిలోఁ బెద్దదైన యంబ నన్నుఁగాంచి "నామనసు మిదివఱకే సాళ్వుని పయిఁ దగిలియుండెఁ గావున నీవు నన్నాతనిపాలికిఁ బంపుట ధర్మ" మని వచించెను. నే నంతట సాళ్వునికడ కామె ననిపి, యంబికాంబాలికలను విచిత్రవీర్యునకు వివాహము సేసితి. అంబ సాళ్వునికడ కేఁగి తన్ను వరింపుమని యడుగ నతఁడు "విచిత్రవీర్యునకుఁ బెండ్లి సేయ నిశ్చయించి గాంగేయుఁడు నిన్గొనిపోయెఁ గావున నేను నిన్నుఁ బరిగ్రహింప నొల్ల" నని యప్పు డతని వెడలఁ గొట్టెను. అంత నాయంబ మఱియు గురుమాన్యుఁడైన పరశురాముని పాలికిఁ బోయి, నావలనఁ దనమనోరథము భగ్నమయ్యెనని విలపింప, నమ్మహానీయుఁ డామెను వెంట నిడుకొనివచ్చి నన్నుఁ బిలిచి "ఈమెను విచిత్రవీర్యునకు వివాహముసేయు" మని యుపదేశించెను. పరానురక్తచిత్తయగు నక్కాంతను నాయనుజున కెట్లు వివాహము సేయుదునని నేను దానికంగీకరింపనందున, భార్గవుఁడు

నాపయిఁ గోపించి సమరము సేయ నుపక్రమించెను. అంతట నేనును సమరసన్నద్ధుఁడనై నిలిచి భార్గవునితో నిరువదిమూఁడు దినము లుగ్రముగఁ బోరితిని. అప్పుడు నారదాదిమహాత్ములు నరుదెంచి నాయెడ దపరాధము లేదని చెప్పి భార్గవుని శాంతచిత్తుఁ జేయ నమ్మహాత్ముఁడు ప్రసన్నుఁడై సమరము చాలించి మహేంద్ర నగరమున కరిగెను. అనంతర మా యాంబ నన్నుఁ జంపఁ దలంచి విపినమున కేఁగి యుగ్రతపమాచరించి హరుని మెప్పించి, మఱుజన్మాంతరము నన్నుఁ జంపునట్లు వరము వడసి యాత్మహత్య గావించి, ద్రుపదునకు స్త్రీరూపమునఁ జనించెను. ద్రుపదుఁడు తనకు పుత్త్రుఁడు జనించెనని యెల్లెడలఁ జెప్పి కుమారుఁ డుదయించెనని చెప్పుచు దానికి శిఖండి యని పేరిడి కొంతకాలమున కొక రాజపుత్త్రినిఁ దెచ్చి దానికి వివాహ మొనరించెను. కొంతకాలమునకు రహస్యము వెల్లడిగాఁ నక్కన్యాజనకుండు ద్రుపదునిపై కెత్తివచ్చెను. అప్పుడు శిఖండి స్థూణకర్ణుఁడను నొక యక్షునిఁ బ్రార్థించి పురుషత్వము నొందివచ్చి తన శ్వశురుని సంశయముఁ దీర్చి మామనుఁ బంపి యనుగ్రహము వడసెను. శిఖండి తన జీవితకాలమున నిట్లు పురుషరూపమున నుండి మరణసమయమున మరల స్త్రీరూపమొందఁగలఁడు. వీని జననప్రకారమిట్టి దగుటచే నే నయ్యంగనాపురుషునితో నని సేయనొల్ల" నని శిఖండివృత్తాంతమును సవిస్తరముగఁ జెప్పెను.

—* భీష్మ పర్వము *—

మఱునాఁటి యుదయమున గంగానందనుఁడు మానుష వ్యూహముఁ బన్ని తాలధ్వజ విరాజితమైన యరదమధిరోహించి

తా నగ్రభాగమున నిలిచి కౌరవవాహిని నతి చతురముగ నడిపించి కొనుచు సమరమున కరుదెంచెను. అటఁ బాండవసేనాపతియైన ధృష్టద్యుమ్నుఁడును తనవాహిని నచలవ్యూహముగఁ బన్ని రయమున నడిపించుచు సంగరమున కరుదెంచెను. ఇటుల నుభయవీరబలములనాయకులు కవచకార్ముకధారులై స్యందనారూఢులై, నిజధ్వజములు విరాజిల్ల, మణిమకుటములు మెఱయ, భేరీమృదంగాది నిస్వనములు సెలఁగ నడచి, కురుక్షేత్రమున నుత్తమప్రదేశమగు శమంతపంచకమున నెదురొడ్డి తమతమ శంఖములఁ బూరించిరి.

అప్పుడు ధర్మపుత్రుఁడు తన శరాసనము నరదమునఁ బెట్టి పాదచారియై భీష్మునిపాలికిఁ బోవుచుండ నాతని వెంటఁ బాండవులును, శ్రీకృష్ణుఁడును నరిగిరి. ధర్మతనూజుఁడు పితామహునకుఁ బ్రణామము సేసి

ఆ. "అనఘ నీకెదుర్చ ననిసేయువాఁడనై
మున్న నాజ్ఞఁ గొనఁగ నిన్నుఁ గాన
వచ్చినాఁడ నీచేత దీవన
వడసి చనిన నేను బడయుఁ గెల్పు."

అని వినయమున వచింప శాంతనవుఁడు ప్రీతుఁడై "కుమారా! సమరమున విజయుఁడవగు" మని దీవించెను. "పితామహా! నిన్నుఁ జయించు నుపాయము నుపదేశింపు" మని ధర్మతనయుఁడడుగ దేవవ్రతుఁడు "కుమారా! ఆయుధపాణినై యుండ నన్ను నిమిషులు సైతము నిర్జింపఁజాలరు. నన్ను జయించువిధము నింకొకదినమునఁ జెప్పెద" నని వచించెను. పిమ్మట ధర్మరాజు ద్రోణాచార్యునికడ కేఁగి వందనము సేయ నతఁడు ప్రీతచిత్తుఁడై "జయలక్ష్మిఁ

గైకొను"మని దీవించెను. "గురువరేణ్యా! నిన్ను జయించు తెఱఁగు నానతి"మ్మని యుధిష్ఠిరుఁ డడుగ "కుమారా! ఆయుధహస్తుఁడనై యున్నంతవఱకు నన్నెవ్వరును జయింపఁజాలరు. సత్యసంధుఁడగు నావలన నధిక దుస్సహమైన మాట వింటి నని యేను బ్రాయోపవేశమున సన్న్యస్తశస్త్రుండనగుదు. అప్పుడు నన్ను వధింపననువగు"నని ద్రోణుఁడు స్వవధోపాయము నెఱిఁగించెను. అనంతరము ధర్మతనయుఁడు కృప, శల్యుల కడకుఁబోయి వారి దీవెనలం బడసివచ్చి తనయరదము నధిరోహించి యుద్ధసన్నాహ హస్తుఁడై నిలిచెను. భీమార్జున నకుల సహదేవులును దమతమ యరదముల నధిరోహించి విల్లమ్ములు గెలుపుఁబూని నిలిచిరి.

అప్పుడు కిరీటి తన గాండీవముం గైకొని గుణంబు సారించి సోదర, సుత, పితామహ, మాతులాచార్యాదులగు బంధుశ్రేష్ఠ జనముల నవలోకించి పరమకృపావేశమున నత్యంతవిషాదము నొంది తనకు సారథ్యము సేయుచున్న వాసుదేవునిఁ గాంచి,

చ. "సరసిజనాభ బంధుజనసంతతిఁ గయ్యపు నేలఁ జూడఁగా
విరవిరఁబోయి మేను నిడువెండ్రుక నెట్టుచుఁ గంపమొందెఁ జే
నిరతము గాదు గాండివము నిల్వఁగ నోర్వవు గాళ్ళు నేను ని
ష్ఠురతకుఁ జాలనొల్ల నొకఁడుఁ గెల్చి మహి నేలుట యేటి సౌఖ్యముల్.

ఉ. తాతల మామలన్ సుతులఁ దండ్రులఁ దమ్ముల నన్నలన్ గురు
వ్రాతము శిష్టకోటి సఖివర్గముఁ దుష్టజనానురూప దు
ర్నీతి వధించి యేఁ బడయు నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగముల్
ప్రీతి యొనర్చునే యశము పెల్లొగఁ గూర్చునె పెంపొనర్చునే.

కావున నేను సమరము సేయనోప" ననుచు శోకవిహ్వల మానసుఁడై గాండీవము విడిచి రథముపయిఁ గూలఁబడియె.

అప్పుడు మురమర్దనుఁడు సవ్యసాచి నుద్దేశించి "ధనంజయా!

క. సమరంబు రాజులకు ను
త్తమకర్మంబది యపావృత స్వర్గద్వా
రము సుమ్ము లెమ్ము దగఁ గ
య్యము సేయుము దీని కేల యనుమానింపన్.

క. ఫలముల గోరక బ్రహ్మార్పణ
కలనపరుండవగుచుఁ గార్యకర్మము సల్పన్
వలయుం దత్త్వజ్ఞానము
తలకొనినం గర్మశమము దానై కలుగున్."

అనుచు కర్మత్యాగధర్మమును దత్త్వజ్ఞానమును బెక్కువిధము లను బోధించి అన్యులకు గోచరముగాని దివ్యరూపమున నర్జునునకుఁ దన విశ్వరూపమును జూపి "నన్నుఁ గొలిచి యుద్ధము కావింపుము. ఇచ్చట నీ సకలరాజసమూహమును నే ముందే సంహరించితి. నీవు నిమిత్తమాత్రుఁడవు. భీష్మద్రోణాదులెల్లను వధింపబడు వారలే. నాచేతం జచ్చినవారి నెల్లను జంపుచు నిమిత్తమాత్రుఁడవు గమ్ము. లెమ్ము. రాజ్యము గైకొను" మని బోధించెను. అప్పుడు విజయుఁడు వాసుదేవునకు పునః పునః ప్రణామము లాచరించి "విశ్వరూపధరుండవైన యచ్యుతా! నాయందు కరుణవహించి సామాన్యమానవుండవుగ మున్ను నిన్ను సఖుండనయు, బావవనియు భావించి సల్లాపము లాడుచుందును. నా యజ్ఞానము సైరింపు" మని ప్రార్థింప నద్దేవుఁడు ప్రీతుఁడై విశ్వరూపమును విడిచి శ్రీకృష్ణరూపముఁ దాల్చెను.

ఇట్లు విజయుఁడు వాసుదేవునిచే జ్ఞానోపదేశము నొందినవాఁడై రణోత్సాహయుక్తుఁడై గాండీవము గైకొని గుణధ్వని సేయఁ దొడఁగెను.

అనంతర మిరుగెలములవారును నధికోత్సాహముతో నొండొరు లం దాకి శరవర్షము గురియించుచు తమతమవిక్రమము మెఱయ నని సేయసాగిరి. దుర్యోధన ప్రేరితుండై భీష్ముఁడు నాఁడు ననన్యసామాన్యునివలె విజృంభించి పాండవబలములం గుందఁజేయుచు గాసిం బొందించెను. ఇట్లు కౌరవులును పాండవులును దిననాథుఁడు పశ్చిమాంబుధిఁ గ్రుంకువఱకును సమరము సేసి పిమ్మటఁ దమతమ నివాసముల కేఁగి విశ్రమించిరి.

ప్రభాతంబైన పిమ్మట ధర్మతనయునిచే ననుజ్ఞాతుండై ధృష్టద్యుమ్నుఁడు పాండవవాహినిని క్రౌంచవ్యూహముగ నిల్పి సమరాభిముఖుండయ్యెను. భీష్ముఁడు సర్వసేనాధిపతియై నడిపింపఁ గౌరవులును సహర్షోత్సాహులై రణాంగమునకుఁ జనుదెంచిరి. అప్పుడు విజయుఁడు శ్రీకృష్ణు నవలోకించి

మ. "ఘనసేనం గలఁగంగఁ జేయుచు మదిన్ మందాకినీ నందనుం
డు నిరుంగొనకున్న వాఁ డితని యాటోపంబడంగించెదన్
నిను మెప్పించెదఁ జూడు ఖేచరులు వర్ణింపన్ విజృంభించెదన్
దనుజధ్వంసి రథంబు లేపఱుపు ముద్యద్వ్యాఘ్రకను ప్రక్రియన్."

అని వచింప, కృష్ణుఁడు మందస్మితవదనారవిందుఁడై, కపిధ్వజ, శ్వేతహయములచే నలరారు నద్దివ్యరథమును గాంగేయుని దెసకుఁ దోలెను. అంతట భీష్మార్జునులు భీకరముగ సంగ్రామము సేసిరి. అప్పుడు ద్రోణ, కృప, శల్య, దుర్యోధన, వికర్ణులు భీష్మునకు సహాయులై ధనంజయునిపై ననేక సాయకములఁ బఱపసాగిరి. కిరీటి యందఱకన్న మిన్నయై నిజశౌర్యము విరాజిల్ల నని సేయుచుండెను. సాత్యకియు, నభిమన్యుఁడును, ద్రౌపదేయులును

ధనంజయునకుఁ దోడ్పడిరి. ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునితోఁ బోరఁ దొడఁగెను. భీమసేనుఁడు విజృంభించి కళింగభూమిపాలునిఁ దాఁకి సమరమున సంహరించి, యాతని యనుజుఁడగు భానుమంతునిఁ జం పెను. ఇవ్విధముగ నుభయపక్షముల వారును దమతమ పరాక్రమము చూపుచుఁ బవలెల్ల నాయోధనము సేయుచు, వారిజ మిత్రుం డస్తగిరి శిఖరమునకుఁ జేరఁ బిమ్మట సమరము చాలించి తమతమ శిబిరముల కేఁగి విశ్రమించుచుండిరి. ఉభయపక్షముల సైన్యంబును సంఖ్యాతీతముగ రణావనిం ద్రెళ్ళుచుండెను.

ఎనిమిదవనాఁటి రణమున, ధనంజయుని సుతుండును, భుజగ రాజదౌహిత్రుండును నైన యిరావంతుఁ డలంబుసుఁడను రక్క సునిచే మృతుఁడయ్యెను. సునాభుండును, నాదిత్యకేతుండును, నప రాజితుండును, బహ్వాశియుఁ బండితకుండును, కుండధారుండును, విశాలాక్షుండును, మహోదరుండును నను ధృతరాష్ట్రతనూజు లెనమండ్రును వృకోదరునిచే నిహతులైరి.

సుయోధనుఁడు తన యనుజుల మృతికి వగచుచు నాఁటిరాత్రి గాంగేయుని పాలికిఁ బోయి

మ. “నిను మున్నంతయు నమ్మి పాండవుల యున్మేషంబునేఁ జీరికిం
గొననీపోరెడు చందముల్ దెలియఁ జెక్కుల్ సూచితిం జేరి చే
రి నయంబిచ్చుచునోంపమాల్కొనకవారిం బట్టి పోలార్చెదోం
డన నేరంగురు ముఖ్యయింక నిటనీవాలంబు సాలింపవే.”

చ. అని మొనదేవ దానవుల కైనను మార్కొనరాదు నిన్ను నేఁ
డెనిమిదినాళ్లు లయ్యె సమయింపవు నోంపవు సవ్యసాచిన
ప్పని యటులుండనిమ్ము నినుఁ బ్రార్థన సేసెద నింతవట్టు నా
చనువునఁ బోవనిచ్చి నృపసత్తమ పోరికిఁ గర్ణుఁ బంపవే.

అని పలికెను. అవ్వచనములు పితామహుని మనమును శూలములవలెఁ గాఁడ గద్గదస్వరంబున నిట్టూర్పు నిగిడించి సుయోధను నవలోకించి

సీ. "కాల్పఁడే మహనీయఖాండవం బింద్రుని
 నమరగణంబుతో విముఖుఁ జేసి
బహుదివ్యశరములు వడయఁడే యొక్కటి
 బవరాన మెప్పించి శివుని చేత
గంధర్వులకు నోడి కర్ణుండు నీ తమ్ములును
 బాఱ విడిపించికొనఁడె నిన్ను
నిను నను ద్రోణు నాతనిపుత్రుఁ గృపుఁ గర్ణు
 గెలిచి విరాటుగోవులఁ గొనండె
ఆ. తక్కుపెక్కులెడలఁ బెక్కండ్ర నేమేమి
 సేసె వినమె యట్టి నెట్టి నిన్ని
దినములిట్లు దొడరి పెనఁగియు నీచేత
 నేఁడు వినఁగవలసె వేడిపలుకు."

దైవబలసంపన్నులగుపాండవులఁ గెలువశక్యముగాదని మేమెన్ని విధములఁ జెప్పినను వినక వారలతో రణమునకు గడంగితివి. నేనుశక్తివంచనలేక పోరాడుచుంటి నింకేమి సేయఁగలవాఁడ? అయినను నేఁటి సమరముఁ జూడు" మని చెప్పి పంపించెను.

తొమ్మిదవనాఁటి యుదయమున నుభయపక్షములవారును, భేరీభాంకారశంఖాది నిస్వనగర్జాస్ఫూర్జిత బహుళముగా నొండొరులఁ దాకి పోరఁదొడఁగిరి. పితామహుఁడు విజృంభించి పాండవసైన్యముఁ జెండాడుచుండఁ గపికేతనుఁ డమ్మహనీయు నెదుర్కొని వాడినారాచములం బ్రయోగింపసాగెను. మందాకినీ

నందనుఁడును గాండీవిపై నిశితసాయకములఁ బ్రయోగించి యాతనిని నొప్పించుచుండెను. అర్జునుఁడు కొంచెము డస్సినటులఁ గానఁబడినతోడనే దేవకీనందనుఁడు రోషపరవశుఁడై "నేనీక్షణ ముననే భీష్మునిఁ జంపి, సవ్యసాచికి జయముఁ గూర్చెద" ననుచు ధరణిపై కుఱికెను. గాంగేయుఁ డదిగాంచి "అనంతా! శీఘ్రముగ వచ్చి నన్నుఁ గడతేర్చి పరమపదము నొసంగు" మని ప్రార్థింపఁ దొడఁగెను. అప్పుడు కిరీటియుఁ బుడమిపై కురుకి జనార్దనునిఁ బట్టుకొనిఁ "దనుజభంజనా! నీవు మున్ను రణమునఁ గయ్యము సేయనని ప్రతిజ్ఞ సేసి, యిప్పుడు సంగరమునఁ కేఁగినఁ బ్రజ లేమందురు? నీయట్టి మహానుభావుఁ డాడినమాటఁ దప్పవచ్చునా? నా ప్రార్థన నాలించి యీ ప్రయత్నము మానుము" మని వేడఁ, గృష్ణుఁడు ప్రీతుఁడై మరల నరద మధిరోహించి విజయునకు సారథ్యము సేయఁదొడఁగెను. విజయుఁడు మరల విజృంభించి సమరము సేయఁదొడఁగెను. ఆనాఁటి రణమునఁ బాండవవాహిని నంతయు భీష్ముఁడు బీభత్సము సేసెను. అంశుమంతుఁ డస్తాద్రిం జేరినపిమ్మట నిరుబలములవారును సమరము చాలించి తమతమ శిబిరముల కేఁగిరి.

ఆ నాఁటి రాత్రి యుధిష్ఠిరనృపాలుఁడు తన వారెల్లరుఁ బరిశ్రాంతులై భీష్మునెదుర్కొనఁజాలరైరని చింతించి వాసుదేవునితో నాలోచించి, యనుజ సమేతుఁడై రహస్యముగ భీష్ముని శిబిరమున కేఁగెను. పితామహుఁ డత్యాదరమునఁ బాండవుల సేమము నడిగి "వచ్చిన కార్యము నెఱిఁగింపుఁ" డన, ధర్మనందనుఁడు దీనాననుండై "పితామహా! మాయెడఁ గరుణాళుఁడవై మాకు

జయము సేకూరుసుపాయము నుపదేశింపు" మని వేడెను. గాంగే యుఁ డవ్వచనములకుఁ బ్రీతుఁడై "ధర్మనందనా! నన్ను జయించినఁ గాని నీకుఁ జయము సేకూరదు. ఆయుధపాణినై యున్నంతవఱకు నన్ను నిమిషులు సైతము గెలువఁజాలరు. కావున నన్ను జయించు విధముఁ దెలిపెద నాకర్ణింపుము. పుట్టినప్పుడు స్త్రీ యై మధ్యకాల మున నొరుల నాశ్రయించి పురుషత్వము నొందిన వాఁడగుటచే శిఖండితో నే నని సేయనొల్ల; ధనంజయుండు వానిం బురస్క రించుకొనివచ్చి, నేనేయుటమానిన సమయమున నాపై శరములఁ బ్రయోగించి నొప్పించి పడద్రోవవలయు; పడంపడి ధార్త రాష్ట్రులఁ జయించుట సుకరము. మీరలు శంకింపక నివ్విధమున నన్నుఁబడద్రోచి జయలక్ష్మిఁ జేకొనుఁ" డని నిజవధోపాయమును మనుమలకుఁ జెప్పి పంపించెను.

అనంతరము విజయుఁడు పురుషోత్తము నవలోకించి "కమల నాభా! ధర్మనిరతుఁడును, లోకమాన్యుఁడును నగు దేవవ్రతునిఁ గృతకవృత్తిం జంపఁజాలను. అమ్మహామహుండు బాల్యమున నాటలాడున సమయమున నన్నెత్తుకొని నామేనంగల ధూళినిఁదులిపి యతిప్రేమమునఁ గౌఁగిలించుకొనిమాతండ్రిసుగుణములఁ దలఁచి కన్నీరునించుచు, ననేకవిధముల నాకుఁ బ్రియముసేయుచుఁ బెని చెను. అట్టితండ్రికంటె నెక్కుడుప్రేమతోఁ బెంచిన పితామహుని వంచనచేఁ జంపనొల్ల" నని మిక్కుటముగఁ జింతింప, వాసుదేవుఁ డాతనికి క్షాత్రధర్మము నుపదేశించి దుఃఖోపశమనము సేసెను.

ప్రభాతమైన పిమ్మట నిరుబలములవారును రణరంగమున

కరు దెంచియొంకొరులందాకియు గ్రమునఁ బోరదొడఁగిరి. అప్పుడు గాండీవి శిఖండిని ముందిడుకొనివచ్చి పితామహునితో ననిసేయు నారంభించెను. అవిగాంచిదుశ్శాసన, కృపాశ్వత్థామాది యోధు లెల్లఱును భీష్మునకు సహాయులై వచ్చి కిరీటితోఁ బోర నారంభింప సాత్యకి, ధృష్టద్యుమ్న భీమాదులు ఫల్గునునకుఁ దోడై వారితో నని సేయఁదొడఁగిరి. గాంగేయుఁడు విజృంభించి సమరము సేయుచు విర టుని తమ్ముఁడగు శతానీకునిఁ జంపె. పురందరనందనుండు శాత్రవుల కందఱకన్నిఁ ఘోరములై వారుణాగ్నేయాది మహాశర ములం దెగఁజూచుచు, శిఖండిచాపము వెనకఁ దనవిల్లునిల్పి యాతఁ జేసినటులఁ దాను వాడి నారాచములఁ బ్రయోగించి మందాకినీ నందనుని నొప్పించుచు, నస్త్రమహామహుఁ డేర్చి వింటన్ద్రిన సన్నిటినిఁ దాను ఖండించుచుండెను.

అప్పుడు శాంతనవుఁడు తనమనమున "పాండవులకుపజయము సేకూరు నుపాయమునుపదేశించితిఁ గావున నేనిఁక సమరము సాలించి శాంతివహించుట సమంజస"మని యోఁజించుచుండ బృందారకులమ్మహానీయు తలంపునెఱింగి "ఇదియేమాకుసమ్మతి" మని, యొరు లెఱుంగరాని విధమున దేవవ్రతునకుఁ జెప్పి యమ్మహాత్మునిపయిఁ గుసుమవర్షముఁ గురియించిరి. అనంతరము శాంతనవుండు దుర్యోధన దుశ్శాసనుల నవలోకించి

సీ. "అశనికల్పములివి యర్జునుబాణముల్
గాని శిఖండివిగావుసుమ్ము
కర్కటి గర్భము కరణిగాత్రముచ్చి
నిట్టివి దీనికి నెందుఁగలవు

బ్రహ్మదండంబుల పాటివై మర్మంబు
　　　　వెట్టి నొవ్వఁటునే యితనిచేత
జముదూతలట్లఁ బ్రాణముల వెఁ
　　　　ర్పంగ నీద్రుపదాత్మజుఁడెన్నఁడేసె
దృఢవిముక్తములును దీప్తాకృతులుఁ లక్ష్య
శుద్ధిమంతములును సునిశితములు
నైన నారసంబు లతనివిగాక యా
తనివియగునె యెవ్విధమునఁ జూడ.''

అనిపలికి మఱియొక ఘనశక్తిని ధనంజయునిపయి బ్రయోగింపఁ బార్థుఁడు దానిం దునుమాడి పితామహుని విరథునిఁజేసెను. పిమ్మటసురనదీ సుతుఁడు తన యరదముఁడిగ్గివాలును, బలుకయుఁ జేఁబూనిపోరాడసాగెను. పాండవసైనికులెల్లఱును భీష్మునిపయిఁ గవిసి నిష్ఠురాస్త్ర శస్త్రములఁబ్రయోగించి క్షతగాత్రునిఁజేయఁ దొడఁగిరి. అప్పుడుభానుమంతుఁడస్తాద్రిం జేర నుద్యుక్తుండగుచుండెను. ఆసమయమునఁ గిరీటి నిశితసాయకములఁ బ్రయోగించి పడఁద్రోయ భానుసమతేజుఁడగు భీష్ముఁడు తూర్పుతలగాఁ బడి పోయెను. అప్పు డమ్మహామహుని తనువు ధరణినంటకుండునట్లు శరములూఁతయై తల్పముభంగినుండెను. అది దక్షిణాయనంబగుటచే దేవవ్రతుండప్పుడు మృతినొంద నొల్లక నుత్తరాయనము వచ్చువఱ కాయంపశయ్యపైనుండ నిశ్చితుండయ్యెను.

పాండవధార్తరాష్ట్రులు పితామహుని పాటునకుఁ గడు దుఃఖితులై సమరముసాలించి యమ్మహాసీయుని పాలికిఁబోయిరి. దేవవ్రతుఁడువారలఁగాంచి "నాకుఁదలగడకావలయు"ననియడిగెను. అంత నందఱును మెత్తని పట్టుతలగడలఁ దీసికొనిరాఁ గాంగే

యుఁడు తనకుఁగావలసిన తలగడలవి గావనిచెప్పి కిరీటినిగాంచి "నా కీశరతల్పమునకుఁ దగినయుపధానంబు వెట్టు" మనికోరెను. సవ్యసాచి యవ్వచనములనాలించి శోకాకులితమానసుఁడై, గాండీవముఁగైకొని మూఁడువాలమ్ములభిమంత్రించి పెడతలఁదాఁకి యెత్తిపట్టుకొని పుంఖంబులు భూమిమోఁచి నిలుచునట్లుగా నేయఁ బితామహుఁడుప్రీతుఁడై "తగినతలగడ నేర్పఱచితి"వని యాతనిఁ బొగడెను. అప్పుడు శల్యచికిత్సకులు కొందఱు చికిత్స సేయ నరుదేర భీష్ముఁడు వలదని వారలను వారించి, తనపౌత్రులను సకల ధాత్రీపతులను నవలోకించి "నాకు సలిలంబులం ద్రావింపుం" డని యడిగెను. పితామహునితృష్ణందీర్ప ధార్తరాష్ట్రులు నిర్మలోదకముఁదెచ్చి యీయఁగోర దేవవ్రతుండు "శరతల్పగతుండనైన నేనీసలిలముల పానము సేయఁజనదు. తేజోమయాస్త్రవిన్యాసవిధి సముత్థితమైన భూజలము గావలయు" ననివచించి కవ్వడినుద్దేశించి

క. "శరవేదన సర్వాంగము
నెరియఁగ నాకిపుడు పెదవులెండెనుఁ దృష్ణా
భర ముడుపఁ దగిన నీరులు
వెరవునఁదే నేర్తు వీవవే లెమ్మనఘా."

అనిపలికెను. అంతటఁ గిరీటి పితామహునకుఁ బ్రదక్షిణము సేసి తేజోమయమైన మార్గణము పర్జన్య మంత్రాభి మంత్రితము గావించి మహీతలముగాడ నేయభాసురచ్ఛాయమగు తోయము ధారారూపమున దివ్యగంధరసోపేతమై యెగసెను. దానిందెచ్చి యీయఁ బితామహుఁడు తృప్తుఁడై విజయునిఁ గీర్తించెను. పిమ్మటఁ బాండవధార్తరాష్ట్రులచ్చోటఁబరిఘతోడి ప్రాకారముఁ

గట్టించి పితామహుని పక్షమునకుఁ బరువారలను నియమించి యుద్ధప్రవృత్తిని యనుజ్ఞఁ గైకొని దీనాననులై తమతమ నెలవు ములకేగిరి.

అనంతరము కర్ణుఁడు గాంగేయుని పాలికిఁబోయి భక్తివినయములతోఁ బ్రణామము నాచరించి "మహాత్మా! నాయందలి యలుక విడిచి వాత్సల్యమును జూపు" మని వేడ ప్రేమమతుఁ డాతని నాలింగనము చేసికొని "కుమారా! నీవు కౌంతేయుఁడవుగాని రాధేయుఁడవుగావు, అకారణముగ నాకు నీయెడ వాత్సల్యముగాని క్రోధ మున్నదనులేదు. మీరలు దురాలోచనలఁ జేయునప్పుడు మాత్రము కోపించి సదుపదేశము సేసితి: అది వాత్సల్యాతిశయమునఁ జేసినదే గాని, క్రోధముగాదు. సుయోధనుఁడు మదీయవచనముల నాలింపక పాండవులతో వైరముఁ దెచ్చికొనియె. శ్రీకృష్ణుఁడు సహాయుఁడై యుండుటచే నీరణమునఁ బాండవులే విజయులయ్యెదరు. కావున నీవిప్పుడు పాండవులఁ గలసి సామ్రాజ్యాభిషిక్తుఁడవై సుఖింపు" మని వచించెను. "పితామహా! ఇంతకాలమునుండియు సుయోధనుని యన్నముఁదిని యిప్పుడాతనిని విడిచిపోవుట యధర్మముగావున, సుయోధనుపక్షమునఁ బాండవులతోఁ బోర నాకనుజ్ఞ నొసంగు" మని కర్ణుఁడు గాంగేయునిఁ బ్రార్థించి యమ్మహాత్మునిచే ననుజ్ఞాతుఁడై నిజనివాసమున కేగెను.

—* ద్రోణ పర్వము *—

పదునొకండవనాఁడు సుయోధనుఁడు కర్ణుని సమరమునకుఁ బిలిచి యాతనితోనాలోచించి, సర్వసైన్యాధిపత్యమునకు ద్రోణా

చార్యునభిషేకించెను. భీష్మునవంతరమున సుయోధనుఁడు తన్నుఁ గౌరవించినందులకు ద్రోణుఁడు ప్రీతుఁడై "కౌరవనాథా! నీవు నాయెడ నధిక గౌరవము సూపితివిగావున నీకొక్క వరమొసఁగెద. ఇచ్చవచ్చినదానిఁ గోరు"మని చెప్పెను. "గురువరేణ్యా! ప్రాణములతో ధర్మతనయునిఁ బట్టి నాకొసఁగు" మని సుయోధనుఁడు కోరెను. "అవనీతలేంద్రా! అజాతశత్రునిఁ జంప గోరక ప్రాణములతోఁ దెచ్చియిమ్మనుట కేమికారణ" మని భారద్వాజుఁ డడుగ దుర్యోధనుఁడు "యుధిష్ఠిరునిఁ జంపినచోఁ గిరీటికోపించి కౌరవుల నందఱిని బరిమార్చును. మఱియు పాండవులందఱిని వధించినను కృష్ణుఁడు కుపితుఁడై మనలనందఱిని జక్కాడి కుంతీదేవికైన రాజ్యమునొసంగును. ప్రాణములతో ధర్మనందనునిఁ దెచ్చినచో మరల జూదమాడి యోడించి వనములకుఁ బంపించి నేనునిరాటంకముగ రాజ్యము నేలవచ్చునని యత్నించెద" ననుచుఁ దన యభిమతము నాచార్యున కెఱింగించెను. ద్రోణుఁ డాతని మాటాలోచనమునకుఁ గొని

చ. "నరుఁ డెడఁబాసి చెచ్చెనని విను నాకది యుక్కుగ మేనొకండనే
సురగణమైన ద్రెళ్ళఁగని చూపఁగఁజాలుదు వాఁడు లేనిచోఁ
ధరణిపై పోరనిల్చిన యుధిష్ఠిరు ద్రౌపది పుట్టినింటి వే
వురు పెడఁగందిమాడ నలవుం జలముం జెడఁబట్టి తెచ్చెదన్."

అని వచింప దుర్యోధనుఁడు సంతసిల్లి గురుప్రతిజ్ఞ నెల్లెడలఁ జాటఁబనిచెను.

అప్పుడుకౌంతేయాగ్రజుఁడు గురుప్రతిజ్ఞనాలించి విజయునిఁ గాంచి "తమ్ముఁడా! ఆచార్యుఁడిట్టి ప్రతిజ్ఞఁ జేసెఁ గావున సమర

మున నీవు నిరంతరము నన్నొడఁబాయక కాపాడుచుండవలయు”
నని వచింప, సవ్యసాచి

క. “క్షోణీవల్లభ వినుమేఁ
ప్రాణముతో నుండ నిన్నుఁ బట్టికొనఁగ నా
ద్రోణునకు కాదు సగణ
స్థాణునకైనను వశంబె తలకేమిటికిన్.

చ. అలవియెఱుంగ కిట్లయి దురాశఁ దలంచిరిగాక ధార్తరా
ష్ట్రులు త్రిజగమ్ములం గని ఒట స్ఫురణం జనుఁ గాంచిరే నియు-
బలవదరాతిపుంజ మదభంజన నీకని భంగపడ్డ నీ
యులశకిలంబులై చెడదె యింక వారధి నింగికూలదే.”

అనుచు సగ్రజునకు ధైర్యముఁ జెప్పెను.

అనంతర మిరువాగులవారును రణరంగమునకరుదెంచి విజృంభించి యొండొరులతోఁ బోరాడఁ దొడఁగిరి. ద్రోణాచార్యుఁడు దివ్యాస్త్రములఁ బ్రయోగించి పాండవ సైన్యముఁ జెండాడుచు యుధిష్ఠిరు నెదుర్కొని పోరనారంభింప ధనంజయుఁడు డగ్గఱి యాచార్యునితో ననిసేయఁ దొడఁగెను. ఇరుబలములవారును నిట్లు సూర్యాస్తమయ మగువఱకు సమరము సేసి యనంతర మెప్పటియట్లు దమతమశిబిరముల కేఁగి విశ్రమించిరి.

అప్పుడు దుర్యోధనుఁడు ధర్మనందనుఁడు పట్టుపడమికి విచారింప నాచార్యుఁడు “నృపాలా! విజయుని దవ్వునకుఁ దీసికొని పోయి పోరాడఁజాలిన యోధులెవ్వరైనఁ గలరేని, కడమవారిని నేనుజయించి యుధిష్ఠిరునిఁ బట్టఁజాలుదు; మఱియు నప్పుడజాత శత్రుఁడు రణభూమినిఁ దొలఁగిపరుగిడకుండెనేనిఁ బట్టగలవాఁడ” నని వచించెను.

మఱునాఁటి యుద్ధమునఁ ద్రిగర్తనాథుఁడైన సుశర్మ సుయోధనుపాలి కరుదెంచి "రాజేంద్రా! ఈసమరమున మే మర్జునునితోఁ బోరి యాతనిఁ దెగటార్తుము. అట్లు సేయలేనిచో నాతనిచేఁ జత్తుము. నేఁడు రణభూమియందు ధనంజయుండో యుండెఁ ద్రిగర్తులో యుండెఁ గావలయు" నని ప్రతిజ్ఞ సేసి, సంశప్తకు లనం బఱఁగు తనవారి ననేకవేల రథములవారినిఁ గూడి సమరభూమి కరుదెంచి "మాతో రణము సేయ నరుదెంచి నీశౌర్యముఁ గనఁ బఱుపు"మని సవ్యసాచినిఁ బిలిచెను.

అప్పుడు సవ్యసాచి యుధిష్ఠిరు నవలోకించి "అగ్రజా! సంశప్తకులు నన్ను యోధనమునకుఁ బిలుచుచుండిరి. నేనిపుడచటి కేఁగకుండుట పౌరుషహీనముగావున, నీరక్షణమునకుఁ బాంచాల కుమారుఁడైన సత్యజిత్తును నిలిపి నే నని సేయనరిగెద" నని చెప్పి యాతని సెలవుఁగైకొని సంశప్తకులతోఁ బోర నేఁగెను. సంశప్తకు లాతని నతిదూరమునకుఁ దీసికొని పోయి సమరము సేయఁదొడఁగిరి.

ఇటుఁ గౌరవ పాండవ వ్యూహములు నొండొంటిం దాకి యెప్పటివలెసంగ్రామము సేయుచుండెను. ఆనాఁటిరణముననాచార్యునిచే సత్యజిత్తు నిహతుఁడయ్యెను. ధర్మనందనుఁ డదిగాంచి గురుని పరాక్రమమునకు వెఱచి రణభూమినివిడచి పాఱఁదొడఁగెను. అప్పుడు విరటుని తమ్ముఁడైన సూర్యదత్తుఁడు ద్రోణుని మార్కొని యాతనిచే హతుఁడయ్యెను. అభిమన్యు, సాత్యకి, ధృష్టద్యుమ్న ప్రముఖులు యుధిష్ఠిరునిఁ గూడివచ్చి భారద్వా

జునిపై విజృంభించి పోరఁదొడఁగెను. భీమసేనుఁడు వంగదేశ నాథునితోఁ బోరి యాతనిఁ దెగటార్చెను. అప్పుడు ప్రాగ్జ్యోతిష దేశాధీశుఁడగు భగదత్తుఁడు సుప్రతీకమను తనగజమును పాండవ వాహినిపై కుఱికిఁ బురికొల్ప నది పాండవయోధుల సంహతిని నొప్పించి వాహినినంతయు క్షోభము సేయ నాకాంక్షించెను. ఆసమయమున దశార్ణ భూవిభుండు భగదత్తు నెదుర్కొని యాతనిచేఁ జచ్చెను.

అప్పటికి విజయుఁడు సంశప్తకులయందుఁ బదియేనువేల రథముల వారిం గూల్చి, భగదత్తుఁ డంతటి తన వాహినినంతయుఁ గలంచు చుండుట గాంచి, భగదత్తునిపై కేఁగ నుద్యుక్తుఁ డగాఁ, దక్కిన సంశప్తకులు పదునాలుగువేల రథములతో నాతనిపైఁ గవిసిరి. విజయుఁడు నిజభుజాబలము ప్రకాశింపనివ్వాస్త్రములఁ బ్రయో గించి యవ్వీరుల సంహతిని బరిమార్చి, సుశర్మను మూర్ఛ నొందించి వాసుదేవునిచేఁ బ్రశంసితుఁడై దేవదత్తశంఖం బూరిం చుచు భగదత్తునిపై కరుదెంచి, సుప్రతీక యుక్తముగ నాతనిం బరిమార్చెను.

అప్పటికి భానుఁడు పశ్చిమాంబుధిని మునుగుటచే నుభయ పక్షములవారును రణమును జాలించి శిబిరములు కేఁగిరి.

పదుమూఁడవనాఁడు సమరమున: కేఁగు సమయమున సుయోధనుఁ డాచార్యునవలోకించి "గతదినమున యుధిష్ఠిరునిఁ బట్టవైతి"వని నిష్ఠురోక్తులాడ భారద్వాజుఁడు "నేఁడు నా సమరము వీక్షింపు"మని పలికి దొరలకభేద్యమగు పద్మవ్యూహము

పన్ని యమ్మొగ్గరము మొగమునఁ దానునిలిచి రణరంగమున కరుదెంచెను. అప్పుడు మరల సంశప్తకుల నేకులు వచ్చి విజయు నతిదూరమునకుఁ దీసికొనిపోయి పోరాడసాగిరి.

పిమ్మట యుధిష్ఠిరుఁడు సౌభద్రు నవలోకించి "కుమారా! పద్మవ్యూహమును భేదించుక్రమము విజయునకును, కృష్ణునకును నీకును దక్క నొరులకుఁ దెలియదు. కావుననీవు నేఁడీవ్యూహ మ్మును భేదించి మనగౌరవము నిలుపవలయు" నని వచింప నక్కుమారుఁడు మందస్మితవదనారవిందుఁడై "తండ్రీ! నేను పద్మవ్యూహమును భేదించువిధము నెఱుంగుదునుగాని, యచ్చట శత్రువులు చుట్టుముట్టినచో నరలివచ్చు విధము నెఱుఁగ" నని పలుకలు సెప్పెను. "నీవు కొంచెము భేదించి మార్గము నొసినచో సాత్యకి, ధృష్టద్యుమ్న, భీమ నకుల ప్రముఖులును నేమును నీవెంబడిన యరుదెంచి నిన్ను గాపాడు చుండఁగలవార"మనియుధిష్ఠిరుఁడు పలుక నభిమన్యుఁ డధికోత్సాహవంతుఁడై తన యరదము నతిత్వరితముగఁ బోనించుకొనిపోయి యనన్యభేద్యమగు పద్మవ్యూహము భేదించి యమ్మొగ్గరము సొచ్చి రౌద్రరసోల్లసితమూర్తియై, మహార్ణవమునఁ దిరుగు మందరనగము చందమున నందుఁ జరియించుచు శత్రువాహినిఁ జెండాడఁ దొడఁగెను. అప్పుడు దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, కృప, ద్రోణాశ్వత్థామాది యోధవరులెల్ల రాతనిపయిఁ గవిసి శరవర్షముఁ గురియింప సుభద్రా సుతుఁడు విజృంభించి యందఱ కన్నివిధములై యుగ్రముగఁ బోరుచు కొందఱిని మూర్ఛితులఁ జేసియుఁ గొందఱినిఁ

బరిమార్చియుఁ గొందరిని విరథులఁ జేసియు ననేక విధముల నందు వీరవిహారము సలుపుచుండెను.

అభిమన్యుని పెఱుండనఁ బాండవులు మొగ్గరము సొచ్చుచుండ సైంధవుఁడు వారల కడ్డుపడి పోరసాగెను. మున్ను పశుపతి యొసంగిన వరప్రభావమున వాఁడానాఁడు యుధిష్ఠిర భీమ నకుల సహదేవుల కజేయుఁడై వారిని మొగ్గరము సొరనీయక రౌద్రముగ బోరుచుండెను.

కానసమునఁ జరియించు తీవ్రానలము చందమున నమ్మొగ్గరమున సంచరించుచున్న ధనంజయ నందనునిచే, దుర్యోధన పుత్రుఁడగు లక్ష్మణుఁడు మృతుఁడయ్యెను. పమ్మట గౌరవ యోధులెల్ల నాకుమ్మడి నక్కుమారునిపైఁ గవిసి కొందరాతని ముందరనిలిచి పోరాడుచుండ, మరికొందఱు వెనుక భాగమునకువచ్చి నిశితాస్త్రముల ప్రయోగించి ధనువుఁ ద్రుంచి హయసారథులఁ గూల్చి యక్కుమారుని విరథునిఁజేసిరి. అంత నక్కుమార సింహుఁడు తనవాలును బలకయుఁ గేలఁబూని గగనభాగమున కెగసి వినతా తనయుని విధమున సంచరించుచుండ నాచార్యుఁడు శల్లెముఁ బ్రయోగించి యాతని వాలునుఁ బలకయును దునుమాడెను. అనంతర మక్కుమార రత్నము తనగదఁ గైకొని యాయోధనము సేయుచు నరివీరులఁ జెక్కుండ్రఁ బరిమార్చుచుండ దుశ్శాసనునిసుతుఁ డాతని నెదుర్కొని పోరసాగెను. అక్కుమార ద్వయము ఘోరముగ గదా యుద్ధము సేయుచుఁ గొంత తడవున కొకరి గదాఘాతమున కొకరు

ధరణింగూలి విగత జీవులైరి.

అభిమన్యుని మరణమువిని పాండవులు దుఃఖాకులిత మానసులై, యంబరమునఁ యపర రత్నాకరము సొచ్చినపిమ్మట సమరముసాలించి తమనివాసములకేఁగి విచారాక్రాంత మనస్కులై, "ధనంజయుఁడు వచ్చిననేమిసెప్పుద"మని చింతించుచుండిరి.

విజయుఁడచ్చట సంశప్తకులనందఱినిఁ బరిమార్చి శిబిరమున కరుదెంచుచుండ మార్గమధ్యమున నాతనికిఁ బెక్కు దుశ్శకునములు కానవచ్చెను. కీడటియదిగాంచి తనవారికేమి విపత్తుసంభవించెనో యనుకొనుచువచ్చి నిజతనయుని మరణవార్తనాలించి "హా! కుమారశేఖరా! భరతాన్వయరత్నదీపా! నన్నుడఁ బాసి నాకమునకేఁగితివా? అనుచు ధరణిపైఁబడి దుఃఖాతిశయమునఁ బెక్కువిధములు విలపింపఁ దొడఁగెను. దేవకీతనయుఁ డాతనిఁ గ్రుచ్చియెత్తి "ధనంజయా! వీరస్వర్గమునొందిన యక్కుమారరత్నము కొఱకు నీవింత విలపింపవల"దని యనేకవిధములఁ జెప్పి యోదార్చెను. విజయుఁడు యుధిష్ఠిరు నవలోకించి గద్గదకంఠుఁడై

ఉ. "పావనిసైరణుండుఁ గౌరవపార్థతుఁ వచ్చుట లేదెయొందుమై
బోవఁగ బంచితే ద్రుపదుఁ బోరికి సాత్యకి రాక తక్కనే
భూవర మత్స్యనాథుఁ డెటవోయెనో చెప్పరమైన నీకు నం
గావఁగఁ రాక తక్కెనో తెగం గతమేమి సుభద్రపట్టికిన్."

అని నిట్టూర్పులతోనడుగ, ధర్మనందనుఁడు, పశుపతి వరప్రభావమున సైంధవుఁడు తమకడ్డుపడిన విధమును సౌభద్రుఁడు పెక్కండ్రు యోధులఁ బరిమార్చి రణావనింద్రెళ్ళిన విధమును నాతనికి సవిస్తరముగఁ జెప్పెను. అంతట విజయుఁడు గాండీవహస్తుఁడై

చ. "అనిమిష దైత్య కింపురుషు లాదిగ నెవ్వరువచ్చి కాచినం
దునుముదు నెల్లి సైంధవునిఁ దోయజమిత్రుఁడు గ్రుంకకుండు ము
న్న నరవరేణ్య యిత్తెఱఁగు నాకొనరింపఁగ రాకయున్న నే
ననలము సొచ్చువాఁడ నృపులందఱుఁ జూడఁగ గాండివంబుతోన్."

అని ప్రతిజ్ఞఁ జేసెను. పిమ్మటఁ గృష్ణుఁ డుత్తరను, సుభద్రను, ద్రౌపదిని నూరడించివచ్చి తన సారథియైన దారుకునిఁ బిలిచి "నేను రేపు సంగరతలమునందుండి పాంచజన్యముఁ బూరించిన తోడనే నీవు గరుడధ్వజ విరాజితమైన మన యానముఁ దోలుకొని రమ్మని యాజ్ఞాపించి శయనించెను. ధనంజయుఁడును కుమారునిఁ దలంచి మనమున దుఃఖించుచు శయనించి కొంత తడవునకు నిద్రాభివశుఁడయ్యెను. అప్పుడు స్వప్నమున నాతనికిఁ బశుపతి ప్రత్యక్షమై పాశుపతాస్త్రమును మరల నుపదేశించెను.

అర్జునుని ప్రతిజ్ఞను సైంధవుఁడు విని ద్రోణుఁ డాతనికి ధైర్యముఁ గఱపి పదునాలవదినమునఁ దన సైన్యమును, సూచీవ్యూహమును, పద్మవ్యూహమును, శకటవ్యూహము నను మూఁడు వ్యూహములుగఁ బన్ని సూచీముఖస్థానమున సైంధవు నునిచి, శకటవ్యూహ ముఖమునఁ దాను నిలిచి సమరమున కసుదెంచెను.

అట ధనంజయుఁడు నిజస్వప్నవృత్తాంతముఁ దన వారి కెఱిఁగింప నది శుభసూచకమని యెల్లరును సంతసించుచు రణరంగమున కరుదెంచిరి. పిమ్మట నర్జునుఁడు సాత్యకిని ధర్మనందనుని రక్షణమునకు నియోగించి, తాను మొగ్గరము సొరనెంచి దాని యగ్రభాగమున నిలిచిన ద్రోణాచార్యునితో నని సేసి యాతనిఁ

గడచి మొగ్గరము సొచ్చి తన్నెదుర్కొనిన యోధులనందఱిఁ జెండాడుచుండెను. అప్పుడవంతిపురాధీశులైన విందానువిందులును మఱికొందఱును నృపాలురును నాతనిచేఁ జచ్చిరి. పాండవసేన మంతయు వెలుఁగులనుండి [illegible]రులంబోఁ బోవుచుండెను. ఆ సమర మున ఘటోత్కచుఁ డలంబుసునిఁ దెగటార్చెను.

కొంతతడవునకు ధర్మనందనుఁడు గాండీవగుణఘోషమును, దేవదత్తధ్వానమును వినకుండిన కారణమున ధనంజయునకుఁ బ్రమాదము సంభవించెనేమో యని [illegible]నొంది సాత్యకినిఁ బిలిచి "యదునందనా! నీకు గురుఁడును, సఖుఁడును, బావయునగు ధనంజయుఁ డొక్కరుఁడు మొగ్గరముసొచ్చి తడవయ్యె; అచ్చట నాతని కేమి యాపద సంభవించెనోయని నాచిత్తమధిక వ్యాకులము నొందుచున్నది. కావున నీ వాతనికి సహాయము సేయనరుగు" మని వచింప, సాత్యకి యుధిష్ఠిరుని రక్షణమునకు భీమసేనుని నిలిపి, వారణ సమూహమును గాంచు వ్యాఘ్రము చందమునఁ గౌరవ వ్యూహముఁ జూచుచు విజయునకుఁ దోడ్పడ నేఁగెను.

కృష్ణానుజుఁ డట్లునని ద్రోణాచార్యునిఁ గడచి మొగ్గరము సొచ్చి యోధాగ్రేసరుల నందఱినిఁ జిందరవందర సేయుచు, జలసంధ, సుదర్శను లను నృపతులఁ బరిమార్చి తన యరదమును సవ్యసాచియున్న దిక్కునకుఁ దోలించుచుండెను.

"అట ధర్మనందనుఁడు మఱికొంత తడవునకు భీమునవలోకించి తమ్ముఁడా! సాత్యకియు మొగ్గరముసొచ్చి తడవయ్యె; అయ్యిరువురి సేమమును మనకుఁ దెలియనందున నా మనము కలంక

నొందుచుండెఁ; కావున నీవు మొగ్గరముసొచ్చి యాదవ పాండవ కుమారసింహుల సేమముల నరసి సింహనాదము సేయుము. నీసింహనాదము వినినపిమ్మట నేను భీతినుడిగి ధైర్యమున నుందు" నని వచింప, నమ్మారుతాత్మజుఁడు ద్రోణుని ప్రతిజ్ఞ నుగ్గడించి పాండవాగ్రజుని రక్షణమునకు ధృష్టద్యుమ్ను నునిచి తాను సాత్యకిధనంజయుల కుశలము నరయ నేఁగెను.

పవనతనయుఁ డట్లు సని మొగ్గరిముఖమున నున్న యాచార్యునితో ననిసేసి యవ్విరవతంసుని నొప్పించి మొగ్గరముసొచ్చి, సాత్యకిధనంజయుల సముల్లాసముఁ గనుఁగొని సింహనాదము సేసెను. అమ్మహానాదము విని యుధిష్ఠిరుఁడు భీతినుడిగి సంతుష్టాంతరంగుఁడై "ఫల్గునుఁ డెప్పుడు తన ప్రతిజ్ఞ నెఱపివచ్చి నన్నాలింగనము సేసకొనునో" యని మనమునఁ దలఁచుచు పార్థునిరాకకు నిరీక్షించుచు శాత్రవులతో నని సేయుచుండెను.

అట్లు మొగ్గరము సొచ్చిన భీమసేనునిఁ గర్ణుఁ డెదుర్కొని పోరుచుండ ధృతరాష్ట్రనందనులు పలువురు కర్ణునికిఁ దోడు సనుదెంచిరి. పవనతనయుఁడా నాఁటిరణమున ధార్తరాష్ట్రుల నిరువది తొమ్మిది మందినిఁ బరిమార్చెను. పిమ్మట భీమసేనుఁడు కర్ణుని రథాశ్వములను సారథినిఁ దునిమి విరథుఁడైనయాతనిఁ బట్టుకొన రాఁ గర్ణుఁడు పవనతనయునిపై నిశిత సాయకములఁ బ్రయోగించి నొప్పించి, తొల్లి తాను కుంతీదేవి కొసఁగిన వరముఁ దలఁచి యాతనిఁ జంపనొల్లక,

ఆ. "తిండిపోత నీకు దండనం బేటికిఁ
గడవఁ జేర మనసు కాంతుదీటు

నోఁపు కాలఁది క్రిఁంగి యూరక నీవింటి
కడనయుండు మింక నడచి పడక."

అనుచు సవమానించి పంపించెను.

సాత్యకి తన్ను మార్గ్గానిస యోధుల నందఱి నోడించుచు వచ్చి విజయుని సమీపించుచుండఁ, గురువంశజాఁడైన బాహ్లీకుని పౌత్రుఁడగు భూరిశ్రవుఁడను యోధాగ్రేసరుఁ డాతని కడ్డు పడెను. అప్పుడు సాత్యకి భూరిశ్రవుని హయములను సారథినిఁ జంప, భూరిశ్రవుఁడు సాత్యకి రథాశ్వములను సూతునిఁ బరిమార్చెను. ఇట్లే యొకరి విల్లు నొకరు దునుమాడిరి. అంత నయ్యాదవకౌరవసింహు లిరువురును మల్లయుద్ధము సేయఁ దొడగిరి. అంతకు మున్ను పెక్కండ్రు యోధులతోఁ బోరి యలసి యున్నవాఁ డగుటచే నప్పుడు సాత్యకి భూరిశ్రవునితోఁ బోరఁ జాలకఁ గడుడస్సియుండెను. భూరిశ్రవుఁడాతనిఁ గ్రిందఁ బడవైచి కంఠముఁ దునుమ నుద్యుక్తుఁడై కృపాణము నెత్తెను. అప్పుడు కృష్ణుఁడు తనయనుఁగు తమ్మునిదురవస్థఁ గాంచి కిరీటికిఁ దెలుప నతఁడొక ఘనమగు శరముఁ బ్రయోగించి కృపాణము నెత్తిన యా కురువీరుని బాహువుఁ దునుమాడెను. అంతట సాత్యకిలేచి భూరిశ్రవుని శిరముఁ దెగటార్చెను. అప్పుడు కృష్ణుఁడు పాంచజన్యముఁ బూరింప దారుకుఁడు శైబ్యసుగ్రీవమేఘపుష్పవలాహకములనునశ్వములును గరుడకేతనమునుగల యరదముఁ దోలుకొనివచ్చెను. త్రికాలవేదియగు కృష్ణుఁడానాఁడు తనయనుజునకు భంగపాటు సంభవించునని యెఱిఁగియే గతరాత్రమున "పాంచజన్యముఁ బూరించినపుడు నాయరదముఁ దె"మ్మని దారుకునకుఁ

జెప్పియుండెను. కావున నప్పుడు కృష్ణుడు తన ప్రియానుజాత కయ్యరదము నొసఁగ నతఁడు దాని నధిరోహించి సమరము సేయఁదొడఁగెను.

విజయుఁడు సైంధవుని దెసకుఁబోవ నుద్యుక్తుఁడుగాఁ శల్య, కృప, కర్ణాశ్వత్థామాదియోధులెల్ల రాతనిఁ దాఁకి ఘోరముగాఁ బోరఁదొడఁగిరి. అప్పటికి దిననాథుఁడు శాంతకిరణుఁడై పశ్చిమ ధరాధరము సేరఁబోవుచుండెను. అప్పుడుయుధిష్ఠిర,ద్రుపద,విరాటాదులెల్లను చింతాక్రాంతులై "మన ధనంజయుఁ డసాధారణ ప్రతిజ్ఞఁ గావించె; ఇఁకఁ గొలఁదికాలములో సైంధవునిఁ జంప లేనిచో నతఁ డగ్ని ప్రవేశము సేయు. ఏమి సేయఁగలవారో" మనుచు పలువిధముల విచారించుచుండిరి. దుర్యోధనాదులు "మనమింకఁ గొంచెము సేపు సైంధవునిఁ గాపాడఁ జాలితిమేని విజయుఁడు తనయంతఁ దానె మడియు"నని తలఁచి సంతసించు చుండిరి.

అప్పుడు కృష్ణుఁడు గాండీవినిఁ గాంచి "ధనంజయా! నీవీ వీర వరేణ్యులనందఱినిఁ గెలిచి సైంధవుఁ బరిమార్పనవకాశములేదు; కావున నేనొక్క యుపాయము గల్పించెద" నని చెప్పి మాయాతిమిరమును గల్పించి దినకరుని మఱుఁగు జఱచెను. కౌరవులెల్ల అదిగాంచి రవి గ్రుంకెననితలఁచి సంతోషధ్వానములఁ జేయఁ దొడఁగిరి. అంతట సైంధవుఁడు తనశిరమునెత్తి పశ్చిమదిశ నుప లక్షించుచుండ, వాసుదేవునిచే ననుజ్ఞాతుఁడై విజయుఁడు వాని మస్తకముఁ ద్రెళ్ళనేసెను. "అర్జునా! వీని శిరమును ధరణిం

బడసీయకుము. వీనితండ్రియగు వృద్ధక్షత్రుఁడనువాఁడధిక తపో వంతుఁడై "సైంధవుని మస్తకమును మహింగూల్చినవాని శిరము నూరు శకలములగునని మున్ను వచించియుండెను. ఆవృద్ధక్షత్త్రుఁ డిప్పుడుశమంతపంచక సమీపముననుండెను. కావున నీవీతని మస్త కము నాతని తొడపైఁ బడునటుల నేయుము" మని కృష్ణుఁ డుప దేశింప విజయుఁడు పాశుపతాస్త్రమును జపించెను. అమ్మహాస్త్ర మాశిరముఁ దీసికొనిపోయి, శమంతపంచక సమీప మున జపము సేయుచున్న వృద్ధక్షత్త్రుని తొడపై నుంచివచ్చెను. ఆతఁడు దానిస్పర్శనమునకులికి లేవ నమ్మస్తకము ధరణింబడియె. తోడ నేవృద్ధక్షత్త్రుని శిరము నూరుశకలము లయ్యెను.

సవ్యసాచి సైంధవునిఁ దెగటార్చిన తోడనే కృష్ణుఁడు మాయాతిమిరమును హరింపఁ దోయజమిత్త్రుఁడు మరల ప్రకా శింపఁ దొడఁగెను. అదిగాంచి కౌరవానీకము ఖేదమునుఁ బాండవా నీకము మోదమునునొందెను. పిమ్మటఁ గృష్ణార్జునులు సాత్యకి భీము సేన సహితులై ధర్మతనూజుని సన్నిధికిఁ రాఁ నతఁ డతిప్రేమమున విజయు నాలింగనము సేసికొని యానందాశ్రువులచే నాతని మస్తకముఁ దడుపఁ జొచ్చెను.

అట సుయోధనుఁడు ద్రోణాచార్యుని కడకుఁ బోయి "నీవు పక్షపాతము వహించి విజయుని మొగ్గరమున సొరనిచ్చి సైంధ వునిఁ జంపించితి" వని నిష్ఠురాలాపములాడ, నతఁడు"మహీపాలా! నేను శక్తివంచనలేక పోరాడుచున్నను నీవు శూలములఁ బోలు వాక్యములచే నన్ను నొప్పించుచుంటివి. ముల్లోక విజయుఁడగు

ధనంజయునిఁ గెలువ నాకుశక్యమే? అయినను నీరాత్రి విశ్రాంతిని మఱచి సమరముసేసి నిన్ను మెప్పించెద; పాంచాలురఁ జంపక నేఁడు కవచమువిడువ" నని ప్రతినఁ జేసి కౌరవానీకమును మరల రణమునకుఁ బురికొల్పెను.

అంతటఁ బాండవయోధులును సమర సన్నద్ధులై శాత్రవ వాహినిఁ దాకి ఘోరముగాఁ బోరజొచ్చిరి. ఆ సంగ్రామమున దుర్మద, దుష్కర్ణాది ధార్తరాష్ట్రులు బండ్రెండుగురు మారుతిచేఁ జచ్చిరి. ఘటోత్కచుని సుతుఁ డంజనపర్వుఁ డనువాఁడు గురుపుత్రునిచే వధింపఁబడియె. కురువృద్ధుఁడైన బాహ్లికుఁడు వడముడిచే నిహతుఁడయ్యె. బాహ్లికుని సుతుఁడును భూరిశ్రవుని తండ్రియు నగు సోమదత్తుఁడు సాత్యకిచే మడిసెను. బకుని సోదరుఁడగు నలాయుధాసురుఁడు ఘటోత్కచునితోఁ బోరి సమసెను. మఱియు ఘటోత్కచుఁడు కౌరవయోధుల కజేయుఁడై శాత్రవ వాహినిఁ జిందరవందర సేయుచుండఁ గర్ణుఁడు వాని నెదుర్కొని పోరఁదొడఁగెను.

మున్ను కర్ణుఁడు నిరంతరము విప్రభక్తి పరాయణుఁడై వారలకుఁ గోరినయర్థముల నొసగుచుండుట నెఱిఁగి పాకశాసనుఁడు కిరీటిహితార్థము కర్ణునికవచకుండలముల నపహరింపఁ దలఁచుచుండ సరోజమిత్రుఁ డాతనితలంపు నెఱిఁగి యొకనాఁడు కర్ణునికడ కరుదెంచి "కుమారా! అర్జున హితార్థమై పురందరుఁడు ధరణీసుర వేషముతో నగు దెంచి నీకవచకుండలముల నడుగును. నీ వాతనికి వానినీయవలదు. ఈకవచ కుండలములు

ధరించియున్నచో నీవు దేవాసురులకు సైత మజేయుఁడ వగుదువు. ఇవిలేనిచో శాత్రవులు నిన్ను జయింతురు" రని హితోపదేశముఁ జేసెను. కర్ణుఁడా యుపదేశము నాలించి "దేవా! నేను ధరణీదేవులకుఁ గోరినయర్థముల నొసంగుదునని పలికి పెక్కుకాలమునుండి యట్లాచరించుచుంటిని. నేఁడు పురుహూతుఁడు విప్రవేసముతో వచ్చి నన్నడిగిన వానినీయనిచో నాకపయశము వాటిల్లు: కావున నతఁ డడిగినచో వానినిచ్చి తీరవలయు" నని బదులుచెప్పెను. "కుమారా! నీవట్టి నిశ్చయముతో నుంటివేని వాసవునికడనున్న ఘనశక్తినైనఁ గైకొని పిమ్మటనీకవచకుండలముల నీయు"మని చెప్పి యాదిత్యుఁ డంతర్హితుఁడయ్యెను. పిమ్మట నింద్రుఁడు భూసురవేసముతో నరుదెంచి కర్ణునిఁ గవచకుండలముల నడుగ నతఁడు "రహస్యము నెఱింగితి" నని పలికి పాకశాసను నడిగి యొక ఘనశక్తిఁగైకొని తన కవచకుండలముల నద్దేవునకొసఁగి పంపించెను. నాఁటనుండియు కర్ణుఁడాశక్తిని ధనంజయునిఁ బరిమార్పఁ దాచియుంచెను. ఆతఁడే మహాసంగ్రామమున ననుదినమును నిశాసమయమున నాశక్తిఁ దలఁచి "నేను రేపు దీనిఁ బ్రయోగించి సవ్యసాచిని బరిమార్పవలయు" నని యోజించుచు సమరభూమికేఁగిన తోడనే కృష్ణుని మాయచే నాశక్తిని మఱచుచుండెను. ధార్తరాష్ట్రులుకూడ దానిని నిశాసమయమునఁ గర్ణునకుజ్ఞాపకము సేయుచు రణరంగమునఁ కరుదెంచిన తోడనే మఱచుచుండిరి.

ఇప్పుడాశక్తి దుర్యోధనునకు స్ఫురణకురాఁ నతఁడు కర్ణు నుద్దేశించి "మిత్రమా! కిరీటివిషయము దరువాత నాలోచింప వచ్చును. మనవారెల్లరు నేఁడే ఘటోత్కచుని బాధఁ బడుచుండిరి. కావున నీవాశక్తి నిప్పుడితనిపైఁ బ్రయోగింపు" మని చెప్పెను. అంతటఁ గర్ణుఁ డాఘనశక్తిని ఘటోత్కచుని పయిఁ బ్రయోగింప నది యారాక్షసునిఁ గడ తేర్చెను. అప్పుడు కృష్ణుఁడు "పార్థునిపీడ నేఁడు వదలె" నని తనవారికిఁ జెప్పి సంతోషించెను.

అనిశానమయమున నుభయపక్షములవారును నిద్రాభరముచే మిగుల డస్సియుండఁ గిరీటి కరుణాయత్తచిత్తుఁడై యెలుఁగెత్తి "ఉభయ పక్షములవారును మిగులఁ నలసి యుండిరిగావునఁ గొంతతడవు విశ్రమించిన పిమ్మట పనిసేయుట యుక్త" మని వచింప దానికెల్లరు నంగీకరించి, ధనంజయునిఁ గొనియాడుచు నెక్కడివారక్కడఁ గొంచెము సేపు నిద్రించిరి. కొంతతడవునకుఁ గుముదినీకాంతుఁడు గగనమండలమునఁ బ్రకాశింప నెల్లవారును మేల్కని మరల సమరమునకుఁ గడఁగిరి. అనంతరము ద్రోణాచార్యుఁ డతి రౌద్రమూర్తియై పాంచాల, కేకయ, మాత్స్యబలములఁ జెండాడుచు, విరాటద్రుపదులఁబరిమార్చెను. భారద్వాజుఁడట్లు మఱునాఁటి మధ్యాహ్నము వఱకును బాండవ వాహినిఁ జిందరవందర సేయుచుండ, సాత్యకి, ధనంజయ ధృష్టద్యుమ్న ప్రముఖులు సైతము మహావీర వరేణ్యునిఁ గెలువ లేకపోయిరి.

అప్పుడు వాసుదేవుఁడు పాండవుల దైన్యముఁ గాంచి "సమ

రమున నిమ్నగాసూనునిఁ జయింప నేరికి నలవిగాదు. అందులకై నొక్క యుపాయము సెప్పెద నాలింపుఁడు. ఇప్పుడు మన వాయు తనూజునిచే నశ్వత్థామ యనఁబడు నొక్క మాతంగము మడిసె; కావున నానెపమున నిప్పుడొక్కరుఁ డాచార్యుని పాలికిఁబోయి యశ్వత్థామ నచ్చెనని చెప్పినచో నతఁడు సంగ్రామము చాలించు"నని వచింప, యుధిష్ఠిరార్జును లట్లుసేయనొల్లకఁ జింతించుచుండిరి. అంతటఁ బవన నందనుఁడు ద్రోణుని పాలికిఁబోయి "అశ్వత్థామ నచ్చె"నని వచింపఁ నతఁడు తన తనయునస్త్రవిద్యాది గుణములు గణుతించి యాతని వచనములు పెడచెవులఁబెట్టి రణము సేయుచుండెను.

అప్పుడు విశ్వామిత్ర భరద్వాజ గౌతమాది మునివరేణ్యులు కొందఱు ద్రోణాచార్యునకుఁ బొడసూపి "భారద్వాజా! భూసురోత్తముఁడవు, వేదవేదాంగ విదుఁడవునగు నీవు సంగ్రామము సేయుట ధర్మమగునే? ఇంతకు బూర్వము చేసినఁ జేసితివి; ఇక నీకుఁ గాలము పూర్ణమయ్యెఁ గావున నాయుధములు విడిచి శాంతి వహింపు"మని చెప్పి యంతర్ధానులైరి

అంతనాచార్యుఁడు తనసుతుఁడు మృతుఁడైనదియు లేనిదియు సత్యవ్రతుఁడగు యుధిష్ఠిరుని వలనఁ దెలిసికొనఁగోరి యాతని నడిగెను. అంతకుమున్నే వాసుదేవ భీమసేనాదులెల్లరును "ద్రోణుఁడీదివసమంతయు నిట్లు సమరము సేయునేని మన వారెల్లఱు మడియుట నిక్కము; నీవారి నందఱి నీతనిబారిఁ బడఁద్రోయక నిప్పుడొక్క యనృతమాడి రక్షింపుము. దాన

నీకిస్మృతి దోషము సేకూర"దని యుపదేశించినందున ధర్మనం
దనుఁడు "అశ్వత్థామ సచ్చె"నని పెద్దయెలుఁగునఁ బలికి యనం
తరము "కుంజర" మనుచు గుసగుసకు వినరాకుండు నటుల మెల్లఁగ
వచించెను. అంత నమ్మహీసురోత్తముఁడు చింతావేశిత
మానసుండై తనకు ఋషులుపదేశించిన వాక్యములఁ దలఁచి,
తాను సమరము సేయుచున్నఁ బాండవులకు విజయము సేకూర
దని యమ్మహనీయులుపదేశించిరని భావించి తానికనస్త్ర
సన్న్యాసము సేయుట సమంజసమని నిశ్చయించుచుండ ధృష్ట
ద్యుమ్నుఁ డాతనితో నని సేయనరుదెంచి వాఁడి నారాచములఁ
బ్రయోగింపఁదొడఁగెను. ద్రోణుఁ డని సేయనొల్లకయున్ననుఁ
గాంచి సహింపఁజాలక దివ్యాస్త్రములఁ బ్రయోగింపనెంచ నవి
ప్రతిఘటింపక యుండ: అంతనతఁడు ప్రకృతిబాణములఁ
బ్రయోగించి ధృష్టద్యుమ్నుని సారథిని తురంగములనుగూల్చి
యాతని తనువుఁ బాలసేయ భీమసేనుఁడువచ్చి యాద్రుపదనంద
నుని గురుని బారికిఁ దప్పించుకొనిపోయెను. అనంతరమా
భూసురోత్తముఁడు శాంతచిత్తుఁడై యస్త్రసన్న్యాసముసేసి తన
యరదముపయిఁగూర్చుండి యోగనిష్ఠ నత్తనువుఁ ద్యజించి ప్రకట
జ్యోతీరూపమున నెగసి పరమస్థానమునకుఁ జనియె. ఆ దివ్య
తేజము కృష్ణార్జున యుధిష్ఠిరనృపులకు మాత్రము గోచరమయ్యె!

అప్పుడు ధృష్టద్యుమ్నుఁడు కృపాణపాణియై వెడలి,యుధిష్ఠి
రార్జునులు "వలదువల"దని కేక లిడుచున్నను వినక,మృతుఁడైన
యమ్మహనీయుని కేశములఁబట్టుకొని గళముఁద్రుంచి యాం

పవిత్ర దేహమును ధరణీ తలగతము సేసెను. అట్టిదుష్కార్యముఁ జేసినందులకు సాత్యకీధనంజయు లాతని పయిఁ గోపించిరి.

ఆచార్యుఁడు మృతుఁడైనతోడనే కౌరవవాహిని చెల్లాచెదరై పరుగులిడ నారంభింప, వేఱొక దిశనఁ బోరాడుచున్న యశ్వత్థామ యది గాంచి వచ్చి నిజజనకుని మరణవృత్తాంతము నాలకించి శోకాకులితమానసుఁడై, ధృష్టద్యుమ్నుఁ డమ్మహాసీయు నవమానించెనని విని క్రోధారుణితనయనుఁడై సుయోధను నవలోకించి "కౌరవేశ్వరా! రణరంగమున నాచార్యు నిట్లవమానించిన యాధృష్టద్యుమ్ను సహితముగఁ బాండవవాహిని నంతయుఁ జంపినార్చి నీకు జయముఁగూర్చెద; నాదివ్యాస్త్రమహిమఁ జూడు" మని పలికి సైనికుల నందఱిని మరల రణమునకుఁ బురికొల్పి, పాండవానీకము పైకి నారాయణాస్త్రముఁ బ్రయోగించెను.

అమ్మహాస్త్ర మనలజ్వాలల చెల్లఁ బ్రకాశించుచు వచ్చుచుండ వసుదేవసుతుఁ డవలోకించి "సైనికులారా! మీరెల్లరును సామజహయరథములు దిగ్గి యాయుధములు విడిచి నిలువుఁడు. భూమి గతులగు నిరాయుధుల నిమ్మహాస్త్ర మేమియుఁ జేయ"దని పెద్ద యెలుఁగునఁ బలుక నచటివా రెల్లరు దమతమ యాయుధములు విడిచి పుడమిపై నిలువఁబడిరి. అప్పుడు సమీరనందనుఁడు రోషపరవశుఁడై తనవారినిఁ గాంచి

చ. "డిగకుఁడు వాహనములుగడిందిమగంటిమిఁ గోలుపోవ మీ
రు గడఁక దక్కఁ బెట్టకుఁడు రూపఱ నాయుధముల్ మహాస్త్రక

త్రిఁ గెలుతుఁ గోత్రభిత్కులిశ తీవ్రశరముల వైభవముధూ
ళిగదవిహారభంగియుఁ శిప్రశరములు కెచ్చలింపఁగన్."

అనుచు సింహనాదముసేసి యశ్వత్థామ నెదుర్కొనియె. తక్కిన వారందఱును నిరాయుధులై భూమిపై నిలువఁబడుటచే నారాయణాస్త్రము వారల నేమియుఁ జేయక, కార్చిచ్చులోనగువు చందమునఁ బవనతనూజునిఁ జుట్టుముట్టెను. కృష్ణార్జును లదిగాంచి బలవంతముగ నాతనిఁ బట్టుకొని ఘడమిపైకిఁ ద్రోచి నిరాయుధునిఁ జేయ నారాయణాస్త్రము ప్రశాంతిఁబొంది యేమియు నపాయము సేయక యదృశ్యమయ్యెను.

తన పరమసాధనము కృష్ణుని యుపాయముచే నట్లు వ్యర్థ మగుటఁగాంచి యశ్వత్థామ విషాదాక్రాంత చిత్తుఁడై యరుణగ భస్తి యస్తగిరిసమీపమున కరుగువఱకు సమరము సేసి పిమ్మట బలములఁ దెలియ నియమించి దీనాననుఁడై తన శిబిరమున కేగెను. పాండవులును సమరము చాలించి తమతమనివాసముల కేఁగి విశ్రమించిరి.

—* కర్ణపర్వము *—

పదునాఱవనాఁడు సుయోధనుఁడు తన ప్రియమిత్రుఁడగు కర్ణుని సర్వసేనాధిపతిఁ జేయ నతఁడు సైన్యమును చతురముగ నడిపించుకొనుచు సమరభూమికరుదెంచెను. పిమ్మట నుభయపక్షముల వారును దమతమ శౌర్యముఁ బ్రకాశింప నని సేయఁదొడఁగిరి. ఆనాఁటి యాహవమున, కులూత దేశపాలకుఁడైన క్షేమధూర్తి యను రాజు భీమునిచే హతుఁడయ్యెను. యుధిష్ఠిర నందనుఁడగు ప్రతి

వింధ్యునిచేఁ, జిత్రుండను నృపాలుఁడు సమసెను. కర్ణుఁడు సహదేవునితోఁ బోరి యతనిఁబట్టుకొనియు జంపనొల్లక యవమానించి విడిచెను. ఇరువాగులు వారును నిట్లు దిననాథుఁడ స్తమించువఱకుఁ బోరాడి పిమ్మటఁ దమతమ సేనలను మరలించుకొని నిజ నివాసముల కేఁగిరి.

మఱునాఁటి ప్రాతఃకాలమున నందఱును సమరభూమి కేఁగు సమయమునఁ గర్ణుఁడు కురురాజు నుద్దేశించి "మహీనాథా! కృష్ణుఁడు సారథ్యము చేయుచుండుటచే సవ్యసాచి నాకఁ జేయుఁ డయ్యెను. అశ్వహృదయజ్ఞానమునఁ గృష్ణునితో సముఁడగు శల్యుఁడు నాకు సారథ్యముచేయు నేని నేఁడిదినమున గాండీవిని జయింతు"నని చెప్పెను. అంతట సుయోధనుఁడు మద్రమహీపాలునిఁ బెక్కువినయముల బ్రతిమాలి కర్ణునకు సారథ్యము సేయ నొడఁబఱచెను.

పిమ్మట శల్యుఁడు రాధేయుని తేరు నడుపుచుండ నతఁడు "నేఁడిదినమున ధనంజయుఁ బరిమార్చి కురుపతికిఁ బ్రియము సేయుదు"నని పలికెను. శల్యుఁడప్పలుకు లాకర్ణించి "అంగరాజా! సురాసురులకు జేయుఁడగు విజయుని నీ వెంతమాత్రము గెలువఁ జాలవు. ఈవ్యర్థ ప్రలాపము లుడిగి నీవాతని నెదుర్కొనక వేఱొకనితో నని సేయుము. నాయుపదేశము నాలించి దుస్సాధ్యపు పనికిఁ బోకు"మని వచింప, రాధేయుఁడు "మద్రభూపాలా! నీవు ధనంజయునివిక్రమము పొగడుచు నన్నుఁ దూలనాడెదవు. పార్థుఁడెఱిఁగిన దివ్యాస్త్రము లన్నియు నేను నెఱుఁగుదు; తొల్లి

నేనస్త్రశిక్షార్థినై పరశురామునికడకేఁగ నమ్మహాత్ముఁడు నన్నుఁ గులముఁ దెలుపుమని యడిగెను. అప్పుడు నేను సూతుఁడనని చెప్పినచో నమ్మహనీయుఁడు దివ్యాస్త్రముల నుపదేశింపఁడని తలఁచి విప్రుఁడనని చెప్పితి. అంత నమ్మునీంద్రుఁడు నాయెడఁ గరుణాళుఁడై భార్గవాస్త్రాదివరమాస్త్రముల నొసఁగెను. అనంతర మొకనాఁడ తత్తపోధనుఁడు నాయంకతలమున నొరఁగి నిద్రించుచుండ, సుత్రాముఁడు ధనంజయుని హితముఁగోరి యొక్క వికృతకీటకరూపధారియై వచ్చి నాతొడఁ దొలచ నారంభించెను. గురువునకు నిద్రాభంగమగునని నేనాబాధకు సహించియుండ రక్తము వెల్లువయై ప్రవహింపఁదొడఁగెను. కొంతతడవున కమ్మహాత్ముఁడు మేల్కాంచి నెత్తుటి వెల్లువఁగని, తత్కారణము నన్నడిగి తెలిసికొని నాధైర్యమునకు విస్మయమందుచు "నీవు భూసురుఁడవు గావు. మఱి యేకులజుఁడవో నిక్కముఁ దెలుపు" మని గద్దింప నే సూతుఁడనని చెప్పితిని. నను వంచించినవాఁడవని కోపించి "కపటమున భార్గవాస్త్రమును గ్రహించితివి గావున నయ్యస్త్రము నీకవసరసమయమునఁ దోఁపకుండుఁగాక!" యని నన్ను శపించెను. అనంతర మొకనాఁడు నే నాశ్రమమునకై వివిధాశుగములు ప్రయోగించుచుండ నచటి కొక ధేనువత్సము పరుగెత్తుచువచ్చి, నాయస్త్రవశమున నంపతాఁకున విగతజీవి యయ్యెను. దాని బోషించు ధరణీదేవుఁ డదిగాంచి యధిక కోపమున "ఓయీ! నిష్కారణముగ మదీయ హోమధేనువత్సమును జంపితివి. కావున నీ వేశూరుని గెలువఁగోరి శ్రమముసేయు

చుంటివో యానిచేఁ జచ్చెదవు. మఱియు సవ్వీరునితో నుత్సాహ ముగాఁ బోరునప్పుడు నీరథ చక్రము పుడమిఁ గ్రుంగుఁగాక” యని నన్ను శపించి చనియెను. నేనీ శాపద్వయమునకు వెఱతునే కాని కిరీటికి వెఱచువాఁడఁగాను. నేఁడు నా పరాక్రమము నీక్షింతువుగాక” యన్నని వచించెను.

అనంతర ముభయపక్షముల వారును సమరభూమికి నరుదెంచిరి. అప్పుడు కర్ణుఁడు ధనంజయుఁడు పరస్పర ముదుర్కొని సధికోత్సాహముతో యుద్ధము సేయుచుండ నంతలో [illegible] అర్జునునిపయిఁ గవిసి [illegible] డగిరి. అంతట రాధేయుఁడు పాండవాగ్రజుని పైకి నడుపుచుండ [illegible] కష్టపడిరి. కర్ణుఁడు బెక్కండ్రఁ [illegible] యుధిష్ఠిరు నెదుర్కొని యాతని [illegible], కుంతీ వచనము దలంచి చంపనొల్లక “ధర్మనందనా! సమరభూమిని నిలిచి నాతో నీవు పోరాడఁజాలవు. శాంతుఁడ [illegible] యుంటివి [illegible] శత్రువుల నా [illegible] ము” యనుచుఁ జేతి [illegible] విడిచిపెట్టెను.

అగ్రజుని సంరక్షించిన యవమానముఁ గాంచి భీమసేనుఁ డుగ్రుఁడై [illegible] రాధేయునితోఁ [illegible] మూర్ఛితుం జేసి నాలుకఁ గోయఁబోవ శల్యుఁడు “పవనసంభవా! ఈతని జంపకు. ధనంజయుఁడు ప్రతిజ్ఞఁ గావించి యుండెఁగావున నీవు చంపవలదు. ఈతఁడు నీచేఁ జచ్చెనేని విజయుని మనము చిన్నవోవు” నని చెప్పెను. అప్పలుకు లాలించి వాయుసుతుఁ డాప్రయత్నమునుండి మరలి గాంధారేయులఁ బెక్కండ్రఁ బరిమార్చి కర్ణ నందనుఁడగు సత్య

సేనుని వధించెను. పిమ్మటఁ గర్ణుఁడు మూర్ఛఁ దేరి విజృంభించి పాండవవాహినిఁ జెండాడ నారంభించెను.

అటఁ గిరీటి తన్నుఁ జుట్టుముట్టిన సంశప్తకుల నందఱినిఁ దెగటార్చి కౌరవానీకముఁ దాఁక నరుదెంచి దండధారుడను మాగధునిఁ గూల్చి యశ్వత్థామ నోడించి, ధర్మతనయుని క్షేమము నరయఁగోరి సమరప్రదేశమున వెదకి యమ్మహీపాలునిఁ గానక భీముని గాంచి "భూనాథుఁ డేఁడీ" యని యడిగెను. అనుజా! మన యగ్రజుఁడు కర్ణునిచేఁ గడునొచ్చి శిబిరమున కరిగెను. కావున నీవు శిబిరమునకేఁగి యాతని కుశలము నరసిర''మ్మని పవనతనయుఁడు పలికెను.

అంతట మాధవ ధనంజయులు ధర్మతనయుని శిబిరమున కరిగి, రాధేయుని శరజాలములకుఁ గడునొచ్చి శయ్యాతలమునఁ బరుండియున్న యారాజచంద్రుఁ గని యాతఁడు కుశలియై యుండుటకు సంతోషించిరి. కర్ణునిఁ జంపకయే గాండీవి మరలి వచ్చె నని పాండవాగ్రజుఁడు కినియ, మాధవ ధనంజయు లాతనిఁ బ్రసన్న చిత్తుం జేసి "నేఁడు తప్పక రాధేయునిఁ దెగటార్చి వచ్చెద" మని చెప్పి మరల రణరంగమున కరుదెంచిరి. శిబిర సేవకులు ధర్మతనయుని కుశలవార్త ధనంజయునివలన విని సంతోషప్రసన్న చిత్తులై యని సేయఁదొడఁగిరి.

ఆనాఁడు కర్ణుఁడు "భీష్మద్రోణులకంటె నీతఁడు శౌర్యమునఁ బేరుచుండె" నని యెల్లరు దన్ను మెచ్చునటుల విజృంభించి పోరాడుచు పాండవవాహినిఁ గలంచుచుండఁ గిరీటి కర్ణుని సుతుఁ డగు వృషసేనునిఁ దాఁకి యాతనిని సమయించెను. అప్పుడు వృకో

దరుఁడు దుశ్శాసనునితోఁ బోరి వాని వక్షముఁ జీల్చి రక్త పానముఁ జేసి తన ప్రతిజ్ఞ నెరవేర్చికొనియె. తమ సోదరుని దుర్మరణమును గాంచి ధార్తరాష్ట్రులు పదుగురు భీమసేనుఁ జుట్టుముట్ట నవ్వీరుఁ డాకుమారదశకమునుగూల్చి వీరవిహారము సలుపుచుండెను.

తన తనయునిఁ గిరీటి సమయించుటఁ గాంచి కర్ణుఁడు శోకాకులుండై వచ్చి యాతని నెదుర్కొని పోరఁదొడఁగెను. అంతటఁ బార్థకర్ణులన్యోన్యజయార్థులై పెనఁగుచు నొండొరులపై ననేక దివ్యాస్త్రములఁ బ్రయోగించుకొనుచుండిరి. కొంత తడవునకు రాధేయుఁడు నాగబాణమును ధనంజయుని శిరముకు గుఱిపెట్టుచుండ శల్యుఁడు గాంచి సవ్యసాచిని రక్షింపనెంచి "రాధేయా! ఈసంధానము మెడకుమాత్రముగా కన గుణముగాదు. ఇంకఁగొంచెము పైకి గుఱిపెట్టు" మనివచింపఁ గర్ణుఁడు కోపించి "నాకు నీవు లక్ష్యముఁ దెలుపనవసరములే" దని శల్యునిఁ గసరి యాశరముఁ బ్రయోగించెను. వాసుదేవుఁ డానాగశరము నవలోకించి సవ్యసాచియరదమును పంచాంగుళ మాత్రము ధరణిం గ్రుంగ నదిమెను. ఆకారణమువలన నాగాస్త్రముచే విజయునకేయపాయము వాటిల్లక, నాతని శిరమున నున్న యింద్రదత్తమైన దివ్యకిరీటము మాత్రము ధరణిఁ గూలెను.

అంత నాక్రూర భుజంగము తనచేఁ బుడమిఁ గూలినది కిరీటమేగాని, కిరీటిశిరము గాదని యెఱిఁగి మరల ధనంజయుని పైకి వచ్చుచుండ నతఁడు వాడినారాచములు ప్రయోగించి

దానిని సంహరించి "వాసుదేవా! ఈనాగమిట్లు వచ్చుటకు కత మేమి?" యని యడిగెను. "ఫల్గునా! మున్ను ఖాండవ వనము దగ్ధమగు నప్పు డీయశ్వసేనాభిధానభుజంగము తన తల్లి నయ్యనలము నుండి తప్పించుకొని పోవుచుండ నీవు బాణముఁ బ్రయోగించి యానాగాంగనను జంపితివి. అప్పటినుండియు నీసర్పము నిప్పుడు పగఁబూని కర్ణునియొద్దనుండి నేఁడాతనిచేఁ బ్రయోగింపఁబడి నిన్నుఁ జంప నరుదెంచె" నని యాసర్ప వృత్తాంతమును కృష్ణుఁడు విజయునకుఁ విశదపఱచెను.

పిమ్మట ధనంజయుఁడు తన శిరస్సునకు మేలుకొఱకు పాగఁ జుట్టుకొని కర్ణునిపైఁ దీక్ష్ణాస్త్రములఁ బ్రయోగించి యాతనిని క్షతగాత్రునిఁ జేయఁ గర్ణుఁడును తన [illegible] వ్యర్థమగుటకుఁ జింతించుచు విజయునిపై వాఁడి నారాచములఁ బ్రయోగించుచుండెను. పరశురాముని శాపమున నప్పుడాతనికి భార్గవాస్త్రము ప్రతిభాసింపకుండెను. మఱియు బ్రాహ్మణశాపమున నప్పు డాతని రథచక్రము భూమిం గ్రుంగెను.

అంతఁ గర్ణుఁడు "ధనంజయా! నారథచక్రము ధరణిం గ్రుంగెను. నేను దీని నెత్తువఱకు నాపై నస్త్రములఁ బ్రయోగింపకుము. రథస్థుఁడు భూమిస్థునితో ననిసేయుట ధర్మవిరుద్ధ" మనుచు నరదము డిగ్గి తన బలమంతయు వినియోగించి యాచక్రము నెత్తుచుండెను. అప్పుడు కృష్ణుఁడు కర్ణునుద్దేశించి

సీ. "కౌంతేయు నందఱు గొడుకులు సుప్తులై
యుండంగ లక్క యిల్ మండఁజేసి
కపటంపు జూదంబు ఘటియించి ధర్మాత్ముఁ డగు
ధర్మసుతు సిరి యపహరించి

యంతఁ బోక ద్రుపదాత్మజఁ దెచ్చి
సభాస్థలి నమ్మాయి భంగపఱచి
యమ్మహాత్ములఁ జంప నడవికి ఘోష
యాత్రావిధి నెపమున దాడిపెట్టి
బాలునభిమన్యు నొక్కని బహురథికులఁ
బనిచి చంపించె మీసుయోధనుఁడు దలఁపఁ
గాని యిప్పాపముల కాడక ర్తవీవ
యిన్ని యెడలను నీపాడి యెందుఁ బోయె?"

అని పలుకుచుండఁ గవ్వడి రోషపరవశుఁడై రాధేయునిపై వాడి నారాచములఁ బ్రయోగింపసాగెను. కర్ణుఁడు భూమిస్థుఁడయ్యును పార్థునిపై బాణములు నేయుచు తన శక్తినంతయువిని యోగించి యాచక్రము నెత్త నది ధరణీసహితముగ నాలుంగుళములు పై కెగసెను. అంతట రాధేయుఁ డరదము నధిరోహించి బాణముసంధింప నాచక్రము మరలఁగ్రుంగెను. కర్ణుఁడందులకుఁ గటకటఁ బడుచు మరల రథావతీర్ణుఁడై చక్రమునెత్తుచుండ విజయుఁడు కృష్ణప్రేరితుఁడై యొక ఘోరశరముఁబ్రయోగించి యా వీరవరేణ్యుని శిరమును నేలఁగూల్చెను. అప్పుడు సకల జనములు వీక్షించుచుండఁ గర్ణునిచే తనువునుండి యొక దివ్యతేజము వెలువడి వారిజాప్తబింబమునఁజొచ్చెను.

కర్ణుని మరణవార్తనాలించి దుర్యోధనుఁడు మిక్కుటముగ దుఃఖించుచు నప్పటికి సూర్యాస్తమయసమయమగుటఁ గని బలములఁ దెలియ నియమించి నిజశిబిరమునకుఁ జనియెను. కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తములఁ బూరించుచు నతి సంతోషముతోఁ దమసేనలను మరలించుకొని శిబిరమున కరిగి ధర్మతనూజునిఁ బ్రమోదభరితమానసునిఁ జేసిరి.

—♦ శల్య పర్వము ♦—

ఆనాఁటి రాత్రి సుయోధనుఁడు కర్ణునిఁ దలఁచి యధిక పరితాపము నొందుచుండఁ గృపాచార్యు డమ్మనుజేంద్రునిఁ దగ్గఱి "కౌరవేశ్వరా! భీష్మద్రోణకర్ణాదియోధవరేణ్యు లెల్లరు సమసిరి. ఇఁక మనకుఁ బరాజయము సిద్ధము; కావున నిప్పుడైనను నీవు ధర్మతనూజునితో వైరము విడిచి సఖ్యము సేయుట సమంజసము. ఆ ధర్మశీలుఁడు నిన్ను విడనాడక రాజ్యమునఁ బాలొనఁగి రక్షింపఁగలవాఁ" డని యుపదేశించెను. దుర్యోధనుఁ డయ్యుపదేశము నాలించి వేఁడి నిట్టూర్పు నిగిడించి "ఆచార్యా! నీవు నాయందలి ప్రేమచే నిట్లుపలుకుచుంటివి గాని, యీపలుకులు నాకు మాత్రము రుచింపవు. మొదటి నుండియు నే ననేక విధములఁ బాండవులను జిక్కులుపెట్టి యిప్పుడు తుచ్ఛప్రాణమున కాసపడి వారిముంగిటఁజొచ్చు టెంతయు నీచకరము. కావున నేనట్లు సేయనొల్లను. ప్రాణమున్నంతవఱకుఁ బాండవులతోఁ బోరి వారినిజయించి రాజ్యమునైనను, లేనిచోఁ గర్ణాదులవలె వీరస్వర్గమునైనను బొంద నిశ్చయించితి" నని వచించి, కృప కృతవర్మాశ్వత్థామ శకుని శల్యులతో నాలోచించి యారాత్రి శిబిరమున నిద్రించుట యుచితము గాదని తలఁచి యచటికి రెండామడల దూరమున నున్న సరస్వతీనదీతీరమునకుఁ జని యచ్చటఁ దనవారితో మజ్జనభోజనాదులనాచరించి శల్యునిఁ జమూపతినిఁ జేసి విమ్మట విశ్రమించెను.

పదునెనిమిదవనాఁడు మరల నిరుపక్షములవారును భేరీప్రముఖతూర్య నిస్వనములు చెలఁగ రణరంగమున కరుదెంచి ఘోరముగాఁ దాఁకి పోర నారంభించిరి. అప్పటికి దుర్యోధనునకుఁ బదునొకండువేలు రథములును, పదివేల నేఁడునూఱు గజములును, రెండులక్షలు హయములును, మూఁడుకోట్లు పదాతులును మిగిలియుండిరి. పాండవుల కాఱువేలు రథములును, మూఁడువేలు వారణములును, లక్ష తురంగములును, గోటి కాల్బలములును మాత్రముండెను. ఆనాఁడుభయబలములు నధికోత్సాహముతోఁ బోరుచుండఁ గర్ణనందనులు చిత్రసేన, సత్యసేన, సుశర్ములను వారు నకులునిచేఁ జచ్చిరి. సురథుఁడను పాంచాలకుమారుఁ డశ్వత్థామచేఁ జచ్చెను. భీమసేనుఁడు శల్యుఁడును గొంతతడవు గదాయుద్ధము చేసి యొకరి గదాఘాతమున నొకరు మూర్ఛితులైరి. అప్పుడు కృపాచార్యుఁడు వచ్చి శల్యునిఁ దనస్యందనముపైఁ బరుండఁబెట్టుకొని తొలంగఁ గొనిపోయెను. అంతట భీమసేనుఁడును దెప్పిఱిలి లేచి మరలఁ గౌరవబలములఁ జక్కాడఁ దొడఁగెను.

అశ్వత్థామయు, సంశప్తకులును ధనంజయునిఁ జుట్టుముట్టి పోరాడుచుండ, శల్యుఁడు సేదఁదీర్చికొని వచ్చి విజృంభించి పాండవబలములను జెండాడుచు, ధర్మతనయు నెదుర్కొని యాతనిపై నిశితసాయకములఁ బ్రయోగించి మూర్ఛితునిఁ జేసెను. అంతట సాత్యకి ధృష్టద్యుమ్న భీమసేన ప్రముఖులువచ్చి యాతనితోఁ బని సేయసాగిరి. కృపకృతవర్మాదియోధులు

శల్యునకు బాసటయై పోరఁదొడఁగిరి. అంతలో ధర్మతనూజుఁడు వేఁదేరి మద్రనాథునితో మరల నతిరౌద్రముగఁ బోరఁ దొడఁగెను. అట్లు పోరుచు యుధిష్ఠిరుఁడు మున్నొకపరి దాను ఫాలలోచనువలనఁ బడసిన మహనీయశక్తి నాతనిపైఁ బ్రయోగింప నది మద్రనాథునివక్షమును భేదించెను. అంత నతఁడు రుధిర ధారలొలుకఁ బుడమిపైఁ గూలి విగతజీవుఁ డయ్యెను.

శల్యుని బాంధవులెల్ల నదిగాంచి యుధిష్ఠిరునిపైఁ గవియ, సాత్యకి భీమసేనాదులు వారినిఁ జెండాడఁ దొడఁగిరి. ధనంజయుఁడు సంశప్తకుల సంహతిని సుశర్మయుతముగఁ జంపివచ్చి తనవారికి బాసటయై నిలిచి యనిసేయసాగెను. ఆనాటి సంగ్రామమున ధృష్టద్యుమ్న సాత్యకులచే సాల్వుఁడు సమసెను. దుర్విషహ, దుష్టదర్శనాగ గాంధారేయులందఱును వృకోదరునిచే మడిసిరి. గాంధారపతియైన శకుని సహదేవునిచే నిహతుఁడయ్యెను.

అట్లు తనవారెల్లఱు రణావనిం ద్రెళ్ళుటఁ గాంచి శోకాక్రాంతచిత్తుఁడై సుయోధనుఁడు హతశేషులగు నిజసైనికులను బురిగొల్ప వారలు రక్షకరహితులయ్యును దెంపుపెంపున శక్తికొలఁది సవ్యసాచిని బొడిచి యాతని బాణశిఖా సందోహమునఁ గ్రుంగిపోయిరి. అంతఁ గౌరవనాథుఁడు తానొక్కఁడు రణరంగమున నిలువనోపక గదాయుధము భుజమున నిడుకొని పలాయనపరుఁ డయ్యెను. కృతవర్మకృపాశ్వత్థామలును సమర భూమినుండి తొలఁగిపోయిరి. పాండవబలమునకు నప్పటికి రెండు

వేలస్యందనములును, నేఁడునూఱులు మాతంగములును, నైదు వేలు గుఱ్ఱములును, పదివేల పదాతులును మాత్రము బ్రదికి యుండిరి.

దుర్యోధనుఁడు జలస్తంభన విద్య నేర్చినవాఁ డగుటచే ద్వైపాయనహ్రదమున డాఁగియుండెను. పాండునందను లాతనిఁ జాలసేపు వెదకి యెచ్చోటను గానక విసుగుకొంది, కురునాథుని జాడనరయుఁ గొందఱు చారులను నియమించి తాము నిజ శిబిరముల కేఁగిరి.

పిమ్మట నాహ్రదము కడకుఁ గృతవర్మ కృపాశ్వత్థామ లరుదెంచి "కౌరవేంద్రా! దీనునివలె నీ విమ్మడుఁగున డాఁగ నేల? మమ్ము ముగ్వురను బురస్కరించుకొని సమరభూమి కరుదెంచి పాండవులను జంపి రాజ్యలక్ష్మిని గైకొనుము. కానిచో వీరస్వర్గముఁ జూఱఁగొను"మని వచింప సుయోధనుఁడు "వీరవరేణ్యులారా!

చ. తనువు ఘనాస్త్రశస్త్రముల తాఁకున నొప్పిని దప్పిఁ బుట్టె నా
మనము వశంబుగా కెడలె మాటల చందము సూపమీఱ డ
స్సినయటులున్న వారలను జీవులు లేరు తొలంగి నేఁటి మా
త్రనిలువుఁ డెల్లి పైకొని యరాతుల గెల్తము లావు వచ్చినన్."

అని చెప్పెను.

అప్పు డాసమీపమునఁ జరించుచున్న బోయలు కొంద ఱావచనముల నాలించి, సుయోధనుఁ డమ్మడుఁగున డాఁగి యుండెనని నిశ్చయించి, పాండవులు సుయోధనుని వెదకఁ

దమ కాజ్ఞాపించియుండిరి కావున సత్వరముగఁ బాండవశిబిరమున కేఁగి యవ్వార్త వారల కెఱిఁగించిరి.

అంతటఁ బాండవులు తమవారలం గూడి ద్వైపాయనహ్రద సమీపమునకు వచ్చుచుండఁ గృతవర్మ కృపాశ్వత్థాము లా కలకలము నాలించి "సుయోధనా! పాండవులు వచ్చుచుండిరి. నీవనుజ్ఞ నొసఁగిన దో మేమిప్పుడు వీరిని మార్కొనెదము. లేనిచో నెందైన డాఁగియుండెద" మని పలికిరి. "మీ రిప్పుడు పాండవుల నెదుర్కొనక నెందైన డాఁగియుండి రాత్రియైన పిమ్మట నిచటికి రండు. అప్పుడు కర్తవ్యము నాలోచింతము. ఇమ్మడుగున డాఁగియుండ నన్నుఁ బాండవు లెఱుఁగఁజాలరు. ఒకవేళ నెఱిఁగినను బట్టుకొనఁజాలరు. నే నీఁదు విద్యయు దక్షుఁడనై యుండెద. మీరు సత్వర మిచ్చోటువిడిచి యరుగు"డని సుయోధనుఁడు పలుకఁ నారథికత్రయము పొగులు మనములతోఁ వేఱొక తావునకుఁ జనిరి.

అనంతర మచ్చటికి బంధుజాలముతో యుధిష్ఠిర నృపాలుఁ డరుదెంచి కురునాథు నుద్దేశించి—

చ. "ఇటు తగునే సుయోధన, మహీవలయంబున నట్టి దైన్య మె
చ్చట వినఁజూడఁ గలేదు యసంఖ్యులు రాజులు నీకు గాఁగఁ జ
చ్చుటయును బంధుమిత్రులు విశుద్ధచరిత్రులు పోరనట్లు త్రుం
గుటయును జూచి తేమిటికి గ్రుంకితి నీళ్ళను జావు దప్పునే?

చ. "అని మము నోర్చినం బృథివియంతయు నేలఁగవచ్చు లేక చ
చ్చినసురసద్మ సౌఖ్యములు చేకుఱు రెండు దెఱంగులందు నొ
ప్పనియది లేదు డాఁగ నగుబాటును బ్రాణము చేటుఁ దెచ్చుకోల్
వినుమము నీ వెదుర్పఁదగు వేయువిధంబులఁ జాటి చెప్పెదన్."

అని గంభీరముగఁ బల్కెను. "ధర్మనందనా! బంధుమిత్ర పరివార జనమెల్ల రణభూమిం దెగుటవలనను, శరఘాతములచే నామేను మిగుల నొచ్చియుండుట వలనను నిచటికివచ్చి కొంచెము సేదఁ దీర్చుకొనఁ దలఁచితి. కొంతతడ విట విశ్రమించినపిమ్మట సమరమున కరుదెంచెదను. అంతదనుక మీరును విశ్రమించి నం" డని సుయోధనుఁ డాతనికిఁ బ్రత్యుత్తర మొసఁగెను. "నీవిట కరుదెంచి చాలతడవయ్యె. ఇంతవఱకు విశ్రమించినది చాలును. ఇఁక సత్వరము బయటికిర"మ్మని ధర్మతనయుఁడు వచింప సుయోధనుఁడు "కౌంతేయాగ్రజా! సోదరసుతాది బంధువర్గ మెల్ల సమసినపిమ్మట నాకింకను సమరమేల? రాజ్యమేల? రాజ్యమును నీకొసఁగి విపినమున కేఁగి జటావల్కలధారినై తపముచేయ నిశ్చయించితిని. బంధుమిత్రవిరహితమగునిప్పుడమిని నీవే గట్టుకొను" మని పలుచెప్పెను. "సుయోధనా! నీవు నాకిప్పుడు రాజ్యమును దానము చేయనక్కరలేదు. కదనమున నిన్ను జయించినగాని ధరణి నేల నొల్లను. మున్ను నీవు ధర్మశీలుండవై నాకు రాజ్యమీయ నంగీకరించినచో నిట్టి కులక్షయ మేల సంప్రాప్తమగును? ఇఁక నీకపటోపాయములఁ గట్టిపెట్టి సమరమున కరుదె"మ్మని యజాతశత్రుఁడు పలుక నచటివారెల్లరు నవ్వచనములనే వచించిరి. అంతట సుయోధనుఁడు "పాండవాగ్రజా! మీరేవురును పరివార బాంధవ మిత్రశస్త్రాస్త్ర సహితులై యుండిరి. నేనొంటినై యుంటిని. కావున మీరందఱొక్కపెట్టున నన్నుఁ జుట్టుముట్టి పోరక యొక్కరొక్కరుగ

వచ్చి పోరెడ రేని నేను సమరముసేయ నరుదెంతు" నని వచింప యుధిష్ఠిరుఁడు "ధృతరాష్ట్రనందనా! మీరు పెక్కండ్రుగూడి యభిమన్యుకుమారునిఁ జంపినటుల మేము నిన్ను వధించువారముగాము. మాలో నొక్కనితో నీయిచ్ఛ వచ్చిన యాయుధముఁగొని పెనఁగుము. నీవాతని జయింతువేని సకలమహీచక్రము నీకు విడిచిపెట్టెద"నని ప్రత్యుత్తరమొసఁగెను. అంతటసుయోధనుఁడు గదాహస్తుఁడై హ్రదము వెడలివచ్చి భీమసేనునితో గదాయుద్ధముసేయఁ దలపడియెను.

మున్ను తీర్థయాత్ర కేఁగిన బలరాముఁడు, భీమ దుర్యోధనులు తనయొద్ద గదాయుద్ధము నభ్యసించిన వారగుటచే వారల రణము నవలోకింప నేఁచి యరుదేర నచ్చటివారెల్ల రాతనిఁ బ్రణతులై కుశల ప్రశ్నముచేసిరి. ఆ రేవతీరమణునిగాంచి సుయోధనుఁడు నూతన బలోత్సాహము నొందెను. రోహిణీసుతుఁడు తన ప్రియశిష్యుఁడగు సుయోధనునియొక్కయుఁ గడమవారియొక్కయు క్షేమము నరసి యనంతరము వారలఁగూడి సమరభూమి కరుదెంచెను. అంతట భీమదుర్యోధనులు బలరాముని యనుజ్ఞ వడసి యనిసేయ నారంభించిరి.

అట్లు భీమ దుర్యోధను లెదుర్కొని తమ నేర్పును దర్పమును జూపుటకు వెలుపుఁగోలుపునట్లు పెక్కుభంగులఁ బోరాడుచుండఁ గృష్ణుఁడు సవ్యసాచినిఁ గని "ధనంజయా! దుర్యోధనుఁడు గదాయుద్ధమున నతికౌశలము గలవాఁడు. మనవృకోదరుఁడు బలశాలి యగునుగాని గదాయుద్ధమున నంత నిపుణుఁడు గాడు.

యుధిష్ఠిరనృపాలుఁ డనాలోచితుఁడై భీమదుర్యోధనులను గదా యుద్ధమునకు నియమించి, సుయోధనుఁడు గెలిచినచో సకల రాజ్య మిత్తునని పలికెను. పవననందనుఁ డీకఁ గొంత తడవిట్లు ధర్మయుద్ధము సేసినచో సుయోధనునిచేఁ జచ్చుట నిశ్చయము. వాయుసూతుఁడు మున్ను తాను దుర్యోధనుని యూరువులను గదాయుధముతో భగ్నముసేయుదునని చేసినప్రతిజ్ఞ మఱచి నటులఁ గన్పట్టుచున్నాఁడు. గదా యుద్ధమున నాభికిఁ దిగువభాగ మునఁ గొట్టుట యధర్మమని యోజింపకఁ దనప్రతిన నెరవేర్చి కొని యిక్కుటిలాత్మునిఁ బరిమార్చుట కర్తవ్య" మని రహస్య ముగఁ జెప్పెను. అంతట గాండీవి భీమునకుఁ దనయూరువులఁ జూపి సైగఁజేయ నతఁడు దానియర్థమును గ్రహించి గదా దండముతో సుయోధనుని తొడలు విఱుఁగఁగొట్టెను. అప్పుడు మృగేంద్రునిచేఁ గూలిన మదమాతంగము చందమునఁ దన గదాఘాతమునఁ దొడలు విఱిఁగి పుడమింగూలిన సుయోధను ను ద్దేశించి భీమసేనుఁడు "దురాత్మా! నాఁడు సభామధ్యమునఁ బాంచాలిని భంగపఱచిన ఫలమనుభవింపు" మనుచు నాతని శిరముఁ దన్నెను.

అజాతశత్రుఁ డదిగాంచి సహింపనోపక "రారాజైన సుయో ధనుని దన్నవలద"ని యనిలతనయుని మందలించి, సుయోధనుని దురవస్థఁగాంచి బాష్పాకులలోచనుఁడై "తమ్ముఁడా! విధి ప్రతి కూలుఁడై మాకును నీకును వైరముఁ గలిగించి యిట్టి దురవస్థ పాలు గావించె "ననుచుఁ బెక్కుభంగుల దుఃఖించెను.

భీమసేనుఁడు గదాయుద్ధమున నధర్మముగ దుర్యోధనుని తొడలుభగ్నముసేయుటఁ గాంచి హలాయుధుఁడుగ్రుఁడై "అధర్మముగఁ గౌరవేశ్వరునిఁ గూల్చిన యిప్పాపాత్ముని మస్తకము ఖండించెద" ననుచుఁ దనహలముఁ గైకొని వాతాత్మజునిపైకిఁ బోవుచుండఁ గృష్ణుఁ డాతనిఁ బట్టుకొని "అగ్రజా! సుయోధనుఁడు మున్ను ద్రుపదరాజపుత్రిని సభాంతరమునఁ దనతొడపై నెక్కుమని పరిహసించిన భీముఁడు కోపోద్దీపితుఁడై తన గదాయుధముతో నాతని యూరువులు భగ్న మొనర్చెదనని ప్రతిన గావించి యుండెను. ప్రతిజ్ఞా పాలనము నృపతులకుఁ బరధర్మ మగుటచే నాతఁ డిప్పుడు తన ప్రతినఁ దీర్చుకొనియెను. కావున భీమసేనునిపయిఁ గోపింపవల" దని యనేకవిధములఁ జెప్పి యాతని నుపశమింపఁ జేసెను. అంత నాబలదేవుఁడు "ఇట్టి చెనఁటి గెలుపు గెలిచిన భీమసేనుని నీవు పొగడినఁ బొగడుదువుగాక! రణధర్మముఁ దప్పక చెనఁగిన ధర్మాత్ముఁడగు సుయోధనునకు నుత్తమలోకము సేకూరు" ననిపలుకుచు రథారూఢుఁడై నిజపురమున కేఁగెను.

అప్పుడు సుయోధనుఁడు ప్రాణాంతకమైన వేదనాభరము ననుభవించుచు మధుసూదను నుద్దేశించి "కృష్ణా! నీవు నవ్యసాచికిఁ జెప్పి సైగఁజేయించుట నీపాపకర్ముఁడు ధర్మముఁ దప్పి నాతొడలు భగ్నము గావించెను. ధర్మముగఁ బోరినచో నన్నుఁ గెలువనోపునే? మఱియు నీవు శిఖండిధనువు చాటున నర్జునుని ధనువుఁ బెట్టి కొట్టించి పితామహునిఁ బడఁ

ద్రోయించితివి. పాండవాగ్రజునిచే బొంకించి యాచార్యునిఁ జంపించితివి. మాయాతిమిరముఁ బన్ని సైంధవునిఁ జంపించితివి. పుడమిని గ్రుంగిన రథచక్రము నెత్తుకొనుచుండ నన్యాయముగఁ గర్ణునిఁ గూలనేయించితివి. కురువీరుఁడగు భూరిశ్రవుఁడు సాత్యకితోఁ బోరుచుండ, ధనంజయునిచే నాతని చేయిఁ దెగఁగొట్టించి యన్యాయము చేసితివి. ఇట్టి యకృత్యములాచరించిన నిన్నేమనవచ్చు" నని క్రోధాయత్తచిత్తుఁడై పలుక గోవిందుఁడు "సుయోధనా! నీవు నిద్రితుఁడైన భీమునిఁ బాములచేఁ గఱపించియు, నీటఁ ద్రోయించియు, విషాన్నముఁ బెట్టించియుఁ బెక్కుమారులు చంప యత్నించితివి. కుంతియుఁ గుమారులు నిద్రాసక్తులై యుండుసమయమున లాక్షాగృహము దగ్ధము చేయించితివి. కపటద్యూతమున ధర్మతనయుని సిరి నపహరించి పరమసాధ్వియగు ద్రౌపదిని సభామధ్యమున నవమానించితివి. భీమసేనుఁ డానాఁడే నీయూరువులు భగ్నము సేయ నెంచియు ధర్మబద్ధుఁడై నేటివఱ కాఁగియుండెను. ఇట్లు నీవు పెట్టిన బాములనెల్ల ననుభవించియుఁ శాంతవాగ్రతుఁడు నీతో సమరము సేయనొల్లకఁ బుడమి పాలుమగ నన్నుఁ బంప నీవు నూది మొన మోపఁజాలు భూమినైన నీయనని పలికితివి. దుశ్శీలుఁడవగు నీ కతముననే పూజనీయులగు భీష్మద్రోణులు ననుసిరి. నీవాచరించిన పాపములకెల్ల మూలమైన కర్ణుని రథము పుడమిఁ గ్రుంగ ధనంజయుఁ డాతని నేయకఁ గాచియుండునా? కాచియున్నను,

భూసురశాపమునఁ గ్రుంగిన రథమునకు నిష్కృతి గలుగునే? కావున నాతనిని సమయించుట సముచితము. అరణ్యమునఁ గృష్ణను బరిభవించి, యభిమన్యుని మరణమునకుఁ గారణుఁడైన సైంధవుని జంపక విడిచి యర్జునుఁ డగ్నిని బ్రవేశించునే? పెక్కండ్రు యోధులతోఁ బోరి డస్సియున్న సాత్యకినిఁ జంపఁ బూనిన భూరిశ్రవుని వధింపకుందుమే? ఇవియన్నియు వృథా జల్పములు. ఊరకుండు" మని వచించెను. సుయోధనుఁ డవ్వచనముల నాలించి "కృష్ణా! నీకుఁ జూడ నేనెట్టివాఁడ నైననేమి?

చ. చదివితి నెల్ల వేదములు జన్నము లొప్పఁగఁ జేసితిన్ గమా
స్పదముగు వృత్తిఁ బోల్చి పరపాలకులెల్లనుఁ గొల్వఁగఁగంటి దు
ర్మద రిపు గాఢ గర్వపరిమర్దనకేళి యొనర్చితిం దగం
దుదిఁజని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబునఁ కేఁగుటొప్పదే?

మీరలిఁకఁ బశ్చాత్తాపదుఃఖితులగుచు నిప్పుడమి నేలుదురు గాక" యని ధీరముగఁ బలికెను. అప్పు డక్కురునాథునిపైఁ గుసుమవర్షము గురిసెను.

అప్పటికి దినానాథుఁ డస్తమించుటచేఁ గృష్ణుఁడు పాండవులఁ దోడ్కొని కౌరవ శిబిరమున కేగుచుండ, ధృష్టద్యుమ్నాది పాంచాలురును, ద్రౌపదీ సూనులును, దక్కిన ధరణీశులును దమ విడిదలలనే విశ్రమింప నెంచి యుధిష్ఠిరు ననుజ్ఞవడసి నిజశిబిరముల కేఁగిరి. సాత్యకి మాత్రము పాండవులతో నరిగెను. పాండవులు పాడువడియున్న కౌరవశిబిరమున కరిగి తమ తమ స్యందనములు డిగినతోడనే, యగ్నిదత్తమైన

ధనంజయుని రథము దగ్ధమయ్యెను. పాండుసూనులది గాంచి విస్మితులై "ఇట్లగుటకుఁ గారణమే" మని కృష్ణు నడుగ నద్దేవుఁడు "భీష్మద్రోణకర్ణుల యస్త్రాగ్నులు ధనంజయు నంటకుండ నియ్యగరథమున డాచియుంచితిని. ఆబాణాగ్నులచే నిప్పు డిది దగ్ధమయ్యె" నని వారలకుఁ దేటపఱచెను.

పిమ్మటఁ బాండవులు కమనీయాభరణములును, కనక రాసులును, రత్నసంచయములును మొదలుగా మహనీయ వస్తువిస్తారముతోఁ బ్రస్తుతి పాత్రమైన సుయోధనుని భాండా గారముఁ జేకొనిరి. అనంతరము కృష్ణుఁడు "పాడువడిన యీ శిబిరము మనకు విశ్రమయోగ్యముగా" దని చెప్పి, ఓఘవతీ యను నొక పుణ్యనదీతీరమునకుఁ బాండవులఁ దోడ్కొని పోయి యట విశ్రమింపఁజేసెను. అప్పుడు యుధిష్ఠిరుఁడు మధుసూదను నవలోకించి "పుండరీకాక్షా! నీవిప్పుడు హస్తి పురమున కరిగి గాంధారీ ధృతరాష్ట్రులకు దుఃఖోపశమనము చేసి రావలయు" నని వచింప నద్దేవుఁడును రథారూఢుఁడై హస్తినగరమున కరిగెను.

కృష్ణుం డట్లు చని గాంధారీ ధృతరాష్ట్రులఁ గాంచి, జరిగిన వృత్తాంతము వారల కెఱింగించి "దుర్యోధనుఁడు దుర్బుద్ధియై నిష్కారణముగఁ బాండవులతో వైరముఁ దెచ్చుకొని మిమ్మిట్లు శోకానలసంతప్తమానసులఁ జేసెను. కావున నిరపరాధులగు పాండునందనులపైఁ గోపింపకుఁ" డని యనేకవిధములఁ జెప్పి వారల నూరార్చి మరల నప్పుడే పాండవులకడ కరుదెంచెను.

అటఁ ద్రోహులు విఱిఁగి పడియున్న సుయోధనునికడకుఁ గృతవర్మ కృపాశ్వత్థామ లరుదెంచి "సకల సామంతులుఁ బరివేష్టింప ధరాచక్రము నేలు చక్రవర్తికి నేఁడెట్టి దుర్దశ వాటిల్లెను" ననుచుఁ బెక్కుభంగుల విలపించిరి. పిమ్మట నశ్వత్థామ "కౌరవేశ్వరా! అసత్యమాడి నా జనకునిఁ జంపి యధర్మ యుద్ధమున నీతొడలు విఱుగఁగొట్టిన పాండవులను ధృష్టద్యుమ్నాది పాంచాలురను నేఁడు బరిమార్చివచ్చి నీకు బ్రమదముఁ గూర్చెద" నని పలికి సుయోధనుని యనుజ్ఞ వడసి కృతవర్మ కృపాచార్యులఁ గూడి బయలుదేరెను.

—* సౌప్తిక పర్వము *—

ఆరథికులు ముప్పురును పాండవశిబిరాభిముఖులై చని, యచ్చటి వీరుల సంతోషధ్వానములు నాలించి శిబిరమునఁ జేర వెఱచి కొంత దవ్వున కరిగి యొక్కెడ మఱ్ఱిమ్రాను క్రింద విశ్రమించి, కౌరవ నంహారనముఁ దలఁచి చింతాక్రాంత మానసులై కొంత తడవునకుఁ గృప కృతవర్ములు నిద్రించిరి. క్రోధాతిశయమున మనము జీకాకుగనుండుటచే గురునందనుఁడు మాత్రము నిద్రింపక పాండవుల నెట్లు వధింతునని యాలోచించుచుండెను. అప్పు డచ్చటి కొక్క యులూకము సని వచ్చి యామ్రవృక్షశాఖలపై నిదురించుచున్న వాయసముల నన్నిటిఁ బరిమార్చి యథేచ్ఛం జనుచుండ నశ్వత్థామ యది గాంచి "ఈ కౌశికము కాకములఁ జంపినటుల నే నీరాత్రి నాశత్రువులఁ గడతేర్తు" నని దృఢనిశ్చితుఁడై తనవారిని మేలుకొలిపి

తాను సేయఁబూనిన కార్యమును వారల కెఱింగించెను. అప్పుడు కృపాచార్యుఁడు "ద్రోణనందనా! నిద్రాసక్తులఁ జంపుట యకృత్యము కావున నట్లు సేయఁదలదు. మన మిప్పుడు కరవురమున కరిగి గాంధారీ ధృతరాష్ట్రులకు సమస్త వృత్తాంతము నెఱిఁగింతము. వారలు ధర్మనిరతుఁడగు విదురునితో నాలోచించి మనల నే పనికి నియోగించిన నాపని నాచరింత" మని చెప్పెను. అశ్వత్థామ యావ్వచనముల కొడఁబడక "పాండవులు భీష్మద్రోణకర్ణభూరిశ్రవ దుర్యోధనుల నన్యాయముగ వధించిరి. అట్టి పాపాత్ముల నిట్టివేళఁ జంపుట యన్యాయముగాదు. నాజనకునిఁ బరిభవించిన ఖలుఁడగు నాధృష్టద్యుమ్న యుతముగఁ బాండవుల నీసాప్తిక సమయమున బరిమార్చినఁగాని నాచిత్తమున కూఱట గలుగ"దని పలుకుచు నతఁడు పాండవశిబిరాభిముఖుఁడై బయలుదేరఁ గృపకృతవర్మ లాతనివెంట నేఁగిరి.

ఆరథికత్రయము నిద్రావివశమైన పాండవ శిబిరముఁ జేరిన తోడనే యచట గరళకంఠుఁడు భూతాకృతియై వారికిఁ బొడ సూపెను. అశ్వత్థామ యమ్మహాభూతముఁ గాంచియు భీతుఁడు గాక దానిపై ననేక దివ్యాస్త్రములఁ బ్రయోగింప నాభూతము వానినెల్ల మ్రింగఁ దొడఁగెను. తన యస్త్రము లన్నియు నట్లు నిష్ఫలములగుటకుఁ జింతించి యశ్వత్థామ తనకిఁక భవానీపతియే శరణ్యుఁడని తలఁచి మనమున మహేశ్వరుని ధ్యానించుచు నద్దేవున కాత్మోపహార మొసఁగ దృఢనిశ్చితుఁడై యనలమునఁ

ప్రవేశించెను. అప్పు డుమారమణుఁడు ప్రీతుఁడై యాతనికిఁ గన నిజరూపము సూపి "వత్సా! నీధైర్యముఁ బరీక్షింప ని భూతరూపముతో వచ్చి పరీక్షించి నీభక్తికిఁ బ్రీతుఁడనైతి. నేఁడీ శిబిరమున నిద్రించుచున్నవారల కింకఁటఁ గాల మాసన్నమయ్యె! నీవీ కృపాణముఁ గైకొని పోయి నీ శాత్రవులఁ జయింపు" మని పలికి యాతని కొక్క ఖడ్గము నొసఁగి, తేజో రూపమునఁ దా నాతని దేహమునఁ బ్రవేశించెను.

అంత నా గురుపుత్రుఁడు పార్వతీపతి తాంత్రీకరణుఁడై తా నొక్కఁడే శాత్రవుల నంతటినిఁ బరిమార్ప నెంచి కృపకృత వర్మలను వాకిటఁ గావలి యుంచి నిజాయుధముఁ గేలఁ బూని మొదట ధృష్టద్యుమ్ను నగనమున కేఁగి యప్పార వాణ్ముని దన్ని లేపెను. గాఢనిద్రానక్తుఁడై యున్న యపాంచాలరాజ నందనుఁడు గురుపుత్రుని పదప్రహారమున నదరిపడి లేచి తన బాణాసనముఁ గైకొననుంకించుచుండ ద్రోణనందనుఁడాతని తలఁ బట్టుకొని యీడ్చి ధరణిం బడవైచి యురమును గళమును నిరుగాలఁ ద్రొక్కసాగెను. ధృష్టద్యుమ్నుఁ డాబాధకుఁ దాళఁ జాలక "గురుపుత్రా! బాణముతోఁ గొట్టి శీఘ్రముగ నన్ను స్వర్గమున కనుపుము. ఇక నిట్లు బాధింపకు" మని, మెలుఁగు వెడలకుండుటచే నట్టకేలకు మాటలు వెడవెడ నెలుంగవచ్చు తెలుఁగునఁ బలికెను. "ఓరీ! గురుద్రోహీ! మదీయజనకునిఁ బరిభవించిన కారణమున నిన్నిట్లే వలిపి పశువును జంపు విధమునఁ జంపుదు" ననుచు గురుపుత్రుఁ డాతనిఁ గాలను గేలను

జరిపి మిక్కుటముగ బాధించి జముని వీటి కనిపెను. సేవక జనము లాకలకలమునకు మేల్కాంచి పీనుఁగై పడియున్న రాజ కుమారునిఁగాంచి దుఃఖావేశిత మానసులై విలపింప నవ్విలా పమువిని చుట్టుప్రక్క శిబిరములలో నిద్రించుచున్న నృపాలురు లేచివచ్చి యశ్వత్థామను ముట్టడించిరి. అశ్వత్థామ తన భుజ బలము ప్రకాశింప వారినెల్ల నని నేసి యందఱి నంతకసదనమున కనిపి, యుత్తమౌజ, యుధామన్యులను ద్రుపదరాజ నందనుల నిలయమున కేఁగి వారినిఁ బరిమార్చెను.

పిమ్మట నతఁడు రాజమందిరమునఁ బ్రవేశింప నచ్చట శయనించిన శిఖండియు, ద్రౌపదీపుత్రపంచకమును మేల్కాంచి యాతని నెదుర్కొని పోరఁదొడఁగిరి. అశ్వత్థామ నిశితాస్త్ర ములఁ బ్రయోగించి వారిని వధించి పిమ్మటఁ దన్నెదిర్చిన పరివారమును బరిమార్పఁ దొడఁగెను. ఇట్లు గురుపుత్రుఁ డా నాటిరాత్రి నిద్రాసక్తులైయున్న వారినిఁ గొందఱిని, గలత నొంది లేచుచున్న వారినిఁ గొందఱిను, మేల్కొని తన్నెది రించినవారినిఁ గొందఱిని, బరిమార్చుచుండ మఱికొందఱు భటులు భయభ్రాంతచిత్తులై హాహారవములు సేయుచు "నేఁ డిచ్చటఁ గృష్ణ సాత్యకులును భీమార్జునులును లేకుండుటచే నిట్టి మహోపద్రవము సేకూరె" నని యడలుచు శిబిరము విడిచి పారిపోవ నుంకించి బయటికి వచ్చి యచ్చటఁ గావలియున్న కృపకృతవర్మలఁగాంచి "మహాత్ములారా! నిరపరాధులమగు మమ్ము వధంపకుఁ" డని వేఁడుచు వారిని

శరణుఁజొచ్చిరి. అప్పుడు కృపకృతవర్మలును రాక్షసావేశ సంభృతక్రౌర్యులై యుండుటవలన ధర్మాధర్మముల నాలోచింపక, తమ్ము శరణుఁజొచ్చినవారి నందఱినిఁ బట్టి వధించిరి.

అశ్వత్థామ పాండవ శిబిరమున రెండుజాములు వీర విహారముసల్పి యచటనున్న నృపాలురను చేది, మాత్స్య, పాంచాల, ప్రభద్రాది బలములను, గజాశ్వాదివాహములను నిరవ శేషముగ హతముగావించి రక్తసిక్తగాత్రుఁడై, శివను ఘమైన యాశిబిరము విడిచి తనవారినిఁగలసి కురుపతిపాలికిఁ బోయెను.

అప్పుడు కౌరవేశ్వరుఁడు రక్తసిక్తమైన ధరణిపయిఁబడి దుర్భరమగు మరణవేదన ననుభవించుచు ప్రాణములు విడువ నుంకించుచుండఁ గృపకృతవర్మాశ్వత్థామ లచటి కరుదెంచి నృపతియవస్థఁ గాంచి శోకాక్రాంతమనస్కులై యాతని నతి ప్రియంబున నెత్తి కౌఁగిలించుకొని విలపింపసాగిరి. అప్పు డశ్వత్థామ యమ్మహీపతి ముఖంబునఁ జూడ్కి నిలిపి,
"కౌరవేశ్వరా!

చ. కుడువఁగఁ గట్ట బంధులకుఁ గోటివిధంబులఁ బెట్టఁజన్నము
ల్నడుప ననేక ధర్మవిధులం బొగడొందఁగఁ జాలునట్టి యొ
క్కుఁడు సిరియిచ్చి పేర్మినొక కొండఁగ మన్చిన నీవు సావఁగా
నొడలిటులో మితిఁ గురుకులోత్తమ యేనొక సేవకుండనే.

ఉ. న్యాయము దప్పకుండఁగ రణంబొనరించి దివంబుఁగైకొనం
బోయెద వందురాఁ దగినపుణ్యము సేయుట లేదుగాని మా
చేయు మనంబునుం దనియెఁ జెందఁగఁ బడ్డవిరోధివర్గమున్
నీయెడ కిం పొనర్పఁగ గణింపఁగ భాగ్యము గల్గె భూవరా.

అధర్మముగ నీయూరువులు భగ్నము సేసి విజయము సేకొన్న పాండవు॥ శిబిరమున కే నరిగి శిఖండి ధృష్టద్యుమ్నాదులను, ద్రౌపదేయులను, సమస్తపరివారమును దెగటార్చి వచ్చితి. పాండుసూనులు, కృష్ణసాత్యకులును మాత్రము నా కచ్చటఁ గానరారైరి. వార లెట కేఁగినదియుఁ దెలియలేదు. నీవు దివమున కేఁగినతోడనే భారద్వాజునకు నామాటుగ నమస్కరించి, నీచుఁడగు ధృష్టద్యుమ్నుని నేను వధించితినని శ్రవణానంద కరముగఁ జెప్పుము. బాహ్లీక, సోమదత్త భూరిశ్రవ, కర్ణప్రముఖ భవదీయబాంధవజనములతో నా చేసినకుశలప్రశ్నముగా సంభా షింపు" మని పలుకుచు దీనాననుఁడై దుఃఖాశ్రువులు విడువ సాగెను.

సుయోధనుఁ డవ్వచనముల నాలించి "ధరణీసురవరేణ్యా! భీష్మ ద్రోణ కర్ణుల కంటె నీవెక్కుడు పరాక్రమము సూపి యద్భుతకార్యము సేసి నాకధికప్రియము సేసితివి. ఇఁక మీరు ముగ్గురును నాకొఱకు విలపింపక సుఖముగఁ జనుఁడు. మనకుఁ బునర్దర్శనము త్రిదివమున నయ్యెడుఁగాక" యని యధిక వేదనములోఁ బలుకుచు ప్రాణములు విడిచెను. కృతవర్మకృపా శ్వత్థామ లమ్మహీపతి శరీరము నాలింగనము సేసికొని కొంత తడవు విలపించి పిమ్మటఁ దమ యరదముల నెక్కి యచ్చోటుఁ బాసి చనిరి.

భానుమంతుఁ డుదయగిరి శిఖరము నలంకరించినపిమ్మట ధృష్టద్యుమ్నుని సారథి పాండవులపాలికిఁ బోయి "మహా

మహాబులారా! నిశీథసమయమున నశ్వత్థామ కృపకృతవర్మ లతో మనవీటి కరుదెంచి శిఖండి ధృష్టద్యుమ్నాదులను, భవదీయ పుత్రపంచకమును, సకలపరివారమును బరిమార్చెను. నే నొక్కఁడనుమాత్రము వారిబారిఁ బడక మీకీ దుఃఖవార్త నెఱిఁగింప వచ్చితి" ననుచు జరిగిన వృత్తాంతము నామూలాగ్రముగ వారల కెఱింగించెను.

పాండవాగ్రజుఁ డాఘోరవార్త నాలించినతోడనే దుఃఖాతిశయమున మూర్ఛాక్రాంతుఁడై, సాత్యకి భీమసేనాదులసముచితోపచారములచేఁ గొంతతడవునకుఁ దెలివొంది "హా! తనయులారా! భీష్మద్రోణకర్ణాదియోధాగ్రేసరుల బాణాగ్నులకు సైతమోర్చి పరవాహినీభయంకరులై చరించిన మీరలు నేఁ డీగురుపుత్రునిఁ బాఱిఁ బడితిరా? శాత్రవుల నందఱిని సమయించి జయము నేఁగొంటినిగదాయని యానందించుచుండ నింతలో శాత్రవు లరుదెంచి నావారల నందఱినిఁ గడతేర్చి నన్ను దుఃఖభాజనునిఁ గావించిరి. హా! విధిచేష్టితము లెంతవిచిత్రములు?

చ. జనకుఁడు లేమికిం గడువిషాదము నొందెడు కృష్ణ యిప్డయిం
దనయులు భ్రాతలుం జెగుట దావిని మూర్ఛ మునుంగు నెమ్మనం
బున నవశంపుమేనునయి భూస్థలిఁ బ్రశ్లకయున్నదే తెఱ నే
నినిఁ బటుశోకవేగమున నిర్భరవేదనఁ జెందకుండునే"

అని చింతించుచు ద్రౌపదిని సత్వరముగఁ దోడ్కొనిరమ్మని నకులున కాజ్ఞాపించి, దామోదర సాత్యకిభీమార్జున సహదేవులఁ గూడి వీనుఁగుపెంటయైన శిబిరమున కరుదెంచెను.

అచ్చట హతులై పడియున్న పుత్రమిత్ర బాంధవుల కళే బరములఁ గాంచి పాండవులు విలపించుచుండఁ గృష్ణసాత్యకులు వారల నూరార్చి మృతులైన వారల కందఱకు నగ్ని సంస్కారము సేయించిరి.

విరాట్ద్రుపదులు మృతులైన మఱునాఁడు కృష్ణ విరటు పురమున కరిగి సుధేష్ణకును, నచ్చటనేయున్న తన జనయిత్రి కివి దుఃఖోపశమనము సేసి పిమ్మటఁ దన జననిఁ గూడి యుపప్లావ్యపురమునకు వచ్చియుండుటచే నప్పుడు నకులుఁ డుపప్లావ్యమున కరిగి యా దుర్వార్త నామె కెఱింగించి తన సోదరులపాలి కవ్వధూమణినిఁ దోడ్కొనివచ్చెను.

ద్రౌపది దుఃఖాతిశయమున నాక్రందనము సేయుచు వచ్చి "నిద్రానక్తులై యున్న నా కుమారపంచకమును వధించిన యాదురాత్మునిఁ దెగటార్చినఁ గాని నామనస్తాప ముపశ మింపదు. ఇప్పుడు వాయుతనూజునిఁ బంపించి యానీచుని సమయింపనిచో నేని దేహముఁ ద్యజింతు" నని వచించెను. అంతట భీమసేనుఁడు రథారూఢుఁడై వెడలి కురుక్షేత్రసంచారి జనములవలన నశ్వత్థామ జాడ నరయుచు నతఁడు వ్యాసా శ్రమమున కరిగెనని యెఱిఁగి తన యరదము నచ్చటికిఁ దోలించుచుండెను.

అప్పుడు కృష్ణుఁడు ధర్మతనయు నవలోకించి "కౌంతే యాగ్రజా! అశ్వత్థామ ద్రోణునివలన, దేవమనుజదనుజలోక ములు భస్మము సేయు బ్రహ్మశిరోనామకాస్త్రము వడసి

యుండెను. ఆతఁ డిప్పు డయ్యస్త్రముఁ బ్రయోగించినచో భీమ
సేనుఁ డెదుర్కొనఁజాలఁడు. దానికిఁ బ్రతి ధనంజయుఁడు
మాత్రమే యెఱుంగు. కావున నిప్పుడు నీవును నేనును విజయుఁ
డును భీమసేనునకుఁ దోడుగ నేఁగవలయు" నని వచింప,
యుధిష్ఠిరార్జునులు కృష్ణునితోఁ బయలుదేరి భీమసేనుని గలిసి
కొనిరి.

భీమసేనుఁడు వ్యాసాశ్రమమున కేఁగి యశ్వత్థామ నవ
లోకించి "ఓరీ! దురాత్మా! మేము లేని సమయమున వచ్చి
నిద్రాసక్తులం జంపి, యిచటికి వచ్చి తాపసవేసముం దాల్చినఁ
జావు దప్పునని తలంచితివా? నీ తపంబిఁకఁ జాలు. రణ
మునకు ర"మ్మని గంభీరస్వరమునఁ బలికెను. అంతట గురు
పుత్రుఁడు రోషప్రదీప్తుఁడై యొక్క యిషీకముఁ జేతఁబట్టుకొని
బ్రహ్మశిరోనామకాస్త్రమును జపించి యపాండవంబగుఁగాక
యనుచు దానిం బ్రయోగించెను.

అమ్మహాస్త్రము ఘోరానలజ్వాలలతో వచ్చుచుండఁ
గృష్ణుఁ డవలోకించి "ఫల్గునా! ఫల్గునా! బ్రహ్మశిరోనామ
కాస్త్రంబు వచ్చుచుండె. దీని నొండస్త్రము ప్రతిహతము సేయఁ
జాలదు. కావున నిప్పుడు నీవును బ్రహ్మశిరముఁ బ్రయోగించి
నీసోదరులను, నన్నునుఁ గాపాడుకొను" మని వచింప ధనం
జయుఁడు మనమున ద్రోణాచార్యునకు నమస్కరించి, గురు
పుత్రునకుఁ గీడుపొందకుండ నాతని యస్త్రమును మాత్రము
మరల్పవలయు నని తలఁచి తాను బ్రహ్మశిరోనామకా

స్త్రమును బ్రయోగించెను. అంత నయ్యిరువురి యస్త్రములును ఘోరముగఁ బోరాడుచుండ దిశలన్నియుఁ గంపింప నారంభించెను.

అప్పుడు వ్యాసనారదమహర్షు లచటికి కరుదెంచి "హీనలోకోత్తములారా! మీ మీ యస్త్రముల నుపసంహరించి లోకమునకు హితము సేయుఁడు" డని పలుక ధనంజయుఁడు తన యస్త్రము నుపసంహరించెను. అశ్వత్థామకు నిజాస్త్రసంహారము నేయుఁ గోప నది శక్యము గాకయుండెను!

బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రహ్మచారి ప్రయోగింప వాఁడు బ్రోఁవఁ బ్రశంసించియుండెను. ప్రయుక్తమైన దాని మునికి మరల్పుట దుస్సాధ్యము. అట్లు మఱల్పనిచో నది ప్రయోగించిన వానినే దహించును. అధిక తపోబలవిశిష్టాత్ముఁ డగుటచేఁ భార్గవుఁడు దాని నుపసంహరింపఁజాలెను.

అశ్వత్థామ యా దివ్యాస్త్రము నుపసంహరింపఁ జాలక పాండవవంశవధూజనగర్భములన్నియు దగ్ధము గావించి యియ్యస్త్రము శమించుఁగాక యనుచు నస్త్రప్రమోచనము సేసెను. అప్పుడు కృష్ణుఁడు "ద్రోణనందనా! ఉత్తరగర్భమునఁ బెరుఁగుచున్న యభిమన్యుని దేజమును మాత్రము గాపాడి పాండవవంశము నుద్ధరింపు" మని వచింప, నద్దురాత్ముఁ డందుల కంగీకరింపకుండెను. అంతట మధుసూదనుఁడు కోపాయత్త చిత్తుఁడై "దురాత్మా! నీవంగీకరింపకున్నను మత్స్యరాజనందన గర్భం బేను రక్షించి పాండవవంశము నుద్ధరించెద. బాలఘాతి

వగు నీకు నశనము దుర్లభమై, సహాయరహితుఁడవై దుర్గంధ రక్తమున నంగము దిగ్ధమగుచుండ మూఁడువేల వర్షములు దిరుగుచుండు" మని యాతనిని శపించెను.

అశ్వత్థామ శిరమున నొక్క దివ్యరత్నము గలదు. దానిఁ దాల్చిన వారలు విషజంతుసంతాపమును, దేవదానవభయమును, క్షుత్పిపాసలను నెఱుఁగక సుఖజీవనము సేయుదురు. అశ్వత్థామ చిరజీవి యగుటచేఁ బారాశర్యుఁ డాదివ్య శిరోభూషణమును పాండవుల కిప్పించి వారల కాతని యెడఁగల క్రోధము నుపశమింపఁజేసెను. పిమ్మట నశ్వత్థామ తపోవనమున కేగెను. పాండుసూను లారత్నముఁ గైకొని, సాత్యవతేయునకుఁ బ్రణామము సేసి యామునీంద్రునిచే నాశీర్వాదము వడసి కృష్ణ సహితులై ద్రౌపదిపాలికిఁ బోయి యాసాధ్వీమణి కమ్మణి నొసఁగి జరిగిన వృత్తాంతమంతయు నెఱిఁగించిరి. ద్రౌపది సంతుష్టాంతరంగయై యారత్నమును ధర్మతనయుని శిరమునఁ బెట్టెను.

అశ్వత్థామచేఁ బ్రయుక్తమైన బ్రహ్మశిరోనామకాస్త్రము పాండవవంశవధూజనముల గర్భములు దగ్ధము గావించి ప్రశాంతి నొందెను. కృష్ణుఁడు పాండవవంశనాశనము గాకుండ నుత్తరగర్భము నందున్న యర్భకుని మాత్రము రక్షించెదనని చెప్పి పాండుసూనులకును, బాంచాలరాజనందనకును దుఃఖోపశమనము సేసెను.

—* స్త్రీ పర్వము *—

తమ తనయులందఱును శాత్రవులచే వధింపఁబడుటఁ దలఁచి గాంధారీధృతరాష్ట్రులు శోకసంతప్తమానసులై ధరణి పయిఁబడి రోదనము సేయుచుండ విదురుఁ డరుదెంచి

తే. "యౌవనంబును రూపంబు జీవితంబు
ద్రవ్యసంచయములు ననిత్యములు గావె
వీని హానికి వగపవివేకమగుటఁ
బండితులువగఁ గూరరు పౌరవేంద్ర.

సీ. భీరుమలైనను బిఱికివాండ్రనునైనఁ
జంపుచోఁ గడపఁడు జముఁడు నేర్పు
లావున మర్త్యునిచావు మాన్పఁగలేవు
రణమొనర్చినఁ గాని రాదు మరణ
మెయ్యదియవధి యిందెల్లవారును
దగువార కాకది గడవంగ వశము
గాదింతయుమ్మలికం బేల యట్లును
గాక నీ సుతులు సంగ్రామకేళి
సలిపి యింద్రుని కతిథులై చనిరి యజ్ఞ
దాన విద్యాతపోలబ్ధమాననీయ
గతులు సమరాని వర్తనమృతులయరుగు
నట్టి గతులకుఁ జూటిగావండ్రు బుధులు.

పాండిత్యసంపన్నుఁడవగు నీవు వీరస్వర్గము నొందిన కుమారులకై యిట్లు విలపింపఁదగునె? శోకముడిగి పోలికలని కరుదెంచి పుత్రాదిజ్ఞాతులకు నౌర్ధ్వదైహికములు సేయింపు" మనుచు నాతని నూరడించుచుండెను.

అప్పుడు కృష్ణద్వైపాయనుఁ డరుదెంచి "పుత్రా! ప్రాజ్ఞుఁడ

వగు నీవు బేలవలె నిట్లు దుఃఖింపఁదగునె? ఇప్పుడు దుఃఖిం చిన నేమిప్రయోజనము గలదు? నీసుతుఁ డవినీతుఁడై పాండు సూనులఁ జిక్కిడుములు బెట్టి వారిరాజ్యము నపహరించి సంధి కొడఁబడఁడయ్యె! నీవును సుయోధనుని దుర్మంత్రమున కామోదించి పాండవులకు రాజ్యము నీయనొల్లక, శ్రీకృష్ణ గాంగేయ విదురాదుల సదుపదేశముఁ జెడచెవిం బెట్టితివి. దాన నిట్లు కులక్షయము సంప్రాప్తమయ్యె! ధర్మమూర్తులైన పాండవుల యెడ నించుకయుఁ దప్పులేదు. ధర్మనిరతుఁడగు యుధిష్ఠిరుఁడు మిమ్మధిక భక్తితోఁ బోషింపఁగలవాఁడు. కావున నీవిఁక దుఃఖముడిగి సకలబాంధవులకుఁ బరలోకక్రియల నాచరింపుము.

క. భూతము లనిత్యములు నీ
నీ తెరువెప్పుడును విం దహీన ధృతిన్ నీ
చేతోగతినల కలంపుము
భూతానిత్యత్వమడియ పుచ్చును దగలన్.

అనుచు ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనము సేసెను. ఇట్లు వ్యాసవిదురులచేఁ బ్రబోధింపఁబడి ధృతరాష్ట్రుఁడు కొంచె మూఱటనొందిన మనముగలవాఁడై పొలికలనికి బయలుదేరెను. అతనివెంట గాంధారియుఁ, గుంతియుఁ, గౌరవవధూజనములును సకలపౌరులును నాక్రందనము సేయుచు బయలుదేరిరి.

మార్గమధ్యమునఁ గృతవర్మకృపాశ్వత్థామలు వారల నెదుర్కొని, తామానాఁటిరాత్రి పాండవశిబిరమునఁ గావించిన సాహసకృత్యమును గాంధారీధృతరాష్ట్రుల కెఱింగించి దుఃఖో

పశమనవాక్యములచే నా రాజదంపతుల నూఱడించి, పాండవులకు నెఱిఁగించి మేమెంద్రైన దాగియుందుము" మని చెప్పి వారి యనుజ్ఞ వడసి వెడలిపోయిరి. పిమ్మటఁ గృతవర్మ నిజపురమునకును, కృపాచార్యుఁడు గజపురమునకును, గురుపుత్త్రుఁడు తపోవనమునకును జనిరి.

యుధిష్ఠిరుండును ధృతరాష్ట్రుఁడు పొలిమేరలనిక వచ్చుచుండెనని విని తన దామోదరునితోడను, తమ్ములతోడను బయలు వెడలి పోయి నమస్కారము సేసెను. పుత్త్రశోకార్తుఁడైన యజాతశత్రుఁడు పుత్త్రశోకార్తుఁడగుచున్న ధృతరాష్ట్రునకుఁ బోయి నమస్కారము సేయ నాభూపాలుఁ డక్కుమారు నాలింగనము సేసికొని యాదరించెను. పిమ్మట భీమార్జున నకుల సహదేవులు వరుసగా వచ్చి ప్రణామము సేయుచుండఁ బార్శ్వవర్తు లాధృతరాష్ట్రునికి వారలఁ బేరు పేరున నెఱింగించిరి.

భీముఁ డను మాట చెవిసోకిన తోడనే ధృతరాష్ట్రుని మనంబునఁ గ్రోధాగ్ని ప్రజ్వరిల్ల నతఁ డక్కుమారునిఁ జంప నెంచి తన క్రోధము నతిగుప్తముగ నునిచి, యాతని నాలింగనము సేసికొనఁ దలఁచినటుల నటించెను. త్రికాలవేదియగు వాసుదేవుఁ డాతని దురాలోచనము మున్నే యెఱింగి యయోమయంబుతో భీముని ప్రతిరూపము సేయించి యచటికిఁ దెచ్చి నిగూఢముగ నుంచి యున్నవాఁ డగుటచే నపుడ య్యయోమయభీము న క్కురుపతి సమీపమునఁ బెట్టి భీమసేను

నీవలకుఁ దోడ్కొనివచ్చెను. అంతట దశసహస్రసామజసమాన బలుఁడగు నయ్యంధనృపాలుఁ డయ్యనుపహూపము నాలింగనము సేసికొని తనబల మంతయు వినియోగించి దానిఁ బొడిపొడి గావించి విడిచి మనమున నానందించుచుఁ దన దుష్కృత్యము నొరు లెఱుఁగకుండుటకై భీమునిఁ జేర్కొని హాహాకారము లెసఁగ రోదనము సేయఁ దొడఁగెను.

అప్పుడు కమలనాభుఁడు మందస్మితముఖారవిందుఁడై "కౌరవేశ్వరా! నేను నీదుర్మంత్రము నెఱిఁగియే యినుపభీముని నీసమీపమునఁ బెట్టించితిని. నీవు దానిఁ బొడిపొడి గావించితివి. నీవు చంపనెంచిన గంధవహనందనుఁడు సుఖుఁడై యున్నవాఁడు. కావున నాతనికై దుఃఖింపవలదు. నీ తనూజు లాచరించిన దుష్కృత్యముల నెఱింగియు, వాయునందనుఁడు వారలఁ బరిమార్చెనని కుపితుఁడవై యాతనిఁ జంపనెంచుట ధర్మమే? సకలధర్మవిదుఁడవగు నీవిట్టి పాపకృత్యము సేయ నేల సమకట్టితివి? ఇఁకనైనఁ బశ్చాత్తప్తుఁడవై పాండవులయెడఁ గ్రోధము విడిచి శాంతుఁడవై యుండు" మని వచింప ధృతరాష్ట్రుఁడు సిగ్గునొంది "మధుసూదనా! హృదయమును గ్రోధశోకములు తల్లడింపఁ జేయుటచే మందబుద్ధినై యీ యకృత్యము సేయ సమకట్టితిని. నాయపరాధము సైరింపుము. ఇఁకఁ బాండవులయెడఁ బుత్రవాత్సల్యమున వర్తించువాఁడ" నని పలికి పాండవుల నాశీర్వదించెను.

పిమ్మటఁ బాండవులు గాంధారికడకుఁ బోయి వినయమునఁ

ప్రణామము సేయ న ద్దేవి మనంబు తనూజుల మరణమునకుఁ దాపమునొందుచుండుటచే వారలఁ దీవింపనొల్లక యుధిష్ఠిరుని శపింపఁ దలఁచెను. అప్పుడు సాత్యవతేయుఁ డామెతలఁపు నెఱిఁగి వచ్చి "కుమారీ! నీ తనయులు దుర్వర్తను లగుటచే నిట్టిముప్పు వాటిల్లెఁ గాని పాండవులయెడ నించుకైన నేరము గలదే? నీయెడ మాతృభావమున మెలఁగు వీరల దెసఁ గారుణ్యము వహింపు" మని యుపదేశింప నా సాధ్వి "మునీంద్రా! భీమసేనుఁ డన్యాయముగ సుయోధనునిఁ దొడలు విఱుఁగఁగొట్టుటయు, దనుజుని చందమున దుస్ససేనుని యురముఁజీల్చి రక్తపానము సేయుటయుఁ దలఁప, నామనము క్రోధసంతాపానలములచే దగ్ధమగుచుండె" నని పలికెను.

అప్పుడు భీమసేనుఁ డామెకు నమస్కరించి "తల్లీ! మున్ను కౌరవసభాంతరమునఁ బాంచాలినిఁ దన యూరువు నెక్కరమ్మని సుయోధనుఁడు సైగ సేయ నే నద్దురాగతమునకు సహింపక నాతని తొడలు గదాయుధముచే భగ్నము సేయుదు నని ప్రతినఁ గావించితి. దుశ్శాసనుఁ డప్పుణ్యచరిత వసనములు నూడఁదీసినప్పుడు, నేనాతని వక్షముఁ జీల్చి రుధిరము నాస్వాదింతునని శపథము సేసితి. ఈ రెండుకార్యము లానాఁడె యాచరింపవలసిన వైనను, ధర్మతనూజుని ధర్మమునకు హాని సేకూరునని నేను శాంతివహించి కాంతారవాసము సేసి వచ్చి, బంధువధము సేయ నొల్లకఁ బుడమిపాలడుగ సుయోధనుఁ డీయ నొల్లక సంగ్రామమునకుఁ గడఁగె. ఉత్తమ క్షత్రియులకుఁ

ప్రతిజ్ఞాపాలనము పరమధర్మమగుటచే నే నీ సమరమున నా రెండు ప్రతిజ్ఞల నెఱవేర్చితిని. సువిచార వగు నీవెఱుంగని ధర్మములు గలవె?" అనుచు సౌమ్య వాక్యముల యుధిష్ఠిరుఁడామెకుఁ బ్రణామము సేసి "జననీ! నీతనయుల సంహారకునిఁ జంపించి నన్ను సుఖసాగరమున ముంచిన పాపాత్ముఁడనగు నన్ను నీ కోపానలముచే దగ్ధము సేయు" మని వచించెను. అంత నామెకు వానిని శపింప నోరాడనందునఁ గ్రోధముఁ నిగ్రహించి మాతృభావముతో దీవించెను.

అప్పుడు పాండవజనము లెల్లరు నా సమరప్రదేశమునఁ బడియున్న తమవారి కళేబరములపైఁ బడి ప్రలాపింపఁ దొడఁగిరి. గాంధారియు వ్యాసవరప్రసాదమునఁ బ్రాప్తమైన తాత్కాలికమైన దివ్యదృష్టి విభవమున నిజవ్రత హానిలేని తెఱంగున సమరాంగణము నవలోకించి, యందుఁ బడియున్న తనవారి సంహతినిఁ గలయఁజూచి దుఃఖావేశితమానసయై కృష్ణు నుద్దేశించి "దేవకీనందనా! అన్నదమ్ములు సమరము నకుఁ దొడఁగుచుండ నీవు వారింప సమర్థుఁడనయ్యును వారింపక యుపేక్షించి కలహముఁ బెంచి మాకుఁ గులక్షయము సేసితివి. కావున మీ యాదవవంశముగూడ నిట్లే యింక ముప్పదియాఱు వత్సరముల కన్యోన్యకలహమున నశింతుఁగాక! మీ వధూజనములు గూడ నిట్లే శోకాక్రాంతలై యడలుదురుగాక! నీవు దిక్కులేనివాఁడవై కుత్సితంపుఁదెఱంగునఁ గూలుదువు గాక" యని శపించెను.

ఆశాపము నాలకించి పాండవులు భయావేశితులై వడకు చుండఁ గృష్ణుఁడు చిఱునగవుతో నామె నుద్దేశించి "యాదవు లన్యులచేఁ జచ్చువారలు గాకుండుటచే వారల కెల్లను నన్యోన్యకలహనాశనము సంభవించును. నీవు నిష్కారణముగా నన్ను శపించితివే గాని నీ శాపమున నధిక మేమియు లేదు. నే నెన్నివిధముల నదుపదేశము సేసినను, నీ కొడుకు సంధి కొడఁబడఁడయ్యె. దానికి నే నేమి సేయఁగలవాఁడ" నని వచించెను.

పిమ్మట యుధిష్ఠిరుఁడు రణనిహతులైనవారి కందఱికిని విధ్యుక్తముగ నగ్నిసంస్కారము సేయించి ధృతరాష్ట్రాది బాంధవులఁ గూడి భాగీరథీతీరమున కరిగెను. అపుణ్యానదీ జలమున నందఱును స్నాన మాచరించి బాంధవులకుఁ దిలోదక ప్రదానములు సేయుచుండఁ గుంతి దుఃఖాక్రాంతయై వచ్చి "కుమారా! కర్ణుఁడు జను లెల్లఱును భావించునట్లు రాధాసుతుఁడు గాఁడు. అతఁడు భాస్కరుని వరమున నాకు జనించినవాఁ డగుటచే మీ కగ్రజుఁడు! కావున నా శూర వరేణ్యునకుఁ దిలోదకప్రదానము సేయువలయు" ననుచు నాతని జననవృత్తాంతమును యుధిష్ఠిరునకు సవిస్తరముగఁ జెప్పెను.

దుస్సహములగు నవ్వాక్యముల నాలకించిన తోడనే పాండవులు పరమదుఃఖావేశమానసులైరి. అప్పు డజాత శత్రుఁడు జనయిత్రినిఁ గాంచి "తల్లీ!

సీ. అనిలజార్జునుల మార్కొని తేర్చె నెవ్వని
యుత్సాహమాది సుయోధనుండు
హైడింబ పౌండ్రాది వసుధేశు లెవ్వని
కడిమిసొంపున నరిగాఁపులైరి
మనసైన్యకోటి యెవ్వని బాహువీర్య సం
పదకోడి యంతంత నొదుగుచుండు
నద్భుతంబొనరించె నమరుల కెవ్వని
యసమాన వివిధ దివ్యాస్త్రమహిమ
మమ్మునందఱ నెవ్వని మహితశక్తి
యొక్కఁడై సంగరంబునఁ జిక్కఁబఱిచె
నట్టికర్ణునిఁ గొంగున నగ్నిఁ దాఁచి
నట్లు లెమ్మోయి దాఁచితో యమ్మ చెపుమ.

ఆ. అతఁడు మాకు నన్న యని మున్న యెఱుఁగంగ
గన్నఁ గురుకులంబు గలఁగఁబడక
మనుదుమట్టులైన మనుజలోకమునకుఁ
గలుగదడలు మాకుఁ గలుగదడలు."

అనుచు విలపించి యాదిత్యనందనునకుఁ దిలోదకప్రదానంబు సేసెను. పిమ్మట బాంధవు లెల్లఱు నాతనికి నుదకకర్మం బాచరించిరి. యుధిష్ఠిరనృపాలుఁడు కర్ణహితార్థంబుగ ననేక పుణ్యకర్మల నాచరించి, యాతని నతుల ననేకవిధముల గారవించి సకలబంధుసహితముగా గంగసముత్తరణం బాచరించెను.

—• శాంతి పర్వము •—

ఆశుచిత్వనివృత్తికై యుధిష్ఠిర నృపాలుఁడు గంగాతీరమునఁ బటకుటీరంబులు నిర్మింపఁజేసి సకల బాంధవులతో నచ్చట

శోకమానసము నివసించెను. అప్పుడు నారద, దేవల, వ్యాసాది మహామును లరుదెంచి యమ్మహీపతిచేఁ బూజితులై

శా. "గోవిందుం డనిశంబు శోభనమొదంగోరంగఁ బార్థుండు ద
ర్పావిర్భూతోజ్జ్వలబాహుసార మహనీయస్ఫూర్తి సంక్షోభి గాం
డీవోల్లాసవిభాసియై సమరపాండిత్యంబు వాటింప సం
భావింపన్ జగమెల్ల రాజ్యమిటు లొప్పంగొంటె రాజోత్తమా."

అనుచుఁ గుశలప్రశ్నము సేసిరి. "తాపసోత్తములారా! వాసుదేవుని కృపవలనను, మీయనుగ్రహమువలనను, భీమ పార్థుల భుజబలమువలనను రాజ్యము సేకూరె! అయినను భరతకులభూషణులగు నభిమన్యుద్రౌపదేయులఁ గోల్పడుట వలనను, సకలజ్ఞాతివధము సేయుటవలనను, మదీయాగ్రజుఁ డగు కర్ణునిఁ గూల్చుటవలనను నామనము సంతాపాగ్నిచే దగ్ధమగుచుండె! అమ్మహానీయుఁ డగ్రజుఁడని యెఱింగినచో నిట్టి దుష్కృత్యము సేయక, రాజ్యముఁ గాంక్షింపక విపినంబున నైన సుఖముగ నుండెడివాఁడ" ననుచు గద్గదకంఠుఁడై ధర్మ తనూజుఁడు వారికిఁ బ్రత్యుత్తర మొసఁగెను.

అప్పుడు కుంతి యాతని నోదార్చనెంచి "కుమారా! కర్ణునకు నేను జననక్రమ మెఱిగించి, సుయోధనుని విడిచి మిమ్ముఁగూడి మహీవలయము నేలుమని యుపదేశింప నతఁడది వినఁడయ్యె! కావున నీవాతనికై మిక్కుటముగఁ బరితపింపకు" మని వచింప, యుధిష్ఠిరుఁ డవ్వచనముల కసహ్యమొంది యద్దేవి నవలోకించి "భవదీయ మంత్రకార్యగోపన మున నిట్టి ప్రమాదము సంభవించె! కావునఁ నిఁకమీఁద స్త్రీ

జనముల మనములకు రహస్యరక్షణశక్తి లేకుండుఁగాక" యని శపించెను.

అనంతరము యుధిష్ఠిరనృపాలుఁ డుభయపక్షముల మృతి నొందిన బంధుమిత్రవర్గముఁ దలఁచియు, భానుసూనునిఁ దలఁచియు శోకవిహ్వలమానసుఁడై నిజానుజులఁగాంచి "తమ్ములారా! నిజాగ్రజవధమును, బంధువధమును నేసి గైకొన్న యీవుడమిని నేఁ బరిగ్రహింపనొల్ల! విపినమున కేఁగి కందమూలఫలాశనుఁడనై తపము సేయుచుండెద. మీర లీరాజ్యముఁ బాలింపుఁ" డని దగ్గుత్తికతోఁ బలికెను. "క్షోణీవల్లభా! దుర్నీతిపరులైన ధార్తరాష్ట్రులను ధర్మమార్గమున జయించి రాజ్యముఁ బాలింప నొల్ల ననుట బేలతనముగాదే? బంధువధమునఁ బాతకముం జేకూరెనను చింతగలదేని యశ్వమేధాదిక్రతువుల నాచరించి పాపవిమోచనము సేసికొని, దిలీపమాంధాతాది మహీపాలురవలె ధరణీచక్రము నేలి యశముఁగాంచుము. అట్లుగాక నీవరణ్యమున కేఁగెదేని మేమును నీతో నరుదెంతుముగాని, నిన్ను విడిచి పుడమీపాలనము సేయుదుమె? ధరణి యరాజకమైనచోఁ బ్రజలధర్మవర్తనులగుదురు. ఆకిల్బిషము మహీపాలునిఁ జుట్టుకొనదే? నీవెఱుఁగని నృపధర్మములు గలవే? కావున నీబేలతనము విడిచి రాజ్యభారము వహింపు" మనుచు భీమార్జున నకులసహదేవులును ద్రౌపదియు నాతని కనేకవిధములఁ జెప్పిరి.

ఎవ్వరెంత చెప్పినను ధర్మాత్మజుఁడు "పూజనీయులగు భీష్మ ద్రోణకర్ణాదుల నన్యాయముగ వధించిన పాపము నాకు

తపమునఁ గాని శమింప"దని దృఢనిశ్చితుఁడై పుడమి నేలనొల్ల కుండెను. అప్పుడు కృష్ణుఁడును, వ్యాసనారదాది మహర్షులును "పాండవాగ్రజా! కాలము దీరుటచే భీష్మద్రోణకర్ణాదులు సమసిరి గాని నీవలనఁ జచ్చినవారలుగారు. గాన నీకుఁ బాపముఁ జేకూరదు. నీవు ధర్మముగ క్షాత్రవులఁ గెలిచి రాజ్యమును వడసితివి. కావున నిఁక సింహాసనాసీనుఁడవై, పాలనమునకు నిరీక్షించుచున్న ప్రజలనేలి వారలను సంతుష్టాంతరంగులఁ జేయుము. నీకింకను బాపభయము గలదేని సకల పాపక్షయకరమగు నశ్వమేధయాగముఁ జేయు" మనుచు ధర్మనందనునకుఁ బెక్కువిధములఁ నుపదేశించిరి.

అంతట ధర్మతనూజుఁ డమ్మహాసీయుల యాజ్ఞ నుల్లంఘింపఁజాలకఁ బట్టాభిషేకమున కంగీకరించి యొక్క శుభదివమున గాంధారీధృతరాష్ట్రాది సకల బాంధవులతోడను మునివర నికరములతోడను గజపురమునకుఁ బయనమయ్యెను.

ఆరాజచంద్రుని రాకకుఁ బౌరులెల్లరును ప్రమోదభరితమానసులై కస్తూరికలయంపులతోడను, గర్పూరపు ముగ్గులతోడను, పచ్చలతోరణములతోడను బురము నతిరమణీయముగ నలంకరించి, రాజమార్గమునఁ బాండునూనులు రథారూఢులై యరుగుచుండ, సురభికుసుమములును, మౌక్తికసేసలును వారలపైఁ జల్లుచు, గర్పూరనీరాంజనముల నొసఁగి గౌరవించిరి. ధర్మనందనుఁ డట్లు పురప్రవేశముఁ జేసి, రాజమందిరము సొచ్చి, గృహదేవతారాధనము సలిపి, బ్రాహ్మణసంఘములకు గో,భూ,

హిరణ్యాది మహాదానము లనేకములొసఁగి, కృపాచార్యుని రావించి యాతనిఁ బూజించి, గాంధారీధృతరాష్ట్రుల యనుజ్ఞ వడసి నవరత్న ఖచితసింహాసనమున నాసీనుఁడయ్యెను.

అప్పుడు దుర్యోధన సఖుఁడగు చార్వాకుఁడను దనుజుఁ డొకఁడు విప్రవేషమున నరుదెంచి "పాండవాగ్రజా! ఇటనున్న భూసురులందఱును 'ఈనృపాలుఁ డెక్కడి ధర్మవర్తనుఁడు? రాజ్యకాంక్షియై, సుతులనక, సహోదరులనకఁ దనవారి నందఱినిఁ జంపి, తన్ను లోకులేమనెదరో యనినైన శంకింపక రాజ్యమేల నరుదెంచె' నని నిందించుచు నివ్వచనములు నీకుఁ జెప్ప నన్నుఁ బనిచిరి. ఇట్లు శిష్టజనములెల్లఱు నిందించుచుండ నీకింకను రాజ్యమేల"యని పలికెను. కర్ణకఠోరములగునవ్వచనము లాకర్ణించి ధరణీసురులెల్లఱు నివ్వెరఁగంది "భరతకుల ప్రదీపా! ఈదుర్వచనములు మావలనఁ బుట్టినవిగావు. దుర్యోధనసఖుఁడగు దానవుఁడు సన్యాసివేషమున నరుదెంచి యిట్టి యప్రియోక్తులాడె. ఈనీచుఁడు ప్రలాపించిననేమి? ఉత్తమక్షత్ర ధర్మమున నీవు సముపార్జించిన "యుజ్జ్వలశ్రీ సుస్థిరతనొందెడు" మని యాశీర్వదించి, కోపారుణితలోచనులై యాదనుజునిఁ జూడ, భూసురకోపాగ్నికి వాఁడు విగతజీవుఁడై ఘోరాకారముతో నేలఁగూలెను. అంతట ధర్మతనూజుని చిత్తము కలంకదేరెను.

పిమ్మట ధౌమ్యుఁడు కృష్ణానుమతమున నొక కనకకలశమున భాగీరథీజలముఁ దెచ్చి సమంత్రపూర్వకముగ సకల

జనానందకరముగఁ బట్టాభిషేకసంస్కారము నిర్వర్తింప, ధృత రాష్ట్రుఁడు ప్రసన్నచిత్తుఁడై యావన్మిత్రతోయములతో నానృప తిలకు నభిషేకించెను. అప్పుడు వేద ఘోషమును, విప్రాశీర్వా నాదములును, మంగళతూర్యారవములును మిన్నుముట్టెను.

అంతట ధర్మతనూభవుఁడు పౌరులఁ గృపారసదృష్టి నవ లోకించి "పౌరులారా! నాకుఁ దండ్రియు, గురుఁడునగు నీకురు నాథునియెడ మీరెల్లరు నెప్పటివలె భక్తితోఁ జరించుచు నమ్మహానీయు నాజ్ఞల నాచరించుచు మీమీ నిలయముల సుఖముగనుండుఁ"డని పలికి, సమరనిహతులైన రాజకుటుంబముల కనేక బహుమానముల నొసఁగి, వారి వారి రాజ్యముల వారివారి సంతతిఁ బ్రతిష్ఠింపఁజేసి, యువరాజపదమున భీమసేనుని నిలిపి, దర్పితుల మర్దింపను, బరచక్రములాక్రమింపను నర్జును నిర్దేశించి, సేనలకొలందులు గనుఁగొనుటకు, భృత్యులకు జీవితములు వెట్టుటకుఁ, గర్మకలాపములు సేయించుటకు నకులు నాజ్ఞాపించి, సర్వావస్థలయందుఁ దనసమీపముననుండి రక్షణము సేయ సహదేవుని నియమించి, కర్తవ్యవిచారమునకును, సంధివిగ్రహాదిషాడ్గుణ్యచింతనమునకు విదురుని నియోగించి, బ్రాహ్మణకార్యములకు, శ్రౌతస్మార్తకృత్యసమనుష్ఠానమునకు ధౌమ్యుని నియోగించి కొలువుఁ జాలించి యన్నదానములతో సకల జనములఁ దృప్తులఁజేసెను.

ఇట్లు ప్రాప్తసామ్రాజ్యుఁడై పాండవాగ్రజుఁడు గాంధారీ ధృతరాష్ట్రులకుఁ బ్రణామము సేసి "ఇప్పుడమికిఁ బాలకులు

మీరలు: నేను మీపనుపు సేయుచు, మీరు చెప్పినయట్లుఁ గుడిచి యుండెఁ గలవాఁడ" నని భక్తిపూర్వకముగఁ బలికి, పతివిహీనలైన వారి కోడండ్ర నతిగౌరవముగ నాదరించి, వాసుదేవు నవలోకించి వినయమునఁ గేలు మొగిచి,

తే. 'అమలభవదీయ సుప్రసాదమునఁ జేసి
పితృపితామహాక్రమయోగ్య పీఠమైన
వినుతసామ్రాజ్యమున నేను విభుఁడనైతి
కృతార్థతానందపూర్ణుఁడనైతి గృష్ణ.'

అనుచుఁ బ్రియభాషణములచే న ద్దేవునిఁ బ్రీతునిఁ జేసి, నిజానుజుల నవలోకించి,

మ. "అటవీదేశము లందు గాఢబహులాయాసంబులం గంది దు
ర్ఘటము ల్వైర్యేశ్వరు సేవఁగుంది బహుసంగ్రామంబులన్ విద్విష
త్పటు నానాస్త్రమహోగ్రశస్త్రచయ నిర్భగ్నాంగతంబొంది యు
త్కటదుఃఖంబుల మీరలొందితిరి రక్షేదృశ స్థైర్యులై నాకుఁ గాన్..,

నన్నుఁ గృతకృత్యుఁగఁ జేసితిరి. కృష్ణప్రసాదలబ్ధమైన యీ జయశోభనము నిజేచ్ఛాకలిత సుఖావాప్తిలీల ననుభవించుచు నాత్మప్రియప్రకారముల వర్తించుచు నవధానముతో రాజ్యాంగ సక్తక మరయుం" డనుచు వారల నభినందించెను.

అనంతర మొక్కనాఁడు ప్రభాతసమయమున నజాతశత్రుఁడు వాసుదేవుఁడు శయనించిన మందిరమున కరిగి, హేమపర్యంకమున శయనించి యున్న యా జలధరశ్యాము నవలోకించి ముకుళితకరకమలుఁడై "అంబుజాక్షా! రాత్రి సుఖనిద్ర నొందితివా? త్రిభువనవ్యాప్తవిక్రముఁడవగు నీ కటా

క్షేమము కలిమిగాదే జగత్త్రయసంభావనీయుఁడవై వెలింగితి" ననుచుఁ జేరఁబోయి, తన వచనముల కద్దేవుఁడు మాఱు వలుక కనివాతనిశ్చలదీపప్రకారమున నుండుట నుపలక్షించి విస్మితుఁడై "ఈ పరమపురుషుఁ డిట్లుండుటకేమి కారణ" మని యోజించు చుండెను. కొంతతడవునకుఁ శార్ఙ్గధరుఁడు చిఱునగవుతో యుధిష్ఠిరనృపాలు నవలోకించి,

సీ. "గంగ యెవ్వనిఁ దనగర్భమునం దతి
      శ్లాఘాసమేతయై సంభరించె
భార్గవుఁ డెవ్వనిఁ బరమశిష్యుఁడుగాఁగఁ
      బడసి గురుత్వ మెక్కుడుగ నెగడె
నా రాముఁ డెవ్వనితోఁ బోరి యిరువది
      మూఁడుదినములకు వాఁడిదొలఁగెఁ
గాశీశుకన్యలు కారణంబుగఁ బోరి
      యెవ్వనికోడి రనేకనృపులు
వేదములు నాలుగును ధనుర్వేదమును మ
హాస్త్రములుఁ జెంది యెవ్వనియందు వెలిఁగె
నట్టి భీష్ముండు నన్నిష్టు డాత్మఁ దలఁచు
చునికిఁ దద్గతమయ్యె నామనము నధిప.

క. శరతల్పగతుం డతఁడే
   శరణంబుగ నాశ్రయించి సద్భావవ్యా
   ప్తిరతుండగుటను వినుత
   త్పరత నతనియందు నాదుభావం బెలసెన్.

అక్కారణమున నీ రాక నెఱుఁగనైతి" నని పలికి యానృపతి సందియము వాపి "ధర్మనందనా! ఉత్తరాయణముకొఱకు వేచియున్న గాంగేయుని పాలికి నీ వరిగి, సర్వవిద్యాధార

ఖ్యాతుఁడగు నమ్మహాపురుషునిచే సకల ధర్మములు దెలిసికొని, నిశ్శేషనిరస్తసంశయుఁడవగు" మని చెప్పెను. అంతట ధర్మతనయుఁడు పితామహుని పాలికిఁ దన బంధువర్గముతోడను, శ్రీకృష్ణునితోడను బయలుదేరెను.

అప్పుడు శరతల్పగతుఁడై యున్న యా దేవవ్రతుఁడు తన మనమున ముకుందుని చరణారవిందములు నిలిపి,

సీ. "శుచియును హంసుండు శుచిషత్తుఁ బరముండుఁ
బరమేష్ఠియును నగు భవ్యుఁ గొలుతు
మునులును సురలు నెవ్వనియున్నరూపెఱుం
గరు సర్వవిదుని నప్పురుషుఁ గొలుతు
శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం
బుగ నెఱింగెడు పుణ్యమూర్తిఁ గొలుతు
లోకంబులెల్లఁ గల్గుట నిల్చుటొదుగుట
తనయందయగు మహోత్తరునిఁ గొలుతుఁ
బక్షిరత్నచయంబుఁ బుష్పవ్రజంబుఁ
బంజరము త్రాడునారయుపాశ్రయముగ
మందుచాడ్పున విశ్వంబు నుండుటకు సు
ఖాస్పదంబగు పుండరీకాక్షుఁ గొలుతు.

మ. యదువంశంబున వాసుదేవుఁడనఁ గ్రీడార్థంబు జన్మించి దు
ర్మద దైత్యావళిఁ గూల్చి పార్థునకు సారథ్యంబు త్రైలోక్య స
మ్మదమారంగ నొనర్చి దేవముని సమ్మానోద్ధృతిన్ భూధరం
బుఁ దోలంగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్."

అని ధ్యానించుచుండ, కృష్ణ యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవ విదుర ధృతరాష్ట్రాదు లచటి కరుదెంచిరి.

అప్పుడు కృష్ణుఁడమ్మహానీయు నవలోకించి "కురువంశ శేఖరా! మేనినిండ శరములు గ్రుచ్చుకొని పీడించుచుండ నంపశయ్యపైఁ బరుండియు, నుత్తరాయనము వచ్చువఱకుఁ బ్రాణము విడువననుట మహాపురుషుఁడవగు నీకుఁగాక నొరులకు శక్యంబే? ఇఁక నేఁబదియాఱుదివసములకు నుత్తరాయనము ప్రవేశమగు. నీవప్పు డిత్తనువు విడిచి పరమపదవి నొందుదువు. వసువులు గగనమున విమానారూఢులై నీరాకకుఁ బ్రతీక్షించుచున్న వారలు. సకల విద్యాధారభూతుండవగు నీ వస్తమించిన నీ ధాత్రి యస్తమితసుధాగభస్తియగు రాత్రియుఁ బోలెనగు; సమస్తజ్ఞానములు ననాశ్రయములై పోనుంగు పడుఁగావున నీ విప్పుడు, బంధువధము సేసినందులకు శోకసంతప్తమానసుఁడై యున్న యీపాండవాగ్రజునకు సర్వ ధర్మములు నుపదేశించి దుఃఖోపశమనము సేయువలయు" నని పలికెను. దేవవ్రతుఁడు కృష్ణసందర్శనమునకుఁ బ్రమోద భరితమానసుఁడై కరకమలములు మొగిడ్చి "వాసుదేవా! భక్తవత్సలా! భవదీయవచనామృతపూరములఁ గ్రోలుటచే వార్షపూరితాంతఃకరణుఁడనైతి ; విషానలసదృశములగు శరములు నిరతము పీడించుచుండుటచే నా సర్వాంగములు, నంతరంగమున వశములై యుండె ; ఇట్లు శరపీడితగాత్రుఁడనై సంభాషణశక్తిహీనుఁడనై యున్న నాయెడఁ బ్రసన్నుఁడవై యుధిష్ఠిరునకు బోధింపవలసిన ధర్మములు నీవే బోధింపుము. నీవుండ నేనుబోధించుట, గురుఁడుండ శిష్యుఁ డుపదేశించిన

విధముగాదె?" అని వచింపఁ గృష్ణుఁడు "అనఘా! నీకు శరములవలన బాధయు, క్షుత్పిపాసలును లేకుండునటుల నేను వర మొసఁగుచుంటి. సుజ్ఞానుఁడవై ధర్మతనూజునకు సకల ధర్మముల నుపదేశింపుము. ఈ పరమయశము నీకుఁ గలిగింప నెంచి ధర్మోపదేశమునకు నియమించితిని. నీ యుపదేశ వాక్యములు వేదతుల్యములై ఘనకీర్తి వెలయుచుండు" నని చెప్పెను.

అంతట భీష్ముఁడు కృష్ణవరప్రసాదమునఁ దన్ను శరములు బాధింపకుండుటకుఁ బరమానందము నొంది, యుద్దేవునిఁ గీర్తించి, తనకు నమస్కరించిన యుధిష్ఠిరు నతి ప్రీతి నాదరించి యాతనికి ధర్మోపదేశము సేయ నుపక్రమించి "ధర్మనందనా! దుర్యోధనాదు లవినీతులై నిన్ను నేక శ్రమలనొందించి, రాజ్యముఁ బంచి యీయ నొల్లనందున నీవు క్షత్రియోచిత ధర్మమార్గము నవలంబించి రణమొనరించి వారలఁ జయించి రాజ్యముఁ గైకొంటివి. దీన నీ కేమి పాపముగలదు? క్షత్రియులు బాహుబలమున రాజ్యము వడసి ప్రజల నేలుట ధర్మముగాని, భిక్షాటనమున జీవించుట ధర్మమే? మఱియు నృపధర్మములు వివరించెద నాకర్ణింపుము.

చ. యజనము దానకర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం
బ్రజ కనురాగ మొందఁ బరిపాలనసేఁతయు సంగరంబున
న్నిజశరనిర్భిన్నులై మరణమొందుటయున్ నృపధర్మముల్ గదా
ప్రబలిత రాజ్యస్థాన ఘనశరంబు సుధర్మవృత్తి విలసిల్లెడు నృపుల్.

క. తరణిశశాంకుల తేజ
స్ఫురణము లేకున్న యట్లు భూజనములు ని
ర్భరదురితతఁ జెడ్పుదురు
నరపాలక విహితపాలనము లేకున్నన్.

క. రాజానకుఁ బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మ గాన రాజుం బ్రజయున్
రాజోత్తమ యన్యోన్యవి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్.

వ. జనకుండుబోలె నర్మిలిఁ బ్రజం బరికించుచు షష్ఠభాగముం
గొనునది వారిచేత నరిఁగోటిఃధంబుల నాప్తదత్తులం
గని వనగోకులాకరనగప్రముఖార్థకసంబు లారయుం
జనుచు నన్నిఁటన్ ధరణిపాలుఁడు గన్నిడియున్నఁ బెంపగున్.

క. చోరులచేఁ జెడకుండం
గ్రూరులచేఁ జావకుండఁ గురుల సుజనులన్
జారులచేఁ బడకుండ ధ
రారమణుఁడు నేర్పుగలిగి రక్షింపఁదగున్.

క. అరి మిగులఁ గొనుట గ్రేపులఁ
బొరివాలం బిదికినట్ల భూవరకదుపున్
జెరవునఁ బెనిచిన యట్లగు
నరపతి ప్రజచేత నప్పనముఁ దగఁగొనినన్.

తే. భూతవృద్ధులు ధనలాభములునుగలుగు
ధర్మమునను రాజనువాఁడు ధర్మరక్ష
కై జనించెను గావున నతఁడరోష
కాముఁడై ధర్మనిరతుఁడు గాఁగవలయు.

మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగఁ ద
ద్ధరకున్ వర్షము లేక యుండుఁ బ్రజకున్ దైన్యంబు వాటిల్లుఁ దె
క్కుఱదజల్ వైకొను [illegible] [illegible]
ద్ధరసైన్యంబుల శత్రులొత్తుదురు బంధుశ్రేణికిం జేటగున్.

క. కాని చెంబడములు సేయక
సూనృతధర్మమున నడచు సర్వేశుఁడు సం
తానము బంధులుఁ బ్రజలును
దానును సేవలును శుభము దలకొనఁ జేర్చున్."

అనుచు వివిధ రాజధర్మములును, ననేక యితిహాసములును నుపదేశించెను.

—∗ అ ను శా స ని క ప ర్వ ము ∗—

ఇట్లు దివ్యజ్ఞాన దేదీప్యమానుఁడైన శాంతనవునిచే ననేక ధర్మముల నాకర్ణించియు ధర్మతనూజుఁడు "పితామహా! నా కింకను ధర్మోపదేశము సేయు" మని యడిగెను. దేవవ్రతుఁ డా భూమీశుని యెడఁ బ్రీతుఁడై,

సీ. అఖిలజగత్ప్రభుఁడగు దేవదేవు న
నంతుని బురుషోత్తమాభిధాను
నంచిత నామ సహస్రకంబున సంస్తు
తించుచు సంతతోద్గతమనస్కుఁ
డై యజమానుఁ డవ్యయుఁడైన యాతని
నర్చించుమను దృఢధ్యాననిరతుఁ
డగుచు నమస్కృతి యాచరించుచు నవా
ద్యంతు నవ్విష్ణు నధ్యక్షు నెల్ల

తే. లోకములకు బ్రహ్మణ్యుఁ ద్రిలోకకీర్తి
వర్ధనుని సర్వధర్మజ్ఞుఁ బరము లోక
నాథు భూతభవోద్భవు నమ్మి భక్తిఁ
గొలిచి సర్వదుఃఖంబులం దొలఁగఁద్రోచు.

తే. ప్రస్తుతులఁ బుండరీకాక్షుఁ బరమభక్తిఁ
దలఁచి యర్చించుట యనాహుతంబు సర్వ
ధర్మములకును సముధికతమము నైన
ధర్మ మింతయెయుంగుము ధర్మతనయ.

తే. వినుము దానఁబుఁ దపమును వృద్ధసేవ
నమున హింసయు నియతకృత్యములు సర్వ
జనుల కిష్టహితగుణములు మనమునందు
దృఢముగా నిల్పి నడపుము ధీరవర్య.

సీ. ఎప్పుడు ధర్మంబు నెడ నాదరముగల
వానికిఁ గాలంబు దాన యిచ్చు
ధర్మతత్త్వప్రబోధముఁ బరిస్ఫుటముగాఁ
గావున సుస్థిరభావశుద్ధి
సహితతపశ్శ్రుతస్నానదాన జపంబు
లను దేవతాపూజలను నమోఘ
కాలుఁడై వర్తింపఁగా ధర్మయోగంబు
సమకూరు ధర్మంబు సాధనత్వ

తే. మొంది చేయించికొని చెప్పఁబొందు నిర్మ
లాత్మకుండు సంసారసారాత్మకంబు
సత్యమజరామరము బోధనిత్య మచ్యు
తము పరానందమగు నప్పదంబు ననఘ.

తే. కను తెలుంగు వేదవ్యాసమునివరుండు
నధిప కృష్ణుండు నీకుఁ బరాయణంబు
చింత దిగఁద్రావి పాలింపు శాంతవృత్తిఁ
బ్రజల సర్వంబునందును విజయివగుము.

నే నెఱిగిన ధర్మమూలన్నియు నీ కుపదేశించితిని. నీ విఁక గజపురమున కరిగి, యయాతీ, మాంధాతాది చక్రవర్తుల వలెఁ బెక్కుమఖముల నాచరించుచు యశోవంతుఁడవై, ధర్మైక నిష్ఠుఁడవై, ప్రజారంజకుఁడవై మహీపాలనము సేయుము. అర్కుఁ డుత్తరాయణగతుఁ డైనతోడనే మరల నాకడ కరుదె" మ్మని సప్రేమముగఁ బలికెను. అంతటఁ బాండు

సూను లా దేవవ్రతునకుఁ బ్రణామము నేసి, యమ్మహానీయు ననుజ్ఞవడసి, కృష్ణ, ధృతరాష్ట్రులఁగూడి కరిపురమున కేఁగి సుఖముగఁ గాలము గడపుచుండిరి.

ఇట్లుండఁ బంచాశద్దివసానంతరమున వాసరపతి యుత్తరాయణగతుఁడుగా, ధర్మనందనుఁడు మొదలు సకలబాంధవులఁ గూడి భీష్ముని శరశయనస్థానమునకరిగెను. భీష్మనిర్యాణ కాలము నెఱిఁగి నారద, దేవల, వ్యాసాదిమహామునులును నచటి కరుదెంచిరి.

అప్పుడు గంగానందనుఁడు ధృతరాష్ట్రు నవలోకించి "కుమారా! నీసుతులు లజీసితులై యుధిష్ఠిరునకు రాజ్యముఁ బంచి యీయనొల్లనందున నిట్లు కులక్షయము సంప్రాప్తమయ్యె! కృష్ణద్వైపాయన మునీంద్రునిచే నీవు సమస్తధర్మములు నెఱిఁగినవాఁడవు గావునఁ గడచినదానికిఁ జింతిల్లక, నీయెడ భక్తితోఁ జరించుచున్న యీపాండునందనులనే నీతనయులుగ నెంచి వీరియెడఁ గరుణాళుఁడవై వర్తింపుచుండు" మని చెప్పి, వాసుదేవు నవలోకించి కృతాంజలియై

తే. "దేవదేవ జీవాత్మక దేవవంద్య
శంఖచక్రగదాపద్మ చారుహస్త
వాసుదేవ త్రివిక్రమ వరద పరమ
పురుష ప్రణుతిసేయనర్హుఁడఁ గరుణఁజూడు.

ఆ. బలము నీవ నాకు భక్తుండ నీయెడ
నాలుబిడ్డలేని యట్టివాఁడఁ
గావు నన్ను నధిక కారుణ్యమున నిన్ను
నుజ్జఁ గమలదళమనోజ్ఞనయన."

అని వేడఁ, గృష్ణుఁ డా దేవవ్రతు వదన మత్యాదరమున నాలోకించి " మహాపురుషా !

ఆ. కీడొకఁడు లేదు కృతపుణ్యుఁడవు తండ్రి
వలని భక్తిపెంపు గలవు దానఁ
గాన బంటుఁబోలె గాంగేయమృత్యువు
నీవశమున నిలిచె నిర్భరముగ."

నీకనుజ్ఞ నొసఁగుచుంటిని. ఇఁక దివమున కరిగి వసువులఁగూడి సుఖింపు " మని పలికెను. అంతట గాంగేయుఁడు ప్రమోదిశాంతఃకరణుఁడై, విదుర ధృతరాష్ట్ర యుధిష్ఠిరార్జునాదుల నందఱినిఁ జేరఁదీసికొని " మీయందఱిచే ననుజ్ఞాతుఁడఁగదా " యనిపలికి, తొల్లి తాను భూపాలుర జయించి తెచ్చిన ధనమును భూసురోత్తములకొసఁగి, ధారణానుక్రమమున సమాహితాత్ముఁడై వాయువుల సన్నిరుద్ధముసేయ నవి యూర్ధ్వగతిం గైకొనియె. ఆమహాత్ముఁ డవయవములఁ బ్రాణములు వాసికొనుచు నేఁగుచుండ నాయాచోట్లు శల్యరహితములగుచుండెను. అచ్చటివారెల్ల అదిగాంచి విస్మయావేశితమానసులై యా తపోధనసత్తముని మహిమం బ్రస్తుతించిరి. అంతనా సంయమచతురునిచే సర్వాయతనసన్నిరుద్ధంబై యాత్మ మూర్ధము భేదించి మహోల్కాకారమున నాకసమున కెగసి కొంతదవ్వరిగి యంతర్హితమయ్యె ! ఆసమయమునఁ గుసుమ వర్షము గురిసెను. దేవదుందుభులు మొరసెను. అంబరమున సిద్ధసాధ్యులు హర్షపూరితమానసులై కీర్తించుచుండ మాఘ మాసమున శుక్లపక్షమున నేకాదశీ పుణ్యదివసమున నద్దేవ

వ్రతుండు పరమపదము నొందెను.

అంతటఁ బాండుసూను లామహాత్ముని పుణ్యశరీరము నత్యంతభక్తితోఁ దీసికొనిపోయి, చందనాగరుకాష్ఠములతో దహనసంస్కారము సేసి భాగీరథీతీరమునకుఁజని, భీష్మహితార్థముగా నచ్చట విప్రసమూహమున కనేక మహాదానముల నొసఁగి, సకలబాంధవులఁగూడి యమ్మహానుభావున కచ్చటఁ దిలోదకప్రదానము సేసిరి.

అప్పుడు భాగీరథీదేవి తనపుత్త్రునిఁ దలఁచి శోకవిహ్వలయై "పితృభక్తిపరాయణుఁడును, దృఢవ్రతశీలుఁడును, నార్యసమ్మతుఁడును, విద్యాపరిశ్రమఘనుఁడును నగు శాంతనవుఁడు సమరమున శిఖండివలన నిట్టులగుటఁ గాంచియు, వజ్రమయమగుటచే నాహృదయము వ్రయ్యలుగాక నిలిచియుండె" ననుచు విలపింప, వ్యాస, వాసుదేవు లద్దేవి నుద్దేశించి

తే. "నీవు శోకంబుదక్కుము నీసుతుండు
పరమగతినొంద శాపసంప్రాప్తిఁజేసి
వసువు మర్త్యుఁడై వర్తించె వసదృశప్ర
భావుఁ డాతఁడు వగపేల దేవినీకు.

చ. అతనిశిఖండిచేల యమరాధిపుడుః సమయింపఁజాలఁ డే
యతఁడు నిజేచ్ఛఁజేసి నరునంచితదివ్యశరంబు లంగసం
గతములుసేసి పాన్పుగ సుఖస్థితి మృత్యువుమాన్చియుండి
స్వ్యతిశయమొంది తావలచినప్పుడు పోయె విషాదమేటికిః

అని చెప్పి యూరడించిరి.

—॥ అశ్వమేధపర్వము ॥—

యుధిష్ఠిరనృపాలుఁడు పితామహునకుఁ బరలోకక్రియల

నాచరించి యాశుచిత్వ నివృత్తికై గంగాతీరమునఁ బటగృహ నిర్మాణముసేయించి యిచ్చట నివసించుచు, భీష్మ, ద్రోణ కర్ణాదులఁ దలఁచి యింకను దుఃఖాక్రాంతచిత్తుఁడై యుండ వ్యాసవాసుదేవు లానృపచంద్రు నవలోకించి "పాండవా గజా! బంధువులు శోకించిన మృతకోటికిఁ బరితాపము వాటిల్లు. పితామహునిచే సమస్తధర్మములు నెఱిఁగియు నిట్లు చింతింపఁదగునే? ఇంకను నీకుఁ బాపశంకగలదేని యశ్వమేధ యాగముఁ జేసి, శ్రీరామ, పూరు, భరతులఁబోలె సద్యశో ధనుఁడవుగ" మ్మని యుపదేశించిరి. అప్పుడు ధర్మతనూ జుఁడు అశ్వమేధయాగ మధికదక్షిణాన్వితముగఁ జేయవలసి యుండె; నాకడ నిప్పుడు ధనములేదు. దుర్యోధనుఁడు ధన మంతయు దుర్వ్యయము సేసి బండారమును బాడుసేసె; మహీవలయమునఁ గల రాజులెల్లఱు నీమహాసంగ్రామమున నిహతులగుటఁ జేసియు, వారి సంతతివారలు పిన్నవయ స్కులై, దుఃఖాక్రాంతచిత్తులై పుడమినేలుచుండుటఁ జేసియు వారలవలన ధనాహరణం బత్యంతాకరణీయమును, దుర్లభ మునై యుండె. కావున నేనిప్పుడు క్రతువునకుఁ జాలిన ధనము నెవ్విధమున నార్జింపఁగలవాఁడ" నని వచింప వ్యాసుఁడు "ధర్మనందనా! తొల్లి మరుత్తుఁ డను మహీ పాలుఁ డొకఁ డశ్వమేధయాగముఁ జేసి భూసురనికరమున కనేక ధనరాసులను దానమీయ వారలాధనమంతయుఁ దమ గృహములలో దాఁచుకొనఁజాలకఁ దమకు వలయునంత

గృహములకుఁ దీసికొనిపోయి కడమ ధనమంతయు హిమవన్నగమున నొక్కచోట నిధిగా నిక్షేపించి "కాలాంతరమున నీనిధి నెవ్వరు కనుగొనెదరో వారిదే యీధన" మని యందఱు నేకగ్రీవముగఁ బలికియుండిరి. కావున నీవిప్పు డా ధనముఁ దెచ్చి సుఖము నాచరింపు" మని చెప్పి నిజాశ్రమమున కరిగెను. పిమ్మట యుధిష్ఠిరుఁడును తన వారలఁగూడి హాస్తిపురమున కరుదెంచి సకలబాంధవులు మోదముగొంద, జనులు నభినందింప వసుంధరాపరిపాలన ధురంధరుఁడయ్యెను.

కృష్ణుఁడు కొన్నిదినములు ధనంజయునితో నిచ్ఛావిహారములు సలిపి, పిమ్మటఁ దానిఁక ద్వారకానగరమున కేగవలయు నని చెప్పి పాండవుల నంగీకరింపఁజేసి సాత్యకీసహితుఁడై నిజపురమున కరిగెను.

పిమ్మట యుధిష్ఠిర నృపాలుఁడు నిజానుజులఁగూడి హిమశైలమున కరిగి భక్తిపూర్వకముగఁ గృష్ణద్వైపాయనునిం దనమనమునఁ బ్రార్థింప నమ్మునీంద్రుఁ డరుదెంచి యాధననిధి నానృపవరేణ్యునకుఁ జూపించెను. యుధిష్ఠిరనృపాలుఁ డాసువర్ణరాసిని భక్తియుక్తముగఁ బూజించి యనేక వాహనములపయిఁ బెట్టించి గజపురమునకుఁ దెచ్చి, "అశ్వమేధ యాగము సేయింప సకలబాంధవ యుతముగ విచ్చేయు" మని కృష్ణునిఁ బిలువఁబనిచెను.

ఆశుభవార్త నాలకించినతోడనే మధుసూదనుఁడు వసుదేవ బలభద్రసాత్యకి కృతవర్మాది సకలబాంధవులఁగూడి.

గజపురమున కరుదెంచెను. అప్పుడు మత్స్యరాజనందనయగు నుత్తరకు విగతప్రాణుండై సుతుండు జనింపఁ గుంతీ ద్రౌపదీ సుభద్రలు శోకాక్రాంతలై విలపించుచు, కృష్ణునివాలికిఁ బోయి "వాసుదేవా! పరమపురుషా! భక్తవత్సలా! నీవు మున్ను "ఉత్తరగర్భమునుమాత్రము రక్షించి యీభరత వంశము నుద్ధరింతు" నని మాకభయమిచ్చియుంటివి. సురాత్ముఁడగు ద్రోణాత్మజుని బాణాగ్నిచే విగతప్రాణుండై జనించిన యిబ్బాలునకుఁ బ్రాణదానముసేసి కురుకులము నిలువఁ బెట్టి మమ్మానందింపఁజేయు" మని బహువిధములఁ బ్రార్థించిరి. అంత నప్పుండరీకాక్షుఁడు సూతికాగృహమునకుఁ జని, యబ్బాలశవమును శయ్యాతలమునఁ బెట్టఁ బనిచి, యెల్లరును వినుచుండ,

క. "నరునియెడ నామనంబున
విరోధమెన్నఁడును నేవిధముననైనం
బొరయమి నిజమేనియు సు
స్థిరముగ నిబ్బాలుఁడీన జీవము నిందున్.

తే. మహితసత్యంబుఁ బరమధర్మంబు గాఢ
నిర్మల బ్రహ్మచర్యంబు నిత్యసుప్ర
తిష్ఠితంబులై నాయందుఁ దేజరిల్లు
నేని నిబ్బాలునకు జీవమిపుడ వచ్చు."

అని వచింపఁ దోడనే యబ్బాలుఁడు సజీవుఁడై బాంధవుల నందఱిని హర్షపరిప్లుతాంతరంగులఁ జేసెను. కృష్ణుఁ డాబాలునకుఁ బరీక్షితుఁ డని పేరు పెట్టెను.

అనంతరము యుధిష్ఠిరనృపాలుఁడు కృష్ణు నానతిచొప్పునఁ

దగినవారలచే యజ్ఞోపకరణతతు లన్నియు సిద్ధము సేయించి, మునివరేణ్యులు నిర్ణయించిన శుభలగ్నమునఁ దాను సవన దీక్షితుఁడై యజ్ఞాశ్వరక్షణమునకు విజయుని నియమించి "తమ్ముఁడా! మహీచక్రమునఁ గల నృపతులెల్లలును మన సంగ్రామమున నిహతులైరి. కావున నీ విప్పు డీ యశ్వముఁ బట్టవచ్చినవారిని సాంత్వవచనములచే మరలింపుము గాని, శౌర్యముఁ జూపి వధింపకు" మని చెప్పి పంపించెను.

అనంతర మా హయరత్నము ధనంజయుఁడు తనకు రక్షకుఁడై వెంట వచ్చుచుండ ధరణీ ప్రదక్షిణరూపమునఁ దిరుగుచు త్రిగర్తదేశము సమీపింప సుశర్మ పుత్రులు పూర్వవైరముఁ దలఁచి ధనంజయునితోఁ బోర నెంచి యుత్తరంగమున కడ్డము వచ్చిరి. సవ్యసాచి వారితో నని సేయ నొల్లకఁ దన యగ్రజు నాజ్ఞ సాంత్వనవచనములతోఁ దెలిపెను. వా రవ్వచనముల నాకర్ణింపక రణమున కుపక్రమించి, యమ్మహాభుజుని పరాక్రమమున కోర్వఁజాలక నాతని శరణుఁ జొచ్చిరి. గాండీవి వారల కభయ మొసఁగి "మఖావలోకన మునకు రం" డని చెప్పి యజ్ఞాశ్వము ననుసరించి వెడలెను.

పిమ్మట న య్యశ్వరాజము ప్రాగ్జ్యోతిషపురపరిసరమున కరుగ భగదత్తతనయుఁ డు దానిఁ బట్టి వచ్చె నవ్వడి సాంత్వన వచనములకు మరలక దన్నుఁ గొంతతడ వామోహనము సేసి విజితుఁ డయ్యెను. అప్పుడు ఫల్గునుఁడు కరుణాతరంగిత స్వాంతుఁడై యాతని నవలోకించి "ఓయీ! యుధిష్ఠిర నృపాలుఁ

డశ్వమేధయాగదీక్షితుండై యి త్తురంగము వజ్జ నన్నుం బుత్తెంచునప్పుడు,

క. "చంపకు మీరాజుల నను
కంపాతిశయంబు మెఱయఁగా నడపుము నీ
పెంపను కుసుమములకు నా
పం పొనరించుట యసౌరభముగ నెఱుఁగుమీ."

అని యాజ్ఞాపించెఁ గావున నీయెడ నాకుఁ గ్రోధము లేదు. వైరము విడిచి బంధుజనములఁ గూడి క్రతువీక్షణమున కరుదెం" మ్మని పలికి యశ్వము వెంట నేఁగెను

అనంతర మా హయము సింధుదేశప్రాంతమున కరుగ జయద్రథుని బాంధవులు దాని కడ్డువచ్చి పాండవమధ్యముని వచనముల నాకర్ణింపక సమరమున కుపక్రమించి, యాశూర వరేణ్యుని ధాటి కాగఁజాలకఁ జిందరవందరయై పోయిరి. అప్పుడు దుస్సల దుఃఖావేశితమానసయై యడలుచుఁ దన పౌత్రునిఁ దోడ్కొనివచ్చి "సోదరా! నీ మేనల్లుని సుతుఁ డగు ని బ్బాలునెడఁ గరుణాళుఁడవగు" మని వేఁడ నర్జునుఁడు "సోదరీ! ఇప్పుడు నా యల్లుఁ డెచ్చట నున్నవాఁ" డని సప్రేమముగ నడిగెను. "సోదరా! నీరాక వినినతోడనే, మున్ను తన జనకుఁడు నీచేఁ జచ్చుటఁ దలఁచి భయావేశితమానసుఁడై మరణించె" ననుచు దుస్సల దుఃఖింప గాండీవి దుఃఖపూరితాంతఃకరణుఁడై యామె మస్తకముఁ దన యక్కునఁ జేర్చి "సోదరీ! ఈ రాచపుట్టుక సమస్తపాపములకు మూలమని చింతించుచున్నవాఁడ! దుర్యోధనుఁడు దుర్న్యాయుఁడగుటచే

మున కిట్టి యిక్కట్లు వాటిల్లె. నీ విఁక నూరడిల్లి యీ బాలునితోఁ గూడి కేఁగి సుఖముగ నుండుము. మఖావలోకనమునకు హస్తిపురమున కరుదె" మ్మని చెప్పి యూరార్చి పంపించి తాను ఘోటకము వెంట వెడలెను.

పిమ్మట నా తురంగరత్నము మణిపూరనగరప్రాంతమున కరుగ నా నగరపాలకుఁడైన బభ్రువాహనుఁడు జనకుని రాకకుఁ బ్రమోదితాంతఃకరణుఁడై యెదురు సని భక్తి పూర్వకముగఁ బ్రణామము సేయ ధనంజయుఁ డాతని నాదరింపక "యాగపశువై చనుచున్న యశ్వముఁ బట్టి బాహుబలము సూపక బేలవలె నిట్లు సనుదెంచు నృపతి నృపతియే? పో పో" మ్మని నిరాకరించి పలికెను.

అంత నక్కుమారుఁడు భిన్నాంతఃకరణుఁడై నిజమందిరమున కరుగుచుండ, నురగరాజపుత్త్రియగు నులూపి మార్గమధ్యమున నక్కుమారు నెదుర్కొని "కుమారా! నీతండ్రి నీ పరాక్రమము నూడ నభిలషించుచు యుండె! కావున నీ విప్పుడు క్షత్రియోచితమైన ధర్మము నవలంబించి యా కురుసత్తమునితోఁ బోరి మెప్పు గాంచుము. నీ కీయంశము నుపదేశింప నే నిప్పుడు నాగలోకమునుండి వచ్చితి" నని బోధించి సమరమున కాతనిఁ బురిగొల్పెను. ఆ వచనముల నాలించి బభ్రువాహనుఁడు సమరోత్సాహుఁడై హంసధ్వజవిరాజితమైన తన యరద మెక్కి నిజజనకునితోఁ బోర నేఁగి యశ్వమున కడ్డుపడెను. అంత నా ధనంజయు బభ్రువాహను లతి

ఘోరముగఁ బోరఁ దొడఁగిరి.

కొంత తడవునకు బభ్రువాహనుఁ డొక తీక్ష్ణశరముఁ బ్రయోగింప ధనంజయుఁడు ధరణిం గూలెను. అంతకు మున్నే ధనంజయుఁడు ప్రయోగించిన శరఘాతమునకు బభ్రువాహనుఁడును మూర్ఛితుఁ డయ్యెను. ఇట్లు తన పతియును, కుమారుఁడును భండనమునఁ బడుట విని యులూపీ సమేతయై చిత్రాంగద యచటికి వచ్చి దుఃఖాతిశయమున నాక్రందనము సేయుచు భుజంగరాజసుత నవలోకించి “హా! సోదరి! నీ వక్కమగాని నసమయమున కేలఁ బ్రేరేపించితివి? సాధ్వీమణీ! నీ తలంపదగునా? ఇమ్మహాపురుషుని సత్వరమునఁ బునర్జీవితుఁ జేయుము. లేనిచో నేను నిమ్మహాత్మునితోఁ బరలోకమునకే గుదాన” ననుచు ననేక రీతుల నడలుచుండ బభ్రువాహనుఁడు మూర్ఛఁదేరి నిజజనకునిపైఁ బడి యనేక విధముల విలపించుచు “పితృహంతకుఁడనగు నాకిఁకఁ బ్రాయోపవేశమే యాచరణీయ” మని నిశ్చయించుచుండెను. అప్పు డులూపి “మీ రిట్లు విలపింపవలదు. నేనిమ్మహాశయుని కొఱకు ప్రియము సేయనెంచి యిట్లు గావించితి” ననుచు నొక్క సంజీవనమణిని బభ్రువాహనుని హస్తమున నునిచి “కుమారా! నీవు దీనిని జనకుని వక్షమునఁ బెట్టు” మని చెప్పెను. అంతట బభ్రువాహనుఁ డట్లు సేయఁ బార్థుఁడు ప్రత్యుజ్జీవితుఁడై తన వారలం గృపారసదృష్టితోఁ గలయఁ జూచి కుశలప్రశ్నము సేసెను. అంతట నులూపి గాండీవి

నవలోకించి "జీవితేశా! నే నొక్కనాఁడు గంగాస్నానమున కేఁగిన సమయమున నచ్చటికి వసువులును వచ్చి "అర్జునుఁడు శిఖండినిఁ బురస్కరించుకొనివచ్చి భీష్ము నన్యాయముగఁ బడవైచెను. అట్లు కుత్సితజయార్జనం బొనర్చిన యోధనం జయుని మేము శాపసంతాపితుఁ జేయుదు" మని వచింప నవ్వచనములు భాగీరథియు నంగీకరించెను. నేను వారి పలుకుల నాలకించి తోడనే మదీయజనకుని పాలికిఁ బోయి యవ్వృత్తాంతముఁ దెలుప నతఁడు వసువులకడ కేగి వారిని శాంతింప ననేక విధములఁ బ్రార్థించెను. అంత నా వసువులు ప్రసన్నులై "బభ్రువాహనుఁ డొక్కనాఁడు సమరమున విజయునిఁ గూల్చునని యాతని కిల్బిషము వాయును. పిమ్మట నతఁడు సంజీవనమణిచేఁ బ్రత్యుజ్జీవితుఁడగు" నని చెప్పిరి. అక్కారణమున నేనిప్పుడు తగిన సమయము చేకూరెనని తలఁచి బభ్రువాహనుని నీకు రణము సేయఁ బురికొల్పి నిన్ను విగతకిల్బిషుఁ జేసితి. పితామహు నధర్మముగ వధించిన పాతకము నీకు నేటితోఁ దీరె" ననుచు సమస్తవృత్తాంతము ను విశదీకరించెను. అప్పుడు చిత్రాంగదా బభ్రువాహన ధనంజయు లయ్యురగరాజపుత్రి ననేక విధములఁ గొనియాడిరి. పిమ్మటఁ బార్థుఁడు బభ్రువాహను నాలింగనము సేసికొని "కుమారా! నీవు జననీ ద్వయముతో మఖావలోకనమునకు ర" మ్మని ప్రియభాషణములతోఁ జెప్పి సప్రేమముగా నా సతీద్వయమును వీడ్కొని తురంగము వెంటఁ జనెను

పిమ్మట నాయజ్ఞాశ్వము మగధ, చేది, గాంధారాది సకల దేశములఁ దిరుగుచుండ నాయాదేశపాలకులు సమరమున కరుదేర గాండీవి వారలనందఱి నోడించి ధరణీచక్రమునఁ గల నృపతులనందఱి నధ్వరమునకుఁ బిలిచి తురంగరత్నముతో హాస్తిపురమున కరుదెంచెను. ఇట్లు జయశ్రీవిభాసితుఁడై వచ్చిన యప్పాండవ మధ్యముని గాంచి కృష్ణ, యుధిష్ఠిర, భీమాగులెల్లఱుఁ బరమానంద భరితమానసులై యాతని పరాక్రమమును బెక్కువిధములఁ గీర్తించిరి.

పిమ్మటఁ బౌత్రసమన్వితలై దుస్సలయు, జననీద్వయు సమేతుఁడై బభ్రువాహనుఁడును హాస్తిపురమున కరుదెంచి యుధిష్ఠిరాదులచే మన్ననలనొందిరి. మఱియు మఖావలోకనోత్సుకులై మహీవలయమునఁ గల సకల రాజులును, ముని శ్రేష్ఠులును, దిక్కులఁగల జనములును నరుదేర ధర్మాత్మజుఁ డందఱినిఁ దగురీతిని సత్కరించి మహాఋషులు నిర్ణయించిన శుభలగ్నమునఁ దాను వాజిమేధయాగముఁ గ్రమముగఁ జేయు నుపక్రమించెను. వ్యాస ధౌమ్యాది మహామునియు లమ్మహాధ్వరమును విధ్యుక్తముగ సమ్మహీవల్లభునిచేఁ జేయించిరి. అప్పుడు మంగళ తూర్యములతోడను, బుణ్యాహక రవముల తోడను, సంతోషధ్వానములతోడను, విప్రాశీర్వాద నాదముల తోడను దిశలు మాఱుమ్రోగెను.

ఇట్లు ధర్మతనూభవుఁడు సక్రమముగ నశ్వమేధయాగము నిర్వర్తించి పరమపావనమును, సమస్తదురితహరణమును నగు

యవభృథస్నాన మాచరించి, హిరణ్యరజితరత్నరుచిరాంబరాది మహాదానములచేతను, యిష్టాన్న దానముచేతను, సమస్త జనములఁ దృప్తులఁ గావించెను. క్రతువీక్షణార్థ మరుదెంచిన సకల మహీపతులును, కృష్ణ బలదేవాది సమస్త బాంధవులును యుధిష్ఠిరుఁ డొసఁగిన సత్కారములకుఁ బ్రీతులై యానృపాల తిలకు ననుజ్ఞవడసి తమతమ దేశముల కరిగిరి. పిమ్మట దుస్సలయు, బభ్రువాహనుఁడును నిజపురముల కేఁగిరి. ఉలూపియుఁ, జిత్రాంగదయు మాత్రము హాస్తిపురముననే నివసించుచుండిరి.

—* ఆ శ్ర మ వా స ప ర్వ ము *—

యుధిష్ఠిరమహీపాలుఁ డిట్లు పితృపితామహ క్రమప్రాప్తమైన సామ్రాజ్యము జగత్పూజ్య ప్రకారమునఁ గైకొని కుంతీగాంధారీ ధృతరాష్ట్ర కృప పిదురులయెడ వినమ్రుఁడై వర్తించుచు, ద్రౌపదికి సౌమనస్యము సేయుచు, ధృతరాష్ట్రుని కోడండ్ర నందరిని గౌరవముగ నాదరించుచు, కన్నబిడ్డలఁబోలె బ్రజలఁ గాపాడుచు ధర్మమార్గమున వసుధాపాలనము సేయుచుండెను. జయలక్ష్మీవిరాజితుఁడై సకలజనానురక్తుఁడై ధరణి నేలుచున్న యా రాజచంద్రునిఁగాంచి కుంతీవిదురాదులు హర్షపరిప్లుతాంతరంగులైరి. ధర్మతనూజుఁడు గాంధారీ ధృతరాష్ట్రులయెడఁ బరమగౌరవము సూపుచు "మీరెల్లఱుఁ గురువృద్ధుని సనువు సేయుచుండవలయు" నని సమస్తజనముల కాజ్ఞాపించుచుండుటచే

సకలజనులు నాతని యాజ్ఞానువర్తులై మెలఁగుచు, దుర్యోధనుని దుశ్చేష్టితముల నెన్నఁడును వాక్రువ్వకుండిరి.

గాంధారీ ధృతరాష్ట్రు లేకతంబ యుండు సమయమున వృకోదరుఁడు మాత్రము "మమ్మిడుములఁ బెట్టిన దుర్యోధనాదులను నిశ్శేషముగఁ బరిమార్చితిని. నా బాహుబలము నెఱుఁగక యీచెవటులు కయ్యమునకుఁ గడఁగిరి గాని మదీయ బాహుపంజరము సొచ్చిన వైరిసింహములు మరల వెడల నేర్చునే" యనుచు వారికి వినవచ్చునటులఁ బలుకుచుండెను. గాంధారీ ధృతరాష్ట్రు లవ్వచనములకు మనమున దుఃఖించుచు నూరకొనుచుండిరి. ఇట్లు పంచదశవత్సరములు గడచెను.

పిమ్మట ధృతరాష్ట్రుఁడు వనమున కరిగి తపముసేయ నిశ్చితుఁడై యొకనాఁడు యుధిష్ఠిరునిఁ జేరఁ బిలిచి "కుమారా! ఇంతకాలమునుండియు నీవు మాకే లోటయుఁ గలుగనీయక గాపాడుచుంటివి. నీకు నామీఁద గలభక్తికిఁ బ్రీతులమైతిమి. ఉత్తమ రాజవంశజులకు సమరమునఁ జచ్చుటయైనను, లేనిచో వనమునఁ దపము సేయుచు దేహత్యాగము సేయుటయైనను కర్తవ్యములగుటచే నేనిప్పుడు గాంధారీయుతముగ విపినమున కేఁగి తపముసేయ నిశ్చితుఁడనై యుంటి. కావున నీవు మేము తపోవనముకేఁగ నంగీకరింపవలయు" నని చెప్పెను.

ధర్మాత్మజుఁ డవ్వచనముల కులికి "తండ్రీ! ఇంత కాలమునుండియు నీవు దుఃఖములేనివానివలె నాకుఁ గనఁబడుచు మనమున గాఢపరితాపము నొందుచుండుటచే నిప్పుడు విపినమున

కేఁగెదనని పలుకుచుంటివి. విధివశమున దుర్యోధనాదులకును నాకును గలహము ప్రాప్తమయ్యె! నేనిప్పుడు వారల దుశ్చేష్టితముల నెంతమాత్రమును మనమునఁ దలఁపక, నాకుఁదల్లియుఁ దండ్రియు, గురుఁడును, దైవమును నీవయని నమ్మి నిన్ను సేవించి నాచిత్తతాపము నుపశమింపఁ జేసికొనుచుంటిని. నీవు వనవాసము సేయ నేఁగిన నేనిటనుండి రాజ్యముఁ బాలింపనొల్లను. నీకు వైశ్యాతియందుం దుద్భవించిన సుతుఁడును, ధర్మశీలుఁడునునైన యుయుత్సుని రాజ్యాభిషిక్తునిజేయుము. నేనును నీకంటెఁ గాంతారమున కరుదెంచి నీకు శుశ్రూష సేయుచుండెద" ననుచు నాతని చరణద్వయముఁ బట్టుకొనియె. ధృతరాష్ట్రుఁ డాతని లేవనెత్తి కౌఁగిలించుకొని "కుమారా! నీవు మనోతాపమును గలుగకుండఁ బెక్కుకాలమునుండియు శుశ్రూషఁ జేయుచుంటివి. వృద్ధుఁడనగుటచే నాకిఁక వానప్రస్థాశ్రమస్వీకరణము కర్తవ్యము. కావునఁ దపోవనమున కేఁగఁ గోరుచుంటిని. నీవు ధర్మమునఁ బ్రజాపాలనము సేయుచు నిటనుండి, నావనగమనమును అంగీకరింపు" మని గద్గదకంఠుఁడై పలుకుచు దుఃఖాతిశయమున మూర్ఛిల్లెను. "నావలనఁ గదా యీ కురువృద్ధున కిట్టి దురంతసంతాపము సంభవించె" నని యుధిష్ఠిరుఁ డధిక పరితాపము నొందుచు శీతోదకముచే నాతని యవయవములఁ దడుపఁ గొంత తడవునకు ధృతరాష్ట్రుఁడు తెలివినొంది "ధర్మనందనా! నాకుఁబెక్కుమాటలాడ శక్తి లేదు. నీవిఁక నన్నలజడిఁబెట్టకఁ దపోవనముకేఁగ నంగీకరింపు" మనియె.

అప్పుడు పారాశర్యమునీంద్రుఁ డచ్చటికరుదెంచి సకల జనములు వినతులఁగై కొని దీవనలిచ్చి యజాతశత్రు నవలోకించి "ధర్మతనూజా! గాంధారీధృతరాష్ట్రులు పుత్రశోకాగ్ని సంతప్త మానసులై తపోవనమునకేఁగఁ దలఁచియుండిరి. తపమువలననే గాని యాదంపతులకుఁ జిత్తశాంతి కలుగదు. పెక్కుకాలము నీవు వీరికిఁ బరమభక్తితో శుశ్రూషఁ జేసియుంటివి. ఉత్తమ రాజవంశజులు సమరమునఁ జచ్చుటయైనను దృఢసమాధిని తనువు త్యజించుటయైనను సమంజసముగాని, వృద్ధులై రోగతల్పమున మరణించుట యనుచితము గదా! కావున నీవిఁక యుండుమను తలంపు విడిచి గాంధారీధృతరాష్ట్రులు వనవాసమున కేఁగ నంగీకరింపుము." అని చెప్పి యాతని సమాధానపఱచి తాను నిజాశ్రమమున కేఁగెను.

పిమ్మట యుధిష్ఠిరప్రభృతులుఁను ధృతరాష్ట్రునిం గని "తండ్రీ! నీవు కడుబడలిక నొందియున్నావు. ముందు నా ప్రార్థన నాలించి భుజించి పిమ్మట నీ యిచ్చవచ్చినటుల నాచరింపు"మని వేడ ధృతరాష్ట్రుఁడు గాంధారీ సమన్వితుండై యభ్యంతరావాసమునకుఁ జని దేవపితృకృత్యముల నాచరించి యాహారతంత్రము నిర్వర్తించెను.

అనంతరము ధృతరాష్ట్రుఁడు పురజనులందఱిని రావించి "పౌరులారా! వృద్ధుఁడనగు నాకిఁకఁ దపశ్చరణము కర్తవ్యమగుటచే విపినమున కేఁగ నభిలషితుఁడనై మీయనుజ్ఞ వేడుచుంటి"నని పలుకఁ బౌరులెల్లరు దుఃఖాక్రాంత మన

న్కులై కన్నీటితో యాకురువృద్ధున కనుజ్ఞ నొసఁగిరి. పిమ్మట ధృతరాష్ట్రుఁడు రణనిహతులైన బాంధవుల కందఱికిఁ బుణ్య లోకములు సేకూర ననేక మహాదానము లాచరించి గాంధారీ సమన్వితుఁడై వల్కలాజినములు ధరించి సర్వపదార్థములుఁ బరిత్యజించి నగరు విడలెను. కుంతీవిదురసంజయులు వారితో విపినమునకేఁగ దృఢనిశ్చితులై బయలుదేరిరి. యుధిష్ఠిర, కృప, యుయుత్సులును శాసనమునకు బయలుదేర ధృతరాష్ట్రుఁడు వారిని వారించెను. అప్పుడు పాండవులు కుంతీదేవికిఁ బ్రణామము సేసి "జననీ! నీవు కాంతారమున కేఁగవల" దని పెక్కువిధములఁ బ్రార్థింప నాసాధ్వి "నందనులారా! మాననీయులగు సిద్ధవృద్ధదంపతులు వనమున కేఁగుచుండ నే నిటనుండఁ జాలను. వనమున కేఁగి వీరికి శుశ్రూష సేయుచు, తప మాచరించి యుత్తమలోకము వడసెద. మీరలు నాకొరకు చింతింపవలదు. ఏను తొల్లి దనకరతనూజుని జననము గోపనము సేసి యమ్మహానీయుని కన్యాయము సేసితి. అద్దురాగతము నామనమును నిరంతరము గలంచుచుండె. కావునమీర లమ్మహా త్మునియెడ భక్త్యావేశమానసులై మదీయదోష పరిహా రార్థముఁ గనేకదానముల నొసఁగుచు, ద్రౌపదికి సౌమనస్యము సేయుచు, ధర్మము నెడబాయక ధరణినేలుచుండుఁ" డని చెప్పి తాను గాంధారీహస్తముఁ బట్టుకొని నడువసాగెను. గాంధారీ ధృతరాష్ట్రులును గుంతిని వనమునకు రావలదని వారించిరి గాని, యెవరెన్నివిధములఁ జెప్పినను నామె దృఢనిశ్చితయై వెనుదిరుగ

దయ్యో! అప్పుడు ద్రౌపదీసుభద్రాది కోడండ్రెల్లలు నశ్రుపూర్ణత నయనలై కుంతీ గాంధారీధృతరాష్ట్రులకుఁ బ్రణామము సేయ, వారలు తమకోడండ్ర ననునయించి యాశీర్వదించి ముందుకు నడువఁ దొడఁగిరి. ధృతరాష్ట్రుఁడు గాంధారి కరమును, గాంధారి పాండురాజ మహిషికరమును బట్టుకొని నడిచిపోవుచుండ, విదుర సంజయులును, వనమున నగ్నిహోత్ర కార్యముల నాచరింపఁ గొందఱు ఋత్విగ్జనములును వీరివెంట నేఁగిరి. అప్పుడు పౌరులును, బరిచారకజనములును మున్ను పాండవులు విపినమున కేఁగిననాఁడు దుఃఖించినటుల దుఃఖించిరి. పిమ్మటఁ బాండు నందను లశ్రుప్లావితవదనులై వనితాజనములతో మరలి రాజ మందిరము సొచ్చిరి. ఆంబికేయుఁడు తనవారలతో భాగీరథీ తీరమునకుఁ జని యానాఁటిరాత్రి యట విశ్రమించెను.

ప్రభాతమైన పిమ్మట ధృతరాష్ట్రాదులు కాలోచితకృత్యముల నాచరించి గంగానది యుత్తరించి కురుక్షేత్రమున కరిగి యొక్క యాశ్రమసమీపమున నున్న తరుచ్ఛాయను విశ్రమించిరి అయ్యాశ్రమమున నున్న శతయూపనాముఁ డగు రాజర్షి వారలఁ గాంచి సవినయముగఁ దనపర్ణశాలకుఁ దోడ్కొనివచ్చి యుచితాహారముల నొసఁగి గౌరవించెను. అనంతర మాంబికేయుఁ డచ్చటఁ బర్ణశాలలఁ గట్టించి తన వారితో నచ్చట నివసించుచు తప మాచరించుచుండెను.

ఇట్లు కొన్ని దినములు గడచిన పిమ్మటఁ బాండునందనులు కుంతీ గాంధారీ ధృతరాష్ట్ర విదురులఁ దలఁచి మిక్కుటముగ

దుఃఖించుచు వారల కుశలము నరయుచు దలఁపు గలవారై కురుక్షేత్రమునకు బయలుదేర, దుర్యోధనాదుల పత్నులును ద్రౌపదీ సుభద్రాది కాంతలును వారివెంటఁ బయనమైరి.

పాండవులు సకల బాంధవులఁ గూడి కురుక్షేత్రమున నున్న ధృతరాష్ట్రు నాశ్రమమున కరిగి కుంతీ గాంధారీ ధృతరాష్ట్రులకు నమస్కరించి యశ్రుజలములచే వారి పాదములఁ గడుగఁ గుంతి ప్రేమాతిశయమునఁ దనూజులఁ జేరఁ దీసికొని శిరములు మూర్కొనుచు కన్నీటిచే వారల మస్తకములఁ దడిపి దీవించెను. గాంధారీ ధృతరాష్ట్రులును ప్రేమ పురస్సరముగా వారలను దీవించిరి. పిమ్మట ద్రౌపది సుభద్రాది వధూజనము లెల్లరు వారికిఁ బ్రణామము లాచరించి యాశీర్వాదములఁ బడసిరి. అనంతర మాంబికేయుఁడు యుధిష్ఠిరు నుద్దేశించి,

సీ. "కుశలివై యుండుదే కురువంశసత్తమ
పౌరజనులు జానపదులుఁ దెఱఁగు
తో నిన్ను ననుసరింతురె తమ్ములందఱు
సుఖముందురే నీదు సఖులు సుఖులె
బంధులు సంతోషభరితులే యిష్టభృ
త్యులు దమకైన కోర్కులు ఫలింపఁ
గ్రాలుదురే హర్ష లీలలఁ బూర్వరా
జన్యుల నడవడి సలుపఁబడునె
నయముతోడి యప్పనముల భండారంబుఁ
బెనుతె యగ్రహార జనులమీఁద
గాలిదైన సుడియఁగానీక యరయుదే
యనఘ పుణ్యకీర్తు లతిశయిల్ల."

అని కుశలప్రశ్నము సేసెను. "తండ్రీ! నీ కృపావిశేషమున నన్నియు యుక్తముగ నెఱవేరుచుండె. ఆగానమునకు సహింపఁజాలని మీశరీరములు తపఃక్రియల నాచరింపనోర్చు చుండెనే? ధీశాలియగు విదురుఁ డెచటికరిగె? అనుజన వరేణ్యునిఁ జూడ నామనము తపించుచుండె" ననుచు ధర్మ నందనుఁడు బలుక, వైచిత్ర్యవీర్యుఁడు "కుమారా! మేమందరముఁ దపోనిష్ఠ నోర్చి సుఖముగ నుంటిమి. విదురుఁ డీప్రాంతమున నిచ్చవచ్చిన స్థానమునఁ జరియించుచు ననిలాహారుఁడై ఘనతపము సేయుచు నెన్నఁడైన నకస్మాత్తుగ మాకుఁ గానఁబడుచుండు" నని చెప్పుచుండెను.

అంతలోఁ గాంతారధూళీమలినాంగుఁడును, జటీభూతకేశ పాశుఁడును, దిగంబరుఁడును నగు విదురుఁ డయ్యాశ్రమ సమీపమునకు వచ్చి, యచట నున్న జనముల నవలోకించి మగిడిపోవఁ దొడఁగెను. అజాతశత్రుఁ డమ్మహామహు నవ లోకించి తా నొక్కరుఁడును సత్వరముగా నవ్వినుతప్రభావుని వెంటఁ బోవఁదొడఁగెను. విదురుఁడు గుల్మాంతరితుఁ డగుచుఁ బోవుచుండఁ బాండవాగ్రజుఁ డెలుఁగెత్తి "విదురా! యో విదురా! నిలువుము. నిలువుము. నేను యుధిష్ఠిరుఁడ; నిన్నుఁ జూడవచ్చుచుంటి" ననుచుఁ బరుగెత్తి సాగెను. విదురుఁ డప్పచనముల నాలకించి యొక్క పాదపము సేరి యర్ధ నిమీలితలోచనుఁడై నిలువ, యుధిష్ఠిరుఁ డచ్చటికి వచ్చి "నిర్మలాత్మా! నన్నుఁ గనువిచ్చి చూడవే" యని పలికెను.

అంత సత్త్వపోధనుఁడు కన్నులు విచ్చి యాతనిఁ గాంచి, యుదాత్త యోగబలమున నత్తనువు ద్యజించెను. యుధిష్ఠిరుఁ డది గాంచి యా మహాత్ముని తపోబలమునకు విస్మితుఁడై, యాతని కళేబరమును దహనము సేయు నుద్యమించెను. అప్పు డశరీరవాణి "ధర్మనందనా! యోగి కళేబరమున కగ్ని సంస్కారము సేయఁ జనదు; కావున నీ విప్పరమతపోధనుని దేహమును దహనము సేయకు" మని పలికెను. అజాతశత్రుఁ డవ్వచనముల నాకర్ణించి యా యుద్యమము విడిచి, యాశ్రమమున కరిగి, విదురుఁడు దేహత్యాగముఁ జేసిన విధముఁ దనవారల కెఱిఁగించెను.

అనంతర మొకనాఁడు వ్యాసమునీంద్రుఁ డచ్చటికి వచ్చి ధృతరాష్ట్రయుధిష్ఠిరాదులచే సన్మానితుఁడై యందఱి కుశలము నరసి కుంతీ గాంధారీధృతరాష్ట్రుల నుద్దేశించి "వత్సలారా! మీ మనముల నేమైనఁ గోర్కెగలదేని నాకెఱిఁగింపుఁడు. మీ రెట్టి దుస్తరమగుదానిఁ గోరినను మదీయతపోబలముచేఁ దీర్పఁగలవాఁడ" నని వచింప, వారలు భారతరణమున మృతులైన తమ బంధువర్గమును జూడఁగోరిరి.

అంత సత్తపోధనుఁడు సకలజనములను భాగీరథీతీరమునకుఁ దోడ్కొనిపోయి "మీర లీ నలిలావగాహనము సేసి చూడఁ దలఁచినవారి నందఱఁజూ జూడుఁ" డనిపలికెను. తోడనే యచ్చటి వారెల్లఱు నదిలోనికిఁబోయి దుర్యోధన దుశ్శాసనాది కురుకుమారశతమును, విరాట ద్రుపద ధృష్టద్యుమ్న

ద్రౌపదీయాభిముఖ్య కర్ణాది సకల బాంధవులను గాంచి ప్రమోదభరితాంతఃకరణులై యిష్టాలాపములచే నాకసముఁ గడపిరి. మఱునాఁ డాశూరజనములు మరలఁ దమలోకమున కేగుచుండఁ బారాశర్యుఁడు "పతుల ననుగమింపఁదలఁచిన వారలీగంగాతోయములఁ గ్రుంకుఁ"డని పలికెను. అంతట ధృతరాష్ట్రుని కోడండ్రు నూర్వురును, మత్స్యరాజనందనయుఁ దక్కుంగల విధవాంగనలెల్లను నప్పావనతోయముల మునింగి మానుష దేహములఁ ద్యజించి దేవతనువులు దాల్చి తమతమ పతులఁగూడి నాకలోకమున కేఁగిరి.

అనంతరము సాత్యవతేయుఁడు, బంధుసందర్శనమునఁ బ్రమోదితాంతఃకరణులైయున్న ద్రోవది సుభద్రాది కాంతలను, పాండునందనులను, కుంతీ గాంధారీ ధృతరాష్ట్రులను వోడ్కొని యాశ్రమమునకువచ్చి "యుధిష్ఠిరుఁ డిచ్చటికివచ్చి నెలదినములు గడచె. ఇఁకఁ దడయక నీతని హస్తిపురమున కంపు"మని ధృతరాష్ట్రునకుఁ జెప్పి తానునిజాశ్రమమున కేఁగెను.

పిమ్మటఁ గుంతీగాంధారీధృతరాష్ట్రులు తమ్ము విడిచిపోవఁ జాలకయున్న పాండవులను, ద్రౌపదీసుభద్రాది కాంతలను బుజ్జగించి కరిపురమునకుఁ బంపించి, అగ్నికార్యములు ఋత్విగ్జనములు సక్రమముగ సేయుచుండఁ దా మప్పటియట్లఁ దపముసేయుచుఁ గాలముఁ గడుపుచుండిరి.

ఇట్లుకొన్ని దినములు గడచినపిమ్మట నారదమునివరేణ్యుఁ డొక్కనాఁడు గజపురమున కరుదేర యుధిష్ఠిరుఁ డత్తాప

స్తోత్రము సర్వారీతిఁ బూజించి "మునీంద్రా! ఎందుండివచ్చు చుంటిరి? తపోవనమునన్న కుంతీగాంధారీధృతరాష్ట్రుల కుశలవృత్తాంతము మీకేమైనఁ దెలియునే" యని యడిగెను. "నృపకుంజరా! మీతండ్రి తనవారలఁగూడి మున్ను నివసించుచున్న యాశ్రమము విడిచి, గంగాద్వారపరిసరారణ్యమున కరిగి యచ్చట నాశ్రమ మేర్పఱచికొని వాయుభక్షణుఁడై కొన్ని దినములు యుగ్రతపము సేసెను. ఇట్లుండి యొకనాఁడు వారలు గంగాద్వారమునఁ గృతస్నానులై యాశ్రమమునకు వచ్చుచుండ మహావాతోద్ధూతమై యనల మావిర్భవించుచు జుట్టుముట్టెను. నిరాహారులగుటచే వారలమ్మహానలమును దప్పించుకొని పరుగిడ శక్తిలేనివారై యుండిరి. సంజయుఁడు వారిని విడిచిపోవనొల్లకుండ ధృతరాష్ట్రుఁడు "సంజయా! నీవీ యనలముఁ దప్పించుకొనిపోవఁజాలియుఁ బోకున్నఁ బాపము లేకూడు; గావున నీ వెచ్చటికైన బరుగిడి ప్రాణముఁగాపాడుకొను"మని చెప్పి పంపించెను. సంజయుఁ డొక్కఁ డెట్లో తప్పిఁ జూచి హిమశైలమునకు సద్ధిరోహించి ప్రాణముఁ గాపాడుకొనియె. అంతట మీతల్లులుఁ దండ్రియుఁ బ్రాఙ్ముఖాసీనులై సమాహితచిత్తులై రి. తోడనే యగ్ని వారలఁ బొదివి దహింప నమ్మువ్వురుఁ బరమపదవి నొందిరి. అనంతర మీ వృత్తాంతము నాకత్వసమునవుండు మునులు దెలుప విని వారల కళేబరముల నవలోకించి వచ్చితి" ననుచు నారదుఁడు ధృతరాష్ట్రప్రభృతుల మరణవృత్తాంతము యుధిష్ఠిరునకుఁ దెలి

పెను. ఆదుఃఖవార్త నాలించి పాండునందనులును వనితా జనములును శోకవిహ్వలమానసులై యాక్రందనము సేసిరి.

పిమ్మట యుధిష్ఠిరుఁడు నారదు నవలోకించి

సీ. "ఎఱుఁగంగవచ్చునే యెవ్వరి కత్తతి
వేదనయగునో మునీంద్ర హేము
గలుగంగ దెసలేని ప్రమాణికిఁబోలె
నక్కురువృద్ధున కట్టిచావు
పాటిల్లె సముదీర్ణబాహుసరోజ్జ్వలు
లైనపుత్రులు నూర్వురట్లుగలిగి
బలము నాగాయుతప్రాణసమంబగు
నమ్మహారాజట్టి యడవిచచ్చు
టలనఁ దెగటారె నేమనఁగలదు కమల
ముఖులతాలవృంతానిలముల సుఖించు
ప్రభువె కంకగృధ్రావళీ పక్షవాయు
వసర నిలఁబడియున్నవాఁ డక్కటకటా.

సీ. "వల్లభుఁ డొక్కసద్వ్రతముఁ బూనినఁ దానుఁ
దద్వ్రతమూని గాంధారి యతని
పోయినగతిఁబోయె నాయమకై యుంత
వదవఁ బుత్త్రుల రాజ్యవైభవంబు
విడిచి యేయోమక యడవికిఁబోయిన
తల్లికి వగచెన ధర్మసుతుఁడు
భీమసేనుండును బీభత్సుఁడును దన
కడుపునఁబుట్టిన కొడుకులట్టె
యనదతనమునఁ దాను గారగిఁగాలె
నట్లె యనాథయై దీనికి నంతరంగ
మలఁదురకతల్లఁ జిల్లకీయారటమున
నుడుక కలమటఁ బడక యెట్లుండుఁజెపుమ.

మఱియు సన్న్యాసినీయులు కార్చిచ్చుచే దగ్ధులైరిగదా! తదీయ దోషపరిహారార్థముగ నే నేమిసేయవలయు నని పలుక నమ్మునీంద్రుఁడు "రాజోత్తమా! ధృతరాష్ట్రుఁడు తనకు శాంతి యొక్కఁడై సంఘున నాలోలిదినమునసే యగ్ని నుచిత రీతి నుపాసించి యిష్టిసేసి వీడ్కొనియెను. యాజకజనము లయ్యగ్నిచయము నరణ్యమున నుద్వాసించి యథేచ్ఛం జనిరి. ఆయగ్నియే ప్రజ్వరిల్లి వనమును, కుంతీగాంధారీధృతరాష్ట్రు లను దహనము సేసెను. ఇవ్విధమున నమ్మువ్వురు నాత్మా గ్నిచే దగ్ధులై పుణ్యలోకమున కేఁగిరి గావున నీవు తదీయ శాంతికై యేమియుఁ జేయఁ బనిలేదు. చింతవిడిచి వార లకుఁ దిలోదకప్రదానము చేయు"మని చెప్పి దుఃఖోపశమ నము సేసి యథేచ్ఛం జనియె.

పిమ్మట యుధిష్ఠిరుఁడు "మూఁడు వత్సరములు కుంతీ గాంధారీధృతరాష్ట్రులు విపినమునఁ దపము సేసి పరమపదము నొంది"రని పౌరులకుఁ దెలియఁజెప్పి, సకలబాంధవులతో భాగీరథీతీరమున కరిగి వారికిఁ దిలోదకప్రదానము సేసి, భూను క్షేత్రముల ననేక మహాదానముల నొసఁగి పరలోకక్రియల నాచరించి, రాజ్యముఁ బాలించుచుండెను.

—• మౌ స ల ప ర్వ ము. —

ఒకనాఁడు ద్వారకానగరమునకుఁ గణ్వ, నారద విశ్వామిత్ర మహర్షులు హరిసందర్శనార్థము వచ్చి రాజమార్గమున నేఁగు చుండ యదుకుమారులు కొందఱవలోకించి, విధిప్రేరితులై

దుండగమునకుఁ దొడఁగి, కృష్ణుని తనూజుఁడగు సాంబునకు స్త్రీవేషము వేసి తెచ్చి, కపటవినయముతో నమ్మునులకు నమస్కరింపఁజేసి "మహామహులారా! ఈకాంత బిడ్డలఁ గనునే?" అని యడుగ నమ్మునులు క్రోధాత్ములై "ఈసాంబుని కడుపున, సకలయాదవ క్షయాపాదనకర్యమగు ముసలము జనించు" నని శపించి యథేచ్ఛం జనిరి.

మునునాఁడు సాంబునికడుపున మహాభయంకరమగు నొక ముసలము జనింప యాదవులెల్లరు భయభ్రాంతులై యావార్త వసుదేవున కెఱిఁగించిరి. వసుదేవుఁ డది విని విన్నఁబాటొంది "మీరందఱు రాముసలమును బొడిపొడిగాఁ గావించి సముద్రములోఁ జల్లుఁ" డని యాజ్ఞాపింప వారట్లు గావించిరి.

అనంతరము ద్వారకానగరమునఁ జిలుకలు గూబల యెలుఁగులతోడ నఱచుటయు, మేఁకలు నక్కలవలెఁ గూయుటయు, గోవులకడుపున గాడిదలు పుట్టుటయు నున్నగు మహోత్పాతము లనేకములు పుట్టసాగెను. యాదవ యువకులు దుర్మార్గవర్తనులై విప్రసమూహములకు బాధసేయుచు, గురువుల తిరస్కరించుచు నిచ్చవచ్చినటుల సంచరింపఁదొడఁగిరి. కాంతలు భర్తలం దిరస్కరింపనారంభించిరి. సర్వవిదుండగు వాసుదేవుఁ డీదుశ్శకునము లన్నియుఁ గాంచి, గాంధారి శపించి ముప్పదియాఱు వత్సరములయ్యెనని తలఁచి, యిఁక నన్యోన్య కలహమున యాదవులందఱు నశింతురని నిశ్చయించి, తన వారెల్లరుఁ దీర్థసమీపప్రదేశమున మృతులగుట యుచితంబని

యోజించి "సకలజనులును రేపు రత్నాకరతీరమున కరుదెంచి యచ్చట జాతర సేయవలయు" నని పురమునఁ జాటఁ బనిచెను.

ఆరాత్రి సకలజనములును, దమతమ యాయుధములను, భూషణములను గొందఱు రాక్షసులపహరించినట్లును, నొక నల్లని స్త్రీవచ్చి తమతమ కాంతలనీడ్చికొనిపోయినట్లును దుస్స్వప్నములఁగాంచిరి. మఱునాఁ డెల్లవారలు గనుఁగొనుచుండ, శైబ్య సుగ్రీవ మేఘపుష్ప బలాహకములను నశ్వములతోడను, గరుడ కేతనముతోడను బ్రకాశించు శ్రీకృష్ణుని స్యందనమును, చక్రాయుధమును నద్భుతముగ మింటికెగసి యదృశ్యములయ్యెను. పిమ్మట దేవకీనందనుఁడు వేఱొక్క యరదము నధిరోహించి యాదవులనందఱినిఁ దోడ్కొని సముద్రతీరమున కరిగెను.

అప్పుడు బలరాముఁడు కృష్ణు నవలోకించి "తమ్ముఁడా! నేను తపముసేయ విపినమునకుఁ బోయెద" నని చెప్పి వెడలిపోయెను. పిమ్మట యాదవబృందమును సముద్రునిఁ బూజించి యిష్టాహారములఁ దనివిదీర భుజించి మిక్కుటముగ సురాపానముసేసి మదోన్మత్తులై కేకిసలాడుచు విరసభాషణము సేయఁదొడఁగిరి.

అప్పుడు సాత్యకి, రుక్మిణీతనూజుఁడైన ప్రద్యుమ్నుని భుజముపైఁ జేయివైచి యాతనికిఁ గృతవర్మం జూపి నవ్వుచు "ఈతఁడు గురుపుత్త్రునితోఁ బాండవశిబిరమున కేఁగి నిద్రా

సక్తులై యున్నవారలఁ జంపెను. ఇది శూరజనలక్షణమే?" అని యెకసక్కెములాడఁ గృతవర్మ రోషపరవశుఁడై "సాత్యకీ! కిరీటిచేఁ జేయి నరుకఁబడిన భూరిశ్రవునిఁ దెగటార్చిన శూరాగ్రేసరుఁడవగు నీ వాన న్న పహసించునది? నీపరాక్రమము నేనెఱుఁగనిదా" యని పలికెను. ఇట్లు వాగ్వివాదము ప్రబలముకాఁగా నిరువురుఁ గయ్యమునకుఁ గడఁగిరి.

మున్ను సాంబుని కడుపునఁబుట్టిన ముసలమును, యాదవులు పొడిసేసి సముద్రమునఁ గలుప నదియంతయుఁ దత్తీరమున దుంగలై పుట్టి పెఱుఁగుచుండెను. సాత్యకి యాతుంగఁ బెఱికి దానితోఁ గృతవర్మం గొట్ట నాతనిమస్తకము పుడమిఁగూలెను. అంతటఁ గృతవర్మ యాప్తులెల్లఱును సాత్యకిం జుట్టు ముట్టి పోరఁదొడఁగిరి. సాంబ, ప్రద్యుమ్నాదికుమారులు సాత్యకికి సహాయులై యని సేయనారంభించిరి. కృష్ణుఁడు తనయనుజుని రక్షింపఁజాలఁడయ్యెను, విధికృతమును దలఁచి మిన్నకుండెను. అంత నుభయపక్షముల వారును నచ్చటి తుంగఁబెఱికి యొండొరులఁ గొట్టుకొను చుండ, మునుల శాపప్రభావమున నాతుంగ వాడినారాచములవలె వారలశరీరములను ఛేదించుచు ప్రాణములఁ బోరిగొనుచుండెను. అమ్మహాకలహమున సకలయాదవులును నొండొరులం గొట్టుకొనుచు మరణించిరి. సాత్యకి సాంబప్రద్యుమ్నప్రముఖులు మృతులైనపిమ్మటఁ, గృతవర్మపక్షమునఁబోరినవారిలో నింకను గొందఱు మిగులఁ గృష్ణుఁ

డాతుంగఁ గైకొని వారిని నిరవశేషముగ వధించెను.

పిమ్మటఁ గృష్ణుఁడు దారుకునిఁ బిలిచి "నీవతిశీఘ్రముగఁ గరిపురమునకేఁగి యాదవక్షయము పాండవుల కెఱింగించి యర్జును నిచటికిఁ దోడ్కొని రమ్మ"ని చెప్పి పంపించి తాను వనితాజనములను, గరితురంగములను దోడ్కొని నిజ మందిరమునకరిగి, వసుదేవునకు సకల యాదవక్షయము నెఱింగించి, "జనకా! బంధువిహీనమైన యీపురమున నేనిఁక నివసింపఁజాలను. బలరాముఁడు మున్నె తపము సేయ నిశ్చయించి కాననమున కేఁగియుండెను! నేనును నాతనికడకుఁ బోయి తపమాచరించుచుండెదను. దారుకుని హస్తిపురమునకుఁ బంపించితి. ఆతఁడు ధనంజయుని శీఘ్రముగ నిటకుఁదోడ్కొని వచ్చును. ఆ కురువరేణ్యుఁడు మీకుపకృతి సేయఁగలవాఁడు; మీరీ వనితాజనములను, గరితురంగములను నరయుచు నిచ్చట నుండుఁ"డని చెప్పి దండప్రణామము సేసెను. ఆఘోర వార్త నాలించినతోడనే వసుదేవుఁడు దుఃఖాతిశయమున నిశ్చేతనుఁడయ్యెను. వధూజనములెల్లరు రోదనము సేసిరి. "కురుకులదీపకుఁడగు విజయుఁడు సత్వరమున నిచటికి వచ్చి మీ వంతలన్నియుఁ దీర్చుఁగావున మీరెల్లరు ధైర్యమూని యుండుఁడు. విధికృత మిట్లుండెను! దీనిం దప్పింపనలవిగా"దని కృష్ణుఁడు వారి కందఱికి యుపశమనవాక్యములు సెప్పి తాను నగరు వెడలి బలదేవుఁ డేఁగినమార్గమునఁ బోయి యొక్క మహీరుహము చెంగట నాతనిఁ గాంచి వందన

మాచరించి జరిగిన వృత్తాంతమంతయు నెఱిఁగించెను.

పిమ్మట నా బలదేవుఁడు యోగమునఁ దనువుఁ ద్యజించి సహస్రఫణములు గల మహాభుజంగరూపముఁ దాల్చి దివమున కరిగెను. అనంతరము కృష్ణుఁ డచ్చోటుఁ బాసి యించుక దూర మరిగి, తాను భూలోకమునఁ జేయవలసిన పను లన్నియు నెఱవేరుటఁ దలఁచి, యిఁక నిస్తనువుఁ ద్యజించుట సముంజసమని నిశ్చయించి యొక్క తరుచ్ఛాయను శయనించి నిశ్చలచిత్తుఁడై గాఢసమాధి నొందియుండెను.

అప్పుడా విపినమున సంచరించుచున్న వేఁటకాఁ డొకఁడు శ్రీకృష్ణునిఁ గాంచి, హరిణ మని తలఁచి, విధిప్రేరితుఁడై యొక్క బాణముఁ బ్రయోగించెను. ఆ తీక్ష్ణసాయకము దనుజభంజనుని శ్రీపాదతలముఁ దూఱి నొప్పించెను. అంత నవ్వేఁటకాఁడు మృగమును బట్ట తలఁచున నచ్చటికివచ్చి యామహాపురుషు నవలోకించి, భయకంపితగాత్రుఁడై యాదేవుని చరణారవిందములపై వ్రాలి "ఆర్యా! జింకయను తలపుతో నేనీ పాపకృత్యము నాచరించితి" ననుచు దుఃఖించెను. "ఓయీ! విధికృత మిట్లుండెఁ గావున నీవు చింతింపఁ బనిలే"దనుచు నప్పరమపురుషుఁడు వానినూరడించి తన మానుషదేహముఁ ద్యజించి, దివ్యరూపధరుఁడై దివమున కరిగెను.

అప్పుడు బ్రహ్మరుద్రపురందరాది బృందారకులు దేవదేవు నెదుర్కొని దండప్రణామము లాచరించి "అనంతా!

నీవు కంస, శిశుపాలాది దుష్టజనసంహారము సేయ భూలోకమున నవతరించి పెక్కు కాలము గడచె! మే మెల్లరము నీ రాకకుఁ బ్రతీక్షించుచుంటిమి. నీ విఁకఁ బరమపదమునకు విచ్చేసి జగములఁ బాలింపు" మనుచు న ప్పరమేశ్వరుని వైకుంఠమునకుఁ దోడ్కొనిపోయిరి.

అట దారకుఁడు పాండవుల పాలికిఁ బోయి యాదవ నాశము తెఱఁగు వారల కెఱిఁగింప వారలు పరమ దుఃఖితులైరి. తోడనే యర్జునుఁడు బయలు దేరి ద్వారకానగరమున కరుదెంచెను.

దారుకసమేతుఁడై వచ్చిన యా ధనంజయునిఁ గాంచి యాదవకాంతాజనములును, వసుదేవుఁడును, సేవకజనములును, పౌరులును శోకాతిశయమున నాక్రందనము సేసిరి. అర్జునుఁడును గొంతతడవు విలపించి "మురమర్దనుఁ డిప్పు డెచటి కరిగె" నని, వసుదేవు నడిగెను. "భరతాన్వయ ప్రదీపా! నీ ప్రియశిష్యులగు సాత్యకి ప్రద్యుమ్నులును, సకల యాదవులును మడిసిన పిమ్మటఁ గృష్ణుఁడు వనితాజనములను, గజాశ్వనివహములను దోడ్కొని నాకడకు వచ్చి "తండ్రీ! విధివశమున యదువంశ నాశనము సంభవించె! బంధుజన శూన్యమైన యి ప్పురమున నేను వసియింపఁజాలను. మదీయాగ్రజుఁడు మున్నే తపోవనమున కేఁగి యుండె! నేనును దపము సేయ నరిగెద! ఇఁకఁ గొలఁదిదినములలో నీ ప్పురము నంబుధిముంచి వైవఁగలదు. విజయుఁడు నేఁట రేపట

నిచటికి వచ్చి మిమ్మందఱిని రక్షింపఁగలవాఁ" డని చెప్పి తాను విపినమున కరిగెను. ఇఁక నిక్కాంతలను, సామజ హయబృందములను, పౌరులను రక్షించు భారము నీయది." అనుచు వసుదేవుఁడు గద్గదకంఠుఁడై యాతనికి సమస్త వృత్తాంతము విశదముగఁ జెప్పెను.

పిమ్మట ధనంజయుఁడు వారల నందరిని నింద్రప్రస్థపుర మునకుఁ గొనిపోవ నిశ్చయించి ప్రజల నందరిని రావించి "పౌరులారా! దైవకృతమున నిట్లు సకల యాదవక్షయము ప్రాప్త మయ్యె! నేఁటి కేడవదినమున నీ ప్పురము నంబుధి ముంచివైవఁగలదు కావున నేను మిమ్ములనందరిని సురక్షిత ముగ నింద్రప్రస్థపురమునకుఁ గొంపోవఁ దలఁచి యుంటి. కృష్ణుని పౌత్రుఁడైన వజ్రదేవుని నింద్రప్రస్థపురమున కధిపుఁ జేసెద. అతఁ డప్పురమున మిమ్ముల నందరిని ధర్మముగఁ బాలింపఁగలవాఁడు కావున మీ రెల్లరు శీఘ్రముగ నింద్ర ప్రస్థమునకుఁ బయనము గం" డని చెప్పి యారాత్రి తాట విశ్రమించెను.

తెల్లవారుజామునకు వసుదేవుఁడు నిర్మలయోగనిష్ఠచేఁ దన శరీరముఁ బరిత్యజించి యూర్ధ్వలోకమున కేఁగెను. అర్జునుఁ డమ్మహానీయునకును, సంగ్రామమున నిహతులైన సకల యాదవులకును యథావిధిగ దహనసంస్కారము సేయిం చెను. వసుదేవుని సతు లందఱు నప్పు డగ్ని సొచ్చి దేహ త్యాగము సేసిరి.

పిమ్మట ధనంజయుండు తానొక్కఁడును రామకృష్ణులను సందర్శింపఁ గుతూహలముగలవాఁడై యాప్తజనులు కొందఱు వెంటరా విపినమున కరిగి యమ్మహానుభావుల వెదకి యొక్కచోటఁ గృష్ణుని కళేబరముఁ గాంచి దుఃఖాతిరేకమునఁ బడుచు నప్పుణ్యాత్మకము నధికప్రేమమున హత్తి యాలింగనము సేసికొని, మేను ఘూర్ణిల్లుచు "మహాపురుషా! నన్నుఁ బిలువఁ బనిచి, నాతో నొక్కమాటైనఁ జెప్పకయే పరమపదమున కరిగితివా" యనుచు విలపింప సాగెను. అట్లు కొంత తడవు ప్రలాపించి, తన సహోదరులచే నూరడింపఁబడినవాఁడై వారల సహాయమున నమ్మహాపురుషునకు సంస్కారము సేసి, వేదోక్తప్రకారముగఁ గడిమ్మట్ల బలరాముని కళేబరమును గూడఁ దెచ్చి యథావిధిగ నగ్నిసంస్కారము సేసెను.

అనంతరము ధనంజయుండు ద్వారకానగరము సముద్రము ముంచు దినము సమీపించెనని యెంచి సత్వరితముగఁ బుర కడ దేఁచి, రామకృష్ణుల మరణవార్త దెలిపిన నచ్చటివారెల్ల సత్వరముగ ప్రాణములు విడుతు రని తలఁచి యా దుర్వార్త నేరికిఁ జెప్పకయే, రామ, కృష్ణ, సాత్యకి, ప్రద్యుమ్న ప్రముఖుల పత్నులను, సకల యాదవాంగనలను, సమస్త పౌరులను, గజాశ్వనివహములను దోడ్కొని యప్పురము వెడలెను. వెంటనే యమ్మహాపట్టణము సముద్రముచే ముంచఁబడెను. విజయుండు తన వారలఁ గొంత

దూరము తోడ్కొనిపోయి యప్పటికిఁ బ్రొద్దుగ్రుంకుటచే నొక్క యుచితప్రదేశమున విడియించెను

అప్పుడు కొందఱు కిరాతులు వారలఁగాంచి "వీరికి రక్షకుఁ డొక్కవిజయుఁడే గావున మనమీనిని సులభముగ జయించి వీరి ద్రవ్యమంతయు నపహరింత" మని తలఁచి యాసమూహముఁ జొచ్చి కాంతామణుల భూషణములు నపహరింప నారంభించిరి. అర్జునుఁ డది గాంచి యుగ్రుండై యద్దురాత్ములఁ బారఁద్రోలనెంచి బాణములఁ బ్రయోగింప నవి యక్కిరాతుల బాధింపఁజాలకుండెను. అంత నతఁడు మహాస్త్రములఁ బ్రయోగింపఁబోవ నవియును శక్తిఁ దప్పి యుండెను. అప్పుడాశ్చర్యవిషాదనిమగ్నమానసుఁడై గాండీవి మఱికొన్ని నారాచములఁ బ్రయోగించి యెట్టకేల కాబోయలఁ బారఁద్రోలి, ప్రభాతమైన పిమ్మటఁ దనవార లతో నచ్చోటుఁ బాసి కురుక్షేత్రమున కరిగెను.

అనంతరము విజయుఁడు రామకృష్ణుల నిర్యాణము నెఱిఁగింప నెల్లఱును శోకవిహ్వలమానసులై యాక్రందనము సేసిరి. అప్పుడు బలరాముని సతులును, రుక్మిణీప్రభృతి కాంతామణు లును కొందఱగ్నిప్రవేశముసేసి యూర్ధ్వలోకమున కరిగిరి. సత్యభామయు నట్లకొందఱు వనితామణులును దపమాచ రింప విపినభూమికేఁగిరి. ధనంజయుఁడు కృష్ణుని పౌత్రు నిం ద్రప్రస్థమునకును, సాత్యకీతనూజుని సరస్వతీపురమునకును నభిషిక్తులఁ జేసి, వస్తువాహన నివహముల నిరువురకుఁ బంచి

యిచ్చి తాను సాత్యవతేయు నాశ్రమమున కరిగెను.

కృష్ణద్వైపాయనుఁడు వివర్ణవదనుఁడై వచ్చిన ధనంజయు నవలోకించి "కుమారా! నీవిషాదమునకుఁ గారణమే" మని యడుగ నతఁడు, సకల యాదవనాశమును, రామకృష్ణుల నిర్యాణమును, కిరాతులు తన్నెదిరించుటయుఁ, దన శస్త్రాస్త్రముల శక్తి దప్పుటయు నాదిగా సమస్త వృత్తాంతమును సవిస్తరముగ నత్తపోధనున కెఱిఁగించెను. అంత నమ్మునీంద్రుఁడు "ధనంజయా! దైవ నిర్ణయ మివ్విధమున నుండుటచేఁ గృష్ణుఁడు స్వజనరక్షణమున కుపేక్షించె!

చ. ధరణిభరంబుఁ బాప నవతారము నొందిన కృష్ణుఁ డత్తెఱం
గరుదుగ నిర్వహించి యజరామరనిష్కల నిర్వికార భా
స్వరనిజతత్త్వముం బుపశాంతిపరుండయి పొందె దానికిం
గురుకులవర్య శోకమునఁ గుందుదురే మిముబోటి బోధనుల్

మ. అవనీభారము బాపి తాహరికిఁ దోడై భీమసాహాయ్యగా
రవదుర్దాంతపరాక్రమంబునఁ గృతార్థత్వంబునం జేసి యా
స్త్రవితానంబును నిన్నుఁ బాసె ననియెన్ దాన్ దైవప్రకారజ్ఞని
దు వరిష్ఠాచరణంబునన్ సురలు సంతోషించి రప్పౌరులన్.

క. బలమును బుద్ధియుఁ జేవయు
నలఘుమతియుల్లసిల్లునగు కాలమునం
బొలియుం గాలవిపర్యయ
కలనంబున బుధుల కబ్బుఁగలఁకయుఁ గలవే.

తే. కాలమూలంబు సర్వంబు గాన దీని
కొండుతలఁపులు దక్కి మీ రుత్తమంపు
గతికిఁ జనుఁడు నిశ్చింతవికారతలును
విడిచి యోగ్యజనంబు వినుతిసేయ."

అని యుపదేశించెను. అంతట విజయుఁ డమ్మునివర్యునకుఁ బ్రణామము సేసి యాతని యనుజ్ఞవడసి కరినగరమున కేఁగెను.

—* మ హా ప్ర స్థా ని క ప ర్వ ము *—

అర్జునుఁడు, యుధిష్ఠిరు పాలికిఁబోయి రామకృష్ణుల నిర్యాణమును, దనశస్త్రాస్త్రములు శక్తిహీనములగుటయు, సాత్యవతేయుని హితబోధయు సవిస్తరముగఁ దెలిపెను. అంతట యుధిష్ఠిరనృపాలుఁడు తానింకఁ బ్రస్థానమున కేఁగుట యుక్తమని తలఁచి తన యాశయము ననుజులకును, ద్రౌపదికిని దెలుప వారును సంతుల కంగీకరించిరి.

పిమ్మట ధర్మనందనుఁడు పరిక్షితునిఁ బట్టాభిషిక్తునిఁజేసి, యతనికిఁ బూజ్యసామ్రాజ్యపరిపాలన ప్రకారము లుపదేశించి, ధర్మశీలుఁడై తన్ను సేవించుచున్న యుయుత్సునిఁ బిలిచి, యాతనికి రాజ్యతంత్రములు బోధించి "నీవీపరిక్షితునకు రక్షకుఁడవై రాజ్యతంత్రము నడుపుచుండు" మని చెప్పి, సుభద్రను రావించి,

మ. "భవదీయాత్మజు డాత్మజుండు కురుభారోద్వాహుం డయ్యె యా
దవవంశోత్తరుఁడైన వజ్రునకు నింద్రప్రస్థరాజ్యంబు గా
రవదీప్తంబుగ నిచ్చినాఁడ సుచరిత్రా రక్షణీయంబులై
నవి యీరాజ్యములు రెండు నీవు దృఢస్థైర్యం బొప్ప రక్షింపుమీ.

క. విను శేషించిన యాదవ
జనులకు వజ్రనృపతి సంరక్షకుఁడౌ
తనిఁ బోషించుట ధర్మం
బనఘా యది లేమి ధర్మహాని యగుఁజుమీ."

అని యుపదేశించి యామె నందుల నంగీకరింపఁజేసి, కృపాచార్యునకుఁ బరీక్షితుని శిష్యునిఁగ నప్పగించి, పౌరజానపదప్రవరజనముల రావించి వారల కంజలికి నమస్కారించి సింహాసనిఁజూపి "పౌరులారా! మీరందఱు మాయొప్పు మాఱుగ నిక్కుమారునిఁ గైకొని, యీతని యాజ్ఞానువర్తులై మెలఁగుచు ధర్మనిరతులై యుండుఁడు. మే మెవ్వరము ద్రౌపదీయుతముగ విపినమునకుఁ దపముసేయ నేఁగుచుంటి" మని చెప్పెను. పౌరులందఱు నవ్వచనముల నాలించి దుఃఖసంతప్తచిత్తులై "అవనీతలేంద్రా! మమ్మందఱిని విడనాడి విపినభూమి కేఁగుట సముచితమే?" అనుచు గద్గదస్వరములఁ బలుక, ధర్మనందనుఁడు తగు వచనముల వారల నోడఁబఱచి, యనేక దానముల నొసఁగి యెల్లజనులఁ బ్రీతచిత్తులఁ జేసెను.

పిమ్మట సవ్యసాచి యులూచిని భుజగేంద్రునికడకును, చిత్రాంగదను బభ్రువాహనునికడకును బోవ నంగీకరింపఁజేసి పంపించెను. అనంతరము పాండునందనులు ద్రౌపదీసమేతులై సర్వాభరణములుఁ బరిత్యజించి, వల్కలాజినములు ధరించి రాజమందిరము వెడలి వనమార్గమునుబట్టి నడువసాగిరి. అప్పుడు సమస్తబాంధవులును, సకలపౌరులును దుఃఖావేశితమానసులై యడలుచుఁ జాలదూరము పాండవులవెంట నేఁగి పిమ్మట వారిచే నివారితులై మరలి పురికేఁగిరి. ఒక్క శునకముమాత్రము వారివెంటఁ బోవుచుండెను.

ఉపవాసవ్రతపరులై పాండవులు యోగబలమున నడుచుచు ననేక గిరిసరిదరణ్యములు గడచి పూర్వసముద్రతీరమునకుఁ బోయిరి. అప్పు డగ్ని దేవుఁడు వారికిఁ బొడసూపి "ధనంజయా! దేవకార్యమునకుగాను నేనీ గాండీవమును వరుణదేవునిచే నీకిప్పించితిని. దీని కార్యము నెరవేరె. ఇంకను నిమ్మహాధనువు నీకేల? దీని నీ యంబుధిని విడువు"మని చెప్ప విజయుఁ డా ధనువు నా సాగరజలముం విడిచెను. పిమ్మటఁ గృశానుఁ డంతర్ధానుఁడయ్యెను.

అనంతరము పాండవులు భూప్రదక్షిణము సేయుచు మేరుపర్వతసమీపమునకుఁ బోవుచుండ మార్గమధ్యమున నొక్కచోటఁ బాంచాలరాజనందన యోగ మెడలుటచేఁ బుడమిఁ బడి విగతజీవిని యయ్యెను. వాయుతనూజుఁ డదిగాంచి విషణ్ణుఁడై "అగ్రజా! ఈ సుదతీమణి వర్తనమున నధర్మ మెన్నఁడుఁ గానము. ఇప్పుడిట్లు పడుటకుఁ గతమెద్ది" యని యడుగ "ఇత్తన్వి విజయుని దెసఁ బక్షపాతిని అంగుటం జే నిట్లయ్యె" నని పాండవాగ్రజుఁడు ప్రత్యుత్తర మొసఁగి స్థిరచిత్తముతో ముందు కేగుచుండెను. అట్లు వారు మఱికొంత దూర మరిగినపిమ్మట సహదేవుఁ డపగతప్రాణుఁడై యవనిఁ బడియె. అప్పుడు పవననందనుఁడు "అగ్రజా! అనహంకారుఁడును, మాయందఱికంటె నీయెడ భక్తుఁడునునైన యీ మా యనుజుఁ డిట్లు పడుటకుఁ గారణమే"మని యడుగ "ఈతఁడు జగతిలోఁ దనకంటెఁ బ్రాజ్ఞుఁడు లేఁడని మనమునఁ దలఁ

చెడివాఁడు. అందువలన నిట్లయ్యె" నని యుధిష్ఠిరుఁ డాతనికి బదులుచెప్పి యరుగుచుండెను మఱికొంతతడవునకు నకులుఁడు పుడమిఁగూలె, భీమసేనుఁడు ధర్మతనయునిఁ గారణ మడిగెను. "ఈతఁడు తనకంటె సురూపవంతుఁడు లేఁడని గర్వించెడివాఁడు. అక్కారణమున నిచ్చటఁ బడిపోయె" నని చెప్పెను. మఱికొంతదవ్వేగఁ గోయిన పిమ్మట ఫల్గునుఁడు విగతాసుఁడై ధరణిఁగూలెను. భీముఁ డదిగాంచి వగచుచు "అన్నా! ఈ యమలచరిత్రుఁడు పడుటకుఁ గారణ మే"మని యడుగ "ఈతఁడు తనకంటె ధనుర్విద్యయందు నిపుణులు లేరని తలఁచి యుండెడిని గర్వించుచుండుటచే నిట్లయ్యె" నని ధర్మనందనుఁడు బదులుచెప్పి యేగుచుండెను. మఱికొంత దవ్వరిగినపిమ్మట భీమసేనుఁడును ధరణిఁగూలుచు "అనఘా! నేనిట్లు పడిపోవుటకుఁ గతమెయ్యదియో తెల్పు" మని యడుగ "తమ్ముఁడా! నీవు నేనే మహాబలశాలినని గర్వించి యితరులఁ దృణీకరించుచుండుటచే నిట్లయితి" వని ధర్మాత్మజుఁ డాతనికిఁ బ్రత్యుత్తర మొసఁగి స్థిరచిత్తుఁడై ముందున కేఁగుచుండెను. పాండవులు పురము వెడలినప్పటినుండి యావారి ననుసరించి వచ్చుచున్న సారమేయము మాత్రము ధర్మతనయునియెడ నధికభక్తికలదై యాతనివెంట నేఁగుచుండెను.

అట్లు నిష్ఠాగరిష్ఠుఁడై యుధిష్ఠిరనృపాలుఁడు మేరుశైల సమీపమునకుఁ బోవ వాసవుఁడు రథారూఢుఁడై వచ్చి "ధర్మనందనా! నీవీ దివ్యస్యందనము నధిరోహించి నాకలోక

మునకు రమ్ము. నేను నిన్నుఁ గొంపోవచ్చితి" నని పలికెను. యుధిష్ఠిరుఁ డాతనికిఁ బ్రణామమొనరించి, శోకసంతప్తమానసుఁడై "అమరేశ్వరా!

శా. తోడంబుట్టువు లందఱుంబడిన యాదుఃఖంబు చిత్తంబునం
బీడంబెట్టెడు సౌకుమార్యవతి దప్పింగూలెఁ బాంచాలి వా
ర్ధోడైవచ్చిరి వారలేక యిట మీతో రాను వారెల్ల నా
తోడంగూడఁగవచ్చునట్లుఁ గృపాధుర్యాత్మ కావింపవే."

అని పలుకఁ, బాకశాసనుఁడు "అవనీతలేంద్రా! నీయనుజులును, ద్రౌపదియు మానుష దేహములఁ ద్యజించి దివమున నున్నవారలు. వారికొఱకు దుఃఖింపఁబనిలేదు. నీవీస్యందనారూఢుఁడవై దివమున కరుదెంచి వారలఁగాంచు మని" చెప్పెను. అంతట యుధిష్ఠిరుఁడు "నిర్జరవల్లభా! నేనిలువెడలినదాది యీసారమేయము నన్నాశ్రయించి వచ్చుచుండెను. ఇప్పుడు నావెంట దీనినిఁ గూడఁ దోడ్కొనిపోవలయు" నని పలుకఁ, బురందరుఁడు నవ్వుచు "భరతాన్వయవార్ధిచంద్రా! శునకమునకు నాకలోకసుఖమెట్లు గూర్పఁగలవాఁడ" వని వచించెను. ధర్మతనూజుఁ డదివిని "శచీనాథా! భక్త పరిత్యాగముసేసి బడయు సిరివలన నాకు సంతసము గలుగ" దని పలుక, సంక్రందనుఁ డతని నవలోకించి

చ. "అలుకహరించు ధర్మముల నట్లగుటం గురువంశవర్య నీ
వలుగక విన్ము శక్ర యతి సాహసధంబు త్రివిష్టపంబునం
గలుగదు నీవు నిష్ఠురతగల్గదు దీనిఁబరిత్యజించివం
జలముకొనంగనేల శుభసంగతునం బెడనేత కృత్యమే."

అని వచించెను. అంత సహస్రాంశురాజాగ్రనందనుఁడు

చ. "అనఘచరిత్ర విన్ము శరణాగతుఁజేకొని కున్కి-శుద్ధమి
తునియెడఁజేయు ద్రోహము వధూటివధించుట విప్రసర్వముం
గొనుట యనంగఁగల్గు నివిగూడిసమంబగు నాకుఁజూడ భ
క్తు ననపరాధునిన్ విడుచుదోషముతో నిదియోర్వవచ్చునే.

ఉ. కావున నాకలోకసుఖం బటులుండఁగనిమ్ము దేవ నీ
భావమునిల్పు నాదెసఁ గృపాభరితంబుగ సారమేయ సం
భావన సేఁత దోసముగఁ బట్టమి నాకు వరంబు నీవు పా
మ్రావనభూమినుండెద సమిద్ధతపంబున నిన్నుఁ గొల్చుచున్."

అని దృఢనిశ్చితుఁడై పలికెను-

అంత నాసారమేయ మారూపమును బాసి దివ్యపురుష మూర్తిం దాల్చి "వత్సా! నేను ధర్మదేవతను, నీకు సర్వభూతముల యెడఁగల సనుభావమును బరీక్షింపనెంచి శునకరూపమును దాల్చివచ్చి నీయెడఁ బ్రీతుఁడనైతి. ఇఁక నీవీదివ్యరథము నధిరోహించి దేవలోకమునకు విచ్చేయుము" మనుచు యుధిష్ఠిరుని హస్తముఁ బట్టుకొని యాస్యందనము నెక్కించెను.

అట్లు దివ్యరథారూఢుఁడై యుధిష్ఠిరుఁ డమరలోకమునకుఁ బోవ బృందారకులెల్ల రానృపతిలకు నాదరపూర్వకముగ నెదుర్కొని యభినందించిరి. అప్పుడు నారదమునీంద్రుఁడువచ్చి,

ఉ. "దానములం దపంబులను దద్దయుఁ బేర్కొల యట్టివారలన్
మానవనాధులన్ వినమె మాన్యఁదదీయయశంబులెల్ల నీ
మానితకీర్తి కీర్తులు సమస్తజగంబులయందుఁ బర్వ్వట
స్సేనులతోడ వారిటులు సేర్చిర రా నమరత్వసిద్ధికిన్."

అనుచు నారాజోత్తముని బ్రశంసించెను.

పిమ్మటఁ బురుహూతుఁ డమ్మహీపాలునకు దేవలోకమునఁ గల మహనీయ పదార్థములఁ జూపుచు "కురుకుంజరా! నీవిచ్చట సమస్తభోగములఁ దనివి దీర ననుభవింపు" మని పలుక యుధిష్ఠిరనృపాలుఁడు "అనిమిషనాథా! ద్రౌపదీభీమార్జున నకులసహదేవులును, భారతరణమున మృతులైన బంధుమిత్రులను గనుఁగొనిన పిమ్మటఁ గాని నాకిచ్చటి సౌఖ్యములు సంతోషదాయకములు కాఁజాలవు. కావున నన్నతి శీఘ్రముగ వారి కడకుఁ దోడ్కొని పొమ్మని" వేఁడెను.

—** స్వ ర్గా రో హ ణ ప ర్వ ము **—

అంతట దేవేంద్రుఁడు దేవదూతను బిలిచి "నీవీనృపాలునకు బంధుమిత్రవర్గముఁ జూపు" మని యాజ్ఞాపించెను. ఆదేవదూత యుధిష్ఠిరునిఁ దోడ్కొనిపోవుచుండ నారదాదిమునీంద్రులును గొంద ఱాతని వెంటనేగిరి.

ఆ దేవదూత యాతనిఁ దోడ్కొనిపోవుచు నొకచోట నిజభామినీపరివృతుఁడై, సుఖాసనాసీనుఁడై స్వర్గలోక సౌఖ్యముల ననుభవించుచున్న దుర్యోధనునిఁ జూపించెను. ధర్మనందనుఁ డాతనిఁ గాంచి యసూయాయుక్తుఁడై "నారద మునీంద్రా! ఈతఁ డతిలోభియై రాజ్యముఁ బంచి యీయ నొల్లకపోవుటచే నీతని మూలమునఁ బెక్కండ్రు భూనాథులు భారతరణమున నిహతులైరి. మఱియు నీతఁడు సాధ్వీమణియైన ద్రౌపదిని సభను నుంచి పెక్కు దుష్కృత్యము లాచరించి

యుండెడి. ఇట్టి దుస్స్వభావునకు నాకలోకసౌఖ్య మెట్లు సేకూరె” నని యడుగ నవ్వాని “ రాజోత్తమా ! వీర మరణము నొందిన కారణముచే నీతఁ డీ లోకసుఖముల నను భవించుచుండె; ఇది పుణ్యలోకము గావున నిచ్చట దుష్కృత్యముల నుగ్గడింపరాదు. కావున నీ విప్పు డీతని పాపకృత్యములఁ దలఁచి యసూయ నొందకు” మని చెప్పెను. “నంయమివరేణ్యా ! ఈతని కష్టసుఖములతో నాఁకుఁ బనిలేదు. శీఘ్రముగ నన్ను నావారలకడకుఁ దోడ్కొని పొం” డని ధర్మతనయుఁడు వచించెను.

అనంతర మా దేవదూత రక్తప్రవాహములును, నస్థిపుంజములును గలిగి దుర్గంధయుక్తమై నడువ నశక్యమై యున్న యొక దుష్పథమున నమ్మహీనాథునిఁ దోడ్కొనిపోయెను. ఆమార్గమునఁ గొంతదూరము సనిన పిమ్మట నాతనికి సలసలఁ గ్రాగిన నూనియవోలెఁ దెరలుచున్న జలములు గలిగి, వైతరణియను పేరఁ బరఁగుచున్న యొక్క ప్రవాహమును, నత్యుష్ణప్రదేశమున ననేక ప్రకారములైన హింసల ననుభవించుచున్న కొందఱు పాపకర్ములును గానఁబడిరి. ధర్మతనయుఁ డచ్చటి దుర్గంధమునకు సహింపఁజాలక యాదూత నుద్దేశించి “మన గమ్యస్థాన మింకెంత దవ్వుగలదు ? ఇచ్చట నిలువ నశక్యమైయున్న” దనుచు వెనుకకు మరల నుద్యుక్తుఁ డయ్యెను.

అప్పు డచ్చట యాతనల ననుభవించుచున్న వారందఱును యుధిష్ఠిరు నుద్దేశించి,

తే. "భవ్యజనన నీగాత్రము దివ్యసౌర
భంబు వెరసిన గాడ్పు మాపైఁ గరంబు
హృద్యమై వీచుటయు దుఃఖ మెల్లఁ బాసె
భూరిసౌఖ్యంబు నొందుచున్నార మేము.

క. నినుఁ జూడఁగనుటఁ బటుయా
తనలం దొఱఁగితిమి పరమధర్మాత్మక నీ
తనయము దయ నిచ్చటనిలి
చిన బ్రదుకుదు మింకఁ గొంతదవు నిలువవే."

అని యెలుఁగులెత్తి పలుక నారంభించిరి. ధర్మనందనుఁడు వారియెడఁ గరుణార్ద్రహృదయుఁడై నిలిచి "ఘోరనరకము ననుభవించు మీర లెవ్వరో యెఱిఁగింపుఁ" డని యడుగ, వారలు "నేను కర్ణుఁడను, నేను భీమసేనుఁడను, నేనర్జునుఁడను, నేను నకులుఁడను, నేను సహదేవుఁడను, నేను ద్రౌపదిని, నేను ధృష్టద్యుమ్నుఁడను, మేము ద్రౌపదేయుల" మనుచుఁ దమతమ నామధేయములఁ జెప్పసాగిరి.

అవ్వాచసముల నాలకించినతోడనే ధర్మనందనుఁడు శోకవిహ్వలమానసుఁడై "అక్కటా! సత్యపరులు, దయాధర్ములు, సత్యదానరతులు నగు వీరి కిట్టి నరక మేల సంభవించె? దేవత లధర్మ మొనర్చి యిట్టి దుస్థితిఁ గలిగించిరో, లేక నాకిది చిత్తభ్రాంతియో, స్వప్నమో, సత్యమో నిర్ణయింపఁజాల